
హరి గానమే అన్నమయ్య జ్ఞానము
అన్నమయ్య కీర్తనలకు
తొలి పలుకు & భావదీవియలు
రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech

**హరి గానమే అన్నమయ్య జ్ఞానము**

**మొదటి ప్రచురణ**

**మే 2016**

**రచన**

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

**వెల : అమూల్యం**

**ప్రతులకు :**

**ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,**

**హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360**

**అక్షరాల కూర్పు మరియు ముద్రణ :**

**సత్యనారాయణ వరప్రసాద్ రావు పసుపులేటి**

**ఫోన్ : +91-94939 79719**



# అంకితము



నేను తెలుగునాట యాదాద్రి నుండి సింహాద్రి వరకు అన్ని ప్రముఖ నృసింహ క్షేత్రాలను చూచి తరించాను, కాని మాల్యాద్రిని, ఆహోబలాన్ని చూచే భాగ్యానికి నోచుకోలేదు. అన్నమయ్య నుతించిన అహోబల నవనారసింహులను చూడని వెలితి నా ఆత్మను వదలదని నాకు తెలుసు. ఆ స్వామి నన్ను తన కొండపైకి రప్పించుకొంటాడో లేదా సశరీరంగా పోలేని ఆపైకే రప్పించుకొంటాడో తెలియదు.

ప్రభూ! నీ ఆజ్ఞను ధిక్కరించగలనా? కనీసం ఈ నా రచన "హరి గానమే అన్నమయ్య జ్ఞానము" నీకు అంకితం చేసి తరింపనియ్యి తండ్రీ!

**కం॥ నవనారసింహులన్ మన–**
**కవగతమౌ రీతి నన్నమార్యుడు పొగడెన్**
**సవినయముగ అంకితమును**
**ఇవిగో నాకేలుమోడ్చి యిచ్చెదను "హరీ!"**

# ప్రార్థన

కం॥ శ్రీకాంతుని గానముచే
సాకారుడు వేంకటేశు శరణము గనుడీ,
మీకందించెను జ్ఞానము
తేకువయున్ అన్నమయ్య దీవెనయె సుమా!

ఆ.వె॥ హరిని నమ్మినాను అది సుకృతంబహో!
ముక్తిబాట గంటి ముదముగంటి
తొలుత జీవితంబు తుచ్ఛమై తోచెను
వెనుదిరుగను సిరుల వేంకటేశ!

కం॥ గానము జ్ఞానము నిచ్చును
గానము హరిబాట చూపు కడుముదమిచ్చున్
గానము ఘనులను చేయును
గానము మురిపించు కలిమి కాంతారమణున్.

చం॥ ముదముగ వేంకటేశ్వరుని మూర్తిని గాంచిన అన్నమయ్య నా
మదినిలిచెన్ భళా! కలిగె మాన్యత తత్ఫలితంబుగా నహో
ఇది గత జన్మ పుణ్యమని యెంచెద నాప్రియ మిత్రులార! నే
చదివినదేమి? యియ్యెడలజాను తెలుంగు కవిత్వమెట్టిదో?

ఉ॥ గానము ప్రీతిపాత్రమగు కమ్మగపాడిన వేంకటేశుడున్
మానక అన్నమయ్యకును మన్ననతో నిడె ముక్తి భామినిన్,
జ్ఞానపు రాసి కీర్తనలు సాగిలి మొక్కితినేను శౌరికిన్
దేనికి చింత నమ్మితిని, దివ్యములాయెను నాదు భావముల్.

తే॥ నేను కవినెటులౌదును? నేర్పలేదు
సంస్కృతాంధ్రములందున చదువులేదు
వేంకటేశుని కృపగాక విభుదులార!
పుట్టుచేతి వాటంబయి పోయె బ్రతుకు



సీ॥ గానంబుచే హరీ! ఘనుడు నారదుడయ్యె
తుంబురుండటు చేసె తోయజాక్ష!
గానంబు చేబట్టి గంధర్వులందరు
నీ దయ బొందిరి నీరజాక్ష!
గానంబుతో గొల్చి ఘనుడన్నమార్యుండు
వైకుంఠపురిజేరె పద్మనయన!
గానంబునెన్నుచు గణుతికెక్కిరి కదా!
గాయకులెందరో కమలనయన!

ఆ.వె॥ గానమహిమ దెలిసి గళమధురిమ లేక
గానవైతి నిన్ను కంజనేత్ర!
గాన వివరమిచ్చి ఘనుడన్నమయ్యకు
గానలోల! సేవగరపు చుంటి.

మ॥ హరినే వేడితి శంకవీడి యతనిన్ ఆధారమన్యెంచితిన్
వరమై చేసెను నన్ను ధన్యునిగ శ్రీవత్సాంకితుండున్ భళీ!
తరమా నాదగు భాగ్యమున్నుడువ, నేదామోదరున్ నమ్మితిన్
సిరులన్ కోరను నన్ను పిల్వుమికవో శ్రీవేంకటేశా! ప్రభో!

శా॥ ఎవ్వానిన్గన వేచియుందురు దివిన్ యింపారబృందారకుల్
ఎవ్వానిన్గనగా తపింతురు మునుల్ యేకాంతమౌకానలన్
ఎవ్వానిన్గన బ్రహ్మశూలి జతగా ఏవాకిటన్ వేతురో
అవ్వానిన్ మనకన్నమయ్యవొసగెన్ అందించి సంకీర్తనల్.

**మత్తకోకిల :**

నాదు జన్మతరించె ధన్యుడనైతి శ్రీహరి యేలగా
యేదిపాపము యేదిపుణ్యము యెందుకీ అనుమానముల్
యేది చూచిన వేంకటేశుని యెంచినన్ అది చాలదా?
వాదమేల అదేకదయ్యరొ వాస్తవంబుగ ముక్తియున్.

# ముందుమాట

ఈ నా రచనకు ముందు "హరి జ్ఞానమే అన్నమయ్య గానము" అనే పేరుతో అన్నమయ్య పాడిన 101 కీర్తనలను అవతారికతో, భావదీపికనందిచాను. ఇది దానికి సీక్వెల్ ("అనుగమించిన కృతి"). రెండింటికి తేడా యేమంటే ఇందులో కొన్ని కీర్తనలు యెవ్వరూ గానం చేయనివి.

కాని అవి గొప్ప జ్ఞాన దీపికలు. హరి గానమునకు అద్దం పట్టినట్లు భావదీవియలను పొందుపరచటం చేత దీనికి "హరి గానమే అన్నమయ్య జ్ఞానము" అని పేరు పెట్టాను. దీంట్లో 150 కీర్తనలు చేయగలిగితే 3000 కీర్తనలను విశ్లేషించిన మహద్భాగ్యం దక్కుతుంది. లేదా, ఈ జన్మకింతేనని స్వామికి అందిస్తాను. ఏదైనా నాకు అభ్యంతరంలేదు. "దాచుకో నీ పాదాలకు తగనేజేసిన పూజలివి" అని మా గురువుగారు అన్నమాచార్యులవారు యేనాడో పాడినారు కదా! నాదికూడా అదే మాట, అదే పాట, అదే బాట. ఆపై యేమిజరుగుతుందో తెలియదట.

సరే! దీని గురించి కొంత చెప్పి ముగిస్తాను. ఏ 'కవి' అయినా ప్రతి కీర్తనా అత్యద్భుతంగా చెప్పలేదు. అన్నమయ్యవంటి నందకాంశ సంభూతుని కీమాట వర్తించకపోయినా, వినేవారు నాబోటి సామాన్యులే కాబట్టి ఆ కీర్తన అర్థంకాక కొంత, కీర్తన ఆలపించే విధానం నచ్చక, వొక్కొక్కసారి అకారణంగా కొన్ని కీర్తనలు ప్రజల హృదయాన్ని తాకలేదు. "జో అచ్చుతానంద జోజోముకుందా" వంటి కీర్తనలూ అన్నమయ్య 'సృష్టే', ఈ నాప్రయత్నంలో చాలామందికి అర్థంకాని "కొన్ని" కీర్తనలూ అన్నమయ్య సృష్టే, అన్నీ ఆయన అంతర్యామియైన శ్రీహరి చెప్పించినవే.

ఒక్కసారి ఆలోచించండి సాళ్వ నరసింహరాయల తరువాత శ్రీకృష్ణదేవరాయలు అష్టదిగ్గజాలని ఆరాటపడ్డాడేకాని ఇట్లాంటి అమృతం ఈ గుళ్ళోనే ఒక అరలో పడివున్నదని "దేశభాషలందు తెలుగులెస్స" అన్న "ఆంధ్రభోజుడు" స్వామికి అంతులేని మాన్యాలు, వజ్రవైఢూర్యాలనిచ్చినవాడు ఈ 'రాగిరేకుల' నెందుకు మరచాడు? "అన్నమయ్య అర" యెందుకు తెఱవలేదు?



అదే "విధిలీల". అందుకే పెద్దలు ఏదియెట్లా జరగాలని "హరి" అనుకొంటాడో అది అట్లా జరుగుతుంది. అలాగని ప్రయత్నం మానరాదు. అదే గీతాచార్యుడు చెప్పింది కూడా. అదే నేను చేస్తున్నది కూడా. ఇదియే నా మతము, ఇదియే నా తపము, ఇదియే నా హితము, ఇదియే నా పూజ, ఇదియే నాకు సమ్మతము, నా జీవితాంతం ఇదే నా జీవితం.

ఏదియెట్లా జరగాలో నిర్ణయించేది ఆ శ్రీవేంకటేశ్వరుడే అని తెలుసుకోవటం కంటే గొప్ప జ్ఞానం ఇంకొకటేముంది చెప్పండి. అన్నమయ్య పాడిన హరిగానము వింటే మనబోటివారికి అన్నమయ్య మనకిచ్చిన జ్ఞానము యెంత గొప్పది!!! అనిపిస్తుంది. అలా అనిపించాలనే నేను ప్రతికీర్తనకు "తొలి పలుకు"నందించాను. ఇది ఈ కీర్తన అవతరించిన ఉద్దేశ్యాన్ని వివరిస్తుంది. ఈ తొలిపలుకులన్నీ తమ లక్ష్యం సాధించాయా అంటే అవును, అవును అనే దుస్సాహసం చేయలేను.

ఇక కీర్తన "భావదీవియ" యెంత వెలుగు విరజిమ్మిందో చెప్పటం నాకు సాధ్యమా? అయితే నేను నా ప్రయత్నంలో యేలోటూ చేయలేదు. ఆ "దీవియ" మీ మానసప్రాంగణంలో జ్ఞానజ్యోతి వెలిగించాలనే నా ఆకాంక్ష.

ఇది నా వ్యక్తిగత అభిప్రాయమైనప్పటికీ అనుభవజ్ఞులు నాతో ఏకీభవిస్తారని నా నమ్మకం. మన దేహానికి అంకురం వేసింది మన తల్లిదండ్రులు. కాని అది బిడ్డగా ఆకృతికి, మానసిక వికాసానికి "జీన్స్" కారణం. ఇది నిజమే కాని ఆ "జీన్స్" సృష్టించిందెవరు? మనస్సును కల్పించిందెవరు? "ప్రాణాన్ని" ఆ బిడ్డకు ఇస్తున్నదెవరు? నవమాసాలు మోసిన తల్లా? ఆ తల్లికి గర్భదానం చేసిన తండ్రియా? ఇద్దరూ కాదని అందరికీ తెలుసు.

అది "ప్రకృతి" అంటాడు నాస్తికుడు. నేనే ప్రకృతిరూపంలో సృజిస్తున్నాననే భగవంతుని నమ్ముతాడు ఆస్తికుడు, నమ్మడు నాస్తికుడు అంతే తేడా. కనబడని గాలిని లేదనలేని నాస్తికుడు దాన్ని నేను అనుభవిస్తున్నాను కాబట్టి వున్నది అంటాడు. భగవంతుని బ్రాహ్మేంద్రియాలతో చూడలేరు. కేవలం ఆత్మతోనే చూడగలరు.

చూడలేకపోయినా అనుభవించగలవాడే జ్ఞాని అది చేయలేనివాడు మనిషిగా యెన్ని సార్లు పుట్టినా తేడాయేమీ వుండదు. పుడుతుంటాడు, పెరుగుతుంటాడు, చస్తుంటాడు. ఏ నాటికీ ఆ జీవుడికి ముక్తి (జనన మరణాలనుంచి విముక్తి) లభించదు గాక లభించదు. పోతేపోనీ నాకేం అనుకొనే వారికి ఇది wrong number, దయచేసి దీనిని చదివి శ్రమపడకండి.

ముక్తి కావాలనుకొనేవారికి అత్యంత సులభమైన మార్గం త్రికరణశుద్ధిగా (నిర్మలమైన మనస్సు, వాక్కు, చేత) వుండి సమయం దొరికినప్పుడల్లా హరి గానము వింటూ, పాడుకొంటూ స్మరించుకొంటూ వుండటమే. ఆ పని చేయలేనివారు యజ్ఞ, యాగ, తపములవంటి వైదిక కర్మలేం చేయగలరు? స్కూలు చదువే సాధ్యం కానివాడు యూనివర్సిటీ చదువేం చదువుతాడు.

ఇకపోతే నేను చెప్పిన సులభమార్గం కూడా చెప్పినంత సులువుకాదు. దీనికీ ఒక చక్కని గైడ్ వున్నది. అదే శరణాగతి. స్వామీ! నేను నిన్ను నమ్మినబంటును. నీవే దిక్కు, నాకు ఇంకేదారి లేదు. నన్ను రక్షించు అని నిత్యమూ త్రికరణశుద్ధిగా వేడుకోవటమే. అలా యెంతకాలం చేయాలంటే... మనం వున్నంతకాలం.

బాబోయ్! నావల్ల కాదంటే తిరుమల వెళ్ళండి శ్రీవేంకటేశ్వరుని తొక్కిసలాటలో చూడండి నాకిది కావాలి అది కావాలి అని మొక్కుకోండి అంతే. అట్లా మీరు ముక్కి కోరలేరు. కోరినా రాదు. ఎందుకంటే క్యూలోంచి రాగానే ప్రసాదం కోసం పరుగు పెడతారు కదా! అందుకు.

దీనికి నేనూ భిన్నమైన వాడిని కాదు. నేనూ అంతే నా బ్రతుకూ ప్రసాదాలతోనే సరి. కాని నేను మారాలనే కోర్కె నాటుకొని బలపడింది. దారి దూరంగా కనుపిస్తోంది, కాని ఎంత దూరమో తెలియటంలేదు. అడుగులు తడబడుతున్నా వేస్తూనే వున్నాను.



కం॥ తడబడె నడుగులు పడవిక
గడగడమని వడఁకుచుంటి గడబిడనైతిన్
వడివడి సుడివడి అడిగెద
పడివేడెద శరణు స్వామి! వడి పరమిమ్మా!

అని మొత్తుకుంటునే వుంటాను. మళ్ళీ మఱచిపోతూనే వుంటాను. మొత్తుకోళ్ళ మధ్య "హరిగానమే అన్నమయ్య జ్ఞానము" వ్రాస్తూనే వుంటాను. చూద్దాం యేమవుతుందో.

నావంటి అవిటి వానిచేత 2850 అన్నమయ్య కీర్తనలకు వివరణ "పుట్టుచేత్తో" వ్రాయించి సాక్షాత్తు T.T.D. అన్నమాచార్య ప్రాజెక్టు వారికోసం D.T.P. చేయించి, వారికి సమర్పించగలిగానంటే.. "ఇది గాక సౌభాగ్యమిదిగాక తపము మఱి, యిదిగాక వైభవం బికనొకటి కలదే?"

మనిషి పుట్టుక అవటం చేత నేనూ ఆశాబద్ధుడనే. 3000 కీర్తనలను విశ్లేషించాలని ఇంకొక "క్రొత్త ఆశ" పుట్టించాడు ఆ "కొండలరావు" గారు నేను యెప్పటిలాగే ఆయన ఆజ్ఞాబద్ధుడను. అలాగే నిమిత్తమాత్రుడను. నన్ను ప్రోత్సహించి ఆదరించిన తిరుమల తిరుపతి దేవస్థానముల వారికి D.T.P. చేసిన నా మిత్రులందరికీ ధన్యవాదాలు.

Please visit my Website in Google Network
"www.geetadeeksha.com"

అంతేకాదు "kinige.com" వారి "E-Books" లో నావి "10 పుస్తకాలు (2400 అన్నమయ్య కీర్తనల విశ్లేషణ" మిమ్మల్ని అలరిస్తాయి.

"లోకాస్సమస్తా స్సుఖినోభవంతు"







# హరి గానమే అన్నమయ్య జ్ఞానము

## ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు భావదీపిక

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | కీర్తన విషయము | సంపుటము/ సంఖ్య | పేజీ |
|---|---|---|---|
| 1. | అంతయు నతనిమహిమహిమే అత- | 3/562 | 1 |
| 2. | అతడే యిన్నియు నిచ్చు నడిగినవల్లాను | 3/160 | 2 |
| 3. | అతనిలోనే యణగె నన్నియును | 3/568 | 3 |
| 4. | అదియే విష్ణుపదము ఆతుమకునెలవు | 2/402 | 4 |
| 5. | అల్లవాడే గద్దెమీద నౌభళపు గుహలోన | 4/505 | 5 |
| 6. | అవియు నొక్కటే బ్రధమాచార్యులు | 2/416 | 6 |
| 7. | ఇంతకంటే దగు బంధువు లింకనున్నారా | 2/400 | 7 |
| 8. | ఇంతటా హరినే కాని యెందునను గాననన్ను | 2/463 | 8 |
| 9. | ఇందుకే కాలమందే యీతని శరణంటిమి | 3/195 | 9 |
| 10. | ఇతని ప్రసాదమే యిన్నియును | 2/502 | 10 |
| 11. | ఇదె నీకన్నుల యెదిటికి వచ్చితి | 3/182 | 11 |
| 12. | ఈతని మరచివుంటి మిన్నాళ్ళును | 2/427 | 12 |
| 13. | ఊరకే కలుగునా వున్నతపు మోక్షము | 2/505 | 13 |
| 14. | ఎన్నడు వివేకించేదీడేరి దెన్నడు | 3/204 | 14 |
| 15. | ఎఱుగుటకంటే నెఱగకుండుటే మేలు | 2/465 | 15 |
| 16. | ఎవ్వరివసము గెల్వ నింతా వీనిమయమే | 3/225 | 16 |
| 17. | ఏంటి విచారము యెక్కడి యాచారము | 3/560 | 17 |
| 18. | ఏమనగవచ్చునమ్మ ఇటువంటి వారి జూచి | 3/178 | 18 |
| 19. | ఏమి సేయగలడు తానీ జగమెల్లాను | 3/538 | 19 |
| 20. | ఏవల్ల నౌగాములిక నేమి అన్నియు నీలోనే | 3/570 | 20 |
| 21. | ఒకరికొకరు వొద్దు దప్పులనే | 3/162 | 21 |
| 22. | ఒక్కడే దైవం బున్నతు డీతడు | 3/563 | 22 |
| 23. | ఓపితే దానె తగిలి వోపకున్న దానె మాని | 3/190 | 23 |





| క్రమ సంఖ్య | కీర్తన విషయము | సంపుటము/ సంఖ్య | పేజీ |
|---|---|---|---|
| 24. | కంటిరా వింటిరా కమలనాభుని శక్తి | 2/470 | 24 |
| 25. | కలలోన నిట్లనే కాపురము నిట్లనే | 3/559 | 25 |
| 26. | కాదనేటి వారెవ్వరు కడలనుండి | 3/202 | 26 |
| 27. | గరుడగమన గరుడధ్వజ | 2/391 | 27 |
| 28. | చూడవే గోవింద సోద్యము లిన్నియు | 3/224 | 28 |
| 29. | చెప్పరాని మహిమల శ్రీదేవుడితడు | 3/166 | 29 |
| 30. | తొల్లి యెట్టుండునో తాను తుది నెట్టుండునో | 2/380 | 30 |
| 31. | దేహంబొక్కటే దేహియునొక్కడే | 2/378 | 31 |
| 32. | ధరలో "నెద్భావం తద్భవతనె" గాన | 2/435 | 32 |
| 33. | నానా భక్తులివి నరుల మార్గములు | 2/469 | 33 |
| 34. | నిండిన జగములెల్లా నీ యాధీనము | 3/537 | 34 |
| 35. | నిరుహేతు కాన నన్ను నీవు రక్షించే వింతే | 2/468 | 35 |
| 36. | నే నింతసేసినయట్టి నేరమి మరవవయ్య | 3/192 | 36 |
| 37. | నేరనైతి నింతేకాక నే నిన్నాళ్ళు | 3/167 | 37 |
| 38. | పట్టలేని మన భ్రమగాని | 2/472 | 38 |
| 39. | పై కొని చూడరో వుట్లు పండుగనేడు | 3/161 | 39 |
| 40. | బయలు మొరంగగు పరమమాయ ఇది | 2/501 | 40 |
| 41. | మదన జనకునికి మజ్జనవేళ | 3/163 | 41 |
| 42. | మరల విచారించితే మంచముకిందే నుయ్యి | 3/569 | 42 |
| 43. | మాకేమి నీ కరుణ మహాప్రసాదమనేము | 3/191 | 43 |
| 44. | వీదిలో నదేకదే విష్ణుపదము | 2/418 | 44 |
| 45. | వీరు వారనేటి వింతేల | 3/539 | 45 |
| 46. | వెన్నచేత బట్టి నేయి వెదకనేలా | 3/180 | 46 |
| 47. | వెట్టి దెలిసి రోకలి వెస జుట్టు కొన్నట్టు | 3/174 | 47 |
| 48. | హరి నిను నెరగని యలమట లింతేశాయ | 3/172 | 48 |
| 49. | హరియు నొక్కడే గురి ఆత్మలోనొక్కటే | 2/467 | 49 |
| 50. | హరిసేవొకటే యనంతము | 2/420 | 50 |
| 51. | హీనుడైన నన్ను దెచ్చి యింతగా మన్నించితివి | 3/181 | 51 |

**సంఖ్య : 562　　సంపుటము : 3　　పుట : 372　　రాగం : గుండక్రియ**

పల్లవి: అంతయు నతనిమహామహిమే అతఁ-
దెంత సేసినా నెట్టయిన నవును

చ. 1: రావలెనన్నవి రాక మానవు
పోవలె నన్నవి పోకుండవు
ఆవలనీవల నలమటలేఁటికి
దైవమొక్కఁడే తగిలినగుఱుతు

చ. 2: కాయపుగుణములు కలిగినవే భువి-
నీయెడ జీవుఁడు యిటు గలఁడే
ఆయమిందుఁ గా దవునన నెవ్వరు
కాయజగురుఁ డొక్కఁడే ప్రేరకుఁడు

చ. 3: అంతరంగమే యాత్మజ్ఞానము
వింతగు వెలుపల వెడమాయ
చింతించి రక్షించ శ్రీవేంకటేశుఁడు
మంతు కెక్కె నిఁక మతకములేల

**తొలిపలుకు :**

అన్నియును శ్రీహరి మహిమలే. అతడేమి చేసిననూ యెట్టయినను అది జరిగితీరుతుంది అంటున్నారు అన్నమయ్య. రానున్నది రాకమానదు అనవసరమైన దిగులెందుకు? జీవునికి ప్రేరకుడు మదనజనకుడే. రక్షకుడు శ్రీవేంకటేశుడే అయినప్పుడు ఇంకా చింతెందుకు అంటున్నారు.

**భావదీపిక :**

అయ్యలారా! అంతయునూ అతని (శ్రీహరి) మహామహిమయే. అతడెంత చేసినా యెట్లాగైనా అతను తలచినదే జరుగుతుంది.

ఆతడు రావాలెనంటే యేదైనా రాకమానదు. పోవలెనంటే పోకుండా మానదు. అటూ యిటూ తిరిగి అలమట (ప్రయాస) పడుటెందులకు? ఏది జరిగినా తగిలిన గుర్తు ఆ దైవమొక్కడే. మరెవరున్నారు?

ఈ లోకంలో శరీరధారికి కలిగిన గుణాలు ఆ శరీరాన్ని బట్టి జీవుడికీ కలుగుతుంటాయి. నాకు ఈ ఆయముగాదు (శరీరం వద్దు) అనటం యెవ్వరికవుతుంది? కాయజగురుడు (మన్మథుని తండ్రి) హరి వొక్కడే అన్ని జీవులకూ ప్రేరకుడు.

జీవుని అంతరంగంలో ఆత్మజ్ఞానము వున్నప్పటికి శక్యముగాని మాయ వలన బాహ్యమున అజ్ఞాని వలెనే ప్రవర్తిస్తుంటాడు. ఇదంతా యోచించి రక్షకుడని శ్రీవేంకటేశుడు మంతుకెక్కెను (ప్రసిద్ధి చెందాడు). ఇక మతకములేల (మాయామర్మము లెందుకు?).



**సంఖ్య : 160　　సంపుటము : 3　　పుట : 107　　రాగం :**

పల్లవి: అతఁడే యిన్నియు నిచ్చు నడిగినవల్లాను
చేతలోనే వుండఁగాను చింతించరు హరిని

చ. 1: వలెనంటే సంపదలు వట్టి యలమటఁ బెట్టు
అలసి వోపనంటేను అండనే వుండు
తలఁచి యిందరు నీతరితీపులఁ జిక్కి
తలఁచ రెందును బరతత్వమైన హరిని

చ. 2: ఆసపడితే నింతులు అన్నిటాను బిగుతురు
వాసితో నుంటేనే తామే వత్తు రొద్దికి
పోసరించి యిందరు నీపొందుల భ్రమలఁ బడి
పాసివున్నారదే తమపతియైన హరిని

చ. 3: గట్టిగా రాతిరెల్లాను కలయై యుండు జగము
పట్టపగలైతే తమపాల నుండును
బట్టబయలు పందిలి పెట్టేరుగాని చే-
పట్టరు శ్రీవేంకటాద్రిపైనున్న హరిని

**తొలిపలుకు :**

అన్నమయ్య ఈ కీర్తనలో శ్రీహరి వొక్కడే అన్నీ ఇచ్చేవాడు. అటువంటి “దాత” మన చేతిలోవుండగా, ఇంకా విచారమెందుకు చెప్పండి? మీకేం కావాలి? సంపదలా, భోగాలా వాటినీ ఇస్తాడు. కాని అవి రాగానే హరిని మఱచిపోతారు. మళ్ళీ కథ మొదటికే వస్తుంది అంటున్నారు.

**భావదీపిక :**

అడిగినవల్లాను యిచ్చునట్టి అతడే (శ్రీహరియే) మన చేతిలోవుండగా ఆ దేవదేవుని చింతించరు (ధ్యానించరు). ఏమిటీ వింత?

మీకు కాలాలంటే విసుగుపుట్టేటన్ని సంపదలనిస్తాడు. అలసిపోయాను స్వామీ! భరించలేను అంటే, సరేలే అని తోడుగా వుంటాడు. చిక్కేమిటంటే, నీతరితీపుల జిక్కి (నీ విచ్చే భోగాలలో చిక్కుకొని) పరమాత్ముడైన (నిన్ను) హరిని యెందునూ (యెన్నటికీ) తలవరు.

స్త్రీలెటువంటివారో చూడండి. వారికోసం ఆశపడితే తమ బిగువు చూపిస్తారు. బింకంగా వుంటే తామే వద్దకు వత్తురు. పోసరించి (మదించి) ఇందరున్ (అందరూ) ఈ స్త్రీల పొందుల భ్రమలో పడి తమ భర్తయైన అదే శ్రీహరిని పాసివున్నారు (వదలిపెట్టినారు).

ఈ జగత్తు, రాత్రి పూట కలగా మారుతుంది. పట్టపగలైతే మనదేలే అనిపిస్తుంది. ఈ మూర్ఖులు పగలంతయు పందిలి బెట్టేరు (జగత్తు అందాలకు బందీలవుతారు). కాని శ్రీవేంకటేశ్వరుని వలెనున్న హరిని మాత్రం పట్టుకోరు.

**సంఖ్య : 568 సంపుటము : 3 పుట : 381 రాగం : వరాళి**

పల్లవి: అతనిలోనే యణఁగె నన్నియును
కతలెన్నైనాఁ గలవు కమలాక్షుఁ గనరో

చ. 1: యిసుక లెక్కపెట్టితే నెంతైనాఁ గలదు
అసముదించని పుణ్యా లటువంటివే
వసగాని పెక్కు దేవతలఁ గొలుచుకంటే
సుసరాన హరివారై సుఖియించరో

చ. 2: గోడ గడుగఁగఁ బోతేఁ గొనదాఁకా రొంపే
ఆడుకోలు తర్కవాదా లటువంటివే
వాడిక నారుమతాలవాఁడై తిరుగుకంటే
యీడనే శ్రీపతివారై యీడేరరో

చ. 3: మనసునఁ బాలు దాగితే మట్టు లేదు మేర లేదు
అనుగుసంసారభోగా లటువంటివే
దినదినతపములఁ దీదీపులవుకంటే
తనిసి శ్రీవేంకటేశుదాసులై బ్రదుకరో

**తొలిపలుకు :**

సర్వమూ ఈ కమలామాక్షునిలోనే అణగివున్నవి. ఈతని మహిమలు వర్ణించే కథలు అనంతములు అంటున్నారు అన్నమయ్య. ఇంతేకాక చక్కని ఉపమానాలతో హరి వారై సుఖించమంటున్నారు. సంసారభోగాలతో సతమతమవవద్దంటున్నారు.

**భావదీపిక :**

ప్రజలారా! అతనిలోనే (శ్రీహరిలోనే) సమస్తమూ అణగియున్నవి. ఆ కమలాక్షుని మహిమయు వివరించే కథలు యెన్నైనా గలవు. ఆలకించండి.

ఇసుక రేణువులను లెక్కించితే యెన్నైనావుంటాయి. అసముదించని (అహంకారం నశించని) పుణ్యాలు అటువంటివే. వసగాని (సానుకూలంగాని) యెందరో దేవతలను కొలిచేకంటే, సుసరాన (సులభంగా) శ్రీహరి దాసులై సుఖించండి.

గోడను కడిగి శుభ్రము చేద్దామనుకొంటే చివరికి రొచ్చు రొచ్చు అవుతుంది. ఆడుకోలు (నింద్యమైన) తర్కవాదములటువంటివే. ప్రపంచంలోని ఆరు మతాలను ఆశ్రయించి తిరుగుటకంటే, మీరున్న చోటనే శ్రీపతి వారై ఈడేరుట తరించుట మేలు కదా!

పాలు నోటితో త్రాగి, మనస్సుతో ఆనందించాలి గాని మనస్సుతో తాగితే తృప్తి లేదు. సంసార భోగాలు కూడా అటువంటివే. అనుదినము తపస్సుతో శ్రమపడేకంటే, తనిసి (తృప్తితో) శ్రీవేంకటేశ్వరునికి దాసులై బ్రతుకుట మేలు కదా!



**సంఖ్య : 402 సంపుటము : 2 పుట : 271 రాగం : శంకరాభరణం**

పల్లవి: అదియే విష్ణుపదము ఆతుమకు నెలవు
అదే జననకారణ మాకాశపదము

చ. 1: మంచిమాఁటలైనాఁ గానిమాటలైన నొకచోట
ముంచిముంచి యాకాశముననే యణఁగును
యెంచరానినిట్టూర్పు లెన్ని వొడమినాను
అంచల నణఁగిపోవు నాకాశమునను

చ. 2: చూపు లెంతదవ్వైనా సూర్యచంద్రులఁ దాఁకి
అపొంతనే యణఁగు నాకాశమునను
రూపుల మైనీడలును రుచులఁ గాలత్రయము
పైపైనే యణఁగును బహిరాకాశమున

చ. 3: యిలఁ జీఁకటి వెలుఁగు యెంచ నహోరాత్రాలఁ
గలసి మెలఁగు నాకాశతత్వమున
చలువై శ్రీవేంకటేశు సాకారనిరాకారా-
లలరి వెలుఁగుచుండు నంతరాకాశమున

**తొలిపలుకు :**

భూమ్యాకాశాల నిండా ఆవగింజంత సందుకూడా లేకుండా నిండిపోయాడు త్రివిక్రముడైన విష్ణువు. ఆ ఆకాశపదము అంతా విష్ణుపదమే అన్ని ఆత్మలకు అదే సుస్థిరస్థానము. అందుచేత అదే జన్మలకు కారణము అంటున్నారు అన్నమయ్య.

**భావదీపిక :**

అదిగో బ్రహ్మాండమంతా వ్యాపించిన విష్ణుపదము. అదే ఆత్మలన్నింటికీ నెలవు. అదే వారివారి కర్మాను గతిగా వాటి జనన కారణమూ అయినది. ఆకాశపదము అంతా విష్ణుపదమే.

అంతా వ్యాపించిన ఆకాశముననే మంచి మాటలైనా, కాని మాటలైన (చెడు మాటలైనా) అతిశయించి అణగిపోతాయి. వేడివేడి నిట్టూర్పులు యెన్ని కలిగినా అటు పిమ్మట ఈ ఆకాశముననే అణగిపోతాయి.

సూర్యచంద్రులు భూమికి యెంత దవ్వున (దూరంగా వున్నా) చూపులు తాకుతాయి కదా! ఈ ఆకాశము వారిని కూడా తన పొంతనే (లోనే) అణగించుకొంటుంది. అనేక రూపాలు కల మన శరీరపు నీడలను, కాలత్రయమును (భూత, వర్తమాన, భవిష్యత్ కాలములను) బహిర్గతమైన ఆకాశము తనలో అణగించును.

చీకటి వెలుగుల సమ్మేళనమైన అహోరాత్రాలను కలసి మెలసి ఈ ఆకాశతత్త్వమున నిబిడీకృతమైనవి. శ్రీ వేంకటేశ్వరుని సాకార నిరాకార రూపములు వెలుగుచుండే అంతరాకాశమున (ఆత్మ వెలుగొందే ఆకాశమున) ఆ పరమాత్ముడు అలరుతుంటాడు.

**సంఖ్య : 505** **సంపుటము : 4** **పుట : 340** **రాగం : రామక్రియ**

పల్లవి: అల్లవాడే గద్దెమీఁద నౌభళపుగుహలోన
యెల్లవారిఁ గరుణతో నేలుకొన్నాఁడు

చ. 1: వుక్కుఁగంభములో( బుట్టి వుగ్రనారసింహుఁడు
మొక్కలపు హిరణ్యుని ముందలవట్టి
గక్కనఁ గడుపు చించి ఘనమైన పేగులు
వెక్కసపు జంధ్యాలుగా వేసుకొన్నాఁడు

చ. 2: కోరలు దీఁడుకొంటాను ఘోరనారసింహుఁడు
సారెసారె నెత్తురులు చల్లుకొంటాను
వీరులైన దానవుల వెదకి వెదకి కొట్టి
గోరికొనఁ గండలెల్లాఁ గోయుచున్నాఁడు

చ. 3: విచ్చన విడిని శ్రీవేంకటనారసింహుఁడు
పచ్చిదేర నట్టే పకపక నవ్వి
కచ్చు పెట్టి దేవతలఁగాచి యభయమిచ్చి
పెచ్చు రేఁగి సంతోసానఁ బెరుగుచున్నాఁడు

**తొలిపలుకు :**

ఆహోబల నరసింహస్వామిపై అత్యద్భుతమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. గద్దెపై కూర్చున్న ఆ భీకరాకారుడు వుక్కు స్తంభము నుంచి వెడలి హిరణ్యకశిపుని కడుపు చీల్చి కండలను కొనగోళ్ళతో కోసి నెత్తురు త్రాగి, వెదజల్లి పేగులు జంధ్యాలుగా వేసికొన్నాడు. నేడు శ్రీవేంకట నరసింహుడై పకపక నవ్వుతూ అందరికీ సందడిగా వరాలిస్తున్నాడు ఈ జౌభళపుసింహం.

**భావదీపిక :**

అల్లదిగో వాడే గద్దె మీద కూర్చొని జౌభళపు గుహలోన యెల్లరను యేలుకొనుచున్న అహోబల నరసింహుడు.

ఈయన ఉక్కుగంభము (ఉక్కు స్తంభములో) పుట్టిన ఉగ్రనరసింహుడు. మొక్కలపు హిరణ్యుని (మూర్ఖుడైన హిరణ్యకశిపుని) ఎదురువెళ్ళి పట్టుకొని చటుక్కున కడుపుచించి, ఘనమైన వాడి పేగులను చీల్చి జంధ్యాలుగా వెక్కసముగా (ఆశ్చర్యకరంగా) వేసికొనినాడు.

ఆ స్వామి తన కోరలను దీఁడుకొంటాను (మెఱుగుపెట్టుకొంటూ) ఈ ఘోరనృసింహుడు అనేక సార్లు వాడి నెత్తురును వెదజల్లాడు. వాడి వీరులైన కొడుకులను వెదకి వెదకి కొట్టి, కొనగోళ్ళతో వాళ్ళ కండలు కోసికొనుచూ భీకరంగా చంపాడు.

విచ్చన విడి (విచ్చలవిడిగా) నేడు శ్రీవేంకటనారసింహుడై పచ్చిదేరన్ (ఆఱడిగా) పకపక సులువుగా నవ్వుతున్నాడు. కచ్చుపెట్టి (ప్రతిఘటించి) ఆసురులను చంపి, దేవతలకు ఆభయమిచ్చాడు. నేడు పెచ్చురేగిన సంతోషముతో పెరిగిపోతున్నాడు.



**సంఖ్య : 416** **సంపుటము : 2** **పుట : 280** **రాగం : గుండక్రియ**

పల్లవి: అవియు నాకుఁ బ్రథమాచార్యులు
తవిలి యీనెపము మిముఁ దలఁపించుఁగాన

చ. 1: ధనవాంఛ మతిలోనఁ దగిలినప్పుటివేళ
దనుజారి మీమీఁదఁ దలఁపు గలుగు
పొనిగి భయదుఃఖములఁ బొరలినప్పటివేళ
పనివూని మీమీఁది భక్తి గలుగు

చ. 2: చెలఁగి పాపములు మించినవేళ హరి మీ-
నలువు నామోచ్చారణంబు గలుగు
బలిమి భవరోగముల బడలినప్పుటివేళ
వలుమారు మీసంప్రార్థనలు గలుగు

చ. 3: ఇన్నిటాఁ దొలఁగి మిము నెరిఁగి కొలిచిన వేళ
మన్ననలపరిణామంబు గలుగు
వున్నతపు శ్రీవేంకటోత్తముఁడ మిము నెదుటఁ
గన్నయీవేళ సౌఖ్యంబులే కలుగు

**తొలిపలుకు :**

అన్నమయ్య ఈ కీర్తనలో యెంత చమత్కారం చూపిస్తున్నారో గమనించండి. ధనవాంఛ, భయదుఃఖాలు పెనవేయుట, పాపకర్మ, సంసారతాపత్రయం మొదలైనవి చెడ్డవి అనుకొంటుంటారు, కాని అవే నాకు మొట్టమొదటి ఆచార్యులు అంటున్నారు. ఇదేమి తిరకాసు అనుకొంటే 'భావదీపిక' చదవండి.

**భావదీపిక :**

అవియు (నేను చెప్పబోయేవి కూడా) నాకు ప్రథమాచార్యులు (తొలి గురువులు). ఎందుకంటే ఇవి ఏదో విధంగా మిమ్మల్ని (శ్రీహరిని) తలపిస్తున్నాయి, స్వామీ!

మా మనస్సులో 'ధనవాంఛ' తగులుకొంటే వో అసురవైరీ! మీ మీద ధ్యాస కలుగుతుంది. ధనం కావాలని మిమ్ము ప్రార్థిస్తాము. మదిలో భయమూ దుఃఖమూ కలిగాయంటే మంచిదే. అప్పుడే మీపై భక్తి కలిగి పనివేళా వేడుకొంటాం.

మా పాపాలు శృతిమించితే శ్రీహరీ! నలువున (మా సామర్థం కొద్దీ) మీ నామసంకీర్తన చేసి పాప నివారణ జరుపాలని చూస్తాం. భవరోగాలలో (సంసార తాపత్రయంలో) నలిగిపోయే వేళ పలుమార్లు మిమ్ము మొక్కుతాము.

వీటన్నిటి నుంచి తొలగి మిమ్ము తెలుసుకొని కొలిచినచో దాని పరిణామంగా మీ మన్నన దక్కుతుంది. ఉన్నతుడవైన శ్రీవేంకటేశ్వరా! మిమ్మల్ని మా యెదుట యీవేల చూస్తుంటే, లెక్కలేనన్ని సౌఖ్యాలు దక్కుతాయి స్వామీ!

**సంఖ్య : 400    సంపుటము : 2    పుట : 270    రాగం : రామక్రియ**

పల్లవి: ఇంతకంటేఁ దగుబంధు లింక నున్నారా
యెంత సేసినా నీకు నెదురాడేనా

చ. 1: కోపగించి చంకబిడ్డఁ గోరి తల్లి డించితేను
పై పైనే పడుఁగాక పాసిపొయ్యీనా
వోపక నానేరముల కొగి నీవు వేసరితే
నీపాదాలే గతిగాక నే మానేనా

చ. 2: చదివించే అయ్యఁగారు జంకించి చూచితేను
వొదిగి చదువుఁగాక వోపననీనా
యెదుటిగుణములకు నెంత నీవు దొబ్బినాను
యిదె నీకే మొక్కుదుఁగా కింక మానేనా

చ. 3: చెక్కు మీటి పాలు పెంచినదాది వోయఁగాను
గక్కన మింగుటగాక కాదనీనా
యిక్కడ శ్రీవేంకటేశ యిటుల రక్షించఁగ
నిక్కి నే మెరతుఁగాక నే మానేనా

**తొలిపలుకు :**

అద్భుతమైన ఉపమానాలతో అన్నమయ్య స్వామికి తనని కరుణించటం యెందుకు న్యాయమో వివరిస్తున్నారు. నాకంటే కావలసిన వారెవరున్నారయ్యా నీకు? నీవు నాకెంత చేసినా నిన్ను యెదిరించానా? నీవు నన్ను రక్షిస్తే నేను మెరసిపోక మానెదనా? అంటున్నారు.

**భావదీపిక :**

స్వామీ! ఇంతకంటే (నీకంటే) గొప్పబంధువులు ఇంకా వున్నారా? నీవు నాకు యెంతసేసినా (ఏమి చేసినా) యెదురాడేనా (యెదిరించి మాట్లాడానా?)

తల్లి కోపం వచ్చి చంకలోనున్న బిడ్డనుదించితే ఆ బిడ్డ మళ్ళీ ఆ తల్లిపైనే పడుతుందిగాని అలిగి తల్లిని విడిచిపోతుందా? నా నేరాలను చూచి నీవు వేసరితే (విసిగిపోతే) నీ పాదాలే గతి అని యేడుస్తానుగాని మానుకొంటానా?

చదివించే అయ్యగారు బెదిరింపు చూపులు చూస్తే బుద్ధిగా చదువుకొంటాడు కాని వొప్పుకోనంటాడా? నీ యెదుట నా గుణాలు చూచి నీవు దొబ్బితే (తోసిపడేస్తే) శరణు అని నీకే మొక్కుతాను కాని మానేస్తానా యేమి?

నన్ను పెంచిన దాది నా చెక్కిలిని మీటి పాలుపోస్తే గుటుక్కున త్రాగుతాను కాని వద్దని మొరాయించగలనా? ఈ భూమి మీద వో శ్రీవేంకటేశ్వరా! నీవు నన్ను రక్షించగా అతిశయించి నేను మెరయకుండా మానెదనా?



**సంఖ్య : 463    సంపుటము : 2    పుట : 312    రాగం : శ్రీరాగం**

పల్లవి: ఇంతటా హరినేకాని యెందునను గాన నన్ను
కొంత నాకుఁ దెలుపరో గురువులాల

చ. 1: తనువూ హరియే తలఁపూ హరియే
వినికి మనికియును విష్ణుఁడే
కనుఁగొనుచూపులు కమలనాభుఁడే
యెనసి జీవునిశక్తి యేడనెడ నున్నదో

చ. 2: లోకమెల్ల మాధవుఁడే లోనెల్లఁ గేశవుఁడే
వాకును కర్మము శ్రీవైకుంఠుఁడే
చేకొని చైతన్యమెల్ల శ్రీనారాయణుఁడే
యీకడ నే ననువాఁడ నేడ నుండువాఁడనో

చ. 3: వెనకను కృష్ణుఁడే వెస ముం దట్యుతుఁడే
కొనమొదలు నడుము గోవిందుఁడే
యెనయఁగ శ్రీవేంకటేశుమయ మింతాను
అనుగునాస్వతంత్ర మది యేడనున్నదో

**తొలిపలుకు :**

సర్వమూ హరిమయమే, కాని యెక్కడా కనబడడు. గురుపుంగవుల్లారా! కాస్త నాకు ఈ వింత తెలుపండయ్యా. జీవుడికి జీవశక్తి ఇస్తున్నదెవరు? “నేను” అనేవాడు యెక్కడనుంచి వచ్చాడు? అంతా హరి కల్పితమైతే నా స్వతంత్ర్యం యెక్కడుంది? అంటున్నారన్నమయ్య.

**భావదీపిక :**

నేను అన్నిచోట్లా, యెందుననూ (యెక్కడైనా గాని) హరినే కాని మరేమీ చూడనైతిని. నాకు కొన్ని సందేహాలున్నాయి, వో గురువులారా! నాకు కొంత తెలుపుడయ్యా!

మన శరీరము శ్రీహరివల్లనే, తలపులు కలుగుతున్నదీ హరివల్లననే, వినికిడి శక్తీ హరిదే, మనికి (జీవశక్తి) కూడా విష్ణువే. కంటికి చూపునిచ్చినదీ కమలనాభుడే. మరి ఇక అతిశయించిన జీవుని శక్తి యెక్కడున్నదో చెప్పండి?

ఈ లోకంలో యెక్కడ “చూచినా” మాధవుడే వున్నాడు. మన ఆత్మలోనూ కేశవుడే వున్నాడు. వాకును (పలికే మాట) కర్మము (చేసే పని) శ్రీవైకుంఠుని ప్రేరణ వల్లనే. నాలోని చైతన్యశక్తి శ్రీ నారాయణుడే. మరి ఇక “నేను” అని చెప్పుకొంటున్నవాడు యెక్కడున్నాడో చెప్పండి.

నా వెనుక రక్షకుడైనవున్నది కృష్ణుడే. నా ముందు నడుస్తు దారి చూపిస్తున్నది అచ్యుతుడే. కొన మొదలు నడుమ (నా అంతము, ఆరంభము, మధ్యస్తమూ) గోవిందుడే. అంతా అతిశయించిన శ్రీవేంకటేశ్వరుని మయమే. ఇప్పుడు చెప్పండి, నా స్వతంత్రము యెక్కడున్నది?

**సంఖ్య : 195    సంపుటము : 3    పుట : 131    రాగం : బౌళి**

పల్లవి: ఇందుకే కాలమందే యీతని శరణంటిమి
ముందు ముందే దయఁజూచి మొగిఁ గాచుఁగాక

చ. 1: పుడమి గుంగిన నెత్తె పురుషోత్తముఁ డితఁడు
యెడసి కొండ గుంగితే నెత్తె నితఁడు
అదరి సంసారవార్ధి నడఁగిన దాసులను
యిడుమలఁ బొందకుండా యెత్తి కాచుఁగాక

చ. 2: పట్టి ప్రహ్లాదు బాధలు పాపినదేవుఁ డితఁడు
రెట్టిగా వేదము లుద్ధరించె నితఁడు
వట్టిదుష్టులలో సహవాసమైతే దాసులను
దిట్టయై వెళ్లఁదీసి తా దిక్కై కాచుఁగాక

చ. 3: లంకలో సీతఁదెచ్చినలావరి తానే యితఁడు
మంకు అహల్యశాపము మాన్పె నితఁడు
అంకెల శ్రీవేంకటేశుఁ డతిభీతిఁ బాపి మమ్ము
గొంకక తనదాసులఁ గూడి కాచుఁగాక

**తొలిపలుకు :**

అందుకే సకాలంలో శ్రీహరికి శరణనండయ్యా! ఎవరైనా ముందొచ్చిన వాళ్ళని ఆదరించినంతగా వెనుక వచ్చిన వాళ్ళ గురించి పట్టించుకొంటారా? అంటున్నారు అన్నమయ్య. సీతను లంకనుండి తీసికొని వచ్చిన వేంకటరామయ్య ఇతగాడేనా? మరి తన దాసుల్ని కాపాడకుండా వుంటాడా?

**భావదీపియ :**

అందుకే కాలమందే (సకాలంలోనే) యీతని (హరిని) శరణు వేడితిమి. ముందు ముందే (వెనువెంటనే) దయదలచి పూనికతో రక్షించుగాక!

భూమి వొకవైపు క్రుంగిపోతే పురుషోత్తముడైన యితడు బలరాముడై తన నాగలితో యెత్తినాడు. కొండ (మంథరగిరి) క్షీరసాగరంలో క్రుంగితే ఇతడు కూర్మరూపియై యెత్తినాడు. సంసారసాగరంలో మునిగి పోతున్న ఇతని దాసులను కష్టాలు పడకుండా యెత్తిపట్టి కాపాడలేడా?

ఇతడు ప్రహ్లాదుని పట్టి బాధలను రూపుమాపిన నృసింహుడు. మత్స్యరూపియై రెట్టిగా (ద్విగుణీకృతంగా) వేదములను సంరక్షించినది ఇతడే. తన దాసులకు దుష్టులతో సహవాసము వలన నష్టం జరుగుతుంటే, ధీరుడై వారిని ఆదుకొని తాను దిక్కై రక్షించలేడా?

లంకలో రావణుని వధించి సీతను రక్షించి తెచ్చిన వీరరాముడితడు. అహల్య శాపమును నివారించిన శ్రీరామచంద్రుడితడు. తోడు నీడైన ఈ శ్రీవేంకటేశ్వరుడు మా భయం పోగొట్టి, గొంకక (సంకోచించక) మమ్ము కాపాడలేడా?



**సంఖ్య : 502    సంపుటము : 2    పుట : 341    రాగం : శంకరాభరణం**

పల్లవి: ఇతనిప్రసాదమే యిన్నియును
గతి యితనిదేకన కాదనరాదు

చ. 1: కాయములో నొక ఘనసంసారము
ప్రాయంబులతోఁ బ్రబలీన
ఆయ మందుకును హరి దానేయై
దాయక పాయక తగిలున్నాఁడు

చ. 2: వొనరినకలలో నొకసంసారము
మనసుతోడనే మలసీని
ననిచి యందుకును నారాయణుఁడై
కొనమొదలై తా గురియైనాఁడు

చ. 3: వుడిబడి కోర్కుల నొక సంసారము
బడిబడియాసలఁ బరగీని
విడువక యిది శ్రీవేంకటేశ్వరుఁడే
తొడిఁబడఁ గల్పించి ధ్రువమయినాఁడు

**తొలిపలుకు :**

మానవుని శరీరంలో వొక గొప్పసంసారం వున్నది. వయస్సుతో దాంట్లో వచ్చే మార్పులు హరికల్పితాలే. కలలో మనిషి చూచే సంసారము నిజమనిపించే భ్రమ. ఇదీ నారాయణుని కల్పితమే. ఉపద్రవకర కోరికలూ ఒక సంసారమే. ఈ వలయాలన్నీ ఇతని ప్రతాపమే. ఇతడే (శ్రీహరియే) గతి అనక మరొకదారి లేదు అంటారన్నమయ్య.

**భావదీపియ :**

ఇన్నియును (సర్వము) ఇతని ప్రసాదమే (శ్రీహరి ప్రసాదించినవే). గతి ఇతనిదే, కన (కాబట్టి) తిరస్కరించుట తగదు.

శరీరములో వొక గొప్ప సంసారము వున్నది. అది వయస్సు ప్రభావంతో ప్రబలీని (అతిశయించుచుండును). శ్రీహరి, అందుకును (దానికి) తానే ఆయము (అంగము)లై, దాయకపాయక (దగ్గరగాక దూరముగాక) తగులుకొని యున్నాడు.

మన కలలో కూడా ఒక సంసారమున్నది దాని వ్యవహారమంతా మనస్సుతోనే ముడిపడి వుంటుంది. అందుకును (దానికి కూడా) నారాయణుడే ననిచి (అతిశయించి) ఆద్యంతములు తానే గురియైయున్నాడు.

ఉడివడు కోర్కెలు (ఉపద్రవం తెచ్చే కోరికలు) వొక సంసారము వంటివే. క్రమక్రమముగా కోరిక ఆశలవలె మారిపోతవి. విడువక ఇవన్నీ కల్పించే శ్రీవేంకటేశ్వరుడే తొడిబడ (శీఘ్రముగా) ధ్రువమైనాడు (స్థిరమైనాడు).

**సంఖ్య : 182 సంపుటము : 3 పుట : 121 రాగం : మంగళగౌళ**

పల్లవి: ఇదె నీకన్నుల యెదిటికి వచ్చితి
కదియుచు నెట్టయినఁ గావకపోదు
చ. 1: పరమపురుష నీభక్తి దొరకకే
యిరవగుజన్మము లెత్తితిని
హరి నీకరుణకు నరుహము లేకే
దురితవిదుల సందులఁ బడితి
చ. 2: జగతీశ్వర నీశరణము లేకే
వొగి సంసారపువురిఁ బడితి
భగవంతుఁడ నీపదములు గనకే
తెగనిపాపముల తీదీపు లైతి
చ. 3: గోవిందుఁడ నినుఁ గొలువఁగ నేరకే
ధావతి యాసలఁ దగిలితిని
శ్రీవేంకటేశ్వర చేరి నీవు నా-
దైవమవుగాఁగ ధన్యుఁడనయితి

**తొలిపలుకు :**

అన్నమాచార్యులవారు వేంకటపతితో యేమంటున్నారో చిత్తగించండి. నీ కళ్ళబడ్డాము కదా! స్వామీ! యెట్లాగయినా మమ్మల్ని కాపాడవయ్యా! నీ భక్తి దొరకక యెన్ని జన్మలెత్తానో నాకే తెలియదు. నీ కరుణ లేక పాపాలు చేశాను. నీ శరణాగతి లేక సంసారం అనే “ఉరి” తగిలించుకొన్నాను. నిన్ను కొలువక ఆశల ఆరాటాలలో అల్లాడిపోయాను. చివరికి నిన్ను నమ్మి బాగుపడ్డాను.

**భావదీపిక :**

ప్రభూ! ఇదిగో నీ కన్నుల యెదుట చేరితిమి. ఇక నీకు తప్పదు. ఎట్లాగైనా మమ్ము కదియుచు (దగ్గరకు తీసికొని) కావకపోదు (రక్షించక కుదరదు).

ఒక్కసారి మా దీనస్థితిని చూడవయ్యా! పరమపురుషా! నీ భక్తి దొరకనందువలన అమరిన జన్మలన్నీ యెత్తాను. శ్రీహరీ! నీ కరుణకు అర్హుణ్ణికాక చెడు మార్గాలను బట్టి తిరిగాను.

ఓ జగదీశ్వరా! నిన్ను శరణువేడక పూని సంసారపు ఉరితాళ్ళు మెడకు తగిలించుకొన్నాను. భగవంతుడా! నీ పాదముల నాశ్రయించక, తెగని (విడిపోని) పాపముల యొక్క తీదీపుల (అంతులేని పాపకర్మలను) చేశాను.

ఓ గోవిందుడా! నిన్ను సేవించటం చేతకాక దావతి ఆసల (ఆరాట పెట్టే) ఆశలలో తగిలితినయ్యా! ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్ను చేరగా నీవు నా దైవమైనావు అంతే నేను ధన్యుడనైతిని తండ్రీ!



**సంఖ్య : 427 సంపుటము : 2 పుట : 281 రాగం : లలిత**

పల్లవి: ఈతని మరచివుంటి మిన్నాళ్లును
యీతల నేఁ డెచ్చరించె నీతఁడే పో విష్ణుఁడు
చ. 1: తల్లియై పోషించు తండ్రియై రక్షించు
వుల్లపుబంధువుఁడై వొడ లరయు
మెల్లనె దాతై ఇచ్చు మెలుఁతయై యాదరించు
యెల్లవిధబంధువుఁడు యీతఁడే పో విష్ణుఁడు
చ. 2: యేలికయై మన్నించు నిష్టుఁడై బుద్ధిచెప్పు
చాలుమానిసియై యంచలఁ దిరుగు
బాలుఁడై ముద్దుచూపు ప్రాణమై లోన నుండు
యీలాగులబంధుఁ డీతఁడే పో విష్ణుఁడు
చ. 3: దేవుఁడై పూజగొను దృష్టిగోచరమై
శ్రీవేంకటాద్రిమీఁద సిరు లొసగు
తావై యెడమిచ్చు తలఁపై ఫలమిచ్చు
యీవలనావల బంధుఁ డీతఁడేపో విష్ణుఁడు

**తొలిపలుకు :**

అన్నమయ్య ఈ చక్కని కీర్తనలో అంతటా వ్యాపించినట్టి ఈ విష్ణుడు అన్ని వైపులా బంధువే, పైగా అనురాగం గల బంధువు. బ్రతికుండగ యీ భూమి మీదే కాదు నేను పై లోకాలకు పోయినా నన్ను రక్షించే బంధువు ఈ శ్రీవేంకటపతే అంటున్నారు. అన్నట్లు దీని వివరణ అనుకున్నంత తేలిక వ్యవహారం కాదు సుమండీ!

**భావదీపిక :**

మేము దురదృష్టం వలననే ఈతనిని (ఈ శ్రీహరిని) ఇన్నాళ్ళు మరచితిమి. ఈ మధ్య మాపై దయబూని ఈతడే నేడు మమ్మల్ని హెచ్చరించినాడు, పో!

తల్లివలె మమ్మల్ని పోషిస్తాడు, తండ్రివలె రక్షిస్తాడు, ఆత్మబంధువు వలె వొడలరయు (రోగాలనుండి కాపాడుతాడు), గొప్పదాత వలె కోరినవిస్తాడు, మెలతుడై (గృహిణివలె) ఆదరిస్తాడు. సర్వ విధములా ఈ విష్ణువే నిజ బంధువు పో!

పరిపాలకుని వలె మా తప్పులు మన్నిస్తాడు, మా హితుడై మంచీచెడూ చెబుతాడు, చాలుమానిసి (సమర్థుని) వలె మా పక్కనే తిరుగుతాడు, పసిపాపడై ముద్దులు కురిపిస్తాడు. అంతెందుకు మా ప్రాణమై మాలోనే వుంటాడు. మాలాగుల బంధువు (ప్రేమ గల బంధువు) యితడే పో!

మా ఇలవేలుపై పూజలను స్వీకరిస్తాడు. శ్రీవేంకటాద్రి మీద దృగ్గోచరుడై అనేకమైన సంపదలనిస్తాడు. తావై యెడమిచ్చు (ప్రాప్తించు స్థానమై) వుండనిస్తాడు. మన మనస్సున నిలిచి చక్కటి ఫలితాన్నిస్తాడు. ఇహ పరములందు మన వెంటవుండే బంధువెవరు? ఇతడే పో!!!

**సంఖ్య : 505 సంపుటము : 2 పుట : 341 రాగం : ముఖారి**

పల్లవి: ఊరకే కలుగునా వున్నతపు మోక్షము
శ్రీరమణుకృపచేతఁ జేరు మోక్షము

చ. 1: కలుషముఁ బెడఁబాసి కర్మగండము గడచి
మలసినప్పుడుగా మరి మోక్షము
చలన మించుకలేక సంసారవారధి దాఁటి
నిలిచినప్పుడుగా నిజమోక్షము

చ. 2: పంచేంద్రియాల మీరి భక్తి హరిమీఁదఁ బెట్టి
మంచివాఁడైనప్పుడుగా మరి మోక్షము
అంచల యాసలు మాని ఆచార్యసేవ చేసి
మించినప్పుడుగా ఆమీఁద మోక్షము

చ. 3: శాంతమే కూడుగా నుండి సమచిత్తమునఁ బొంది
మంతుకెక్కినప్పుడుగా మరి మోక్షము
అంతట శ్రీవేంకటేశుఁ డాదరించి మన్నించితే
నంతరంగమున నున్న దనాది మోక్షము

**తొలిపలుకు :**

భక్తులంతా మోక్షం, మోక్షం అని పరితపిస్తూంటారు. అది ఊరకే దొరుకుతుందా? అంటున్నారు అన్నమయ్య. శ్రీపతి కరుణిస్తే నీ చేతికందుతుంది. అనాదియైన మోక్షము యెక్కడోలేదు, మన అంతరంగంలోనే వున్నది. శ్రీవేంకటపతి మన్నించి ఆదుకోకపోతే మోక్షం కోసం యేడుస్తూనే వుంటారు కాని, యెన్నటికీ సాధించలేరు.

**భావదీవియ :**

అయ్యలారా! వున్నతమైన మోక్షము వూరకే దొరుకుతుందా? శ్రీపతి యొక్క కృపవుంటే మోక్షమును పొందుతారు, లేకుంటే సాధ్యం కాదు.

మనలోని “చెడు”ని దూరం చేయాలి. కర్మలు అనే గండము నుంచి బైటపడాలి. ఆ విధంగా జీవితకాలం గడపాలి. అప్పుడు కదా! మోక్షము. సంసారసాగరంలో కొద్దిగా నైనా చలించక దాటిధీరుడై నిలదొక్కుకొంటే కదా! నిజమైన మోక్షము కలుగుతుంది.

పంచేంద్రియాలు పెట్టే ఇబ్బందులను మీరి, హరి మీద భక్తిని సడలనివ్వక మంచివాడై బ్రతికినప్పుడు కదా! మోక్షం దొరికేది? అంచెలంచెల మీద ఆశనుంచి విముక్తి పొంది, ఆచార్యుని సేవ చేసి ఉత్తీర్ణుడైతేనే కదా! ఆపైన మోక్షము సిద్ధిస్తుంది.

నిత్యమూ శాంతుడై, సుఖదుఃఖాలలో సమబుద్ధి కలిగి ప్రసిద్ధుడై వున్న వానికే కదా! మోక్షప్రాప్తి. అంతట (ఆ విధంగావుంటే) శ్రీవేంకటేశుడు ఆదరించి మన్నిస్తాడు. అప్పుడు, అనాది నుండి మోక్షము అని పరితపించే వారి అంతరంగంలోనే మోక్షం వుంటుంది.



**సంఖ్య : 204 సంపుటము : 3 పుట : 137 రాగం : వరాళి**

పల్లవి: ఎన్నఁడు వివేకించే దీడేరె దెన్నఁడు
యెన్ని లేవు జీవిపా ట్లేమిచెప్పే దిఁకను

చ. 1: నరజన్మమునఁ బుట్టి నానాభోగాలు మరిగి
హరి నెరఁగక మత్తుఁడై వుండును
సురలోకము చొచ్చి సుకృతఫలములంది
గరిమ విజ్ఞానమార్గము విచారించఁడు

చ. 2: పెక్కుగాలము బ్రతికి పెనుఁగోరికలే కోరి
అక్కడ విష్ణుఁ గొల్వక అలసుఁడౌను
మిక్కిలిఁ దపము చేసి మించైనఘనత కెక్కి
తక్కవ పరమమైనతత్త్వము దెలియఁడు

చ. 3: వేవేలు బుద్దులు నేర్చి వేడుక సంసారియై
శ్రీవేంకటేశుఁ జెందక చింతఁ గుందును
దైవ మాతడే దయదలఁచి మన్నించుఁగాని
భావించి తనంతనైతే భవములఁ బాయఁడు

**తొలిపలుకు :**

జీవి పాట్లేమని చెప్పను అని అన్నమయ్య కళ్ళకు కట్టినట్లు గొప్ప పుణ్యాలు చేసిన వారికి కూడా నరజన్మ కలిగాక జరగబోయేదేమిటో వివరిస్తున్నారు. ఎన్ని తపస్సులు చేసినా, బుద్ధులు నేర్చినా వేడుకలు పేరు ప్రతిష్టలు పొందుతాడే గాని ముక్తిని పొందడు. పుట్టుకలేని ముక్కి కావాలంటే మురహరి దయవుంటే గాని లాభం లేదు అంటున్నారు.

**భావదీవియ :**

ఈ జీవుడు వివేకము పొందే దెన్నడు? ఈడేరేది (కృతార్థుడయ్యే) దెన్నడు? ఏన్ని తిప్పలు పడతాడీ జీవుడు. వీడి పాట్లు యేమని వర్ణించను?

అనేక హీన జన్మల తరువాత నరజన్మ మెత్తి అనేక భోగాలకు మరిగి, మత్తుడై హరిని యెఱుగక వుంటాడు. ఏవో మంచి పనులు చేస్తాడు కాబట్టి చచ్చాక స్వర్గం పొందుతాడు. ఇక అక్కడా సుఖం మరిగి జ్ఞానమార్గం జాడ నెరుగడు.

చాలా కాలం అక్కడ వున్నా కోరిక లెక్కువౌతాయే గాని తగ్గవు. అక్కడ కూడా విష్ణుని గొలువక నిర్లక్ష్యం చేస్తాడు. ఒక వేళ గొప్ప తపస్సు చేసినా, ఇంకా గొప్ప పేరు సంపాదిస్తాడే గాని పరమమైన (మోక్షాన్నిచ్చే) తత్త్వమును దెలియడు. అయితే, ఆ పుణ్యం వలన మళ్ళీ ఉత్కృష్ట జన్మ పొందుతాడు.

గొప్ప గొప్ప చదువులు చదువుతాడు, వేడుకల సంసారి అవుతాడు. శ్రీవేంకటేశ్వరుని సేవించక దుఃఖాల దురవస్థ పొందుతూనే వుంటాడు. మరి ఇక వీడి గతి ఇంతేనా? పరమాత్మ దయదలచి మన్నిస్తేనే తప్ప, తనంత తాను ఈ భవముల బాయడు (పుట్టుకలను విడువలేడు).

**సంఖ్య : 465** **సంపుటము : 2** **పుట : 313** **రాగం : బౌళి**

పల్లవి: ఎఱుఁగుటకంటే నెఱఁగమే మేలు
మఱి తెలివికంటే మఱపే శుభము

చ. 1: లంపటా లెఱఁగము లవలన లెఱ గము
పంపులబాల్యమే పరిణామము
యింపులు నెఱఁగము యొగ్గులు నెఱఁగము
జంపులనిదురే సకలసౌఖ్యము

చ. 2: ఆస లివెఱఁగము అలమట లెఱఁగము
మూసినగర్భమే మును సుఖము
వాసులునెఱఁగము వంతులు నెఱఁగము
వేసట వుట్టనివిధమే సుఖము

చ. 3: పాపము లెఱఁగము బంధము లెఱఁగము
శ్రీపతిదాస్యమే శేఖరము
యేపున శ్రీవేంకటేశ్వరుని శరణమే
తీపులు మఱపేటి దివ్యానందము

**తొలిపలుకు :**

విపరీతమైన నాందీప్రస్తావన చేస్తున్నారు ఈ కీర్తనకు అన్నమయ్య. కొన్ని సార్లు పనికిమాలిన విషయాలను యెఱుగుటకంటే యెఱుగకుండుటే మేలు. అలాగే పనికిమాలిన తెలివి కంటే మతిమఱుపే మేలు అంటున్నారు. కీర్తన భావదీపిక చదివితే ఈ తిరకాసు బోధపడుతుందయ్యా వేంకటయ్యా!

**భావదీపిక :**

అయ్యలారా! కొన్ని విషయాలను యెఱుగుట కంటే యెఱుగకుండుటే మేలు. మఱి అదే విధంగా తెలివి కంటే కొన్ని చోట్ల మతిమరుపే మేలు.

ప్రేమగా పెంచిన బాల్యములో మనకు లంపటాలు తెలియవు. లవలవలూ (పెనుగులాటలూ) తెలియవు. ఒప్పులు తెలియవు తప్పులూ తెలియవు. అందుకే ఆ బాల్యంలో నిదురకంటే సర్వసుఖమైనది వుండదు.

తొలినాళ్ళలో మూసిన మాతృమూర్తి గర్భంలో వున్నప్పుడు ఆశలనెఱుగము, అలమట లెఱుగము (చింతను యెఱుగము). తారతమ్యాల నెఱుగము, పంతము నెఱుగము. విసుగు పుట్టని విధానమే సుఖము.

పాపమంటే యేదో యెఱుగము, బంధము లెట్టివో యెఱుగము, యెందుకంటే మాకు శ్రీపతి దాస్యమే అత్యుత్తమము. శ్రీవేంకటేశ్వరుని శరణ్యమే తీపులు (బాధలను) మఱిపించే దివ్యానందము.



**సంఖ్య : 225** **సంపుటము : 3** **పుట : 151** **రాగం : ముఖారి**

పల్లవి: ఎవ్వరివసము గెల్వ నింతా వీనిమయమే
యివ్వల నీవు గాచితే నేమోకాని

చ. 1: వొక్కలోభము నెంచితే వొగి లోకమెల్లాఁ దానే
యెక్కడ చూచినాఁ దానే యీదీపనము
వెక్కసమైనది తానే వేగిలేచి సేసేపని
తక్కక యిన్నిటా నెట్టు తప్పించుకోవచ్చును

చ. 2: పలుమారు వచ్చీఁ దానే పనిలేని పరాకు
వళచుకొన్నది తానే వట్టిభీతి
నిలుచుకున్నది తానే నిలువుననే సిగ్గు
మెలుపున నెటువలె మెదలఁగవచ్చును

చ. 3: కనుగొంటే నెందూఁ దానే కార్పణ్యము దైన్యము
అనిశము మించీఁ దానే యాచకత్వము
నను నేలుకొంటి విదే నమ్మితి శ్రీవేంకటేశ
జనుఁడను యివి నేను సాధించుటెట్టు

**తొలిపలుకు :**

అన్నమయ్య ఈ కీర్తనలో స్వామీ! నీ దయవుంటే యేమోగాని, లేకపోతే నీవు కల్పించిన ఈ లోభము, పారవశ్యము, భయము, సిగ్గు, దైన్యము, అదుక్కుతినే బుద్ధి మానవుల్ని పట్టి పీడిస్తున్నాయి. నేను కూడా మనిషినేకదా! నాకూ వీటి పీడ తప్పటంలేదు. వీటిని యెట్లా సాధించాలో దారిచూపు అంటున్నారు.

**భావదీపిక :**

స్వామీ! ఈ ప్రపంచమంతా వీని (నేను చెప్పే యీ దుర్గుణాలు) మయమే. వీనిని గెల్వనెవ్వరి వశమయ్యా? నీవు ఇట్లాకాదని మమ్ము రక్షిస్తేయేమో? కాని...

ఒక్క లోభమును చూడు ఆలోచిస్తే లోకమంతా అదే రాజ్యం చేస్తోంది. ఈ దీపనము (దీని ప్రేరేపణ) యెక్కడ చూచినా సమృద్ధిగా వున్నది. పొద్దున లేచింది మొదలు యెవడికి వాడిపని ముందు పూర్తి అవ్వాలి. తక్కక (లొంగక) వీటన్నింటినుంచి యెట్లా తప్పించుకోవచ్చు?

మనిషికి ఈ పనికిమాలిన పరాకు (పారవశ్యము) అనేకమార్లు వస్తుంటుంది. వట్టిభీతి (పనికి మాలిన పిరికితనం) తానే వళుచుకొన్నది (నిందలపాలు చేసింది). సిగ్గు నిలువునా నన్ను నిలదీసింది. ఇక నేను మెలుపున (మెలపు=జాగ్రత్త) యెట్లా మెదలగలను?

నాలోని కార్పణ్యము (కుత్సితత్వము) దైన్యము (దీనత్వము) ఎక్కడచూచినా తామే అన్నట్లు నిండిపోయాయి. అవి నన్నుమించి యెప్పుడూ నన్ను యాచకుడిని చేసేస్తున్నాయి. ఓ శ్రీవేంకటేశ్వరా! చివరికి నేను నిన్ను నమ్మానని నన్ను యేలుకొన్నావు. నేనేమో జనుడను (సామాన్య మానవుడను) వీటిని నేను గెలువగలనా తండ్రీ?

**సంఖ్య : 560 సంపుటము : 3 పుట : 376 రాగం : నారాయణి**

పల్లవి: ఏఁటివిచారము యెక్కడి యాచారము
మాటున జీవుఁ డింతేసి మాయలఁ బొరలును

చ. 1: పరగ నూరేండ్ల బ్రతుకునకేకా
ధర ననియునుఁ గూర్చి దాఁచుకొనేది
పొరసి నానా సుఖభోగాలు చింతించుఁగాని
పరమున కీపాటిప్రయాస పడఁడు

చ. 2: కడుపు నించుకొరకుఁ గామసుఖమునకేకా
చెడనివుద్యోగాలు సేయఁగోరును
మిడిసి లోకము లెల్ల మెప్పించ నడచుఁగాని
చిడుముడి హరి మెప్పించే ననలేఁడు

చ. 3: సారె సారెఁ జచ్చి చచ్చి జననము నొందేదెల్లా
వూరఁగల కర్మము లొగిఁ జేయుట
మేరలేక నరులను మెచ్చుగఁ గొలుచుఁగాని
కూరిమి శ్రీవేంకటేశుఁ గొలువఁగ లేఁడు

**తొలిపలుకు :**

జీవుడికి ఈ ఆలోచనలెందుకు? ఏవేవో ఆచారము లెందుకు? వీడు అనవసరంగా ఇంతింత హరిమాయలో జిక్కి కష్టపడుతున్నాడు అంటున్నారు అన్నమయ్య. ఈ జీవుడు మహా బ్రతికితే నూరేండ్లు దాని కోసం ఇంత సంపాదించాలా? ఇన్నిసార్లు చచ్చి పుట్టాడే.... ఇంకా హరిని గాక నరులను కొలుస్తానంటాడే? ఎంత మూర్ఖుడు!!!

**భావదీపిక :**

ఏమిటీ ఆలోచనలు? యెక్కడవీ ఆచారములు? ఈ జీవుడు ఇంతేసి (ఇన్ని) మాయల మాటున (బంధనాలలో) పొరలును (పొర్లుతున్నాడు కదా!)

ఈ జీవుడు భూమ్మీద యెంత కూడ బెట్టి దాచి ధనం పోగేసినా నూరేండ్లు బ్రతుకునకే కదా! నానా సుఖాలు భోగాలు కావాలని ఆలోచిస్తాడే కాని, పరమునకు (పరలోక సుఖమునకు) యేమాత్రమూ ప్రయత్నించడు.

స్థిరమైన వుద్యోగాలు చేయాలని జీవుడెందుకు ఆరాటపడతాడు? కడుపు నింపుకొని, కామ భోగాలు అనుభవించటానికే కదా! మిడిసిపడి లోకాలను మెప్పించాలని నడచుకొంటాడేగాని, చిడుముడి (తొందరగా) శ్రీహరిని మెప్పించాలి అనుకోడు.

ప్రతిసారీ చచ్చిపుడుతుండాడే దేనికి? వూళ్ళోవున్న కర్మలన్నీ తన నెత్తిన బెట్టుకొని చేయటానికా? మేరలేక (హద్దుమీరి) నరులను పొగడుతూ కొలుస్తుంటాడు గాని, ప్రేమగా శ్రీవేంకటేశ్వరుని మాత్రం కొలువలేడు. అదే వీడి దౌర్భాగ్యం.



**సంఖ్య : 178 సంపుటము : 3 పుట : 119 రాగం : దేసాళం**

పల్లవి: ఏమనఁగ వచ్చునమ్మ ఇటువంటి వారిఁజూచి
కామించి గోపికలెల్లాఁ గాచుకున్నారదివో

చ. 1: రోలఁ గట్టువడ్డవాఁడు రోఁకలిపట్టిన వాఁడు
వేళలేదు వెన్నలెల్ల వెరఁజాడేరు
వేలఁ గొండెత్తినవాఁడు వేరే యేరుసేసేవాఁడు
బాలులవలెనే వీధిఁ బారాడేరు వారివో

చ. 2: కాటుకమైచాయవాఁడు కప్పురపువన్నె వాఁడు
కూటము గూడుక జోడుకోడెలైనారు
నీటుఁబైఁడికోక వాఁడు నీలికాశతోడి వాఁడు
తేటలై దూడలఁ గాచి తిరిగేరు వారివో

చ. 3: చేరి చీరలిచ్చువాఁడు చెలిఁ గుంగించినవాఁడు
ధీరులై రేపల్లెలోనఁ దిరిగే రదే
యీరీతి శ్రీవేంకటాద్రి నిద్దరును నేకరూపై
కోరినవారివరాలు కొల్ల లిచ్చే రదివో

**తొలిపలుకు :**

బలరామకృష్ణులను పోలుస్తూ బహు చక్కటి కీర్తన చెబుతున్నారన్నమయ్య. ఇద్దరూ కవల పిల్లల వలెనున్నా వారి మధ్య విభిన్నమైన పోలికలు వున్నాయని అంటున్నారు. ఇటువంటి వారిని జూచియేమనగలమమ్మా? శ్రీవేంకటాద్రి మీద మాత్రం ఇద్దరూ ఒకే రూపంలో వున్నారట.

**భావదీపిక :**

ఇటువంటి అన్నదమ్ముల జంటను చూచియేమగవచ్చునమ్మా? వీరిని కామించిన గోపికలు, అదిగో వీరికోసం కాచుకొనివున్నారు.

వీరిరువురికి గల పోలికలు, వ్యత్యాసాలను గమనించండి. వీరిలో రోటికి కట్టివేయబడినవాడు కృష్ణుడు. రోకలిని ఆయుధంగా ధరించి తిరిగేవాడు రాముడు (బలరాముడు). ఇద్దరూ వేళాపాళాలేక వెన్నలెల్లా వెరజాడేరు (కొల్లగొడతారు). కృష్ణుడు తన వ్రేలిపై గోవర్ధన కొండనెత్తాడు. వేరేయేరుసేసెవాడు (రాముడు యమునానదిని నాగలితో రెండుగా విడదీసినాడు). ఇప్పుడు మాత్రం చంటిపిల్లల వలె వీధిలో పాకుతున్నారు.

కృష్ణుడి వంటి రంగు కాటుకవలె నలుపు. రాముడు కర్పూరంలా తెల్లనివాడు. ఇప్పుడు జంటగా కూడి జోడు కోడెగిత్తల వలెనున్నారు. కృష్ణుడు బంగారం రంగు పీతాంబరం ధరిస్తాడు. బలరాముడు నీలం రంగు బట్టకడతాడు. ఇప్పుడుతేటలై (వివేకవంతులై) ఇద్దరూ దూడలను కాస్తూ తిరుగుతున్నారు.

కృష్ణుడు ద్రౌపదికి చీరలనిచ్చాడు. రాముడు తన భార్య రేవతి ఎత్తుతగ్గి పోవునట్లు క్రుంగదీశాడు. ఇద్దరూ ధీరులై రేపల్లెలో తిరుగుతున్నారు. ఈ విధంగా నేడు శ్రీవేంకటాద్రిపై ఇద్దరూ ఒక్కరై ఇదిగో కోరినవారి కోర్కెలను కొల్లలుగా (పుష్కలంగా) ఇస్తున్నాడు.

**సంఖ్య : 538 సంపుటము : 3 పుట : 361 రాగం : రామక్రియ**

పల్లవి: ఏమి సేయఁగలఁడు తా నీజగమెల్లాను
కోమలపుదేహి కొక్కకోకే కలది

చ. 1: మించినకోరిక లివి మిన్నులపొడవులు
కొంచపుదేహము దనకొలఁది గాదు
యెంచరానిసిరు లవి యెన్ని గలిగినా
కంచములోనికూడే కలిగినది

చ. 2: గోరపడి గడించేవి కోట్లకొలఁదులు
తారి తూరి నోటికిఁ దగ్గంత గాదు
యేరుపరచి యింతుల నెందరిఁ బెండ్లాడినాను
కూరిమి సతి యొకతె కూటమికిఁ గలది

చ. 3: తలఁచి మొక్కేసురలు తలవెంట్రుకలందరు
యిలఁ దన బతుకెంతో యెరఁగ రాదు
చెలఁగి రక్షించేవాఁడు శ్రీవేంకటేశుఁ డొక్కఁడే
కల దంతరంగమునఁ గైవల్యమే కలది.

**తొలిపలుకు :**

మృదు స్వభావియైన జీవుడు యేమి చేయగలడంటున్నారు అన్నమయ్య. ఈ జగమంతా ఇచ్చినా తనకున్న ఆ వొక్కకోకను మార్చుకోగలడా? మరి వీడి కోరికలనంతం కాని తినే కూడు కంచమంతే. కోట్లు గడించినా నోరు పట్టేటంతే తినగలడు. ఎంతమంది పెళ్ళాలున్నా ఒక్క దానితోనే సుఖించగలడు. ఇక దేనికి అత్యాశ?

**భావదీపిక :**

ప్రభూ! ఈ దేహి (జీవుడు) కోమల స్వభావుడు. వీడు ధరించ గలిగిన కోక (వస్త్రము వంటి శరీరం) వొక్కటేకదా! నీవు వాడికీ జగమంతా ఇచ్చినా యేమి సేయగలడు.

వీడి కోరికలు మిన్నుల పొడుగు (ఆకాశమంత యెత్తు). వాడి దేహం మాత్రం ఏడు జానలే. వాడికి లెక్కించలేనన్ని సిరిసంపదలున్నా ఆకలివేస్తే తినగలిగింది కంచములో పట్టినంత కూడు మాత్రమే. అదే వాడికి కలిగినది.

వాడు గోరపడి (ఆగడాలు చేసి) గడించేవి కోట్లకొలది ధనం వున్నప్పటికీ తడవకి యెంత మ్రింగగలడు? నోరు పట్టేటంత ఆహారం. అంతే కదా! ఏర్పరచుకొని యెంతమంది స్త్రీలను పెండ్లాడినా వాడు నిజంగా ప్రేమించే భార్య వొక్కతే వుంటుంది కదా!

ఇదంతా అటుంచి వీడు తన వాంఛలు ఫలించడానికి మొక్కుకొనే దేవతలు తల వెంట్రుకలంత మంది వుంటారు. కాని వీడెంత కాలం బతుకుతాడో యెవ్వరికీ తెలియదు. అతిశయించి వీడి నీడలా తోడుండి రక్షించేది మాత్రం వొక్కడంటే వొక్కడే కలడు. ఆ శ్రీవేంకటేశ్వరుడు వీడి అంతరంగంలో వుంటే వాడికి కైవల్యం తనలోనే వున్నది, అవునా?



**సంఖ్య : 570 సంపుటము : 3 పుట : 383 రాగం : సామవరాళి**

పల్లవి: ఏవల్ల నౌఁగాము లిఁక నేవి అన్నియు నీలోనే
శ్రీవల్లభుఁడ నిన్నుఁ జేఊతిమి నేము

చ. 1: సగుణనిర్గుణములను సావయవనిరవయవ-
మగుఁదర్క వాదకలహములు ఘనము
జగములో చదువులు సంశయంబేకాని
తెగనీదు నీమాయ తెలియవసమా

చ. 2: వేదమార్గము గొంత వేదబాహ్యము గొంత
పోదిమతముల వారిపోరు ఘనము
పాదై నమునిరుషులు బహుముఖములేకాని
సోదించి వొకమాట చూపంగలేరు

చ. 3: వెసఁ గర్మ మొకవంక విజ్ఞాన మొకవంక
వసగావు రెంటిబలవంతములును
వసుధ శ్రీవేంకటేశ్వర నీవుగావు మిఁక
ముసుఁగు వెట్టినవాదు ముగియదెంతైనా

**తొలిపలుకు :**

పల్లవిలోనే తికమక పెట్టారు అన్నమయ్య. నేనిలా భావిస్తున్నాను. ఏ విధమైన బాగోగుల ప్రసక్తి ఇంకా యెక్కడుంది? ఓ శ్రీపతీ! నిన్ను చేరుకొన్నామయ్యా! వాదోపవాదాలతో నీమాయ నెఱగ సాధ్యమా? వేదములు తపములు నిన్ను సాధించవేవు. స్వామీ! నీవు రక్షించాలిగాని వాదము ముగుస్తుందాయేమి?

**భావదీపిక :**

ఓ శ్రీవల్లభా! ఏ విధమైన జౌగాములు (బాగోగులు) ఇక యెక్కడున్నాయి? అన్నియు నీలోనే వున్నవి కదా! అందుకే అన్నీ త్యజించి మేము నిన్ను చేలినాయమ్మా!

సగుణ బ్రహ్మ, నిర్గుణ బ్రహ్మ–సాకార నిరాకార దైవము తర్కవాదనల కలహాలు. ప్రపంచంలో చదువులన్నీ సందేహాలు పెంచేవేకాని తెగనీయవు. ప్రభూ! నీ మాయ తెలిసికొనుట మాకు సాధ్యమా?

కొంత వేదాన్ననుసరించి చేస్తుంటారు. కొంత వేదబాహ్యము (వేద విరుధముగా) చేస్తుంటారు. పోది మతముల (రక్షిస్తామనే మతముల) వారి పోట్లాటలే అధికము. పాదైన (స్థిరపడిన) మునులు, ఋషులు అనేక రకాలు. కాని వారు కూడా ఏదో వొక మాటపై నిలువలేకున్నారు.

భగవద్గీతలోనే ఒక వంక విజ్ఞానము అత్యున్నత మంటావు. ముసుగుదన్ని పడుకున్న ఈ వాదములు ముగియే ముగియవు. ఇవి మాకెందుకయ్యా? ఓ శ్రీవేంకటేశ్వరా! ధరిణిలో మమ్ము రక్షించు. సత్ప్రవర్తనలో మమ్మల్నివుంచు.

**సంఖ్య : 162  సంపుటము : 3  పుట : 109  రాగం : దేవగాంధారి**

పల్లవి: ఒకరి కొకరు వొద్దు దప్పులనే
పకపకనవ్వు పచరించేరు
చ. 1: కొట్టీనుట్లదె గోవిందుఁ డంతలో
తిట్టేరు గోపసతీమణులు
పట్టీఁ జన్నులట్టే పైపై గోవిందుఁడు
మెట్టెలపాదాల మెట్టే రింతులు
చ. 2: వారవట్టీఁ బాలు వంచి గోవిందుఁడు
గోర గీరే రదే గొల్లెతలు
చీర లంటీ నట్టె చెంది గోవిందుఁడు
మేరతోఁ గొప్పు వంచి మించే రింతులు
చ. 3: కెలసి వెన్నారగించీ గోవిందుఁడు
తొలఁగ దోసేరు దొడ్డివారు
కలసెను శ్రీవేంకటాద్రి గోవిందుఁడు
ఆల మేరు మరి నంగనలు

**తొలిపలుకు :**

"ఒకరికొకరు తప్పులనే ఒడ్డులు"– అంటే ఒకరు చేసిన దానికి ప్రతిచర్యగా ఇంకొకటి చేయటం. అన్నమయ్య ఈ కీర్తనలో యేమి చెబుతున్నారంటే గోవిందుడు, గోపికలు ఒకరు చేసిన దానికి ఇంకొకరు ప్రతిచర్య చేసి పకపకమని నవ్వులు ప్రసరిస్తున్నారు. అదెంత ముచ్చటగా వున్నది!!!

**భావదీపిక :**

ఆ గోవిందుడు, గోపికలు ఒకరికొకరు వొద్దు దప్పులనే (ఒకరు చేసిన దానికింకొకరు ప్రతిచర్యగా ఇంకొకటి చేసి) పకపకమని నవ్వులు ప్రసరిస్తున్నారు.

అంతలోనే గోవిందుడు అదిగో ఉట్లను కొట్టినాడు. మరి గోపసతీమణులు, ప్రతిగా వానిని తిట్టేరు. గోవిందుడు పైపైనే (తాకీతాకనట్లు) అట్టేవారి చన్నులు పట్టినాడు. గోపికలు తమ మెట్టెలున్న పాదాలతో వానిని మెట్టేరు (తాకీతాకనట్లుగా తన్నేరు).

గోవిందుడు వారి కాగిన పాలను వారవట్టీ (కారిపోయేట్లు చేసేవాడు). దానికి ప్రతిగా గోపికలు తమ గోళ్ళతో వానిని గీరేవారు. గోవిందుడు వారి చీరె కుచ్చిళ్ళు పట్టుకొంటాడు. దానికి ప్రతిగా వారు పొడవైన తమ కేశములు విస్తరింపజేసి మానములు కప్పుకొంటారు.

గోవిందుడు కెలసి (ప్రీతితో) వెన్న నారగిస్తాడు. దొడ్డివారు (గోపస్త్రీలు) తొలగిపోయి రహస్యంగా వెన్న దాచుకొంటారు. ఆ శ్రీకృష్ణుడే నేడు శ్రీ వేంకటాద్రి గోవిందుడై కలిసి వస్తే ఈనాడు అంగనలు వాని మేనిపై మరింత వెన్నను అలమేరు (మెత్తుతున్నారు).



**సంఖ్య : 563  సంపుటము : 3  పుట : 378  రాగం : సాళంగం**

పల్లవి: ఒక్కఁడే దైవం బున్నతుఁ డీతఁడు
తక్కినతలఁపులు తప్పుఁదెరువులు
చ. 1: పురుషులకెల్లాఁ బురుషోత్తముఁడు
సురేంద్రాదులకు సురేంద్రుఁడు
హరునికి నజునికి నవ్వలిమూరితి
హరి ఇతఁడే పరమాత్ముఁడు
చ. 2: వేదాంతంబుల వేద్యుఁ డీతఁడు
ఆదికినాదియునన నితఁడే
మేదిని నరులకు మేదినీశ్వరుఁడు
యేదెసఁ జూచిన నీశ్వరుఁ డితఁడే
చ. 3: యెక్కువలకెల్ల నెక్కువ యీతఁడు
మక్కువ మరునికి మరుఁ డితఁడు
యిక్కడ శ్రీవేంకటేశుఁడై మిగుల
పక్కన నిదివో ప్రత్యక్ష మితఁడు

**తొలిపలుకు :**

ఉన్నతోన్నతుడైన దైవమువొక్కడే. అలా కాదని యెందరినో కొలిచేవారి వన్నీ తప్పుడు మార్గాలు మాత్రమేనని చెబుతున్నారు అన్నమయ్య. ఈ స్వామి మరునికే మరుడట అంటే మన్మథుని మైమరపించేటంత అందగాడని అర్థం. మన పక్కనే ప్రత్యక్షమైన యీతడే శ్రీవేంకటేశ్వరుడు అంటున్నారు.

**భావదీపిక :**

ప్రజలారా! దైవము వొక్కడే అని గ్రహించండి. అతడు సర్వోన్నతుడు అంతే. తక్కిన ఆలోచనలన్నీ తప్పుడు మార్గాలు. వాటి జోలికి పోకండి. దైవము శ్రీహరియే.

అతడు పురుషులకెల్లా పురుషోత్తముడు. సురేంద్రుడు మొదలైన వారికెల్లా సురేంద్రుడు. హరునికి బ్రహ్మకు అవ్వలమూర్తి (ఆదిమూర్తి) శ్రీహరియే. ఈతడే జగముల కంతటికీ పరమాత్ముడు.

ఈ శ్రీహరి వేదవేదాంతముల ద్వారా తెలియదగిన వాడు. ఇతడు ఆదికి అనాదియైన వాడు. మేదిని (భూమి) పై నున్న నరులందరికీ మేదినీపతి (భూకాంతుడు). ఏ విధంగా జూచినా ఈశ్వరుడని పిలువదగ్గ వాడితడే.

ఈ మహానుభావుడు యెక్కువలకెల్లా యెక్కువ (ఉన్నతోన్నతుడు). మక్కువ కలిగించే మరునికి (మన్మథునికి) మరుడు (మరపించువాడు), ఈ జగన్మోహనుడే ఈ తిరుమలలో శ్రీవేంకటేశుడై ఇదిగో మీ పక్కనే ప్రత్యక్షమైవున్నాడు.

**సంఖ్య : 190** **సంపుటము : 3** **పుట : 238** **రాగం :**

పల్లవి: ఓపితేఁదానె తగిలి వోపకున్నఁ దానె మాని
మాపు రేపు నలయించే మాయ మాకేలా

చ. 1: చింతాయకుఁడగు (?) హరి చిత్తములో నుండఁగాను
వింతవింతవిచారాల వెట్టి మాకేలా
చెంతల పరుసవేది చేతిలోనే వుండఁగాను
దొంతరవిద్యలతోడిదోవ మాకేలా

చ. 2: తోడు నీడై యచ్యుతుఁడు తొలఁగక వుండఁగాను
జాడదప్పితిరిగేటి జాలి మాకేలా
యేడనో కోకలు వేసి యేమియు నెరఁగలేక
వేడుకతో కొక్కెరాలవెంట మాకేలా

చ. 3: వెల్లవిరై యెదుట శ్రీవేంకటేశుఁ డుండఁగాను
బల్లిదుఁ డీతనిఁ బాసి భ్రమ మాకేలా
యెల్లధాన్యములు మాయింటిలో నుండఁగాను
పొల్లికట్టుదంచేమని బుద్ధి మాకేలా

**తొలిపలుకు :**

అన్నమయ్య ఈ చక్కటి కీర్తనలో యెంతో నిబ్బరంగా ఒప్పుగావున్నా పర్వాలేదు, ఒప్పుగా లేకపోయినా పర్వాలేదు. మాకీ మాయాసంసారంతో పనేమిటి? అంటున్నారు. "పొల్లికట్టు" అంటే, లోపల బియ్యపుగింజలేని వరిధాన్యం అని అర్థం.

**భావదీపిక :**

తానే (ఆ పరమాత్మే) వోపితే (ఒప్పుకొంటే) తగిలీ (ఆదరిస్తాడు). ఓపకుంటే తానే మానేస్తాడు. రేయింబవళ్ళు మమ్ము అలయించే (శ్రమపెట్టే) మాయ (హరి కల్పితమైన మాయామోహము) మాకెందుకు?

చింతలను తొలగించే శ్రీహరి మా హృదయంలో వుంటే వింతలైన వెట్టి ఆలోచనలు మాకెందుకు వస్తాయి? చేతిలో పరుసవేది (దేనినైనా బంగారం చేసే శక్తి) వంటి దొంతర విధ్యలు (అనేక విద్యలు) నేర్చేగతి మాకెందుకు చెప్పండి?

తొలగకుండా అచ్చుతుడే మా తోడునీడ వలెనుండగా, జాడదప్పి (గమ్యంలేని) తిరుగుడు మాకెందుకు? ఆ దైన్యం మాకెందుకు? ఎక్కడనో బట్టలు ఆరబెట్టి మరెక్కడనో కొక్కెరలను (రెట్టలు వేసి బట్టలు పాడు చేసే కొంగలను) తోలటం మాకెందుకు? (అనగా వ్యర్థమైన ప్రయత్నాలు మాకెందుకు అని అర్థం)

మా కళ్ళెదుట సమర్థుడైన శ్రీవేంకటేశ్వరుడుండగా ఇతనిని వదలి భ్రమకు గురవటమెందుకు? పుష్కలంగా అన్ని రకాల ధాన్యాలు మా ఇంట్లోనే వుంటే పొల్లకట్టు (పూక) దంచే మందబుద్ధి మాకెందుకు?



**సంఖ్య : 470** **సంపుటము : 2** **పుట : 317** **రాగం : సాళంగనాట**

పల్లవి: కంటిరా వింటిరా కమలనాభుని శక్తి
వొంటి నితనిశరణ మొకటే వుపాయము

చ. 1: యీతనినాభిఁ బొడమె యెక్కువైన బ్రహ్మయు
యీతఁడే రక్షించినాఁడు యింద్రాదుల
యీతఁ డాకుమీఁద దేలె నేకార్ణవమునాఁడు
యీతఁడే పో హరి మనకిందరికి దైవము

చ. 2: యీతఁడే యసురభాధ లిన్నియుఁ బరిహరించె-
నీతని మూఁడడుగులే యీలోకాలు
యీతఁడే మూలమంటే నేతెంచి కరిఁ గాచె
నీతనికంటే వేల్పు లిఁక మరి కలరా

చ. 3: యీతఁడే వైకుంఠనాథుఁ డీతఁడే రమానాథుఁ-
డీతఁడే వేదోక్తదైవ మిన్నిటాఁ దానె
యీతఁడే అంతర్యామి యీ చరాచరములకు
నీతఁడే శ్రీవేంకటేశుఁ డిహపరధనము

**తొలిపలుకు :**

అన్నమయ్య యేమి చెబుతున్నారో వినండి. అయ్యలారా! ఈ శ్రీహరి శక్తి యెంతటిదో చూశారా? పోనీ విన్నారా? మనకు ఒక్కటే ఉపాయం వున్నది. ఇతనిని శరణు అనండి. చరాచరములన్నింటికీ అంతర్యామియైన ఈయనే మనకు ఇహపరములనిస్తాడు.

**భావదీపిక :**

ప్రజలారా! మీరు కమలనాభుని శక్తి యెట్టిదో కంటిరా? వాని కథలను వింటిరా? అతడొక్కడే శరణ్యమని మొక్కుటే తగిన వుపాయము.

సృష్టికర్తయై అధికుడైన బ్రహ్మ ఇతని నాభికమలములో నుంచి జన్మించాడు. ఇంద్రాది దేవతలను అనేకమార్లు ఈతడే రక్షించినాడు. ప్రపంచమంతా ఏకార్ణవము (ఒకే సముద్ర) మైనప్పుడు ఈతడు మఱ్ఱి ఆకుపై శిశువువలె తేలియాడినాడు. మనందరికి దైవమైన శ్రీహరి ఇతడే పో!

అసురుల వల్ల కలిగే పీడలన్నిటిని ఈతడే పరిహరించినాడు. త్రిలోకములను ఈతడు మూడు అడుగులతో కొలిచినాడు. గజేంద్రుడు "పరమేశ్వరుడెవ్వడు మూలకారణంబెవ్వడు, వానినే శరణంటాను" అని వేడితే ఈతడొక్కడే పరుగిడి వానిని రక్షించాడు. మరి ఈతనిని మించిన దైవం యెవరన్నా వున్నారా?

వైకుంఠానికి, లక్ష్మీదేవికి యేలిక ఈతడే. వేదములు ప్రస్తుతించే "దైవము" అన్ని విధములా ఈతడే. ఈ చరాచరములన్నిటికీ (కదిలే వాటికి కదలని వాటికీ) అంతరాత్మ ఈతడే. ఇహపరధనము లొసగేది ఈ శ్రీవేంకటేశ్వరుడే.

**సంఖ్య : 559 సంపుటము : 3 పుట : 375 రాగం : ముఖారి**

పల్లవి: కలలోన నిట్లనే కాఁపురము నిట్లనే
నిలువు గల్లందమో నిజమందమో

చ. 1: వొక్క నాటిప్రపంచము వొక్కనాటివలె రాదు
వొక్క నిమిషమువలె నొకటి గాదు
పక్కన మాయమై పోవు బడిబడినే వచ్చు
నెక్కొని కల్లందమో నిజమందమో

చ. 2: పొద్దు వొడచేది గొంత పొద్దు గూఁకేది గొంత
చద్ది గొంత వేఁడి గొంత చవులు గొంత
వొద్దనే కాలము నుండు వుండుండీ దవ్వయిపోవు
నిద్దవుఁగల్లందమో నిజమందమో

చ. 3: పాపపుణ్యా లంటెనంటాఁ బాయవు సుఖదుఃఖాలు
పైపై ననుభవించఁ బరసిపోవు
యేపొద్దు శ్రీవేంకటేశుఁ డెదలోనే వున్నాఁడు
యేపునఁ గల్లందమో యిది నిజమందమో

**తొలిపలుకు :**

కలలో చేసే కాపురము నిజమా లేక భ్రమా? ఒకనాటి ప్రపంచంలా నేటి ప్రపంచం వుండదు? ఒక నిముషంలా ఇంకొక నిముషముండదు. ఏది కల్ల యేది నిజం? ఒక రోజు చల్లగా వుంటే ఇంకొకటి వేడిగా వుంటుంది. ఏమిటీ మాయ? హరి ఆత్మలోనే వున్నాడనేది కల్లా? నిజమా?

**భావదీపిక :**

ఇట్లనే (ఈ విధంగా) కలలోన చేసే కాపురమును నిలువునా కల్లందమో (అబద్ధం అందమా?) ఇట్లనే నిజమందమో (సత్యము అని అందమా?)

ఒక నాడు వున్న ప్రపంచం ఇంకొకనాడు అట్లాగే వుండదు. ఒక నిముషమున్నట్లు ఇంకొక నిముషం వుండదు. ఇదే ఇవ్వాళ మాయమైపోయి అంతే వేగంగా మళ్ళీ రావచ్చును. నెక్కొని (నెలకొని) యీ ప్రపంచాన్ని కల్ల అనెదమా, నిజము అనెదమా చెప్పండి.

ఇక కాలము గురించి ఆలోచిద్దాం. ఒకసారి పొద్దు వొడచును (తెల్లవారుతుంది) ఒకసారి పొద్దు కొంతగూకుతుంది (క్రమంగా చీకటి పడుతుంది). కొంత చలి, కొంత వేడి వుంటాయి. కాలము వొకప్పుడు అనుకూలంగా వుంటుంది. దూరంగా పోయి ఒకప్పుడు ప్రతికూలమవుతుంది. ఏది నిజం? ఏది అబద్ధం?

జీవుడు చేసిన పాపపుణ్యాలు మరుజన్మలో వాడిని దుఃఖము సుఖములై వదలవు. పైపైన అనుభవిస్తేనే వదలిపోతాయి. ఏనాడూ శ్రీవేంకటేశ్వరుడు వీడి హృదయంలోనే వున్నాడు. మాయవల్ల అది వాడికి తెలియదుకదా! మరి అతిశయించి దీనిని కల్ల అందమా? నిజం అందామా?



**సంఖ్య : 202 సంపుటము : 3 పుట : 135 రాగం : నాట**

పల్లవి: కాదనేటి వారెవ్వరు కడలనుండి
సేదదేరిచి నీవేమి సేసినానుఁ జెల్లును

చ. 1: తక్కక బ్రహ్మాదిదేవతలకు నాయకుఁడవు
మక్కువ శ్రీసతికి మగఁడవు
చక్కనివాఁడవు మరి చంద్రసూర్య నేత్రుఁడవు
వుక్కుమీరి నీవెట్లానుండినా నమరును

చ. 2: కామునిఁ గన్నతండ్రివి కడుఁజక్కఁ దనమున
ఆముకొన్న యట్టిచక్రాయుధుఁడవు
కామించి యెందుఁజూచినా గరుడవాహనుఁడవు
వేమరు నీవెటువలె వెలసినా నమరును

చ. 3: అందరిలోపల నుండే అంతర్యామివి నీవు
చందమైన పరబ్రహ్మస్వరూపుఁడవు
యెందును శ్రీ వేంకటాద్రి నిరవైనవాఁడవు
అంది మమ్ము నేలితేను అన్నిటా నమరును

**తొలిపలుకు :**

అన్నమయ్య స్వామితో యేమంటున్నారో వినండి. శ్రీహరీ! నా శ్రమను తొలగించి నాప్రక్క నుండి నీవేమి చేసినా కాదు కూడదు అనే వారెవరయ్యా? నీవేమి చేసినా చెల్లుతుంది. నీవు సామర్థ్యం తెలియని వారెవరయ్యా? సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపుడవు.

**భావదీపిక :**

స్వామిా! కడలనుండి (ఒక పక్కన నుండి) నిన్ను "కాదు" అని అనేవారెవరయ్యా? నా సేదదేరిచి (శ్రమను తొలగించి) నీవేమి చేసినా చెల్లదా? ప్రభూ!

ఏ మాత్రం తగ్గకుండా బ్రహ్మాదిదేవతలకు నీవే నాయకుడవు. శ్రీసతికి మక్కువతో గుండెలో పెట్టుకొన్న భర్తవు. చక్కనివాడవు. సూర్యచంద్రులే కన్నులుగా గల లోక రక్షకుడవు. ఉక్కుమీరి (అతిశయించి) నీ వెట్లా వున్నా సరిపోతుంది.

సాక్షాత్తు మన్మథునికే తండ్రివి. నీ చక్కదనం గురించి చెప్పవలెనా? ఆముకొన్న (ఆక్రమించు) సుదర్శన చక్రాయుధుడవు. ఎక్కడ కావాలంటే అక్కడికి వెళ్ళే గరుత్మంతుని వాహనముగా కలవాడవు. పలుమార్లు నీవెట్లావున్నా సరిపోతుంది.

నీవు జీవలందరి లోపల అంతర్యామిగా వుండే వాడవు. సాకారుడవైన పరబ్రహ్మ స్వరూపుడవు. ఎల్లవేళలా శ్రీవేంకటాద్రిపై సుస్థిరంగా నెలకొన్నవాడవు. నీవు మమ్ము అంది (స్వీకరించి) యేలుకొంటే అన్నీ సరిపోతాయి తండ్రీ!

**సంఖ్య : 391** **సంపుటము : 2** **పుట : 264** **రాగం : బౌళి**

పల్లవి: గరుడగమన గరుడధ్వజ
నరహరి నమోనమోనమో

చ. 1: కమలాపతి కమలనాభా
కమలజ జన్మ కారణిక
కమలనయన కమలా ప్తకుల
నమో నమో హరి నమో నమో

చ. 2: జలధిబంధన జలధిశయన
జలనిధిమధ్య జంతుకల
జలధిజామాత జలధి గంభీర
హలధర నమో హరి నమో

చ. 3: ఘనదివ్యరూప ఘనమహిమాంక
ఘనఘనా ఘనకాయవర్ణ
అనఘ శ్రీవేంకటాది తేహం
అనుపమ నమో హరి నమో

**తొలిపలుకు :**

అన్నమయ్య చేప్పిన అసమాన జనప్రియమైన భజన ఇది. చూడటానికి నోరూరించే ద్రాక్షపండులా వున్న ఇది నారసింహుని నారికేళపాకంలో నుతించిన కీర్తనను, పాడటానికి సులభంగా వున్నా అర్థం చెప్పమంటే నాబోటి బక్కవాడు బిక్కమొగము వేసే కీర్తన.

**భావదీపిక :**

స్వామీ! వో గరుడవాహనా! గరుడుని కేతనముపై గల గరుడధ్వజా! నారసింహస్వరూపా! నమో నమో నమో (అనేక వందనములు ప్రభూ!).

స్వామీ! నీవు కమలాదేవికి భర్తవు, కమలమునాభి యందు గలవాడవు, కమలజుడైన బ్రహ్మ జననమునకు కారణమైనవాడవు, కమలదళముల వంటి నయనములు కలవాడవు. కమలాప్తకులమున (సూర్యవంశమున జన్మించిన) శ్రీరామచంద్రుడవూ నీవే. నీకు అనేక వందనములు.

శ్రీరామునిగా జలధిని బంధించి వారధి కట్టావు. జలధిపై పవళించే శ్రీహరివి నీవే. జలనిధి మధ్య జంతుకుల (మత్య, కూర్మములయందునూ పుట్టినవాడవు). జలధిజామాత (సాగరుని అల్లుడవు). సాగరగంభీర విగ్రహుడవైన నీకు పలు వందనములు.

ఇదిగో నేడు ఘనమైన దివ్యరూపము కల నీపై ఘనమహిమగల శ్రీవత్సమనే పుట్టమచ్చ నయనానందకరముగా వున్నది. ఘన (గొప్ప) ఘనాఘన (కురియునట్టి మేఘవర్ణము వంటి) కాయవర్ణా (శరీరవర్ణము కలవాడా) పాపరహితా! శ్రీవేంకటేశ్వరా! సాటిలేనివాడా! నమో నమో హరీ! నమోస్తుతే.



**సంఖ్య : 224** **సంపుటము : 3** **పుట : 150** **రాగం : దేవగాంధారి**

పల్లవి: చూడవే గోవింద సోద్యము లిన్నియు
యేడాఁ గర్తవు యిన్నిట నాకు

చ. 1: చీరినఁ దునుఁగక చేసినదురితము
నారవలెనే కడు నారటిలీ
కారుకొని తలఁపు కలఁకగుణంబుల
వారక పెనునదివలెఁ బారీని

చ. 2: యెట్టుఁగాఁ గ్రూరత్వ మెప్పుడుఁ గొలిమిలో
కట్టువలెనే కడుఁగాఁగీని
వొట్టియై ప్రకృతి వొరసి వేఁటలో
యిట్టివలెనే యెలయించీని

చ. 3: వీడక నీమూర్తి వెంటవెంటనే
తోడునీడయై తొరలీని
యీడనే శ్రీవేంకటేశ నీమహిమ
వాడనివనములవలెఁ జిగిరించీని

**తొలిపలుకు :**

గోవిందునితో అన్నమయ్య ఇలా అంటున్నారు. నీవు చేసిన సోద్యములను నీవే చూడవయ్యా! నాకున్న దుర్గుణాలు నాకెవరిచ్చారు? నీవేకదా! నీవు కల్పించిన ప్రకృతి వేటగాడు అమరించిన యెరవలె మమ్మల్ని నాశనం చేస్తోంది. స్వామీ శ్రీవేంకటేశా! నీ మహిమ వాడని వృక్షమువలె చిగురించింది.

**భావదీపిక :**

ఓ గోవిందా! నీ సోద్యాలన్నీ వొక్కసారి నీవే చూడవయ్యా! నాచేత చెడ్డ పనులు చేయించేది నీవే. కాని నీకే కర్తృత్వం అంటదు. కర్మానుభవం మాకే కదా!

నేను చేసిన దురితము (పాపము) చీలిస్తే తునగదు. జనపనారవలె మెలిబెడుతూనే వుంటుంది. కమ్ముకొస్తున్న నా ఆలోచనలు కల్పించు దుర్గుణాలు మహానది వలె ప్రవహిస్తూనే వున్నాయి.

నాలోని క్రూరత్వము కొలిమిలో ఎఱ్ఱగా కాల్చిన కఱ్ఱు (నాగలికి అమర్చిన ఇనుప కొమ్ము) వలె బాగా మండిపోతోంది. ఒట్టి (వక్రమైన) ప్రకృతి వేటగాడు అమర్చిన యెఱవలె నన్ను యెలయించుచున్నది (మభ్యపెట్టుచున్నది).

అయితే, నీ కృపవలన నీ మూర్తి నన్ను వదలక నావెంట తోడు-నీడ వలెవుండి తొరలీని (అతిశయించినది). ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ తిరుమలలో నీ మహిమ వాడిపోని వనము (వృక్షము) వలె బాగుగా చిగురించినది.

**సంఖ్య : 166 సంపుటము : 3 పుట : 112 రాగం : సావంతం**

పల్లవి: చెప్పరాని మహిమల శ్రీదేవుఁ డితఁడు
కప్పి కన్నులపండుగగాఁ జూడరో

చ. 1: అద్దుచుఁ గప్పురధూళి యట్టె మేన నలఁదఁగా
వొద్దిక దేవునిభావ మూహించితేను
మద్దులు విరిచినట్టి మంచి బాలకృష్ణునికి
మద్దులకాంతి మేన మలసినటుండె

చ. 2: అమరఁ దట్టుపుణుఁగు అవధరించఁగాను
తమితోఁ బోలికెల్లఁ దచ్చిచూడఁగా
యమునానది నాఁగేట నండకుఁ దీసుకొనఁగా
యమునానది నలుపు అంటినయట్టుండె

చ. 3: అంగముల శ్రీవేంకటాధిపున కింతటాను
సింగారించి సొమ్ములెల్లఁ జెలరేఁగఁగా
బంగారపుటల మేలుమంగ నురాన నుంచఁగా
బంగారము మేననెల్లాఁ బరగినట్టుండె

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన అభిషేకమహోత్సవ కీర్తన ఇది. స్వామి వంటి రంగు యెందుకు అంత "నల్లగా" వున్నదో కారణాలను వూహిస్తున్నారు. కృష్ణయ్యగా వున్నప్పుడు ఈయన చేసిన దానికి ప్రతిఫలమే ఈ నలుపు అని చమత్కరిస్తూ, ఈ స్వామి బంగారుకాంతుల దేవిని వురమునబెట్టినందువల్ల యీయన వంటి నిండా సొమ్ములు మెరిసిపోతున్నాయి అంటున్నారు.

**భావదీపిక :**

ఇతడు చెప్పరాని (పొగడ శక్యముకాని) మహిమలు కలిగిన శ్రీదేవుడు. సుగంధద్రవ్యాలతో ఈయనను కప్పి మీ కన్నుల పండుగగా చూడండి.

ఈ స్వామి వంటిపై తెల్లని కర్పూరధూళిని అద్దుచూ ఈ దేవుని భావము నూహిస్తే, ఆనాడు మంచిబాలుడు (అమాయకుడైన) కృష్ణయ్య రోటితో మద్ది చెట్లను విరిచినప్పుడు ఆ మద్దిచెట్లపాలు ఈయన వళ్ళంతా అంటుకొని ఇతని మేను ఇట్లా తిరిగిందా అనిపిస్తోంది.

ఈ స్వామి వంటిపై నల్లని "తట్టుపునుగు" మెత్తి అసక్తితో ఇదెట్లా వున్నదా అని తఱచి చూడగా, ఆనాడు బలరామయ్య యమునానదిని నాగలితో అండకుదీసి నందుకు (దగ్గరకు లాగినందుకు) ప్రతిగా యమునానది తెల్లని ఆయనను నల్లగా చేసిందా, అందుకేనా ఈనాడు ఇంత నలుపు అనిపిస్తున్నది.

శ్రీవేంకటేశ్వరుడు సింగారించిన సొమ్ములతో యెందుకు చెలరేగివున్నాడంటే, బంగారుకాంతులీను అలమేలు మంగమ్మను తన వురమున నుంచుకొనగా ఈయన ఒళ్ళంతా బంగారమైనదా అన్నట్లుంది.



**సంఖ్య : 380 సంపుటము : 2 పుట : 255 రాగం : భవుళి**

పల్లవి: తొల్లి యెట్టుండునో తాను తుద నెట్టుండునో తాను
యిల్లి దె నట్టనడుమ నింతేసి మెరసీ

చ. 1: పుట్టినప్పుడే దేహి బుద్ధు లేమీ నెఱఁగఁడు
యిట్టె లోకులఁ జూచి యింత నేరిచె
ముట్టుకొన్న యింద్రియాల ముదిసి ముదిసి రాఁగా
తట్టుపడి తనమేను తానే మరచె

చ. 2: మనుజుఁ డైనప్పుడే తా మాటలేమి నెరఁగఁడు
జనులాడుకొనఁగానె సంగడి నేర్చె
దినదిన భోగాలదృష్టాంతములెల్ల
అనుభవనై తన కడియాలమాయ

చ. 3: తచ్చి తాఁగలప్పుడే దైవము నెఱఁగఁడు
నిచ్చ నాచార్యునివల్ల నేఁ డెఱిఁగె
అచ్చపు శ్రీవేంకటేశుఁ డంతర్యామై యుండి
యిచ్చఁ గరుణించఁగాను యెక్కుడాయఁ దాను

**తొలిపలుకు :**

అన్నమయ్య యేమి చెబుతున్నారో వినండి. మానవ జీవితం పాపాయిగా, యువకుడిగా, ముదుసలిగా ప్రతి దశలోన రకరకాల అనుభవాలను సంతరించుకొంటుంది. అవి వాడి బుద్ధిని, ఇంద్రియాలను భోగాసక్తుని చేస్తాయి. వీడికి ఆచార్యుని కృప కలిగేదాక దైవము నెరుగుటయూ సాధ్యము కాదు.

**భావదీపిక :**

తొల్లి యెట్టుండునో (బాల్యావస్థలో) యేమైనదో? తాను తుదకేమౌతాడో యెఱుగుట దుస్సాధ్యము. ఇల్లిదె (ఇదిగో) ఈ నట్టనడిమి బ్రతుకులో ఇంతింత విభవం కలిగింది.

పుట్టినప్పుడు దేహికి జ్ఞానమే శూన్యము. తనతోవున్న లోకులను చూచి అన్నీ నేర్చినాడు. ముట్టుకొన్న (లొంగతీసికొనే ఇంద్రియాలు) ముసలివైపోగానే తట్టువడి (బాధపడి) తన శరీరమే తనకు మఱపుతెస్తుంది.

మనిషి అవగానే యెవరైనా మాట్లాడగలరా? లేదు. తన చుట్టూ వున్న జనుల మాట్లాడుకొంటుంటే విని సంగడి (వారి సాంగత్యంలో) నేర్చుకొంటాడు. ప్రతిరోజూ భోగాసక్తుడై ఆ అనుభవాలే అడియాలము (ప్రమాణములు) అవుతాయి.

తాను కలిమివున్నప్పుడు దైవము నెఱుగడు. ఒకనాడు ఆచార్యుని వలన దైవము నెరిగి మార్పుచెందుతాడు. స్వచ్ఛమైన శ్రీవేంకటేశ్వరుడే తన అంతర్యామియై తనను కరుణించగా తాను ఉన్నతుడవుతాడు.

**సంఖ్య : 378   సంపుటము : 2   పుట : 254   రాగం : బౌళి**

పల్లవి: దేహంబొకటే దేహియు నొకఁడే
దాహంబెంతటఁ దనియునో తలఁపు

చ. 1: వినుకలి వెంట వెడలీఁ దలఁపు
కనుకలి వెంటఁ గదలీఁ దలఁపు
కొననాలుక మదిఁ గూడీఁ దలఁపు
తునిగినయెన్నెన్ని తునకలో తలఁపు

చ. 2: నయమగుచోటను నవ్వీఁ దలఁపు
భయమగుచోటను బడలీఁ దలఁపు
లయమై నిద్రల లవమౌఁ దలఁపు
క్రియ నెందరిపంగెనయో తలఁపు

చ. 3: భావించిన గతిఁ బారీఁ దలఁపు
వేవేలు గతుల వెలసీఁ దలఁపు
శ్రీవేంకటపతి చిత్తములోపల
నీవే తెలుపఁగ నినుఁగనె తలఁపు

**తొలిపలుకు :**

మానవుని తలపు యెటువంటిదో వివరిస్తున్నారు అన్నమయ్య. మనదేహం వొక్కటే దానిలో ఆత్మకూడా ఒక్కటే. కాని తలపులు కలిగించే దాహం యేనాటికీ తనివి దీరవు. జీవి వినినా, కనినా, రుచిచూచినా, నవ్వువచ్చినా, భయం కలిగినా, వుత్పన్నమయ్యే తలపులన్నీ గాఢ నిద్రలో నశించిపోతాయి. శ్రీవేంకటపతిని తలపులో నిలిపితే ఆత్మ దర్శనమవుతుంది.

**భావదీపిక :**

అయ్యలారా! మన దేహం వొకటే. దాంట్లో వుండే దేహి (జీవుడు) కూడా వొకడే. కాని ఈ దేహితలపులు (ఆలోచనలు) అసంఖ్యాకం. ఈ తలపుల దాహము యెన్నటికీ తనియదు (తృప్తిపడదు).

ఏదన్నా విన్నామంటే ఆ విన్నదాని వెంట తలపూ పరుగిడుతుంది. దేనిని చూచినా ఆ 'కనుకలి' (చూపు) వెంటనే తలపూ పరుగిడుతుంది. నాలకకేది తగిలినా ఆ రుచి వెంట తలపోతలు పోతూనే వుంటాయి. ఈ తలపులు యెన్నెన్ని తునిగి పోయిన తునకలవుతున్నదో కదా!

తనకు అనుకూలమైతే "నవ్వులు" తెప్పిస్తుంది మన తలపు. భయం కలిగిన చోట ఆ నవ్వించిన తలపే భయముపుట్టిస్తుంది. నిద్రలో మనిషి లయమైతే వాడి తలపూ కొంచెము అయిపోతుంది. ఎందరితోనో పంగెన (ఉచ్చు) లోపడేస్తుంది తలపు.

ఇంకొక వింతయేమంటే మనం యెట్లా భావిస్తే మన తలపూ ఆ భావన ననుసరిస్తుంది. శ్రీవేంకటేశ్వరుని నీ మనస్సులో నిలుపగలిగితే నీ వేమిటో తెలిసి ఆయనే నీ అంతర్యామి అనే తలపు స్థిరపడుతుంది.



**సంఖ్య : 435   సంపుటము : 2   పుట :   రాగం : గుండక్రియ**

పల్లవి: ధరలో "నెద్భావం తద్భవ"తనెఁ గాన
హరిమయమే జగమంతాను

చ. 1: మహి నెదిటివారందు మలినము దలఁచిన
తహతహ మనసే తా మలినము
వహి నెదిటందు భావనము భావించిన
బహువిధములఁ దానూ భావనమే

చ. 2: యెక్కువ నెదిటిపాపా లెంచి నిందించేటి-
నిక్కపునాలుక తానే నిందితము
వొక్కటై యెదిటి పుణ్యా లుగ్గడించి ఘనమంటే
దక్కిన పుణ్యపు జిహ్వ తానూ ఘనమే

చ. 3: సారె శ్రీవేంకటపతి సగుణము దలఁచిన
సారపు జీవుఁడు దాను సగుణమే
నేరుపుల నాతని నిర్గుణము దలఁచిన
తారతమ్యములులేని తానూ నిర్గుణమే

**తొలిపలుకు :**

ఈ లోకంలో భగవంతుడెట్లా వుంటాడంటే మనం యెట్లా భావిస్తే అట్లావుంటాడంటారు జ్ఞానులు. అన్నమయ్య "హరిగానము" లో ఇదే "జ్ఞానము" నందిస్తున్నారు. చదివి తరించండి. ఎందుకంటే, జగమంతా హరిమయమే. అదే నిజమైన జ్ఞానము. నేటి "కళాప్రపూర్ణులు", నాటి "అవధాన్లు" ఈ జ్ఞానాన్ని మరచి అకృత్యాలు చేశారు, చేస్తున్నారు, ఇంకా చేస్తారు. అదే హరిలీల.

**భావదీపిక :**

ఈ లోకంలోనె "యద్భావం తద్భవతి" (భావించినట్లే పరమాత్మవుంటాడు) అనేదే జ్ఞానము. అందుకే ఈ మన జగమంతా హరిమయమే అని గ్రహించండి.

ఈ లోకంలో మనుష్యులంతా మలినము (అసుద్ధం) అని తలచినవారి మనస్సు తహతహలాడుతూ తానూ మలినమవుతుంది. వహి (అదే విధంగా) యెదుటి వారిలో భావనము (ఆత్మ స్వరూపాన్ని) భావిస్తే అన్ని విధాలా తానూ భావనమే (ఆత్మస్వరూపుడే).

ఎక్కువగా నెదుటి వారి పాపాలనెంచి నిందించే నాలుక తానే నిందితము (నిందార్హము). ఎదుటివారి పుణ్యాలను ఒక్కటిగా (అదే పనిగా) ప్రశంసించే ఘనత పొందిన నాలుక తను కూడా ఘనత సంపాదించుకొంటుంది.

శ్రీవేంకటేశ్వరుని సగుణమూర్తిగా భావించే జీవుడు తాను కూడా సద్గుణముల మూర్తి అవుతాడు. నేర్పరులైన జ్ఞానులై ఆతనిని నిర్గుణమూర్తిగా దలచిన వారు తారతమ్యంలేకుండా తాామూ నిర్గుణులే అవుతారు.

**సంఖ్య : 469　సంపుటము : 2　పుట : 316　రాగం : సాళంగం**

పల్లవి: నానాభక్తు లివి నరులమార్గములు
యేనెపాననై నా నాతఁడియ్యకొను భక్తి

చ. 1: హరికిఁగా వాదించు టది ఉన్మాదభక్తి
పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి
అరసి యాత్మఁ గనుటదియే విజ్ఞానభక్తి
అరమరచి చొక్కుటే ఆనందభక్తి

చ. 2: అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి
అతనిదాసుల సేవే అదియే తురీయభక్తి
క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి
అతఁడే గతని వుండు టదివైరాగ్యభక్తి

చ. 3: అట్టె స్వతంత్రుఁడౌటే అది రాజసభక్తి
నెట్టన శరణనుటే నిర్మలభక్తి
గట్టిగా శ్రీవేంకటేశు కైంకర్యమే సేసి
తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి

**తొలిపలుకు :**

నరులు భగవంతుని సేవించుటకు అనేక మార్గాలెంచుకొంటారు. అన్నిదారుల గమ్యం వొక్కటే అయినప్పటికీ మార్గాలు మాత్రం వేర్వేరు. ఏ భక్తి మార్గం యెన్నుకొన్నా స్వామి కృపలేక సిద్ధి లభించదు, అదంతే అని ఆ భక్తి మార్గాలేమిటో చెబుతున్నారన్నమయ్య.

**భావదీపిక :**

నేను చెప్పబోయే ఇవి నానా భక్తులైన నరులు యెంచుకొనిన మార్గాలు. ఏ నెపముతో హరిని చేపట్టినా, అతడియ్యకొనును (ఆయన సమ్మతిస్తాడు).

హరి కోసం మొండిగా వాదించే భక్తిని "ఉన్మాదము" అంటారు. హరిని తప్ప పరులను కొలువకుంటే అది "పతివ్రతాభక్తి" అనదగును. దృష్టి నిలిపి హరిని ఆత్మలో సందర్శించుట "విజ్ఞానభక్తి" అంటారు. అరమరచి (పరవశించి) చొక్కుటే (ఆనందంలో వుండటమే) "ఆనందభక్తి" అంటారు.

గొప్ప సాహసంతో పూజిస్తే దానిని "రాక్షసభక్తి" అంటారు. హరిదాసులే హరి అని నమ్మి సేవించటం "తురీయ భక్తి" అంటారు. ఒకపని సాధించుటకు అదే కోరిచేసేది "తామసభక్తి" అంటారు. అతడే గతియని సర్వం పరిత్యజించి చేసేది "వైరాగ్యభక్తి.

అట్టే స్వతంత్రుడై హరిని దర్పంతో పూజించటం "రాజసభక్తి", వినమ్రతతో శరణు అనటమే "నిర్మలభక్తి", పట్టుదలతో శ్రీవేంకటేశ్వరునికి కైంకర్య భావనతో, తట్టుముట్టు (తొట్రుపాటు) లేనిదే "నిజమైన భక్తి" అంటారు.



**సంఖ్య : 537　సంపుటము : 3　పుట : 361　రాగం : శుద్ధవసంతం**

పల్లవి: నిండినజగములెల్లా నీయాధీనము
బండుజన్మములవాఁడ భయమేమీ నెరఁగ

చ. 1: పాతకపుదేహమిది ప్రకృతియాధీనము
ఆతుమ శ్రీహరి నీయాధీనము
యీతల నాతల నే నెవ్వరి నేమనలేను
చేతనుఁడ నింతే నేను చిక్కినవేమెఱఁగ

చ. 2: వెలయునాకర్మము నీవేదశాస్త్రాధీనము
నిలిచినజ్ఞానమెల్లా నీయాధీనము
తలఁచి యెవ్వరి నేఁ దగుఁ దగదనలేను
కొలఁది జీవుఁడనింతే కొనమొద లెఱఁగ

చ. 3: అక్కడ నామనసిక నాచార్యాధీనము
నిక్కపునామోక్షము నీయాధీనము
యెక్కువ శ్రీవేంకటేశ యెవ్వరి నేమనలేను
పక్కన నీబంటనింతే పరచింత లెఱఁగ

**తొలిపలుకు :**

బండు జన్మములవాడు అంటే "ఆకతాయి" అని అర్థం. అన్నమయ్య ఈ కీర్తనలో నేను ఆకతాయి నన్న మాట నిజమే. ఈ జగములన్నీ నీ ఆధీనములో వున్నప్పుడు నేనెక్కడ పుట్టినా తేడాయేముంటుంది? నాకేమి భయం అంటున్నారు. నా మనస్సు మా ఆచార్యుని ఆధీనము. నా మోక్షము నీ ఆధీనము. నేను నీ బంటుని ఇక నీ ఇష్టం అంటున్నారు.

**భావదీపిక :**

ఓ దేవాదేవా! సమస్త జగములు నీ ఆధీనములోనున్నవి. ఆకతాయి బ్రతుకు గలవాడనగుటచే నేను భయమేమి యెరగనైతిని.

ఇక పాపభూయిష్టమైన నాదేహము ప్రకృతి ఆధీనములోనున్నది. నా ఆత్మ శ్రీహరి ఆధీనములో వున్నది. నా గత జన్మలలోని వారినిగాని, రాబోవు జన్మలలోని వారిని గాని నేనెవ్వరినీ మనలేను. అన్ని జన్మలలోనూ నేను చేతనా స్వరూపుడను అంతే. నేను చిక్కినవి (మిగిలినవి) యేమీ యెఱుగను.

నా కర్మము నేను నేర్చిన వేదశాస్త్రము లిచ్చిన జ్ఞానము ఆధీనము. మరి అట్లు నాలో వెలసిన జ్ఞానము అంతా నీ ఆధీనము. ఆలోచించి నేను ఇది తగును, ఇది తగదు అనలేను. ఎందుకంటే నేను కొద్దిపాటి జీవుడను అంతే. నేను ఆద్యంతముల నెరుగనైతిని.

ఇక అక్కడ నా మనస్సువున్నదే, అది ఆచార్యుని ఆధీనమైవున్నది. నిజమైన నా మోక్షము నీ ఆధీనము. అందరికంటే అధికుడవైన శ్రీవేంకటేశ్వరా! నేను యెవ్వరినీ యేమీ అనలేను. నీ పక్కనవుండే నీ బంటుని అంతే. నేను పరుల గురించి చింతించను తండ్రీ!

**సంఖ్య : 468 సంపుటము : 2 పుట : 315 రాగం : బౌళి**

పల్లవి: నిరుహేతుకాన నన్ను నీవు రక్షించే వింతే
నిరతి నాకొరకే పో నిను సేవించేది

చ. 1: ముందు సిరులిత్తువని మోక్షము నీ విత్తువని
బందుకట్టుదుదుఃఖములఁ బాపుదువని
యిందలియాసలనేపో యేచిన నాభయభక్తి
యెందును నావల్ల నీకు నించుకంతా లేదు

చ. 2: జననాలు చూచి చూచి సరి మరణాలు చూచి
వెనకటినీకథలు వినివిని
నినుపై యీయాసనేపో నిన్ను సారెఁ బొగడేది
వొనర నీయాసేపో వుపకారగురువు

చ. 3: లోకులు గొలువఁగాను లోన నీవు వుండఁగాను
దీకొని గురుఁడు బోధించఁగాను
కైకొని శ్రీవేంకటేశ కరుణించగా నీవు
దాకొని యీయాసకే నీదాసినై కొలిచితి

**తొలిపలుకు :**

ప్రతివారూ శ్రీవేంకటేశ్వరుని యేదో కోరికతోనే సేవిస్తారు. కొందరికి ఇహలోకంలో సంతోషం కావాలి, దుఃఖం వుండవద్దు. కొందరికి మోక్షం కావాలి. ఇదంతా యెందుకు జరుగుతుంది? ఎంతరికో చావు పుట్టుకలు చూచి, నీ కథలు విని, వాటి నుండి ముక్తి కావాలని ఆశ. ఉపకారం చేసే గురువు మాకు ఆ ఆశే అంటున్నారు అన్నమయ్య.

**భావదీపియ :**

స్వామి! నన్ను రక్షిస్తున్నది నీవే. దానికి యే కారణమూ లేదు, నిర్హేతుకము. అంతా నేనేదో నిన్ను సేవిస్తున్నానని అనుకొంటున్నారు. గొప్ప ఆశాపూరితమైన నా కోరికే కారణం.

మొదట్లో నీవు సిరులిస్తావని, ఇప్పుడు మోక్షం ఇస్తావని, బందుకట్టుడు (బంధింట కట్టడిచేసే) దుఃఖాలను పోగొడతావని మా ఆశ. ఇటువంటి ఆశల మూలంగానే నీపై భయభక్తులు చూపుతున్నాం. నా వల్ల నీకు అణుమాత్రం వుపయోగంలేదు. ఇది నిజం ప్రభూ!

నా జీవితంలో యెన్నో పుట్టుకలు, చావులు చూశాను. నీ పౌరాణిక గాథలనెన్నో విన్నాను. చావు అంటే భయం వల్ల నీవు తలుచుకొంటే చావు నుంచి కూడా విముక్తుణ్ణి చేస్తావని ఆశ. ఆ ఆశవల్లనే పో! నిన్ను పొగుతుతున్నాను. నిజంగా ఈ ఆశ కూడా నా ఉపకారే. అదే నాకు సద్బోధచేసిన గురువు.

లోకులనెందరినో నేను కొలిచిన మాట నిజమే. అది తప్పని అనుకొన్నాను కూడా. కాని మా గురువు ధీరతతో అందరి అంతర్యామివూ నీవేనని బోధించారు. శ్రీవేంకటేశా! నన్ను స్వీకరించి కరుణించావు. నాలోనే దాగివున్న నీవు నన్ను రక్షిస్తావనే ఆశతోనే నీ బంటునయ్యాను తండ్రీ!



**సంఖ్య : 192 సంపుటము : 3 పుట : 129 రాగం :సాళంగనాట**

పల్లవి: నే నింతసేసినయట్టి నేరమి మరవవయ్య
ఆనుకొని తాళ్లపాక అన్నమయ్యఁ జూచి

చ. 1: నావొళ్లియపరాధా లెన్నక నిన్ను సారె సారె
వేవేలు దూరితి విచారించక
కావించి కన్నులలోనికళంకు దెలియలేక
ఆవలఁ జందురు నలు పణఁకించినట్లు

చ. 2: పాయక నేఁ జేసినట్టిపాపము లెంచుకొనక
ఆయాలు మోవనాడితి నదివో నిన్ను
మాయల నాదేహమిది మలినమే తలఁచక
చాయలేదని యద్దము సారెఁ దోమినట్లు

చ. 3: మదమత్సరాలు నాలో మానకిట్టే వుండఁగాను
అదియే నీచేఁతంటా నాడుకొందును
యెదలో శ్రీవేంకటేశ యిరవై నీ వుండఁగాను
వెదకి వెదకి నీకే వెఱ్ఱిగన్నయట్లు

**తొలిపలుకు :**

ఇది పెద తిరుమాచార్యులో చిన తిరిమలాచార్యులో చెప్పిన కీర్తన అయివండవచ్చును. లేదా చిన్నన్న వంటి మరొక తాళ్ళపాక కవి అయివుండవచ్చును. ఈ కవి వేంకటేశుని క్షమాబిక్షను వేడుతున్నాడు. అన్నమయ్యను జూచి తన అపరాధాలను, పాపాలను, మదమత్సరాలను మన్నించమంటున్నారు. అద్భుమైన వుదాహరణలతో తన వాదము వినిపిస్తున్నారు.

**భావదీపియ :**

స్వామి! నేను ఇంతగా చేసినయట్టి నా నేరమి (నేరములను) మఱచిపోవయ్యా! ఆనుకొని (క్షమించేయవయ్యా). పోనీ శ్రీ అన్నమాచార్యుల వారిని జూచి నన్ను కరుణించు.

నాలో అంతులేని అపరాధాలను పెట్టుకొని ఆలోచనలేక నిన్ను యెన్నోసార్లు దూరితిని (నిందించాను). నాకళ్ళలో కళంకం వున్నదని తెలియలేక చంద్రుడిలో నలుపువున్నదని ఆరోపించినట్లుంది నా వ్యవహారం.

పాయక (అదే పనిగా) నేను చేసిన పాపాలను యెంచుకోకుండా అదివో నిన్ను ఆయాల మోవనాడితి (అవన్నీ నీ పొరబాట్లని దుయ్యబట్టాను).నా మాయదారి దేహమంతా మలిన పూరితమని మఱచి ఆ మలినం నేను చూసే అద్దం మఱకలతో వుందని దాన్ని తోమి శ్రమపడ్డాను.

నాలో మదమత్సరాలు మానకుండావుంటే అవన్నీ సృష్టించి నామీదకు పంపినావని నీ చేతలను నిందించాను. లోకంలో నాలాంటి వెఱ్ఱివాళ్ళు యెక్కడ చూచినా వున్నారు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు యెదురుగా వున్నా వెదకి వెదకి వేసారే వెఱ్ఱివాడినయ్యా! నేను.

**సంఖ్య : 167 సంపుటము : 3 పుట : 112 రాగం : పాడి**

పల్లవి: నేరనైతి నింతేకాక నే నిన్నాళ్లు
యేరీతి విచారించినా నిదివో నిశ్చయము

చ. 1: నాకుఁగా వేరొకరు విన్నపము సేసేరా నీకు
వాకుచ్చి నేనే ఆడవలెఁగాక
యీకడ నాకంటే హీను నిఁక నీవు గా(ం)చేవా
శ్రీకాంతుఁడ యిఁక నీచిత్త మింతే కాక

చ. 2: నీవల్ల బతుకలేక నే నొకరి వేఁడేనా
వావిరి నిన్నే కొసరవలెఁగాక
నీవితరణ గుణము నీలోనే దాఁచుకొనేవా
సోవ నావంటివారికిఁ జూపవలెఁగాక

చ. 3: తల్లికిలేని ముద్దు దాదికిఁ గలదా మరి
చెల్లుబడి నీవే దయసేయుటగాక
తొల్లె శ్రీవేంకటేశ్వర తూరి నాలో నున్నాఁడవు
చల్లఁగా నీచనవిచ్చి జరుపుటగాక

**తొలిపలుకు :**

భక్తుడు తానెంత పనికిమాలిన వాడైనా, హీనుడైనా, బతకటం చేతకాని బడుగైనా తనని ఆదరించాల్సిన పని స్వామిదే అంటున్నారు అన్నమయ్య. ఎందుకంటే పిల్లవాడిపై తల్లికి లేని ప్రేమ "దాది"కి వుంటుందా? నీవుకాక నన్ను మరొకరెందుకు చల్లగా చూస్తారయ్యా? అంటున్నారు.

**భావదీవియ :**

ప్రభూ! నేనిన్నాళ్ళూ నేరనైతి (తెలివిలేని అజ్ఞానిని) ఎట్లా చూచినా ఈ మాట సత్యమే. ఇదిగో నన్నెట్లా ఆదుకొంటావో నీవే ఆలోచించుకో.

నా బదులు నీకు మరొకరు విన్నపము చేసికొనేరా? నా నోటితో నేనే మొరబెట్టుకోవాలి. ఎందుకంటే, ఈ భూమి మీద నాకంటే హీనుడిని నీవు గాంచేవా (చూడగలవా?). నేను చెప్పవలసింది చెప్పాను ఇక నీ చిత్తము (దయ) అంతే.

నీవల్ల బ్రతుకు సాగక నేను మరొకరిని ఆశ్రయిస్తానా? అది జరుగని పని. కాకపోతే నేను వావిరి (ఉత్కృష్టుడవైన) నిన్నే కొసరవలె (బ్రతిమిలాడుకోవాలి) అంతేకాక మరేముంది? నీకు గొప్ప వితరణగుణం (దాతృత్వం) వున్నది. అది నీలోనే దాచుకొంటే యెట్లా స్వామీ? సోవ (ఎంతో యెక్కువగా) నావంటి వానిపై చూపించవద్దా?

బిడ్డమీద కన్నతల్లికిలేని ముద్దు, పెంచే దాది కుంటుందా? నాకు చెల్లుబడి (ఉపయోగం) యేమన్నావుంటే అది నీవు కల్పించాలి కాని మరెవరిస్తారు? శ్రీవేంకటేశ్వరా! నాకు తొలినాటి నుంచీ నీవే వున్నావు. మరి నీవే చల్లగా చనవునిచ్చి ఆదరించాలి కదా!



**సంఖ్య : 472 సంపుటము : 2 పుట : 318 రాగం : శంకరాభరణం**

పల్లవి: పట్టలేని మనభ్రమ గాక
నెట్టనఁ దాఁ గరుణించనివాఁడా

చ. 1: హితప్రవర్తకుఁ డీశ్వరుఁడు
తతి నంతరాత్మ తాఁగాన
రతి నాతని దూరఁగనేలా
గతియని తలఁచిన కావనివాఁడా

చ. 2: తెగనిబంధువుఁడు దేవుఁడు
బగివాయఁ డిహముఁ బరమునను
అగపడి సందేహములేలా
తగ నమ్మిన దయదలఁచనివాఁడా

చ. 3: హృదయము శ్రీవేంకటేశ్వరుఁడు
మొదలనే ఆనందమూర్తిగన
కదిసి వెలిని వెదకఁగనేలా
యెదురఁ గనిన వరమియ్యనివాఁడా

**తొలిపలుకు :**

మానవ సహజమైన భ్రమ వలన అనుమానపడుతుంటారు. కాని స్థిరచిత్తంతో శరణంటే యెట్టెదురై శ్రీహరి కరుణించడా అంటున్నారు మన అన్నమయ్య. ఇటువంటివే మానవ సహజమైన లోపాలను వివరిస్తున్నారు.

**భావదీవియ :**

మానవులు పట్టలేని (నిరోధించలేని) భ్రమ వలనగాక మరేమిటి? స్వామి, నెట్టన (తప్పక) తాను కరుణించని కఠినాత్ముడా?

ఈశ్వరుడు అందరికీ హితము కలుగునట్లు ప్రవర్తించువాడు. అసక్తితో మన అంతరాత్మ వలె మనలోనే వుండి కాచువాడతడు. రతి (మోహాంధుడై) ఆయనను నిందించుట తగునా? నీవే గతియని స్మరించిన కావకుండా వుంటాడా?

దేవుడు తెగని బంధువు (విడిపోని చుట్టము). ఇహపరములు రెంటిలోను బగివాయడు (మర్యాద తప్పడు). ఆయన కనులకు అగపడుతుంటే ఇంకా సందేహములెందుకు? నమ్మిన వారిని కూడా దయదలచనంత కఠినాత్ముడా? శ్రీహరి?

మన జీవులందరి హృదయాలలో మొదలనే (తొలినాటి నుండి) ఆనందమూర్తిగా స్థితుడైవున్నవాడు శ్రీవేంకటేశ్వరుడు. ఇంకా ప్రయత్నించి ఆయనను వెదకుటెందులకు? భక్తితో ఆ ప్రభువు ఎదురన్ కనిన (ఆయన యెదుట దర్శించి) కోరిన వరములను అనుగ్రహించడా?

**సంఖ్య : 161 సంపుటము : 3 పుట : 108 రాగం : సాళంగనాట**

పల్లవి: పైకొని చూడరో వుట్లపండుగ నేఁడు
ఆకడ గొల్లెతలకు నానందము నేఁడు

చ. 1: ఆదికాలమునఁ గృష్ణుఁ డవతరించినయట్టి
ఆదట శ్రావణబహుళాష్టమాయను
దాదాత రోహిణినక్షత్రము గూడె నడు రేయి
సాదించ లోకు కెల్లా జయంతియాయను

చ. 2: వసుదేవునిని దేవకిని మన్నించి కృష్ణుఁ-
డెసఁగి రేపల్లెకు నేతెంచుటాయను
కొసరి యశోదానందకోపులకుఁబుత్రోత్సవ-
మసమున నిచ్చి మించె నన్నిటా మేలాయను

చ. 3: తొట్టినరాకాసులతోడఁ గూడ భువిమీఁద
నట్టె కంసునిమదము హతమాయను
రట్టడి శ్రీవేంకటేశుఁ డిట్టె వీధులనెల్ల
జట్టిగా మెరసేయట్టి సంభ్రమము లాయను

**తొలిపలుకు :**

అన్నమయ్య ఉట్ల పండుగనాటి వైభవాన్ని వర్ణిస్తున్నారు. నేడు గొల్లభామలందరికీ మహోదానందం అంటున్నారు. యశోద నందగోపులకు పుత్రోత్సవము అనే యశస్సును కలిగించాడట కృష్ణుడు. ఆ గోపబాలుడే ఈ రట్టడి శ్రీవేంకటేశ్వరుడు అంటున్నారు.

**భావదీవియ :**

నేడు ఉట్లపండుగ (కృష్ణాష్టమి). పైకొని (అతిశయముగా) చూడండి. అక్కడ రేపల్లెలో గొల్లభామలకు కూడా నేడు గొప్ప ఆనందము.

ఆనాడు ద్వాపరయుగంలో కృష్ణుడు అవతరించిన, ఆదట (ప్రారంభమే) శ్రావణ బహుళాష్టమి అయింది. దాదాత (దాదాపుగా) అర్ధరాత్రి వేళకు రోహిణీనక్షత్రం కూడా వచ్చింది. లోకులందరికి శ్రీకృష్ణ జయంతి అయింది.

ముందుగా దేవకీ వసుదేవులను మన్నించిన కృష్ణపరమాత్మ, చక్కగా రేపల్లె చేర్చబడ్డాడు. ఆపైన యశోద నందగోపులకు పుత్రోత్సవము అనే అసము (యశస్సు)తో అతిశయించి నట్లయ్యారు.

శ్రీకృష్ణుని వలన దుష్టశిక్షణ మొదలై, తొట్టిన రాకాసులు (దిట్టలైన రాక్షసులు) మరణించిరి. కంసుడి మదము కూడా హతమైనది. వాడే (శ్రీకృష్ణుడే) రట్టడి శ్రీవేంకటేశుడై (చిలిపి శ్రీనివాసుడై) ఈ తిరువీధులలో మెరిసిపోతున్న సంబరము చేస్తున్నాడు.



**సంఖ్య : 501 సంపుటము : 2 పుట : రాగం : సామంతం**

పల్లవి: బయలుమొరంగగు పరమమాయ ఇది
నయమున లోనై నడతురు గాని

చ. 1: కలఁడు హరి యొకఁడు కావ జగములకు
కలిగినతఁడు లేక మానఁడు
తెలిసి ఇందరికిఁ దేరిన యర్థమే
మలసి యప్పటి మరతురు గాని

చ. 2: పుట్టినదెల్లా భోగముకొరకే
పుట్టిన భోగము పో దెపుడు
పట్టి యీమాఁటలే పలుకుదు రిందరు
మట్టులేక ఇది మరతురు గాని

చ. 3: కర్మము శ్రీవేంకటపతి కార్యము
కర్మము దేహికిఁ గాణాచి
ధర్మ మీదేవుని దాస్యం బందురు
మర్మము లోకులు మరతురు గాని

**తొలిపలుకు :**

బయలు మొరంగు అగు యీ మాయ అంటున్నారు అన్నమాచారులు. అంటే ఈ హరి మాయవున్నదే... ఇది బయటికి మోసంలాగా కనుపిస్తుంది. జీవులు తమంతట తామే దానికి లోనై నడతురు. అంతకంటే మరేమీ లేదు అంటున్నారు. ఆ మాయవలన హరికలడని మరచిపోతాం. పుట్టింది భోగించుటకే అనుకొంటాం. కర్మఫలదాత వేంకటపతి కాని కర్మచేసేది మాత్రం జీవుడే అని మరచిపోతాం.

**భావదీవియ :**

అయ్యలారా! ఇది (ఈ శ్రీహరిమాయ) బయలు మొరంగగు (బయటికి మోసంలాగా కనుపిస్తుంది). నిజానికి జీవులే దానికి (హరిమాయకు) నయముగాలోనై (లొంగి) నడుచుకొంటారు అంతే.

నిజానికి శ్రీహరియని వొకడున్నదే జనులకు కావ(రక్షించుటకు) కలిగినతడు (శ్రీమంతుడు) లేక మానడు (తప్పకవుంటాడు). ఇందరికి (అందరికీ) తేరిన (తేటతెల్లమైన) అర్థమేఅయినప్పటికీ జీవులు తమంతట తామే తాము ఆత్మ స్వరూపులమని మరచిపోతారు అంతే.

పుట్టిన ప్రతిజీవికీ భోగము కలుగుతుంది. భోగముపై ఆసక్తి ఒకసారి పుట్టాక పోనేపోదు. అందరూ ఈ నీతివాక్యాలు చెబుతూనేవుంటారు. కాని, మట్టులేక (కాదనలేక) ఈ నిజాన్ని మరచిపోతారు.

జీవులు చేసిన కర్మకు ఫలమునొసగుట శ్రీవేంకటపతి కార్యము (పని). కర్మమే దేహికి కాణాచి (ఆటపట్టు). ఈ దేవుని దాస్యము చేయుట జీవుల ధర్మమని తెలియని వారెవరు? కాని అంతా ఈ మర్మమును మరచిపోతారు. అదేనండీ హరిమాయ.

**సంఖ్య : 163 సంపుటము : 3 పుట : 110 రాగం : శంకరాభరణం**

పల్లవి: మదనజనకునికి మజ్జనవేళ
పదివేలు భోగములు పరగీనదె

చ. 1: వున్నతి వేదఘోషల నుర్వీధరుని మీఁద
పన్నీటికాలువలు పారీనదె
మున్నిటిమునుల హస్తములఁ గప్పురపుధూళి
కన్నుల పండుగగాఁ గప్పీనదె

చ. 2: సేవలుగా నలువంక శ్రీసతివిభుని మీఁద
వాసన తట్టుపుణుఁగు వడిపీనదె
భాసురపుఁజంద్రగావి పట్టుదట్టి కాంతలెల్లా
ఆసల మొలల గట్టఁగా నమరీనదె

చ. 3: చెలరేఁగి సొమ్ములెల్లా శ్రీవేంకటేశ్వరుమేన
నెలకొని కాంతులతో నిండీనదె
అలమేలుమంగ పురమందు నెలకొని యట్టె
సలిగె గృపారసము చల్లీనదె

**తొలిపలుకు :**

తిరుమలలో ఒకానొక అభిషేక మహోత్సవాన్ని వర్ణిస్తున్నారు అన్నమయ్య. పదివేల భోగములు అంటే అంతులేని వైభోగములలో స్వామి అతిశయించుచున్నాడంటున్నారు. ఆలమేలుమంగ ఆయన హృదయవాసినియై అందరిపై కృపారసము చిందునట్లు చేయుచున్నది.

**భావదీపిక :**

ఇది మన్మథుని తండ్రియైన శ్రీహరికి మజ్జనవేళ (అభిషేక సమయము). స్వామికి పదివేల భోగములు (అంతులేని వైభోగములు) అతిశయించినవి.

ఉర్వీధరునకు వున్నతమైన వేదఘోషతో పన్నీరు కాలువలై పారినది. ఆళ్వారులు చేతులతో కర్పూరధూళిని స్వామి వంటిపై మెత్తుచున్నారు. ఆ దృశ్యము కన్నుల పండువగా కళ్ళకు గప్పినది.

మంగళకరముగా అన్నివైపుల నుండి శ్రీవనితా వల్లభుడైన స్వామికి సువాసనలు వెదజల్లు తట్టుపుణుగుతో నలుగుపెట్టుచున్నారు. అదిగో చూడండి భాసురపు (వెలుగులు జిమ్ము) చంద్రుని కావి రంగు పట్టుదట్టి (మొల వస్త్రము) వనితలు తమ ఆశలను మొలగట్టినట్లు అమర్చినారు, అల్లదిగో.

శ్రీవేంకటేశ్వరుని మేనిపై చెలరేగిన సొమ్ములు (ఆభరణాలు) నెలకొని ఈ ప్రదేశమంతా కాంతివంతమైనది. దేవి అలమేలు మంగ అయన వురముపై నెలకొని సలిగె (స్వాతంత్ర్యముతో) కృపారసమును స్వామి భక్తులపై విరజిమ్ముచున్నది.



**సంఖ్య : 569 సంపుటము : 3 పుట : 382 రాగం : సౌరాష్ట్రం**

పల్లవి: మరల విచారించితే మంచముకిందే నుయ్యి
శిరుల హరివారైరి శివాదులు

చ. 1: ఆడేటిమాటలకెల్ల నాది నంతము లేదు
వీడనికర్మములకు విధి లేదు
తాడుపడ్డమనసుకు దైవము విష్ణుఁడేయని
పాడి కొలిచిరి తొల్లి బ్రహ్మాదులు

చ. 2: వుట్టిపడేజన్మముల కూరట యెందూ లేదు
కట్టడి ఇంద్రియాలకు గతి లేదు
తట్టుపడ్డజీవునికి దైవము శ్రీహరియని
యిట్టె మొరయిడిరి యింద్రాదులు

చ. 3: కప్పినయీమాయలకు కడవ రెందూ లేదు
తిప్పనిహరిభక్తికిఁ దిరుగు లేదు
వొప్పుగా శ్రీవేంకటేశుఁ డొక్కఁడే దైవమని
చొప్పువట్టి కొలిచిరి శుకాదులు

**తొలిపలుకు :**

అన్నమయ్య యేమంటున్నారో వినండి. బాగా ఆలోచిస్తే మనం పడుకున్న మంచము కిందే నుయ్యి వున్నది. ఎప్పుడు అందులో పడతామో తెలియదు. జీవికి యెక్కడా శాంతిలేదు. హరి కల్పించిన మాయలకు అంతే లేదు. శుకాదుల వలె బ్రహ్మాది దేవతలవలె మీరు కూడా శ్రీవేంకటేశుని దైవమని కొలవండి అని హితబోధ చేస్తున్నారు.

**భావదీపిక :**

అయ్యలారా! తలచి ఆలోచిస్తే మనము పడుకున్న మంచము క్రిందే నుయ్యి వున్నది. అజాగ్రత్తగా వుంటే పడిపోతాం. అందుకనే సాక్షాత్తు శంకరుని వంటివారే హరిని కొలిచారు.

తొల్లింటి బ్రహ్మాది దేవతలు కూడా విష్ణువే దైవం అని పాడి నుతించారు, యెందుకు? మాట్లాడే మాటలకు ఆది అంతము వుండవు. చేసే కర్మలన్నీ విధి చేతిలోనివే. తాడుపట్టి (బంధితమైన) మనస్సుకు దైవము శ్రీహరియే. అదే పాడి మీరూ కీర్తించండి.

క్రమము తప్పని జన్మలను వూరట అనేదే లేదు. ఎప్పుడూ జీవిని కట్టడిచేసే ఇంద్రియాలకు గతిలేదు. తట్టుపడ్డ (బాధలననుభవించే) జీవునికి దైవము శ్రీహరియని గ్రహించిన ఇంద్రాదులే హరికి మొరవిడిరి.

ఆక్రమించిన ఈ మాయను యెక్కడా అంతమనేదే లేదు. మారని హరిభక్తికి తిరుగులేదు. అందుకే శుకయోగి వంటి వారు కూడా శ్రీవేంకటేశ్వరుడొక్కడే దైవము అని చొప్పువట్టి (స్వంతము చేసికొని) కొలిచినారు.

**సంఖ్య : 191 సంపుటము : 3 పుట : 238 రాగం : గుజ్జరి**

పల్లవి: మాకేమి నీకరుణ మహాప్రసాదమనేము
నీకు నీదాసులచేతినింద బెట్టుగాదా

చ. 1: పమ్మి మిమ్ముఁ గొలిచినబంట్లఁ బరులు దమ-
సొమ్మనుచుఁ దియ్యగాఁ జూచేదా
వుమ్మడి నీవిందుకెల్లా నూరకున్నఁగన మిమ్ము
నమ్ముమన్న వేదాలయానతి కొంచెపడదా

చ. 2: నీముద్ర మోచినవారి నీచులు దడవఁగాను
యీమేర నడ్డమురాక యిట్లుండేదా
వోమక నీవీవేళ నూరకున్న నల్లనాఁటి-
సామజముఁ గాచినది సందేహించఁబడదా

చ. 3: మీరుమన్నించినవారు మీవాకిలి గావ కేడో
వారివాకిలి గావఁగా వద్దనరాదా
నేరిచి శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గావకున్న
ధారుణి మీదయే మిమ్ముఁ దప్పులెంచుకొనదా

**తొలిపలుకు :**

ఒక వింత వాదన లేవదీస్తున్నారు అన్నమయ్య. మీ కరుణ మాకు దక్కింది. అదే మాకు మహాభాగ్యము. కాని నీదాసులు చేసే నింద నీవు భరించగలవా స్వామీ? నీ ముద్ర ధరించిన వారిని నీవు మన్నించక పోతే నీ గజేంద్రమోక్షము నెవ్వరు నమ్ముతారు ప్రభూ! నన్ను కాపాడకపోతే మీ దయే మిమ్మల్ని తప్పుపడుతుంది.

**భావదీపియ :**

ప్రభూ! మాకేమిటి? నీ కరుణయే మాకు మహాప్రసాదము. మమ్మల్ని రక్షించకపోతే రాబోయే రోజుల్లో మీ దాసులే మిమ్మల్ని నిందిస్తారు.

శ్రద్ధగా మిమ్మల్ని గొలిచిన మీ బంట్లను పరాయివారు తమ బంట్లని సేవలు చేయించుకొంటుంటే, తమ సొమ్మంటే నీవు చూచి వూరకుంటే మిమ్మల్నే నమ్ముకోమన్న వేదాల మాటల నెవరు నమ్ముతారయ్యా?

మేము శ్రీవైష్ణవులం. నీ ముద్రలను ధరించాము. మమ్మల్ని నీచులు తడవగా (అడ్డంకులు పెడితే) నీవు వెంటనే అడ్డము రాక వూరకనే చూస్తూ కూర్చుంటే, అలనాటి నీ గజేంద్రమోక్ష కథను యెవ్వరు నమ్ముతారు? పరులకు సందేహాలు రావా?

అంతెందుకు స్వామీ! మీరు మన్నించినవారు అన్యదేవతల వాకిటి బంట్లయి సేవిస్తుంటే నీవు వద్దన రాదా? పోనీ అదట్లావుంచు ఓ శ్రీవేంకటేశ్వరా! నేడు అన్నీ నేర్చి (తెలిసీ) నన్ను రక్షించక పోతే ఈ భూమి మీద మీ దయయే మిమ్మల్ని తప్పుబట్టదా తండ్రీ?



**సంఖ్య : 418 సంపుటము : 2 పుట : 282 రాగం : లలిత**

పల్లవి: వీదిలోన నదేకదే విష్ణుపదము
ఆదెసనే పాయకుండు నాదిమూలము

చ. 1: చూచేటిచూపులకును సూటియైన మొదలేదో
యేచి వినుకలిమర్మ మెందు దాఁకీనో
వాచవిచవులు చూచేవంటశాలచోటేదో
ఆచాయనే వుండు నాదిమూలము

చ. 2: పూఁపతలపోఁతలకు పుట్టినయి ల్లది యేదో
పైపై నూర్పులు నిలుపఁగఁ జోటేదో
మాపులు నిద్రించువేళ మరచేటిచోటేదో
ఆపొరుగుననే వుండు నాదిమూలము

చ. 3: నేరచినవిద్యలెల్లా నించి దాఁచేచోటేదో
కోరనియానందముకొన యేదో
ఆరయ శ్రీవేంకటేశుఁ డాడనే పాయకవుండు
ఆరితేరి నాతఁ డీతఁ డాదిమూలము

**తొలిపలుకు :**

ఆదిమూలము యెవరు? పరమాత్మ. ఆయనెక్కడుంటాడు? వీధులగుండా విష్ణుదేవుడుపోయే దారిలో ఆ స్వామి వదలకుండా వుంటాడంటున్నారు అన్నమయ్య. మన జ్ఞానేంద్రియాలిచ్చే "జ్ఞానం" గురించి మాత్రమే తెలిసిన "జ్ఞానసంపన్నులు" వాటిని 'పసిగుడ్డు' కిచ్చిన ఆదిమూలమెవ్వరో యెరుగలేకున్నారు.

**భావదీపియ :**

అదిగో అదిగో విష్ణువు పోయేదారి, యీ వీధిలోనుండే కదా! ఆదిమూలమైన పరమాత్మ అదే దిక్కున వదలక వుంటాడు.

జీవులు చూచే చూపులకు సూటియైన (తిన్నని) మొదలేదో, అతిశయించిన వినుకలి (వినికిడికి) రహస్యం యెందు దాగినదో, నోరూరించే వంటశాల తయారీల రుచిని చెప్పే చోటేదో ఆ చాయనే (దరిదాపులోనే) ఆదిమూలమైన పరమాత్మ వుంటాడు.

పూపతలపోతకు (శిశివు ఆలోచనలకు) పుట్టిల్లు యేది? ఎడతెగని వూర్పులు (ఉచ్ఛ్వాస నిశ్వాసలు) నిలిచివుండే చోటేది? రాత్రిళ్ళు జీవులు నిదురించేటప్పుడు వాళ్ళకు మరపుయెట్లావస్తోంది? అదిగో అవెక్కడ నుంచి వస్తున్నాయో పరమాత్మా అక్కడే వున్నాడు.

మనం యెన్నో విద్యలు నేర్చి కావలసినప్పుడు బయటకు తెప్పిస్తాం. వాటిని యెక్కడ దాస్తున్నాం? ఊహించని ఆనందము యెక్కడ నుండి కలుగుతున్నది? అదిగో అక్కడే మన శ్రీవేంకటేశ్వరుడు వదలక వుంటాడు. ఆరితేరిన ఆ దేవుడే ఈతడు అంటే ఈ ఆదిమూలం అయిన పరమాత్మ.

**సంఖ్య : 539 సంపుటము : 3 పుట : 362 రాగం : లలిత**

పల్లవి: వీరు వారనేటి వింతేల
శ్రీరమణుని కృప సిద్ధముగాక

చ. 1: యెక్కడిపాపము యెక్కడిపుణ్యము
దక్కిన శ్రీపతిదాసునికి
పక్కన లోహముఁ బరుసము దాఁకిన
యెక్కువ నంతా హేమమేకాదా

చ. 2: యేది హీనము యేది యధికము
పాదుగ నడచుప్రపన్నునికి
మేదినీశుఁ డేమెలుఁతఁ బెండ్లాడిన
సాదించ నేలికసానే కాదా

చ. 3: యేడ నింద లిఁక నేడ సంస్తుతులు
జాడల శ్రీవైష్ణవునికిని
యీడనే శ్రీవేంకటేశుఁ డాత్మయట
యీడులేనియతఁ డెక్కుడేకాదా

**తొలిపలుకు :**

శ్రీ వల్లభుని కృప పొందటానికి అందరూ అర్హులే. వీరు వారు అనే తేదా వుండదు అంటున్నారు అన్నమయ్య. రాజుయే రమణిని పెండ్లాడినా ఆమె దేశానికి ఏలికసానే కాదా! అంటున్నారు. అంటే ప్రభువైన వారికి అధిపురాలు అని అర్థం. సాక్షాత్తు శ్రీవేంకటేశుడే తమ "ఆత్మ" అయిన శ్రీవైష్ణవులు సాటిలేని వారని వేరే చెప్పాలా? అంటున్నారు.

**భావదీవియ :**

ఓ ప్రజలారా! వీరు వారూ అనే వింత (విచిత్రం) యేమీలేదయ్యా! శ్రీపతి కృప సిద్ధముగాక (అందరికీ తప్పక సిద్ధిస్తుంది).

స్వామికి దక్కిన శ్రీపతి దాసులకు పాపము యెక్కడిది? పుణ్యము యెక్కడిది? ఎంత పనికిమాలిన లోహమైనా వొక్కసారి పరుసము (పరుసవేదితో) తాకితే అంతా విలువైన బంగారము అయిపోతుంది కదా!

పాదుగనడచు (స్థిరవర్తనులైన) ప్రపన్నులకు (శరణాగతులకు) హీనమైనదేది? అధికమైనదేది వుండవు? వారికి అందరూ సమానమే. మేదినీశుడు (దేశానికి రాజు) ఏ కాంతను పెండ్లాడినా ఆమె రాజ్యానికి ఏలికసాని (పట్టమహిషి) అయితీరుతుంది కదా!

జాడల (వివేకవంతులైన) శ్రీవైష్ణవులకు నిందలేమిటి? ప్రశంశలేమిటి? వారికి రెండూ సమానమే. ఈడనే (ఇహముననే) శ్రీవేంకటేశ్వరుడు ఆత్మ అయినవారు, సాటిలేని అత్యున్నతులు కాదా?



**సంఖ్య : 180 సంపుటము : 3 పుట : 121 రాగం : లలిత**

పల్లవి: వెన్న చేతఁబట్టి నేయి వెదకనేలా
యిన్నిటా నెంచిచూచితే నిదియే వివేకము

చ. 1: నీదాసులున్నచోట నిత్యవైకుంఠ మిదె
వేదతో వేరొకచోట వెదకనేలా
అదిగొని వారిరూపు లవియే నీరూపులు
పోది నిన్ను మదిఁ దలపోయనేలా

చ. 2: వారలతోడిమాటలు వడి వేదాంతపఠన
సారె వట్టిచదువులు చదువనేల
చేరి వారికరుణే నీచేపట్టిన మన్ననలు
కోరి యింతకంటే మిమ్ములఁ గొసర నేలా

చ. 3: నావిన్నపము నిదె నారదశుకాదులబను
యీవిధముననే ఆనతిచ్చినారు
శ్రీవేంకటేశ నీవు చేపట్టినదాసులకు
కైవశమౌ యీబుద్ధి కడమేలా

**తొలిపలుకు :**

అన్నమయ్య ఈ కీర్తనలో యెవ్వడైనా చేతిలో వెన్నవుంటే నెయ్యి యెక్కడ దొరుకుతుందా అని వెదకుట దేనికి? అని అడుగుతున్నారు. అన్నీ బాగా ఆలోచించి చూస్తే దీని కంటే "వివేకం" యెక్కడుంది? వేదవేదాంగాలు చదవటం దేనికి? నీ దాస్యం దొరికితే చాలదా స్వామీ?

**భావదీవియ :**

స్వామీ! వెన్నచేతిలో వుండగా నెయ్యి కొఱకు వెదకుట యెంత తెలివిలేని పని? అన్ని విధములా ఆలోచించి చూస్తే ఇదియే (ఈ జ్ఞానమే) వివేకము.

నీ దాసులు యెక్కడవుంటారో అదే నిత్యమైన వైకుంఠము. వేదతో (వ్యథతో) మరొక చోట వెదకుటెందులకు? ఆ వైష్ణవుల రూపమే నీ రూపము. శ్రమ పడి మదిలో నీ రూపము నూహించుటెందులకు?

వారలతో (వైష్ణవులతో) మాట్లాడటం వేదాంతపఠనం వంటిది. వ్యర్థంగా వేదవేదాంత పాఠములను చదువుటెందులకు? వారు మాపై కరుణజూపుటే నీవు (స్వామి) చేపట్టి మన్నించుట వంటిది. ఇంతకంటే మిమ్మల్ని కొసరనేల (ఇంకా కావలని) బ్రతిమిలాడుటెందులకు?

నారదుడు, శుకుడు వంటి మునులు యోగులు ఆ విషయమే ఇన్ని విధములుగా సెలవిచ్చారు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు చేపట్టిన (అనుగ్రహించిన) దాసులకు కైవల్యము తప్పదు. ఈ విధమైన బుద్ధికి (తెలివికి) కడమేల (దోషమేముంటుంది?)

**సంఖ్య : 174 సంపుటము : 3 పుట : 117 రాగం : ధన్యాసి**

పల్లవి: వెట్టిదెలిసి రోఁకలి వెసఁ జుట్టుకొన్నట్టు
యిట్టిదీము భోగముల నెనసేము
చ. 1: మురికిదేహము మోచి మూలల సిగ్గువడక
పొరిఁ బరిమళములు పూసేము
పరగ పునుకతల పావనము సేసేమంటా
నిరతితోడ దినము నీట ముంచేము
చ. 2: పుక్కట పంచేంద్రియపుపుట్టు వుట్టి యందరిలో
మొక్కించుక దొరలమై మురిసేము
అక్కర నజ్ఞానమనే అంధకారమునునుండి
దిక్కుల నెదిరివారిఁ దెలిపేము
చ. 3: దినసంసారమే మాకు దేవుఁడని కొలుచుక
వెనుకొని ఘనముక్తి వెదకేము
యెనలేక శ్రీవేంకటేశ మమ్ముఁ గావఁగాను
తనిసి తొల్లిటిపాటు దలఁచేము

**తొలిపలుకు :**

"పూర్వం ఒకడు నాకు వెట్టి తగ్గిపోయింది. అది అందరికీ తెలియాలి, దానికి గుర్తుగా ఒక రోకలిని నా మెడలో కట్టండి" అన్నాడట. అన్నమయ్య అదే సామెతను చెప్పి మేము కూడా కృత్రిమమైన భోగములనాశించి మా అజ్ఞానం బైటపెట్టుకొని మా వెట్టి మేమే చూపుతున్నాం అంటున్నారు.

**భావదీప్తి :**

వెట్టి దెలిసి (పిచ్చి తీరిపోయింది) వెస (వెంటనే) రోకలిని నా తలకు చుట్టుకొంటాను అన్నట్లుగా, ఇట్టిదీము భోగములు (కృత్రిమమైన ఐహిక సుఖములలో) అతిశయిస్తున్నాము.

ముఱికితో కూడిన దేహం మోస్తున్నందుకు సిగ్గు పడక దానిపై సుగంధపరిమళాలు పూసుకొంటున్నాము. పునుకతల (బుఱ్ఱ) పావనం చేసికొంటున్నాము అనుకొంటూ ఆసక్తితో ప్రతిరోజూ తలనిండా నీటిలో మునుగుతున్నాము.

పంచేంద్రియముల వశమైన పుట్టుక పుట్టిన మేము, మాకు వశమైన బంట్లచేత మొక్కించుకొంటూ దొరలమని మురిసిపోతున్నాము. గొప్ప అజ్ఞానాంధకారంలో మునిగిన మేము పరులకు మార్గనిర్దేశం చేస్తున్నాము.

దినదినము సంసారపు పీకులాటలో మునిగిన మేము దేవుని కొలువకుండానే ముక్తి కావాలని ఆశపడుతుంటాము. ఆలోచించండి మన వెట్టి తగ్గిందా? పెరిగిందా? ఇట్లాంటి వెట్టివాళ్ళమైన మాపై దయతో శ్రీవేంకటేశ్వరుడు రక్షించగా మా పూర్వపు అవస్థ తెలిసికొన్నాము.



**సంఖ్య : 172 సంపుటము : 3 పుట : 116 రాగం : లలిత**

పల్లవి: హరి నిను నెరఁగనియలమట లింతేశాయ
శరణంటి నిదె నీకే సర్వేశ కావవే
చ. 1: చొచ్చితి స్వర్గము దొల్లి సుకృతములెల్లాఁ జేసి
ఇచ్చఁ గొలిచితి సుర లిందరిని
గచ్చులఁ బుణ్యము దీరఁ గమ్మటిజన్మములకే
వచ్చితి పురుషార్థము వడి నెందూఁ గానను
చ. 2: వెదకితి భూములెల్ల విశ్వకర్తెవ్వడోయంటా
చదివితిఁ బుస్తకాలు సారె సారెకు
తుద ననుమానమున దొమ్మి నీకలు దెల్లఁగా
ముదిసితి నింతేకాని ముంద రేమిఁ గానను
చ. 3: చింతలెల్ల నుడిగితి శ్రీ వేంకటేశ్వర నిన్ను
వింత లేక శరణని వెలసితిని
చెంతల నిన్నాళ్లదాఁకా చిక్కి కర్మముల వట్టి
గంతులు వేసితిఁగాని కడ గాననైతిని

**తొలిపలుకు :**

అలమట అంటే చింత అని అర్థం. ఏవేవో చదివి, విని వూహించి ఇంతకాలము చింతించాను. చివరికి యేదారీ లేక శ్రీహరికి శరణు అన్నాను. అప్పుడు నా చింతలన్నీ దూరమైనాయి. ఇన్నాళ్ళూ నా కర్మకు చిక్కి గంతులు వేశాను, కాని ఇంత సులభమైన దారిని గుర్తించలేకపోయాను, అంటున్నారు అన్నమయ్య.

**భావదీప్తి :**

ఓ శ్రీహరీ! ఈ నేను చెప్పబోయే మానవుల అలమటలు (చింతలు) అన్నీ నిన్ను తెలియనందు వలననే ఇంతేశాయ (ఇంత పెద్దవైనాయి). సర్వేశ్వరా! ఇదే నీకు శరణంటిని, నన్ను కావవయ్యా!

ఇదివరలో చేసిన సుకృతము వలన స్వర్గము పొందాను. భక్తితో అక్కడవున్న దేవతలను కొలిచాను. చేసిన పుణ్యం తరిగిపోయాక ఇదిగో సంపన్నుడైన మానవు జన్మమునకే వచ్చితిని. కాని చతుర్విధ పురుషార్థములలో మోక్షములను సాధించలేకపోయాను.

ఈ విశ్వకర్తయెవ్వరా? అని భూమినంతా గాలించాను. ఎన్నెన్నో శాస్త్రాలు వేదాలు చదివాను. చివరికి అనుమానాలతోనే జుట్టంతా తెల్లబడి ముసలివాడినైపోయాను. అంతేకాని, ముందరేమో గానను (మోక్ష మార్గం) సాధించలేకపోయాను.

ఓ శ్రీవేంకటేశ్వరా! "అన్యధా శరణం నాస్తి" అని నా చింతనలన్నీ వదలివైచి, నీ శరణు చొచ్చితిని. ఇన్నాళ్ళదాకా కర్మబంధాలకు చిక్కిన నేను గంతులు వేసాను కాని కడగాననైతిని (ముక్తి సాధించలేదు). ఇక నీదే భారం తండ్రీ!

**సంఖ్య : 467 సంపుటము : 2 పుట : 315 రాగం : శంకరాభరణం**

పల్లవి: హరియు నొక్కఁడే గురి ఆత్మలో నొక్కటే గురి
విరివి నెంత చదివినా వేరు గాఁబొయ్యీనా

చ. 1: అందరిచూపులు నొక్కటైనందుకు గురి
యెందూఁ గొండ కొండేకాక యితరముగాఁ జూచేరా
అందరి రుచులు నొక్క టైనందుకు గురి
చెంది తీపు తీపే కాక చేఁదుగాఁ జేకొనేరా

చ. 2: వొప్పుగా నందరివూర్పు లొక్క టైనందుకు గురి
కప్పుర మదేకాక కస్తూరిగా మూఁకొనేరా
యెప్పుడూ నిందరివిని కేకమైనందుకు గురి
తిప్పి తిట్టు తిట్టేకాక దీవెనగా వినేరా

చ. 3: యీరీతి నిందరిచిత్త మేకమైనందుకు గురి
మేరతో సూర్యోదయము మించి రేతి రయ్యీనా
తేరి శ్రీవేంకటపతి దేవుఁడైనందుకు గురి
కోరినవారి వరాలే కొంగుపైఁడిగాదా

**తొలిపలుకు :**

శ్రీహరివొక్కడే. లోపల ఆత్మలో నున్నదీ వాడే. ఎంత నేర్చినా, యెంత చదివినా ఇదొక్కటే సత్యం. ఈ కీర్తనలో "గురి" అంటే సాక్ష్యం అని అర్థం. శ్రీవేంకటపతి దేవుడనటానికి సాక్ష్యం యేమిటి? కోరినవారి కొంగుబంగారం వలె తీరుస్తున్నాడు కదా! అది చాలదా?

**భావదీపిక :**

శ్రీహరీ వొక్కడే నండీ! సాక్ష్యమేమంటే అందరి ఆత్మలలో అంతరాత్మగా వున్నది వాడే వొక్కడు. మీరు యెంత చదువుకొని వేదాలు నేర్చినా, ఈ సత్యం మారదు.

అందరి చూపులూ వొకటే అనడానికి సాక్ష్యం యేమిటి? నీవు చూచే కొండయెత్తు నేను చూచే కొండయెత్తు వొక్కటే. అందరి రుచులు వొక్కటే అనడానికి సాక్ష్యం నేను తిని తీపి అన్నదాన్ని నీవూ తీపే అంటున్నావు కాని చేదు అనటం లేదు కదా!

ఒప్పుగా అందరి వూర్పులు (ఆఘ్రాణశక్తి) వొక్కటే అనేదాని సాక్ష్యం కర్పూరాన్ని వాసన చూచి యెవ్వడూ కస్తూరి అనడు. ఎప్పుడైనా అందరి వినికిడీ వొక్కటేనండీ! ఎవరైనా యెవరినైనా తిట్టితే దీవెనగా యెవరికీ వినిపించదు.

ఇదే విధంగా అందరి మనస్సూ వొక్కటే అనడానికి సాక్ష్యం సూర్యోదయాన్ని యెవ్వరూ కాళరాత్రి అనుకోరు. శ్రీవేంకటపతి దేవుడు (పరమాత్మ) అనడానికి సాక్ష్యం ఎవరు కోరిన వరాలు వారికి వెంటనే కోరినట్లే ఇచ్చే కొంగుబంగారం కదా! అంతకంటే యేమి సాక్ష్యం కావాలి?



**సంఖ్య : 420 సంపుటము : 2 పుట : 283 రాగం : భవుళి**

పల్లవి: హరిసే వొకటే యనంతము
గురుబోధలకును కొలఁదే లేదు

చ. 1: తలఁచినకొలఁదే తనలో భావము
నిలిపిన కొలఁదే నేమము
పలికినకొలఁదే పరమగు సత్యము
యిల నెవ్వరికిని యెక్కుడు లేదు

చ. 2: జరిపినకొలఁదే సకలాచారము
నెరపినకొలఁదే నిజకీర్తి
తిరము సేయుకొలఁదే ధర్మంబును
యిరవుగ నందుకు నెక్కుడు లేదు

చ. 3: సేసినకొలఁదే చేకొనుకర్మము
రోసినకొలఁదే రుచివిరతి
ఆసల శ్రీవేంకటాధిపుశరణును
దాసుఁడే యెక్కుడు తప్పే లేదు

**తొలిపలుకు :**

అన్నమయ్య ఈ కీర్తనలో యేమంటున్నారో వినండి. మానవుని భావాలకు, నియమాలకు, సత్యవాక్కునకు, ఆచారములకు, కీర్తికి, ధర్మమునకు, కర్మమునకు, విరక్తికి పరిమితివుంది కాని శ్రీహరి సేవకు, ఆచార్యుని సద్బోధలకు కొలదియే లేదు, అని అంటున్నారు.

**భావదీపిక :**

అయ్యలారా! హరిసేవ వొక్కటే అనంతమైనది. అదే విధంగా సద్గురువు చేసే బోధలకు కూడా పరిమితి లేదు.

ఎవ్వనికైన వారి ఆలోచనలను బట్టే వారి భావము (ఊహ) వుంటుంది. వారు నిలిపిన పట్టుదల కొలదే వారి నియమమువుంటుంది. వారి పలికిన దీక్షను బట్టే వారి సత్యవాక్కుంటుంది. ఎవ్వరికైనా ఇంతకంటే యెక్కువేమీ వుండదు.

ఆచారం అని తెగపట్టుదలగా వుంటారే అదంతా సాగినంతవరకే కదా! నెరపిన కొలదే (వ్యాపింపజేసిన తీరుని బట్టే) తమ కీర్తి వ్యాపిస్తుంది. ఎట్లా స్థిరపరిస్తే ధర్మం అట్లా స్థిరపడుతుంది. అంతకంటే యెక్కువ యెవ్వరికీ లేదు.

మనం యెంత చేశామో దానిని బట్టే మన కర్మఫలమూ వుంటుంది. రకరకాల రుచులపై విరతి (విరక్తి) యెలా కలుగుతుంది? మనం వాటిని యెంత రోత అనుకొంటే... అంత. శ్రీవేంకటేశ్వరుని శరణాగతులైన దాసులకి అటువంటి "తప్పుల" బాధవుండదు.

**సంఖ్య : 181**  **సంపుటము : 3**  **పుట : 121**  **రాగం : దేవగాంధారి**

పల్లవి: హీనుఁడైననన్నుఁ దెచ్చి యింతగా మన్నించితివి
దానవారి నీవు సేసే తగ విట్టిదయ్యా

చ. 1: విరతిబొందినయట్టి విమలచిత్తుఁడఁ గాను
ధరణి నెక్కుడయినతపసిఁ గాను
అరుదుగ గెంటులేని ఆచారవంతుఁడఁ గాను
హరి నీకరుణ నాపై నంటుటెట్లయ్యా

చ. 2: చేముంచి యిందరిలోన జితేంద్రియుఁడఁ గాను
భూమెల్లా దానమిచ్చిన పుణ్యుఁడఁ గాను
దోమటికర్మాలు సేసి తుదకెక్కె వాఁడఁ గాను
యేమిటికిఁ గాచితివో యిది సోద్యమయ్యా

చ. 3: వివరించి తెలిసిన విజ్ఞాని తొలుతఁ గాను
తవిలి నీభక్తిగల ధన్యుఁడఁ గాను
భవసాగరములోని ప్రాణిమాత్ర మింతే నేను
యివల శ్రీవేంకటేశ యెట్టేలితివయ్యా

**తొలిపలుకు :**

పరమాత్ముడు మనను అనుగ్రహించాలంటే కనీసం ఒక్క మంచి గుణమన్నా వుండాలి కదా! అన్నమయ్య స్వామితో యేమి విన్నవించుకొంటున్నారో వినండి. స్వామీ! అన్నిటా హీనుడనైన నన్ననుగ్రహించి నీవు వివాదం సృష్టించావు. నాలో వొక్కటన్నా మంచి గుణంవున్నదా? ఒక్క మంచి పనైనా చేశానా? పోనీ గొప్ప జ్ఞానినా? నా భక్తి అంతంత మాత్రమే. భవసాగరంలో మునకలేస్తున్న ప్రాణిని. అయినా నన్ననుగ్రహించావు ధన్యోస్మి.

**భావదీపిక :**

ఓ దానవవైరీ! నీవు చేసే తగవు (వివాదం) ఇట్లాగే వుంటుదయ్యా! నాబోటి హీనుణ్ణి తీసికొనివచ్చి ఇంతగా అనుగ్రహించావు. అంతెందుకు స్వామీ?

నేను విరక్తిని పొందిన నిర్మలహృదయుడనా? కాదు. పోనీ గొప్ప తపస్వినా ఈ లోకంలో? కాదు. అరుదైన, అప్రతిహతమైన సదాచారవంతుడనా? కాదు. ఓ శ్రీహరీ! నీ కరుణ నాపై యెట్లా అంటుకొంటుందయ్యా?

ఇంతమంది మనుష్యులలో చేముంచి (నిజమైన) జితేంద్రియుడనా? కానేకాదు. పోనీ భూమినంతా దానం చేసిన గొప్ప దాతనా? అంత పుణ్యం నాకెక్కడిది? దోమటి కర్మాలు (గొప్ప శ్రమతో కూడిన యజ్ఞయాగములు) చేసి మోక్షార్హత గల దీక్షితుడినా? కాదు. మరి నన్నెందుకు రక్షించావో, అదే పెద్ద చోద్యం.

అన్నీ అటుంచి, వివరము తెలిసిన విజ్ఞానినా? కానేకాదు. పోనీ నీపై అనన్యభక్తి గల ధన్యుడనా? కాదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నేను భవసాగరంలో మునకలేస్తున్న ప్రాణినయ్యా! అయినా నన్ను ఇట్టే యేలితివి. నావంటి ధన్యుడుంటాడా తండ్రీ?





# సంపుటి –II

# హరి గానమే అన్నమయ్య జ్ఞానము

## సంపుటి - II

ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు భావదీపిక

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | కీర్తన విషయము | సంపుటము/ సంఖ్య | పేజీ |
|---|---|---|---|
| 1. | అందుల కిదె ప్రతియౌషధము | 4/117 | 1 |
| 2. | అఖిలలోకైకవంద్య హనుమంతుఁడా సీత- | 3/522 | 2 |
| 3. | అదరీ బెదరీ నంతనంత | 4/24 | 3 |
| 4. | ఇందే వున్నది కానమెందో వెదకితిమి | 4/137 | 4 |
| 5. | ఇట్టి సుద్దులితనివి ఇదివో కొలువున్నాఁడు | 2/503 | 5 |
| 6. | ఇది యెరిఁగినవారే యెంచఁగ నీదాసులు | 3/524 | 6 |
| 7. | ఎంచి చూచితే నితని కెవ్వ రెదురు | 4/162 | 7 |
| 8. | ఎంతని పొగడవచ్చు నీతని సేవించరో | 4/506 | 8 |
| 9. | ఎక్కడ చూచిన వీరే యింటింటి ముంగిటను | 3/4 | 9 |
| 10. | ఎఱుఁగఁడు పరసుఖ మీశ్వర నీమాయ | 4/404 | 10 |
| 11. | ఏకాత్మవాదులాల యిందు కేది వుత్తరము | 2/253 | 11 |
| 12. | ఏదైనా సుఖమే యిన్నిటా నీవు గలవు | 4/478 | 12 |
| 13. | ఏపాటితనకర్మ మాపాటి కాపాటె | 3/452 | 13 |
| 14. | ఏమి దిరిగేమెందైనను ఊర | 4/6 | 14 |
| 15. | ఒక్క మాటు శరణని వుండేనింతేకాక | 3/455 | 15 |
| 16. | కనుఁగాక పుణ్యాలు కడఁబడెనా | 4/50 | 16 |
| 17. | కప్పురమునకుఁ గప్పురమై | 4/7 | 17 |
| 18. | కూడుదు రూరకె వొకచో గుమి విత్తురువేరొకచో | 4/433 | 18 |
| 19. | గరిమల నెరఁగరుగాక మానవులు | 3/456 | 19 |
| 20. | చవిచేసుక యిటు జరగెదము | 3/542 | 20 |
| 21. | చాలదా నా సంసారము | 4/27 | 21 |
| 22. | చూడవమ్మ కృష్ణుఁడు నీసుతుఁ డోయమ్మ | 4/161 | 22 |





| | | | |
|---|---|---|---|
| 23. | చెప్పితే నాశ్చర్యము సేసినచేంత లితఁడు | 4/477 | 23 |
| 24. | చేపట్టుఁగుంచము శ్రీవిభుఁడు | 4/174 | 24 |
| 25. | తనుఁ దా నేమఱక దైవము మఱవకుంటే | 3/541 | 25 |
| 26. | తెలిసినవారికి దేవుఁ డితఁడే | 3/480 | 26 |
| 27. | తెలిసినవారెల్లా దేవునిఁ జేరి బదికి- | 4/123 | 27 |
| 28. | తెలుపఁగ రాదిది దేవునిమాయలు | 3/588 | 28 |
| 29. | తొల్లిటివారు వెట్టినతోవ యిది | 4/138 | 29 |
| 30. | త్రిజగముల నెరుఁగు దేవదేవుఁడు | 3/523 | 30 |
| 31. | దాసులపాలిటి నిధానమై వున్నాఁ డదిగో | 4/488 | 31 |
| 32. | ధనముగని మరికదా ధనికుఁడౌట - మొదల | 4/25 | 32 |
| 33. | ధరలో నాజన్మమే తనువు నదియె | 3/479 | 33 |
| 34. | నిండె నిన్ని చోటులను నీమహిమలే | 2/248 | 34 |
| 35. | నీగురుతులు చూచుకో నీబిరుదు లెంచుకో | 4/476 | 35 |
| 36. | నేనా గెలువ లేను నీమాయ | 3/540 | 36 |
| 37. | పోకు పోకు మంత నీవు పురుషోత్తమా వట్టి | 15/252 | 37 |
| 38. | ప్రత్యక్షమే మాకుఁ బ్రమాణము | 4/122 | 38 |
| 39. | బడిబడి నింద్రియాలే పరువులు వెట్టుఁగాని | 4/480 | 39 |
| 40. | బలువుఁడు నాతఁడే బంధువుఁడు నాతఁడే | 3/453 | 40 |
| 41. | మగటిమిగల హనుమంతరాయ | 2/250 | 41 |
| 42. | మిగిలిన దే మిఁకమీఁదట దేహికి | 3/557 | 42 |
| 43. | వట్టిజాలిఁ బడవలదిఁకను | 4/173 | 43 |
| 44. | వద్దిక నోపము వట్టిస్వతంత్రము | 3/454 | 44 |
| 45. | వాగె బలువు దైవపురాయా - నీ | 4/30 | 45 |
| 46. | విత్తొకటి వెట్టఁగాను వేరొకటి మొలచీనా | 4/186 | 46 |
| 47. | వెదకిన నిదియే వేదాంతార్థము | 4/436 | 47 |
| 48. | వేంకటగిరి గోవిందుడా | 4/23 | 48 |
| 49. | సచరాచర మిదె సర్వేశ్వరుఁడే | 4/116 | 49 |
| 50. | సమ్మతించి కనుకొండ సరుస నిశ్చలబుద్ధి | 4/435 | 50 |
| 51. | శ్రీసతీశ బహుజీవ చైతన్యుఁడవు నీవు | 4/479 | 51 |

**సంఖ్య : 117** **సంపుటము : 4** **పుట : 79** **రాగం : సామంతం**

పల్లవి: అందుల కిదె ప్రతియౌషధము
ఇందిరాపతికి నెక్కినచింత

చ. 1: పంచబాణములబాసట మంటిన-
చంచలమౌ నిశ్చలమనసు
పంచబాణగురుపాదము దలఁచిన
కంచుఁజంచలము గక్కన మాను

చ. 2: కనకపుటాసలగరళం బంటిన
ననిచిన విజ్ఞానము చెదరు
కనకగర్భు నటు గన్నతండ్రిపై
మనసిడితే నిర్మలమౌ గుణము

చ. 3: మునుకొనిమొదలను మొలచినససికిని
పనివడి కొననే ఫలియించు
అనయము శ్రీవేంకటాధిపుకృపగల-
జనుని కిహపరము సఫలంబు

**తొలిపలుకు :**

అందులకిదే తగిన మందు అంటున్నారు అన్నమయ్య. అందుల కంటే దేనికి? చంచలమనస్సుకు, బంగారంపై వ్యామోహానికి, మామూలు ప్రత్యవుషధం పనికిరాదు. ఇందిరాపతి మీద నెక్కిన ధ్యాస మాత్రమే తగిన మందు. అదేమో ఆ తిరుమలయ్య కృపలేకపోతే కలుగదు. మరెట్లా?

**భావదీపిక :**

ఓ ప్రజలారా! అందులకు (నేను చెప్పబోయే రుగ్మతలకు) ఇదే (ఇందిరాపతికి నెక్కిన చింత) ప్రతియౌషధము (విరుగుడు మందు).

నిశ్చలమైన మనస్సు కూడా, పంచబాణముల (మన్మథుని బాణాలు) బాసటమంటితే (సహాయం దొరికితే) చంచలమై పోతుంది. అయితే పంచబాణుని గురు (మదనజనకుడైన శ్రీహరి) పాదములను స్మరించిన ఆ మనస్సు పెళుసైన తన చాంచల్యమును వెంటనే మానుతుంది.

ననిచిన విజ్ఞానము (ప్రీతిపాత్రమైన జ్ఞానము) కూడా బంగారముపై వ్యామోహం అనే విషము సోకితే చెల్లా చెదిరిపోతుంది. అటు, కనకగర్భుని (బ్రహ్మగారి) తండ్రియైన శ్రీహరిపై మనస్సు పెట్టితే మన గుణములన్నీ నిర్మలమైపోతాయి.

పూని మొదళ్ళపై నిలిచి మొలచినయే సశ్యమైనా ఫలించినది మాత్రం ఆ చెట్టు కొనలలోనే కదా! అనయము (ఎల్లప్పుడు) శ్రీవేంకటేశుని కృపగల మానవునికి ఇహపరముల రెంటిలోనూ సఫలత దక్కుతుంది కదా!



**సంఖ్య : 522** **సంపుటము : 3** **పుట : 351** **రాగం : రామక్రియ**

పల్లవి: అఖిలలోకైకవంద్య హనుమంతుఁడా సీత-
శిఖామణి రామునికిఁ జేకొని తెచ్చితివి

చ. 1: అంభోధి లంఘించితివి హనుమంతుఁడ
కుంభినీజదూతవైతి గురుహనుమంతుఁడ
గంభీరప్రతాపమునఁ గడఁగితివి
జంభారిచే వరములు చయ్యన నందితివి

చ. 2: అంజనీదేవికుమార హనుమంతుఁడ
కంజాప్తఫలహస్త ఘనహనుమంతుఁడ
సంజీవని దెచ్చిన శౌర్యుఁడవు
రంజిత వానరకుల రక్షకుఁడ వైతివి

చ. 3: అట లంకసాధించిన హనుమంతుఁడ
చటులసత్త్వసమేత జయహనుమంతుఁడ
ఘటన నలమేల్మంగకాంతు శ్రీవేంకటేశుకుఁ
దటుకన బంటవై ధరణి నిల్పితివి

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ హనుమద్వైభవ కీర్తన యెచ్చటనున్న హనుమంతునిపై చెప్పినారో తెలియటంలేదు. కానీ కీర్తనలో నూతన పదప్రయోగాలు పుష్కలంగా వున్నాయి. అలమేల్మంగకాంతుడైన శ్రీవేంకటేశునికి చటుక్కున బంటువై ధరణిలో నిల్చితివయ్యా అంటున్నారు.

**భావదీపిక :**

సమస్త లోకములచే పూజలందుచున్న హనుమంతుడా! సీతాదేవి ఇచ్చిన శిఖామణి గైకొని రామునికి తెచ్చితివయ్యా!

అంబోధి (సాగరమును) లంఘించితివయ్యా హనుమంతా! కుంభినీజ (భూసుత) అయిన సీతాదేవి దూతవైనా మా గురుడవు నీవేనయ్యా! ఎంతో గంభీరప్రతాపము ప్రదర్శించితివి. అందుచేత జంభారి (మహేంద్రుని) చేత చయ్యన (శీఘ్రముగా) వరములు పొందితివి.

ఓ హనుమంతుడా! నీవు అంజనీదేవి కుమారుడవు. కంజాప్తఫల (సూర్యుడనెడి పండును) హస్తముల బట్టవోయిన ఘనుడవు. లక్ష్మణుని బ్రతికించుటకు సంజీవని కొండను దెచ్చిన శౌర్యవంతుడవు. వానరులకు ఆనందము కలిగించు రక్షకుడవు.

ఆనాడు లంకను సాధించి, దహించితివయ్యా హనుమంతుడా! చటుల సత్వసమేత (మొక్కవోని బలసంపన్నుడవు) నీవే స్వామీ! జయకరుడవు. అలమేలు మంగపతియైన శ్రీవేంకటేశ్వరునికి తటుకున (చటుక్కున) బంటువై ఈ ధాత్రిపై నిలిచితివయ్యా హనుమంతుడా!

**సంఖ్య : 24** **సంపుటము : 4** **పుట : 377** **రాగం : బౌళిరామక్రియ**

పల్లవి: అదరీ బెదరీ నంతనంత
అదవదలై మాయామృగము

చ. 1: పొలసీ మలసీఁ బొదలీఁ గదలీ
నెలసీఁ బలుమారు నెలవులను
కలసీ మృగములఁ గ్రమ్మర బెదరీ
అలసీనటు మాయామృగము

చ. 2: దాఁగీ లోఁగీ దటుకన వెనుకకు
వీఁగీ నేఁగీ విసవిసనై
రేఁగీగతి వచరింపుచుఁ జూపుల
నాఁగీనదె మాయామృగము

చ. 3: వెంకటగిరి రఘువీర నీముందర
కొంకీఁ గొసరీఁ గొనగొనల
జంకెల బాణాసన బౌణంబున
సంకెలఁ బడె మాయామృగము

**తొలిపలుకు :**

అదవదలై అంటే తత్తరబిత్తరవటం అని అర్థం. వేంకటగిరి రఘువీరుని ముందు హొయలు చూపిస్తున్న మాయాలేడి తళుకు బెళుకులను వర్ణిస్తున్న అన్నమాచార్యుని కీర్తన అంత తేలికగా మింగుడు పడే వ్యవహారం కాదు. సతమతమై దిక్కుమొక్కులేక అలసిసొలసిన నాకు అండాదండా ఆ కొండలరాయడే.

**భావదీపిక :**

ఆ మాయామృగము తీరు యెట్లా వున్నదంటే, అంతలో అదరుతుంది. అంతలో బెదరిపోతుంది. ఇట్లా అది అదవదలైపోయింది (తత్తరబిత్తర అయింది).

ఆ మాయామృగము పొలసీ మలసీ (అటూ ఇటూ సంచరిస్తుంది, తిరుగుతుంది). పొదలీ కదలీ (పైకి లేస్తుంది కదలుతుంటుంది). అనేకమార్లు ఆ ప్రాంతాల్లో నెలసీ (నిలుచుండిపోతుంది). తనతోటి మృగాలతో కాసేపు కలసివుంటుంది, వెంటనే బెదరిపోతుంది. అంతలోనే అలసట ప్రదర్శిస్తుంది.

ఆ మాయామృగము దాగీలోగీ (కాసేపు దాగికొంటుంది, కాసేపు లొంగినట్లుంటుంది). అంతలో చటుక్కున వెనుకకు పారిపోతుంది. ఇంతలో విసవిసమంటూ చెలరేగుతుంది. కొంతసేపు తన చూపులను ప్రసరించుచూ ఆగిపోతుంది. అదే టక్కులు ప్రదర్శించే మాయామృగము.

ఓ వేంకటగిరి రఘువీరా! నీ ముందర కొనగొనలన్ (కృత్రిమముగా) కొంకీ గొసరీ (భయం నటిస్తుంది). ఇంతచేసినా చివరకు ఆ మాయామృగము "జంకెన బాణాసన బౌణంబున సంకెలబడె" (బెదరించు రాముని వింటి దెబ్బ అనే సంకెలను చిక్కక తప్పలేదు).



**సంఖ్య : 137** **సంపుటము : 4** **పుట : 92** **రాగం : దేశాక్షి**

పల్లవి: ఇందే వున్నది కానమెందో వెదకితిమి
కందర్పగురుభక్తి గంటిమి నే మిదివో

చ. 1: కోటికోటివేదములకొనయర్థము
సాటివేదములలోని సకలార్థము
సూటిగా గురుఁడు మాకుఁ జూపినర్థము
గాటపు మనసు దవ్వి కనుఁగొంటి మిదివో

చ. 2: పరమయోగీంద్రులుపట్టినయర్థము
సురలు మునులు నెంచిచూచినర్థము
సరి మూఁడులోకములఁజాటినర్థము
గరిమ నీదేహమెత్తి కంటిమి మే మిదివో

చ. 3: పలుశరణాగతులపాలియర్థము
మలయుచుండేటితిరుమంత్రార్థము
నిలిచి శ్రీవేంకటాద్రి నిండినర్థము
కలసి విజ్ఞానవీధిఁ గనుఁగొంటిమయ్యా

**తొలిపలుకు :**

"అర్థము" అంటే ప్రయోజనము. అన్నమయ్య ఈ కీర్తనలో వేదవేదాంతముల సారము యెక్కడోలేదు. ఈ తిరుమల శిఖరాలమీదనే వున్నది. ఎంత వెదకినా ప్రయోజనంలేదు. శ్రీహరిపై భక్తి వుంటే సకలార్థములు సమకూరుతాయి అంటున్నారు.

**భావదీపిక :**

ఇందే వున్నది (శ్రీహరిపై భక్తిలోనే వేదవేదాంగ విజ్ఞానము వున్నది). ఎందో వెదకితిమి. ఎక్కడాకానమైతిమి. ఇదిగో మేము కూడా హరి భక్తిని సాధించితిమి.

అనేక వేదముల కొన (వేదాంతముల) అర్థము (ప్రయోజనమును) గంటిమి. వేదములలోని సకలార్థమును గ్రహించితిమి. మా గురుదేవులు చూపిన తిన్నని అర్థం గ్రహించితిమి. ఘనమైన మనస్సును శోధించి ఈ భక్తి మార్గమును కనుగొంటిమి.

పరమయోగీంద్రులు కనుగొన్న ప్రయోజనమిా భక్తి మార్గమే. దేవతలు మునులు యెంచినదీ యీా అర్థమే. త్రిలోకములందు చాటబడిన అర్థము ఈ భక్తి మార్గమే. ఇదిగో ఈ దేహమెత్తిన మేము కూడా గరిమతో ఈ భక్తి మార్గమును గంటిమి.

ఎందరో శరణాగతుల పాలిటి ప్రయోజనము ఇదే. తిరుమంత్రమైన "ఓం నమో నారాయణాయ" లో అర్థము భక్తియే. శ్రీవేంకటాద్రిపై నిండినదీ ఈ అర్థమే. అయ్యా! మేము జ్ఞానమార్గము ద్వారా కనుగొన్నదీ ఈ భక్తిమార్గమునే.

**సంఖ్య : 503** **సంపుటము : 2** **పుట : 342** **రాగం : నాట**

పల్లవి: ఇట్టి సుద్దులితనివి ఇదివో కొలువున్నాఁడు
నట్టనడుమ నీసుగ్రీవ నారసింహుఁడు

చ. 1: పగలూ రాతిరీఁ గాని పటుసంధ్యాకాలమందు
మొగిఁ బచ్చీ వెచ్చీగానిమొనగోళ్ళచే
గగనమూ నేలాఁ గానిగనమైన తొడమీఁద
నగుతా హిరణ్యుఁ గొట్టె నరసింహదేవుఁడు

చ. 2: వెలుపలాలోనాఁ గాని వెడఁగుగడపమీఁద
తలితండ్రిగానియట్టితావునఁ బుట్టి
మొలచి చిగిరించని ముదురుఁగోరలతోఁడ
నలి హిరణ్యు జంకించె నరసింహదేవుఁడు

చ. 3: మానిసీ మెకమూఁగాని మంచియాకారముతోఁడ
పూని యిల్లూఁ బందిలీఁ గాని గుహలో
ఆనుక హిరణ్యుని నడఁచీ శ్రీవేంకటాద్రి
నానాదిక్కులనేలిన నరసింహదేవుఁడు

**తొలిపలుకు :**

కొలువైవున్న సుగ్రీవ నారసింహునిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. హిరణ్యుని వరాలవల్ల వాడికి పగలుగాని రాత్రిగాని, ఇంట్లోగాని, బయటగాని, నర-దేవ-రాక్షస గణాలతో కాని, ఏ ఆయుధముతో కాని, పక్షి-జల-తిర్యక్ జంతువులతోగాని, తల్లీదండ్రికి పుట్టిన యెవరితోగాని, చావురాదు. మరి హరి జరిపిన గరిమయేమి?

**భావదీపిక :**

ఇదివో కొలువై నట్టనడుమన్ (యెట్టెదురుగా) వున్నవాడే ఈ సుగ్రీవ నారసింహస్వామి. చక్కని గ్రీవము (గొంతు) గల ఈయన కథలు అత్యద్భుతాలు.

ఈ నరసింహదేవుడు నగుతా(నవ్వుతూ) వున్నాడు. ఎందుకంటే హిరణ్యకశిపుని వరాలన్నీ 'వమ్ము' చేశాడు కదా! పగలూ రాత్రీగాని పటుసంధ్య (ఘనమైన సంధ్యా కాలమున) పచ్చీవెచ్చీగాని (లేత) కొనగోళ్ళతో, ఆకాశమూ భూమికాని తన తొడ మీద నుంచి ఆ దానవుని సంహరించాడు.

ఈ నరసింహదేవుడు ఆ హిరణ్యుని యెట్లా జంకించాడో (బెదరించాడో) చూడండి. ఇంటి వెలుపలా లోపలా కాక, గడప మీద సంహరించాడు. తల్లీదండ్రికి పుట్టకుండా స్తంభము నుంచి పుట్టాడు. మొలచినా చిగురించని- అంటే జీవం లేకపోయినా పెరిగే నైజమున్న గోళ్ళతో చంపాడు. మరిహరి గరిమ నెఱుగుట నర సురాసురుల తరమటరా!!!

ఈ స్వామి ఆకారం చూశారా? మనిషీ కాదు మెకము (జంతువూ) కాదు. ఇల్లూ, బందిలి (గుడీ, దడీ లేని) గుహలో వెలసినాడు. ఆ విధంగా దైత్యుడు హిరణ్యుని అడచి (మట్టుబెట్టి) శ్రీవేంకటాద్రికి చుట్టూవున్న సమస్త దిక్కులనూ యేలుతున్న నరసింహదేవుని కంటే భర్త-నాకృతి భర్త మరెవరున్నారు? లేరు లేరు. ఈ హరే శ్రీహరే.



**సంఖ్య : 524** **సంపుటము : 3** **పుట : 351** **రాగం : దేసాక్షి**

పల్లవి: ఇది యెరిఁగినవారే యెంచఁగ నీదాసులు
వెదకి తెలుసుకొంటే వేదాంతాల నున్నవి

చ. 1: పట్టితే నీస్వరూపము బయలు లోపల నిండి
అట్టె సర్వశక్తితో సాకారముతో
యెట్టు దలఁచినాఁ జిత్తాఇత్తమై వున్నాఁడవు
వొట్టి ప్రకృతిపురుష లౌగి నీదేహములు

చ. 2: అనంతమైన ప్రకృతి అఖిలవికారములై
పనివడి నీమాయయై ప్రపంచమై
వొనరి జడమై యుండ నొకచో దివ్యమై యుండు
నినుపై ఇహపరాలు నీయైశ్వర్యములు

చ. 3: జీవుఁ డణువు జ్ఞానము చింతించఁగా విభువు
యీవిధము నానాజీవు లివె నీయందె
శ్రీవేంకటేశుఁడ నీవే చేకొన్నచైతన్యమవు
కావింపఁ గర్మభక్తులే కారణఫలములు

**తొలిపలుకు :**

భగవంతుని దేహము, ప్రకృతి, పురుషులు స్వభావము చైతన్య స్వరూపము. అట్టి శ్రీవేంకటేశ్వరునిపై భక్తి గురించి వివరిస్తున్నారు అన్నమయ్య. వీటి గురించి తెలిసిన వారే నీ నిజమైన దాసులు. ఇవన్నీ వేదాంతములయందు కూడా వున్నవి. కాని నీ దాసుల ద్వారా తేలికగా తెలుసుకోగలము.

**భావదీపిక :**

ఇది (నేను చెప్పబోయే ఈ సత్యం యెరిగిన వారే) నీదాసులు. వేదాంతములను శోధించి తెలుసుకొంటే అందులో వున్నది కూడా ఇదే.

పట్టుకోగలిగితే నీ స్వరూపము సాకారమై సర్వశక్తివంతమై యెట్లా భావిస్తే అట్లా చిత్తాయుతమై (మనస్సు నిండి) వున్నది. నీ దేహమే ప్రకృతి పురుషులుగా లోనైయున్నది.

అనంతమైన ప్రకృతి అనేక వికారముల సమ్మిళితమై తానే నీమాయయై అదే ప్రపంచమై కొన్ని పర్యాయములు జడమై వుంటుంది. వేఱొకసారి అదే దివ్యమై వుంటుంది. ఇంపుగా మా ఇహపరాలు నీయొక్క ఐశ్వర్యముగా రూపుదిద్దుకొన్నది.

పురుషుడు అని పిలువబడే జీవుడు, నిజానికి అణువు మాత్రం రూపి. చింతించగా జ్ఞానము సర్వవ్యాపకత్వము గలిగినది. ఈ విధముగా సమస్తజీవులు నీయందే ఇమిడివున్నవి. ఓ శ్రీవేంకటేశా! నీవే అన్ని జీవులలోని చైతన్యము. కర్మభక్తులే (కర్మభాగములే) కర్మకు కారణమైన ఫలముగా పరిణమించినవి.

**సంఖ్య : 162 సంపుటము : 4 పుట : 109 రాగం : గౌళ**

పల్లవి: ఎంచి చూచితే నితని కెవ్వ రెదురు
కొంచఁ దేమిటికి వీఁడె ఘోరనార సింహుఁడు

చ. 1: గక్కన నహోబలాన కంబములోన వెడలి
వుక్కుమీరి హిరణ్యుని నొడిసిపట్టి
చెక్కలువార గోళ్లఁ జించి చెండాడినయట్టి-
వెక్కసీఁడు వీఁడివో వీరనారసింహుఁడు

చ. 2: భవనాసియేటిదండఁ బాదుకొని కూచుండి
జవళి దైత్యుపేగులు జందేలు వేసి
భువియుదివియు నొక్క పొడవుతో నిండుకొని
తివురుచున్నాఁడు వీఁడె దివ్యనారసింహుఁడు

చ. 3: కదిసి శ్రీసతిఁ గూడి గద్దెమీఁదఁ గూచుండి
యెదుటఁ బ్రహ్లాదుఁడు చేయెత్తి మొక్కఁగా
అదన శ్రీవేంకటాద్రి నందరికి వరాలిచ్చి
సదరమైనాఁడు వీఁడె శాంతనారసింహుఁడు

**తొలిపలుకు :**

అహోబలంలోని నారసింహునిపై శ్రావ్యమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. భవనాశి యేటి చెంత వెలసిన ఈ స్వామి హిరణ్యకశిపుని ప్రేవులు చించి జంధ్యాలుగా వేసికొనినప్పుడు ఘోరనరసింహుడే. శ్రీసతితో గద్దెపై కూర్చొని ప్రహ్లాదుని కనేక వరముల నిచ్చిన ఈ దివ్యనారసింహుడే నాడు దేవతలను, నేడు శ్రీవేంకటేశుడై భక్తులను అనుగ్రహించుచున్నాడు అంటున్నారు.

**భావదీపిక :**

ఎంచిచూచినచో ఈ అహోబలనారసింహునికి యెదిరించు వాడెవడున్నాడు? ఏమిటికి (దేనికీ) ఈ ఘోరనరసింహుడు కొంచడు (సంకోచించడు).

ఈ స్వామి అహోబలంలోని కంభము (స్తంభము) నుండి చటుక్కున వెడలినాడు. హిరణ్యకశిపుని బలంగా వొడిసి పట్టి చెక్కులు వార (చెక్కిళ్ళు తెగునట్లు) చీల్చి చెండాడాడు. అట్టి వెక్కసీడు (దుస్సహమైన) ఈయనే వీరనరసింహుడు.

భవనాసి, యేటిదండ (నది ఒడ్డున) తిష్టవేసికొని కూర్చున్న ఈ స్వామి జంటగా నున్న వీడి పేగులను జంధ్యములుగా వేసికొనినాడు. తన భీకరరరూపంతో భువియు దివియు (భూమ్యాకాశములు) ఒక్కసారిగా నిండిపోయాడు. అట్లా కొలువైవున్న వీడే దివ్యనరసింహుడు.

ఈ స్వామి శ్రీలక్ష్మిని కదిసి (దగ్గరకు తీసికొని) గద్దెపై కూర్చున్నాడు. చేతులెత్తి మొక్కి ప్రహ్లాదుడు యెదుట నిలువగా వరములనిచ్చాడు. అదే విధంగా నేడు శ్రీవేంకటాద్రిపై అందరికీ వరములిచ్చి ఈ శాంతనరసింహుడు సదరమైనాడు (స్పష్టమైనాడు).



**సంఖ్య : 506 సంపుటము : 4 పుట : 341 రాగం : మాళవిగౌళ**

పల్లవి: ఎంతని పొగడవచ్చు నీతని సేవించరో
పొంతనిదే కలశాపుర హనుమంతుఁడు

చ. 1: పిడికిటఁ బట్టినవి పెద్దపండుల గొలలు
అడరి యెత్తినది మహావాలము
గుడిగొన రాకాసులఁ గొట్టినది వలకేలు
పొడచూపీఁ గలశాపుర హనుమంతుఁడు

చ. 2: సందడిసమరానకు చాఁచినది పెనుజంగ
అందముగ నిక్కించినదదే వురము
కుందక వీరరసమే కురిసేటిది మొగము
పొందుగువాఁడు కలశాపుర హనుమంతుఁడు

చ. 3: వుదుటున మెలఁగేవి వొద్దికైన పాదాలు
త్రిదశులమెప్పించేది దివ్యరూపము
అదె శ్రీవేంకటేశుబంటయి నిలుచున్నాఁడు
వొదలుచుఁ గళశాపుర హనుమంతుఁడు

**తొలిపలుకు :**

కలశాపురంలో వెలసిన హనుమంతునిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఈ హనుమంతుని రూపం త్రిదశులనే మెప్పించేదిగా వుందట. త్రిదశులు అంటే పుట్టుక, యౌవనం, మరణం అనే మూడు దశలు మాత్రమే వుండే దేవతలు అని అర్థం. ఈ హనుమంతుడు శ్రీవేంకటేశ్వరుని బంటు అంటున్నారు.

**భావదీపిక :**

ఈ కలశాపుర హనుమందుని యెంతని పొగడవచ్చును!!! ఇదే మన పొంతనే (యెదుటనే) వున్నాడు. ఈతనిని సేవించండయ్యా!

ఈయన పిడికిట పట్టుకొన్నది, పండుల గోలలు (ముళ్ళున్న పెద్ద గద). అతిశయించి యెత్తిపట్టిన ఆయన వాలము (తోకను) చూడండి. గుడిగొన్న (గుమిగూడిన) రాక్షసులను అయన కొట్టినది వలకేలుతో (కుడి చేతితోనే). ఇదిగో ఇట్లు పొడచూపిన వాడే కలశాపుర హనుమంతుడు.

ఈయన తన పెద్ద జంగను (అంగను) గొప్ప సమరమునకు సిద్ధపడినట్లు చాచినాడు. ఆయన వురము (రొమ్ము) అందముగా ఉబ్బి వున్నది. ఆయన మొగమున వీరరసము తొణికిసలాడుచున్నది. ఇతడే పొందికవున్న కలశాపుర హనుమంతుడు.

ఆయన కుదురైన పాదాలు ఉద్ధతితో కదలుచున్నవి. ఆయన దివ్వరూపము త్రిదశుల (దేవతల) మెప్పు పొందినది. అదిగో శ్రీవేంకటేశ్వరుని బంటుగానున్న ఈ కలశాపుర హనుమంతుడు ఒదలుచు (వర్థిల్లుచూ) వున్నాడు.

**సంఖ్య : 4** **సంపుటము : 3** **పుట :** **రాగం : దేసాళం**

పల్లవి: ఎక్కడ చూచిన వీరే యింటింటి ముంగిటను
పెక్కుచేంతలు సేసేరు పిలువరే బాలుల

చ. 1: పిన్నవాఁడు కృష్ణుడు పెద్దవాడు రాముఁడు
వన్నె నిద్దరమడలవలె నున్నారు
వెన్నలు దొంగిలుదురు వీఁడు వాఁడు నొక్కటే
పన్నుగడై వచ్చినారు పట్టరే యీా బాలల

చ. 2: నల్లనివాఁడు కృష్ణుడు తెల్లనివాఁడు రాముఁడు
అల్లదివో జోడుకోడెలై వున్నారు
వెల్లవిరై తిరిగెరు వేరు లే దిద్దరికిని
పెల్లుగ యశోదవద్దఁ బెట్టరె యీాబాలుల

చ. 3: రోలఁ జిక్కె నొకఁడు రోకలి వట్టె నొకఁడు
పోలిక సరిబేసికిఁ బొంచి వున్నారు
మేలిమి శ్రీవేంకటాద్రి మించిరి తానే తానై
ఆలించి నె (యె?)వ్వరి నేమి ననకురే బాలుల

**తొలిపలుకు :**

కవలల జంటలాగ ఆడుకొంటున్న రామకృష్ణులను రేపల్లెలోవారి లీలలను వర్ణిస్తున్నారు అన్నమయ్య. ఎక్కడ చూచినా ఈ ఇద్దరు పిల్లలే కనబడుతున్నారట. ఇద్దరూ అమడల వలె అంటే కవలపిల్లల వలె కనిపిస్తున్నారట. మరి ఇద్దరిలోనూ గల తేడాలను కూడా వివరిస్తున్నారు.

**భావదీపిక :**

ఆ రేపల్లెలో ఇంటింటి ముంగిటా (ప్రతి ఇంటి సావిటిలో) యెక్కడ చూచినా వీరే (ఈ బలరామకృష్ణులే) కనబడుతున్నారు. వీళ్ళు ఎన్లో అల్లరి పనులు చేస్తున్నారు. ఈ బాలురను పిలవండమ్మా!

వీళ్ళలో చిన్నవాడు కృష్ణుడు, పెద్దవాడు రాముడు(బలరాముడు). ముఖకవళికలను చూస్తే ఇద్దరు అమడల (కవలపిల్లల) వలెనున్నారు. వీడు (కృష్ణుడు) వెన్నలు దొంగిలిస్తాడు. వాడుకూడా తక్కువతినలేదు పన్నుగ(ఏదోయెత్తుగడతో) వచ్చినారు. ఈ బాలరను పట్టుకోండే.

వీరిద్దరిలో నల్లగా వున్నవాడు కృష్ణుడు, తెల్లగా వున్నవాడు బలరాముడు. అల్లదిగో చూడండి జోడుకోడెలై (జంటగావున్న దూడల)వలెనున్నారు. ఈ ఇద్దరికీ వేరులేదు (విడిపోవటం అనేది లేదు). అతిశయించి జంటగా తిరుగుతారు. ఈ బాలురను పెల్లుగా (అతిశయముగ) తెచ్చి యశోదముందు నిలబెట్టండమ్మా!

వీరిలో ఒకడు (నల్లనయ్య) రోలజిక్కె (రోటికి కట్టివేబడ్డాడు). ఇంకొకడు రోకలి చేత్తోపట్టుకొని (ఆయుధంలాగా) తిరుగుతాడు. సరిబేసికి (చిన్నపిల్లల ఆటకి) పొంచివున్నారిద్దరూ. ఈ శ్రీవేంకటాద్రి మీద మాత్రం తానేతానై (కృష్ణుడేరాముడై) బంగారంలాగా అతిశయించారు. వాళ్లగోలవినినా ఏమీా అనకండమ్మా!



**సంఖ్య : 404** **సంపుటము : 4** **పుట : 271** **రాగం :గుండక్రియ**

పల్లవి: ఎఱఁగఁడు పరసుఖ మీశ్వర నీమాయ
నెఱివిచారముల నెగడినదాఁక

చ. 1: అతిహేయములో నడరు వరాహము
అతిహేయము సుఖమని తలఁచు
మతి సంసారంబే మరగినయాతుమ
పతిలేని దిదే పరమని తెలియు

చ. 2: పొరి విషయములోనఁ బొడమిన కీటము
అరిది విషమ(ము) తీపని తినును
పరగ యోనిసంభవమగుదేహాతుమ
పెరిగి యందుకే ప్రియపడును

చ. 3: యింతేసి నిన్నియు నెరఁగిన యీయాతుమ
అంతరాత్మ నీవని తలఁచి
యింతట శ్రీవేంకటేశ్వర నిన్నే
రంతుల శరణనె రక్షించవే

**తొలిపలుకు :**

“పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా?” – ఇటువంటి వేమన సూక్తులన్నీ అన్నమయ్య చెప్పిన ఇటువంటి కీర్తనల నుండే జన్మించాయని నా ప్రగాఢ నమ్మకం. ఈశ్వరుని మాయ వలన జీవుడు ఇంద్రియ సుఖాలకోసం వెంపర్లాడతాడేకాని “పర సుఖము” గురించి విచారించడు. శ్రీహరి శరణాగతి పొందేదాకా, విషమునే తీపి అని తింటూనే వుంటాడు.

**భావదీపిక :**

ఈ జీవుడు, ఈశ్వరా! నీమాయ వలన పరసుఖము (మోక్ష సుఖమును) గ్రహించలేడు. నెఱి విచారము (తత్త్వ చింతన) నెగడినదాకా (కలిగేవరకు) వాడు అలాగే బ్రతుకుతుంటాడు.

అతి తుచ్ఛమైన బురదలో జీవించే వరాహము అతి నీచమైన పదార్థమును సుఖమని తలచి తింటుంది. సంసార సుఖంలో మతి పోగొట్టుకొన్న ఆత్మ, సాటిలేని ఈ సంసారసుఖమే ఉత్కృష్టమని భావిస్తుంటుంది.

అతిశయించిన విషయములు (గాలి, నీరు, వెలుగు, మట్టి, ఆకాశములు) మూలంగా పుట్టిన కీటము (కీటకము) విషమునే తీపి అనుకొని తింటుంది. దాంట్లోనే చస్తుంది. యోని సంభవుడైన దేహి పెరిగి పెద్దయ్యాక తన జీవితాంతం దాని కోసమే ప్రియపడును (వ్యామోహపడుతుంటాడు).

ఇంతేసి తెలిసికొనిన మీాదట యీా ఆత్మ తన అంతర్యామి నీవేనని గ్రహిస్తుంది. అంతట వో శ్రీవేంకటేశ్వరా! రంతుల (ఒప్పుగా) నిన్నే శరణన్నది. ఇకనైనా నన్ను రక్షించు తండ్రీ!

**సంఖ్య : 253 సంపుటము : 2 పుట : 169 రాగం : శంకరాభరణం**

పల్లవి: ఏకాత్మవాదులాల యిందు కేది వుత్తరము
మీకు లోకవిరోధ మేమిటఁ బాసీ నయ్యలాల

చ. 1: పాప మొక్కడు సేసితే పాపులే యిందరుఁ గావలదా
యేపున వొకరిపుణ్య మిందరికి రావలదా
కోపించి యొక్కఁ డసురైతే కోరి యిందరుఁ గావలదా
చూప దేవుఁడొక్కఁడైతే సురలిందరుఁ గావలదా

చ. 2: వొకఁ డపవిత్రుఁ డైతే నొగి నిందరుఁ గావలదా
వొకఁడు శుచై వుండితే వోడ కిందరుఁ గావలదా
వొకనిరతిసుఖ మంటి యిందరును వొనరఁ బొందవలదా
వొకనిదుఃఖ మందరు వూరఁ బంచుకోవలదా

చ. 3: ఆకడ నొకఁడు ముక్తుఁడయితే నందరునుఁ గావలదా
దీకొని యొకఁడు బంధుఁ డయితే యిందరుఁ గావలదా
చేకొని శ్రీవేంకటేశుఁ జేరి దాసులయి యుండేటి-
లోకపుమునులనుఁ దెలుసుకోవలదా

**తొలిపలుకు :**

ఏకాత్మవాదులంటే జీవాత్మకు పరమాత్మకు బేధము లేదని వాదించే అద్వైత మతస్తులు అని అర్థం. విశిష్టాద్వైతియైన అన్నమయ్య ఏకాత్మవాదమును ఖండిస్తూ ఈ కీర్తన చెబుతున్నారు. బంధుఁడు అంటే చుట్టంకాదు. సంసారబంధనాలలో బంధించబడినవాడని అర్థం. లోకపుమునులంటే సర్వసంగ పరిత్యాగులని అర్థం.

**భావదీవియ :**

ఓ ఏకత్వవాదులారా! దీనికి మీ వద్దయే సమాధానం వున్నది? మీకు ఈ లోకంతోనే విరోధం. అదెట్లా పోతుందయ్యా? మీరే ఆలోచించండి.

ఎవడో వొకడు పాపం చేస్తే ఆ పాపం అందరికీ చుట్టు కొంటుందా? అట్లాగే వొకడు చేసిన పుణ్యం ఇంకొకడికొస్తుందా? ఒకడు కోపంతో అసురైతే (అసురుడైతే) అందరికీ రాక్షసత్వం రావాలి కదా! సరే! దేవుడొక్కడే అయితే ఈ దేవతలంతా పరబ్రహ్మలైపోవాలి కదా!

పోనీ యెవడోవొకడు అపవిత్రుడైపోతే అందరూ అపవిత్రులై పోతారా? ఒకడు శుచిగా వుంటే అందరూ శుచిగా వుంటారా? ఒకడు నిరతి సుఖము (బ్రహ్మానందం) పొందితే అందరికీ అది దక్కుతుందా? ఒకడు దుఃఖిస్తుంటే సానుభూతిచూపుతారు కాని ఆ దుఃఖం అందరూ అనుభవిస్తారా?

ఎవ్వడో కోటికి వొక్కడు ముక్తుడైతే అందరూ ముక్తులైపోవాలి కదా! అట్లాగే దీకొని (తెగించి) ఒక్కడు సంసారబంధనాలలో చిక్కుకొంటే అందరూ అలాగే అవుతారా? ఒకడు శ్రీవేంకటేశ్వరుని చేకొని శరణాగతుడై దాసుడైతే అందరూ సర్వసంగపరిత్యాగులవుతారా?



**సంఖ్య : 478 సంపుటము : 4 పుట : 322 రాగం : లలిత**

పల్లవి: ఏదైనా సుఖమే యిన్నిటా నీవు గలవు
కాదుగూడదని నిన్నుఁ గక్కసించనేఁటికి

చ. 1: యిహపరములలో నీ వెందు నన్నుఁ బెట్టినాను
నిహితమై రెంటిలోనా నీవు గలవు
వహి కెక్క నేలినవాఁడెక్కడ నుండుమన్నా
తహతహఁ గొలువుకుత్తరువే బంటుకును

చ. 2: పాపపుణ్యములలో నేపని నన్నుఁ జేయించినా
కాపాడి రెండు నీవు కల్పించినవే
యేపున మగఁడైనవాఁ డేమి సేయించినాను
దాపగుఁ బతివ్రతాధర్మమే యాలికిని

చ. 3: కల్లనిజములలో నొక్కటి నన్నునాడించినా
చెల్లించ రెంటికి నీవే శ్రీవేంకటేశా
తల్లిదండ్రులే బాస దగ నాడనేర్పినాను
తెల్లమిగ నాడేది తేకువే బిడ్డనికి

**తొలిపలుకు :**

తాను చెప్పదలచుకొన్నదేదైనా సోదాహరణంగా అద్భుతంగా చెప్పటం అన్నమయ్యకు వెన్నతో పెట్టిన విద్య. అన్నిటిలోను నీవే (శ్రీహరి) వున్నప్పుడు నీవిచ్చే దేదైనా సుఖమే. ఇంతోటి దానికి నిన్ను నిరాకరించడం దేనికి స్వామీ! నీవుకాక నాకెవరున్నారు? నేను నీ బంటును నీవు నా చేత తప్పు ఒప్పుయేదైనా చేయింతువయ్యా! నీ ఇష్టం అంటున్నారు.

**భావదీవియ :**

ప్రభూ! నీవు మాకేది వొసగినా అది సుఖమే. మా చేత అన్నీ చేయించేది నీవే కదా! ఇక నిన్ను కాదుకూడదని కక్కసించనేటికి? (బాధించటందేనికయ్యా?)

ఇహలోకంలోకాని, పరలోకంలోకాని నన్నెక్కడ నీవు పెట్టినా, నిహితమై (నెలకొని) రెంటిలోను నీవే వున్నావు. ధరించిన వాడివై ఆ రెండిటిలోనూ నీవే వున్నావు.నీవు నన్నెక్కడవుండమంటే అక్కడ వుంటాను. బంటుకు యజమాని ఆజ్ఞ పాటించడమేకాని తహతహలాడే హక్కేముంటుంది?

నన్ను నీవేంచేయమంటే అదిచేస్తాను. పాపపుణ్యాలతో నాకు నిమిత్తం లేదు. ఎందుకంటే రెంటినీ కల్పించింది నీవేకదా! మొగుడేమి చెబుతే పెండ్లామదే తాను చేయాలి కదా! అదే పతివ్రతా ధర్మం ఆలికి. నాదేముంది నీవు నాపతివి. నీవు నాచేత యేమిచేయిస్తే నాకేమి?

కల్లలాడినా నిజము నాడినా దాని ఫలితం చెల్లించటం నీ బాధ్యతే కదా! నాదేమున్నది? ఓ శ్రీవేంకటేశ్వరా! తల్లీదండ్రీ యే భాషమాట్లాడితే వాళ్ళ పిల్లలు అదే భాష మాట్లాడతారు కదా! నీవేమి నేర్పితే నేను దాన్నే నేర్చుకొన్నాను. నీ బిడ్డడిని నాదేముంది తండ్రీ!

**సంఖ్య : 452 సంపుటము : 3 పుట : 304 రాగం : గుండక్రియ**

పల్లవి: ఏపాటితనకర్మ మాపాటి కాపాటె
శ్రీపతిదాసుఁ డయితే చిహ్న లిటువలెఁబో

చ. 1: అందరిని నిర్మలులే యని తలఁచిన తన-
నిందలేనిమనసే నిర్మలము
మందలిఁచి లోకులతో మంచిమాఁట లాడితేను
బందెలేని తననోరే భావించ మంచిది

చ. 2: అంతటాను హరి యున్నాఁడని చూచినఁ దన-
యంతరంగమున నుండు నాదేవుఁడే
చింతించి యీజగము చేకొని పావనమంటే
పంతపుతనదేహముఁ బరమపావనమే

చ. 3: పుట్టితేఁ దనపాలికిఁ బుట్టె నీ ప్రపంచము
దట్టమైనపుట్టెల్లఁ దనతోడిదే
యిట్టె శ్రీవేంకటేశుఁ డిచ్చినాఁ డీగుణము
పట్టమై నావద్దనుండు పరమవిజ్ఞానము

**తొలిపలుకు :**

జీవులందరి జీవితము వారి కర్మనుబట్టే వుంటుంది. శ్రీపతిదాసులైన వారికి ఈ చెప్పబోయే విధంగా వుంటుంది అంటున్నారు అన్నమయ్య. ఆ శరణాగతులు మనోవాక్కాయ కర్మలా నిర్మలులవటంచేత అందరికీ ఆ గుణము రాదు. అదీ శ్రీవేంకటేశుడివ్వవలసిందే అంటున్నారు.

**భావదీవియ :**

జీవులారా! తన కర్మము యేపాటిదో (యెటువంటిదో) ఆపాటే ఫలము (ఫలితము కూడా అంతే). అయితే శ్రీపతిదాసులకి మాత్రం గుర్తు లేలా వుంటాయి? వినండి.

వారు పరులందరినీ నిర్మలులుగా తలంతురు. అందుచేత నిష్కళంకమైన వారి మనస్సు నిర్మలంగానే వుంటుంది. తప్పుగా మాట్లాడితే మందలించి బందెలేని (అదుపులేని) మన నోటిని మంచిభావనలు గలదానిగా చేస్తారు.

అంతటా హరివున్నాడని దర్శించగలిగితే అటువంటి వారికి ఆ దేవుడు తమ అంతరాత్మలోనే వుంటాడు. చేకొని (స్వీకరించి) నేను వుండే ఈ జగత్తంతా పావనమే (పవిత్రమైనదే) అని చింతించేవారికి యెదిరించు స్వభావము గల తమ దేహముకూడా పరమ పవిత్రమవుతుంది.

ఈ ప్రపంచము తన పాటికి తను పుట్టి పెరుగుతొంది. కిక్కిరిసిన దానిలోని పుట్టకలు తనతోడిదే (దానిననుసరించే వుంటాయి) ఈ గుణములన్ని ఇచ్చినవాడు శ్రీవేంకటేశ్వరుడే. అందుకే ఈ విజ్ఞానము నావద్ద పట్టమై (బిరుదు వలె) వున్నది.



**సంఖ్య : 6 సంపుటము : 4 పుట : 364 రాగం : ఆహిరి**

పల్లవి: ఏమి దిరిగేమెందైనను ఊరక
కోమితిమి దేహమోహో బదుకు

చ. 1: బ్రహ్మకల్పముదాఁక బ్రదికేమా, కాక
బ్రహ్మానందంబుఁ బడసేమా
బ్రహ్మ మీ దేహలంపట మనుచు పరం
బ్రహ్మంబు వదలితిమి బాపు బ్రదుకు

చ. 2: ఒడిలితో నిట్టనే వుండేమా, కాక
చెడని పుణ్యములెల్లఁ జేసేమా
యెడయకమరపదం బేలేమా, వృథా
చెడిపోయె దినములిస్సీ బదుకా

చ. 3: ఆపదలు లేని సుఖమందేమా, కాక
పాపంబు లేని మతిఁ బరగేమా
ఏపు మీరిన వేంకటేశ్వరునిఁ గొలువ
నోపకిట్టైతిమయ్యో బదుకా

**తొలిపలుకు :**

"ఓముట" అంటే పోషించుట అని అర్థం. అన్నమయ్య ఈ కీర్తనలో నశించిపోయే ఈ పాడు దేహాన్ని పోషించటానికి యెక్కడెక్కడో యేమి తిరుగుతున్నాము!!! ఓహో! యేమి బ్రతుకువే నీవు. ఊరకే నా జీవితమంతా వృథా అయింది కదా! అయ్యయ్యో! శ్రీవేంకటేశుని కొలువక ఇట్లా అయ్యాము కదే! బ్రతుకా అంటున్నారు.

**భావదీవియ :**

ఓహో! యేమి బ్రతుకిది!!! ఈ దేహాన్ని వోమితిమి (పోషిస్తూనే వున్నాము). ఇందుకోసం వూరకనే యెందైననూ యేమి తిరుగుతున్నాము!!!

పోనీ బ్రహ్మకల్పము దాకా బ్రతుకుతామా అంటే కాదు. పోనీ బ్రహ్మానందం పొందగలమా అంటే కాదు. ఈ దేహానికుండే లంపటాలే బ్రహ్మమని మురిసిపోయి పరబ్రహ్మమును మఱచిపోయాము.

అదట్లా వుంచి, ఇట్లాగే ఈ ఒడలితో (దేహంతో) వుంటామా అంటే కుదరదు. పోనీ యెన్నడూ చెడిపోని పుణ్యాలు చేసితిమా అంటే లేదు. వదలకుండా అమరపదము (స్వర్గము) యేలెదెమా అంటే లేదు. వృథాగా రోజులన్నీ చెడిపోయాయి. ఇస్సీ! (అయ్యో!) బ్రతుకా!!!

ఆపదలు లేని సుఖము దొరుకుతుందా అంటే కుదరదు. పోనీ పాపబుద్ధిలేకుండా వుంటామా? అంటే లేదు. పోనీ అతిశయించిన శ్రీవేంకటపతిని కొలిచెదమా అంటే, అట్లా చేయకనే చెడిపోయాము. అయ్యో! బ్రతుకా యేదేగతి?

**సంఖ్య : 455 సంపుటము : 3 పుట : 306 రాగం : దేవగాంధారి**

పల్లవి: ఒక్క మాటు శరణని వుండేనింతేకాక
పెక్కువిధముల నెట్టు పెనఁగేనయ్యా

చ. 1: నాలికె వొక్కటే నీనామము లనంతము
పోలించి నే నిన్నెట్టు పొగడేదయ్యా
వోలి నాకన్నులు రెండే వొగి నీమూర్తులు పెక్కు
సోలి నే ని న్నెటువలెఁ జూచెదనయ్యా

చ. 2: పట్ట నాచేతులు రెండే పదములు నీకుఁ బెక్కు
వొట్టి నిన్నుఁ బూజించ నోపికేదయ్యా
గట్టి నాచెవు లిసుమంత కథలు నీ కవియెన్నో
పట్టవు నేనెట్టు విని భజియించేనయ్యా

చ. 3: యేమిటాఁ జిక్కవు నీవు యింతదేవుఁడవుగాన
కామించి నీడాగు మోచి గతిగనేను
యీ మేర శ్రీవేంకటేశ నీవే ననుఁ గావు
దీమసాన నిఁక వేరే తెరుపు లేదయ్యా

**తొలిపలుకు :**

నానావిధ భక్తులలో దేన్నో వొకదానినెంచి హరికృప పొందవచ్చును. కాని శరణాగతిని మించిన సులభోపాయంలేదు. జ్ఞానేంద్రియాలన్నిటికీ పరిమితివుంది. వాటితో పరిమితిలేని విశ్వరూపుడైన హరినెలా గ్రహించగలము? ఏవిధంగానూ చిక్కని దేవుణ్ణి అన్నమయ్య యెలా దక్కించుకొన్నారు? వినండి.

**భావదీపిక :**

స్వామీ! నేను పెక్కు విధముల నీతో యెట్లు పెగేనయ్యా (పోట్లాడగలను స్వామీ?). ఒక్క మాటు నీవే శరణ నీవే దిక్కు అని వుంటాను. అంతే. నీ నామములనంతములు. నాకున్నదేయో వొక్కటే నాలుక నిన్నెట్లా పొగడగలనయ్యా? నాకు నీవు వొసగిన కళ్ళు రెండే కదా! నీవు విశ్వరూపుడవు. నీ మూర్తినెట్లా చూడగలనయ్యా?

నిన్ను పట్టుకోవాలంటే నాకు వున్న చేతులు రెండే కదా? మరి నీపాదాలు లెక్కలేనన్ని. వాటితో నీ పాదములను పూజించే శక్తి నాకు వుంటుందా? నా చెవులు యెంత చిన్నవో చూశావా? మరి నీ లీలలను వర్ణించే కథలు అసంఖాకములు అన్నీ విని నేను నిన్నెట్లా భజించను?

నీవు యెవ్వరికీ చిక్కని దేవుడవు. నిన్ను ఆశించి, నీ డాగులను (ముద్రలను) ధరించిన శ్రీవైష్ణవుడను నేను. శ్రీవేంకటేశ్వరా! ఈ విధంగా నన్ను నీవు రక్షించగా, ఇక నాకు దీమసాన (ఉపాయంగా) మరొక దారిలేదు తండ్రీ!



**సంఖ్య : 50 సంపుటము : 4 పుట : 394 రాగం : ముఖారి**

పల్లవి: కనుఁగాక పుణ్యాలు కడఁబడెనా
తనువు లేదో చేతనము లేదో

చ. 1: మోసపోతిననేల మురుగ వగవనేల
చేసుఁగాక పుణ్యాలు చీమ దుమ్మెనా
దాసుఁడుగాఁ దా లేఁడొ తలఁప శ్రీహరి లేఁడొ
వీసమంతగాలమైన విధిలేదో

చ. 2: తల్లడించి పడనేల దైవము దూరనేల
చెల్లఁబో నేఁడే పండి పొల్లవోయెనా
ఉల్లములో హరి లేఁడో ఒద్దికతోఁ దా లేఁడో
కొల్లలాడఁ బుణ్యములకోరిక లేదో

చ. 3: చచ్చి చచ్చి పుట్టనేల జముబారిఁ బడనేల
నొచ్చి నొచ్చి మరుచేత నొగులనేల
యిచ్చలేదొ తిరువేంకటేశుఁడొద్దనె లేఁడో
నిచ్చ నిచ్చఁ దనకింత నేరుపు లేదో

**తొలిపలుకు :**

“కడఁబడు” అంటే అంతమైపోవటం. అన్నమయ్య ఈ కీర్తనలో చేయటానికి మీకు పుణ్యాలే కనబడటంలేదా? అంతమై పోయాయా? ఆలోచించండి, ఇంకా శరీరంతోనే వున్నారు కదా! దాంట్లో చైతన్యం లేదో? నింద దేవుడి మీదెందుకు వేస్తావు? ఎన్నిసార్లు చచ్చి పుట్టి చస్తుంటావు? శ్రీహరి లేడో? అంటున్నారు అన్నమయ్య.

**భావదీపిక :**

ఓ మానవులారా! పుణ్యాలు కనుపించుటలేదా? కడఁబడెనా (అంతమై పోయాయా?) దేనికి పుణ్యాలు చేయరు? మీకు తనువు లేదా? దాంట్లో చైతన్యం లేదా?

అంతా అయిపోయాక మోసపోయాననటం దేనికి? మురిగియేడ్వనేల? చీమకాని, మృగాలు కాని వాటికి తగిన పుణ్యం అవి చేస్తాయి. హరిదాసుడు అవటానికి నీ దేహంలో జీవుడు లేడా? ధ్యానించటానికి యెదుట శ్రీహరి లేడా?

తల్లడించి పడనేల (చలించిపోవటందేనికి?) అనవసరంగా దైవాన్ని నిందించటం దేనికి? చెల్లబో (ఏమి వైపరీత్యం!!) ఇవ్వాళే నీ చేను పండి, పొల్లబోయెనా (పంటలో పొల్లగింజలూ వచ్చాయా?) నీ మనస్సులో శ్రీహరిని నిలుపుకోలేవా? ఒద్దికతో (వినయంతో) అది సాధించవచ్చునే? అసలు నీకు పుణ్యం చేయాలనే కోరిక మట్టిగొట్టుకపోయిందా?

ఓరీ! ఎన్ని సార్లు చచ్చి చచ్చి పుట్టి చచ్చి యముడి దగ్గరకెళ్తావు? బ్రతికుండగా యెన్నిసారు మన్మథునితో పీడింపబడతావు? విచారం దేనికి? శ్రీవేంకటేశుడు నీ వద్దలేడా? నిన్ను రక్షించే నేర్పు ఆయనకు లేదా?

**సంఖ్య : 7   సంపుటము : 4   పుట : 364   రాగం : శ్రీరాగం**

పల్లవి: కప్పురమునకుఁ గప్పురమై
చిప్పిలుఁదావి మించె నితఁడు

చ. 1: బంగారమునకు బంగారమై
శృంగారమమరె శ్రీహరికి
అంగమయిన మొల పీతాంబరంబున
కొంగుబంగారై కూడె నితఁడు

చ. 2: తట్టు పుణుఁగునకుఁ దట్టు పుణుఁగయి
ఘట్టిమేన మించెఁగా యితఁడు
నెట్టన నొసల నిండిన కస్తురి
బొట్టు చెమటతోఁ బొలెనిక (బొలెచెని?) తఁడు

చ. 3: పన్నీట పాదాన పన్నీరే తానయి
యిన్నిట శ్రీవేంకటేశుఁడిదే
ఉన్నతి జలధి నుదయమున (నందిన?)
కన్నియకౌఁగిట ఘనుఁడితఁడు

**తొలిపలుకు :**

అన్నమయ్య చేసే విశిష్టపద ప్రయోగాలకు ఇదమిత్థంగా అర్థం వివరించటం తేలిక వ్యవహారం కాదు. తిరుమలేశుని మజ్జనానంతర వైభవాన్ని వివరిస్తున్నారు ఆయన. స్వామి యొక్క శరీరపు కర్పూర పరిమళం కర్పూరాన్నే మరపింజేస్తోందట. జలధిని పుట్టిన కన్నియ కౌగిట కరిగే ఘనుడట ఈ హరి.

**భావదీపియ :**

ఇతడు (శ్రీవేంకటేశుడు) కప్పురమునకు గప్పురమై (కర్పూరమునకే కర్పూర పరిమళమై) చిప్పిలుతావి (విస్తరించు పరిమళము) మించిన దాని వలెనున్నాడు.

శ్రీపతికి శృంగారము బంగారమునకే బంగారు వన్నె తెచ్చేదిలా వున్నది. శరీరములోని మొలభాగమున పీతాంబరము ఇతడు కొంగున బంగారము బిగించినట్లున్నది.

ఘటిమేన (బిగువైన శరీరముపై) తట్టుపుణుగు (పుణుగుపిల్లి శరీరజనిత) పరిమళమునకే తట్టు పుణుగువలె అతిశయించినది. ఎదురుగా ఈయన నొసట దిద్దిన కస్తూరీ తిలకపు బొట్టు నల్లని స్వామి శరీరంనుండి కారిన చెమట కాదు గదా! అన్నట్లున్నది.

పన్నీటితో కడిగిన పాదాన నున్న ఆకాశగంగ తాను కూడా పన్నీరై జాలువారిందా అన్నట్లుంది. అన్ని విధాలా ఈ శ్రీవేంకటేశ్వరుడే జలధికన్నియ (లక్ష్మీదేవి) కౌగిట నిలిచిన ఘనుడు.



**సంఖ్య : 433   సంపుటము : 4   పుట : 291   రాగం : గుజ్జరి**

పల్లవి: కూడుదు రూరకె వొకచో గుమి విత్తురువేరొకచో
యేడకో తెరువులు నడతురు యేఁటిదో హరిమాయ

చ. 1: కొందరు జీవులు పురుషులు కొందరు (జీవులు) కాంతలు
కొందరు గొందరు నానాకువలయజంతువులు
యిందరుఁగూడుక భువిలో నేమోయేమో చేసెద-
రెందును నేమియుఁ గానరు యిట్టిది హరిమాయ

చ. 2: జననంబులు మరణంబులు జమునుదయాస్తమయంబులు (?)
జనులివిగనుచునె కనకము సరినార్జింపుదురు
పొనుగుచు నిలిచినదేదో పోయినదేదో కానము
యెనగొని వెరగయ్యానిదె యిట్టిది హరిమాయ

చ. 3: జీవులకీ బ్రహ్మాండము చీమలపుట్ట విధంబున
కావరమిటు గప్పున్నది కాలత్రయములను
తావుల శ్రీవేంకటపతి దాసులు చొరకిటు నవ్వఁగ
యీవల నాలఁ బొదిగీ నిట్టిది హరిమాయ

**తొలిపలుకు :**

హరిమాయను వర్ణిస్తున్నారు అన్నమయ్య. ఈ జీవులు ఎక్కడో పుడుతారు, ఎక్కడో జీవిస్తారు, ఎక్కడో మరణిస్తారు. ఈ జీవులు కొందరు ఆడ కొందరు మగ. ఎవరెంత కాలం బ్రతుకుతారో తెలియదు కాని, వున్ననాళ్ళూ బంగారమంటే వ్యామోహం. పోనీ సంపాదించింది యెంతవుంటుందో యెంత పోతుందో తెలియదు. ఈ చీమల పుట్టలో హరిదాసులు మాత్రం ఈ చీమల ఆరాటం చూచి నవ్వుకుంటుంటారు.

**భావదీపియ :**

ఈ జీవులంతా వూరకనే వొకచోట గుమికూడుదురు. వేరొకచోట జీవనోపాధి పొందుతారు. ఎక్కడికో నడచిపోతుంటారు. ఇదేమి హరిమాయయో తెలియదు.

ఈ జీవులలో కొందరు పురుషులు, మరి కొందరు స్త్రీలు. ఇక మరి కొందరు కువలయజంతువులు (అశ్వజాతికి చెంది నాలుగు కాళ్ళ జంతువులు). వీళ్ళంతా భూమి మీద కూడియేమేమో చేస్తుంటారు. ఎక్కడా యేమి చూడరు. ఇష్టం వచ్చింది చేస్తుంటారు. ఆహా! అంతా హరిమాయ.

ఈ జీవులకు జననములు, యముడు వుదయించి అస్తమించే వేళకు ఇచ్చే మరణములు తప్పింపరానివి. జనులంతా ఇవి చూచి కూడా బంగారంపై వ్యామోహం వదులుకోలేరు. ఈ ఆర్జించిన దాంట్లో యెంతవుంటుందో యెంత పోతుందో తెలియదు. ఇదంతా చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఏమిటీ హరిమాయ.

ఈ జీవులందరికీ బ్రహ్మాండమంతా ఒక చీమలపుట్టవంటిది. భూత-వర్తమాన-భవిష్యత్కాలము లన్నింటిలోను కావరము కప్పివుంటుంది. కాని హరిశరణాగతి పొందిన దాసులు మాత్రం ఈ జీవుల ఆరాటం చూచి నవ్వుకొని ఇహపరములలో ముక్తులుగానే వుంటారు.

**సంఖ్య : 456** **సంపుటము : 3** **పుట : 307** **రాగం : సామంతం**

పల్లవి: గరిమల నెరఁగరుగాక మానవులు
సిరులఁ దియ్యనినోరఁ జేఁదుమేసేదా
చ. 1: హరినారాయణ యని యెడినోరను
ధర నితరుల పేళ్లు దడవుటెట్టు
సరవితో వేదములు చదివేటినోరను
పరులమీఁదిపదాలు పాడేదా
చ. 2: మునుప శ్రీపతికి మ్రొక్కిన చేతుల
అనరుహులకు దండమనుట యెట్టు
మునుకొని పూవులు ముడిచినసిరసున
కనలి కట్టెలు మోచి కాకయ్యేదా
చ. 3: బలిమి శ్రీవేంకటపతిఁ గొలిచినవారు
తెలియ కల్పులఁ గొల్చి తిరుగుటెట్లు
జలధి దాఁటేవాఁడు సరి నోడ వుండఁగ
వలవనిజోలితో వదరువట్టేదా

**తొలిపలుకు :**

చాలమంది మానవులకు భగవంతుడు తమకి మంచి "నోరు" యెందుకిచ్చాడో, తెలియక తియ్యటి నోరును చేదుచేసి కొంటున్నారు. పువ్వులను ముడువవలసిన తలపై కట్టెలు మోసినట్టు అనర్హులకు మొక్కుతున్నాము. ఎంత చక్కటి ఉపమానాలతో తన సద్బోధ వివరిస్తున్నారో చూడండి అన్నమయ్య.

**భావదీపిక :**

మానవులు తమ నోటి గరిమలను (వైశిష్ట్యమును) యెఱుగరు కదా! భగవంతుడిచ్చిన వైభవోపేతమైన తియ్యటి నోటితో చేదును మేయతగునా?

హరినారాయణ అని పలుకవలసిన నోటితో లోకంలోని "శ్రీమంతుల" పేళ్ళను (పేరులను) తడవనా (విచారించనా?) సరవితో (క్రమబద్ధంగా) వేదములు చదువవలసిన నోటిని పరుల మీద పాటలు పాడుటకు వినియోగించేదా?

మునుప (ముందుగా) శ్రీపతికి మ్రొక్కవలసిన చేతులతో నేను అనర్హులకు యెట్లా నమస్కరించను? ఎవ్వరైనా మునుకొని (పూని) పూవులను ముడిచిన సిగలో కాలిపోయిన కట్టెలను ధరిస్తారా? ఎంతటి హాస్యాస్పదమైన విషయం అది!!!

బలవంతుడైన శ్రీవేంకటపతిని కొలిచినవారు అజ్ఞానంతో అల్పులను గొలిచి తిరుగుట సమంజసమేనా? సముద్రమును దాటే వాడు చక్కని "ఓడ" వుండగా, వలవని జోలితో (పనికిమాలిన వారితో) వదరువట్టేదా? (సొరకాయ బుర్ర మీద ప్రయాణం చేసేదా?)



**సంఖ్య : 542** **సంపుటము : 3** **పుట : 364** **రాగం : శంకరాభరణం**

పల్లవి: చవిచేసుక యిటు జరగెదము
జవదాఁటకురో సంసారులార
చ. 1: యేదిచూచినా నెరవెరవే
పోదిఁ గూడఁగా పొదపింతే
ఆదికినాది హరి యొకఁడే
పాదుగఁ బుట్టెడిభవములె వేరు
చ. 2: కలుములు లేములు కతలింతే
నిలుకడగలచో నిజమౌను
యిలయును జగమును యిదే యిదే
తెలిసి చూడఁగా దినములే ఘనము
చ. 3: చెంతల నిందరు జీవులే
బంతులఁ బుణ్యముఁ బాపమునే
యింతట శ్రీవేంకటేశ్వరుఁడే
కాంతలుఁ బురుషులగతులై నిలిచె

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో నాబోటి సామాన్యునికి తలాతోకా తెలియని పరిస్థితి యేర్పడింది. ఇదమిద్ధంగా వివరించటం అంత తేలిక వ్యవహారం కాదు. "నెరవెరవు" అంటే యేమిటి? అది ఒక పదంగా యెక్కడా లేదు "అధికమైన జీవనోపాయము" అని దాని అర్థం. కాని అన్వయం మరొక విధము. నా ప్రయత్నం నేనూ చేస్తాను.

**భావదీపిక :**

ఓ సంసారులారా! నా మాటలు జవదాటకండి. మీకు రుచించేట్లు చెప్పటానికి నేను ప్రయత్నిస్తాను.

ఈ ప్రపంచంలో యేది చూచినా నెరవెరవే (జీవనోపాధి కోసమే). పోది (పోషణ) కూడగా పడే పాట్లే. ఆదికిననాదియైన వాడు శ్రీహరి ఒక్కడే. ఆయన మూలంగా పుట్టే పుట్టుకలు వేర్వేరు. అన్నిటికీ ఉదర పోషణే ఆవశ్యకం.

సంపదలు దారిద్ర్యము కథలవంటివి. ఒకసారి మొదలయ్యాక ముగియక తప్పదు. నిలకడ వున్న చోట సంపదలు నిజమౌతాయి. ఈ జగతిలోనే భూమికూడా వున్నది ఇదంతా తెలిసికొని చూస్తే దినములన్నీ గొప్పగా గడుస్తాయి.

మన చుట్టూ వుండే అందరూ జీవులే. వారు అనుభవిస్తున్నది వారు చేసుకొనిన పాప పుణ్యాలనే. అంతటా శ్రీవేంకటేశ్వరుడే కాంతలుగానూ పురుషులగాను రూపొంది నిలిచి గొప్ప ఆట ఆడుకొంటాడు.

**సంఖ్య : 27 సంపుటము : 4 పుట : 379 రాగం : ఆహిరి**

పల్లవి: చాలదా నా సంసారము
గాలియుయ్యేలలఁ దొలఁగక యూఁగవలసె

చ. 1: పాపపుణ్యములనెడి బల్లిదుల వెంటనే
దీపించు బంటనై తిరిగి తిరిగి
పైపైనె దేహంపుఁ బల్లెలొసఁగిన నరక
కూపముల మడి దున్నుకొని బ్రదుకవలసె

చ. 2: చిత్తమను విభుఁజేరి చెలఁగి విషయంబులకు
కొత్తగమికాఁడనై కొలిచి కొలిచి
హత్తుకొని మోహంబులను ప్రధానుల యెదుట
గత్తంపు మొగసాలఁ గలదించవలసె (?)

చ. 3: గాటంపు దురితములకై జీతగాఁడనై
చేటైన కోరికలఁ జేరిచేరి
ఈటాడఁ దిరువేంకటేశుఁ గనకిన్నాళ్ళు
కోటకొమ్మలకెగసి గుంపించవలసె

**తొలిపలుకు :**

అన్నమయ్య తత్త్వశోధకులై చెబుతున్న చక్కని కీర్తన ఇది. ఇంకా చాలలేదా? వదలకుండా ఇన్నాళ్లు యీ సంసారంలో లేనివి వున్నట్లు వూహించుకొని జీవించవలసి వచ్చింది. శ్రీవేంకటేశుని శరణనక, నేను ఇన్నాళ్లు చిటారుకొమ్మ లందుకోవటానికి కుప్పించి యెగరవలసి వచ్చిందంటున్నారు.

**భావదీపిక :**

అయ్యలారా! నా సంసారములో ఇన్నాళ్ళూ తొలగక (వదలక) గాలియుయ్యేలలు (లేనివూయలలో కూర్చుని) వూగవలసివచ్చింది. అయ్యో! ఇది చాలదా?

నేనిన్నాళ్ళూ పాపపుణ్యాలనే బలమైన వస్తాదుల వెంట తిరిగి తిరిగి వారి బంటునై వెలిగిపోయాను. నా దేహమనే పల్లెలో నాకీయబడిన నరకకూపమున మడిదున్నుక (వ్యవసాయం చేసి) బ్రదుకవలసివచ్చింది. ఏమి దౌర్భాగ్యం!!!

నా "మనస్సు" అనే దొరగారిని చేరి, అతిశయించిన విషయసుఖాల కోసం కొత్తగమికాడనై (కొత్త సేనాధిపతినై) కొలిచి కొలిచి యేమి సాధించాను? హత్తుకుపోయిన "మోహము" అనే ప్రధానమంత్రి యెదుట నిలబడి గత్తంపు మొగసాలలో (గొర్రెల పెంట వున్న రచ్చబండ దగ్గర) అవమానం పొందవలసి వచ్చింది.

గాటంపుదురితాలకు (అధికమైన పాపాలకు) జీతగాడినై, చేటుదెచ్చే కోరికలను చేరి చేరి ఈటాడాను (హద్దులు దాటాను). ఇన్నాళ్ళు ఇట్లా శ్రీవేంకటేశుని సేవించక, కోటకొమ్మల కెగసి (చిటారు కొమ్మలందుకావాలని) గుంపించవలసె (కుప్పించి యెగరవలసి వచ్చింది).



**సంఖ్య : 161 సంపుటము : 4 పుట : 108 రాగం : లలిత**

పల్లవి: చూడవమ్మ కృష్ణుఁడు నీసుతుఁ డోయమ్మ
ఆడీ వీధులవెంట యశోదమ్మా

చ. 1: కోలలు చాఁచి వుట్లు గొట్టఁగా బాలుఁబెరుగు
కాలువలు గట్టి పారెఁగదవమ్మా
మేలములాడీ వద్దంటే మిక్కిలి గొల్లెతలతో
ఆలకించి వినవమ్మ యశోదమ్మా

చ. 2: చక్కిలాలాకుండలెల్లా చలాన దొండ్లు వొడిచి
దిక్కన దోఁటికోలలఁ దీసీనమ్మా
చిక్కని తేనె చాడె చివ్వన రాతవేసితే
అక్కడ జోరునఁ గారె యశోదమ్మా

చ. 3: అల్లంతనుండి తనకందరానితెంకాయలు
వల్లెతాళ్లు వేసి వంచీనమ్మా
బల్లిదుఁడలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
అల్లిబిల్లై యున్నాఁడమ్మ యశోదమ్మా

**తొలిపలుకు :**

గోపిలలు యశోదమ్మకు చిన్నారి కృష్ణయ్యపై పితూరీ చేస్తున్నారు. చూడవమ్మా! మీ వాడు వీధులలో యెలా ఆడుతున్నాడో. మీ వాడు తనకోలలతో కొట్టి మేము కుండలలో దాచిన పాలు, చక్కిలాలు, తేనే దక్కనీయడు. అందిన గొల్లెతలనూ వదలడు అందని టెంకాయలనూ వదలడు. ఏమి చేస్తాడో అన్నమయ్య పాటలోనే వినండి.

**భావదీపిక :**

ఓ యశోదమ్మా! నీ సుతుడు కృష్ణుడు యేమి చేస్తున్నాడో చూడవమ్మా! వీధుల వెంట తిరిగి యెప్పుడూ ఆడుతుంటాడోయమ్మా!

తన కోలలు (చిన్నకట్టలు) చాచి వుట్లను కొట్టి పాలు, పెరుగులు కాలువలై పారేటట్లు చేస్తాడు. మా గొల్ల పడుచులతో మేలము (సరసాలు) ఆడుతాడు. వద్దంటే వినడు. మేము చెప్పేది ఆలకించవమ్మా యశోదమ్మా!

చలాన (మొండితనంతో) మేము కుండల్లో దాచుకొనిన చక్కిలాల దొంతులను పొడిచి చూర (ముక్కలు ముక్కలు) చేస్తాడు. పొడికాని వాటిని కోలలలో వొడుపుగా తీసేస్తాడు. చిక్కని తేనెను మేము చాడె (ఒకరకమైన కుండ)లో దాచికొంటే రాతితో పగలగొట్టి తేనె అంతా తాగేస్తాడమ్మా యశోదమ్మా!

అల్లంత యెత్తున తనకు అందని టెంకాయలను కూడా వల్లె తాళ్ళువేసి వంచి అందుకొంటాడు. అలమేల్మంగపతీ, బలవంతుడూ అయిన శ్రీవేంకటేశ్వరుడు అల్లిబిల్లియైవున్నాడు (స్నేహపాత్రుడుగా వున్నాడు). అవునమ్మా! యశోదమ్మా!

**సంఖ్య : 477 సంపుటము : 4 పుట : 321 రాగం : మాళవి**

పల్లవి: చెప్పితే నాశ్చర్యము సేసినచేంత లితఁడు
ముప్పిరి మనుజవేషమునఁ బుట్టె నీతఁడు

చ. 1: రాముఁ డుదయించె దశరథునికిఁ దమ్ములతో
గామిడైనతాటకిని ఖండించెను
ఆముక యజ్ఞముగాచె హరునివిల్లు విరిచె
ప్రేమమున సీతాదేవిఁ బెండ్లియాడెను

చ. 2: మడియించె ఖరునిని మారీచుని వధియించె
కెడపె వాలిని యా సుగ్రీవునిఁ బెంచె
జడధి బంధించెను సరుగ రావణుఁగొట్టె
బడినే విభీషణునిఁ బట్టముగట్టెను

చ. 3: సీతాదేవితో నయోధ్యసింహాసనంబెక్కె
పోతరించి కుశలవపుత్రులఁ గాంచె
శ్రీ తరుణితోఁగూడ శ్రీవేంకటేశుఁడై నిల్చె
కౌతుకమున జగము కరుణఁగాఁచెను

**తొలిపలుకు :**

మరియొకసారి మధురమైన రామకథను వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆయన ఈ కీర్తన యెక్కడ వెలసిన రామయ్యపై చెప్పారో తెలియదు కానీ ఆ స్థలంలో పట్టాభిషిక్తుడైన రామచంద్రునితో ఆయన పుత్రులు కుశలవులు కూడా వున్నట్లు నా ఊహకు తడుతుంది. కౌతుకమున జగములను కాచే మన శ్రీతరుణీయుత శ్రీవేంకటేశ్వరుడే ఆ అయోధ్య సీతాపతి అంటున్నారు.

**భావదీపియ :**

అయ్యలారా! ఇతని (ఈ శ్రీరామచంద్రుని) సేసిన చేతలు చెప్పితే ఆశ్చర్యంగా వుంటుంది. శ్రీహరియే అతిశయించిన మనుష్యవేషమున పుట్టి దనుజ సంహారానికి నడుము కట్టాడు.

ఇతడు రాముడై దశరథుని కుదయించినాడు. ఇతనికి ముప్వురు తమ్ములు. గామిడైన (దుష్టురాలైన) తాటకిని ఖండించి విశ్వామిత్రుని యజ్ఞము కాచినాడు. హరుని విల్లు విరిచి ప్రేమపూర్వకముగా సీతాదేవిని పెండ్లియాడినాడు.

ఖరుని ఈతడే అసహాయశురుడై మట్టుబెట్టాడు. మారీచుని వధించాడు. వాలిని, కెడపినాడు (చంపివేశాడు). ఆ సుగ్రీవుని వృద్ధికి తెచ్చాడు. సాగరమును బంధించి వారధిని కట్టినాడు. సరుగ (చెలరేగిన) రావణుని వధించాడు. వెంటనే అతని తమ్ముడు విభీషణునికి పట్టముకట్టాడు.

తన భార్య సీతాదేవితో అయోధ్య సింహాసనాన్ని యెక్కాడు. పోతరించి (గర్వపడదగిన) కుశలవులనే పుత్రులను గాంచినాడు. ఇది త్రేతాయుగపు రాముని చరిత, నేడు ఆ సీతారాములే తిరుమలలో శ్రీసతి శ్రీవేంకటేశ్వరులై నిలిచి, కుతూహలంతో జగములను కరుణతో పాలించుచున్నారు.



**సంఖ్య : 174 సంపుటము : 4 పుట : 117 రాగం : కురంజి**

పల్లవి: చేపట్టుఁగుంచము శ్రీవిభుఁడు
వై పెరిఁగి పొగడవలెఁ గాక

చ. 1: మనసులోనిహరి మరవక తలఁచిన
యెనయ నిహపరము లేమరుదు
పెనగొన నాతనిపేరు నుడిగినను
తనకు మహానందము లేమరుదు

చ. 2: పుట్టించినాతని పొసఁగఁగ గొలిచిన
యిట్టె వివేకం బేమరుదు
చుట్టి యతనిదాసులకు మొక్కినను
పుట్టుగు గెలుచుట భువి నేమరుదు

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁ జేరి భజించిన
యేవేళ సాత్విక మేమరుదు
భావించి యాతనిపై భక్తి నిలిపినను
కైవశముగఁ దనుఁ గను టేమరుదు

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన పల్లవి అంత సులభగ్రాహ్యం కాదు. నేనిలా భావిస్తున్నాను. శ్రీపతి ఒక కుంచము (కొలిచే పాత్ర) తీసికొని మన పాపపుణ్యాలను కొలుస్తుంటాడు. కాబట్టి ఉపాయంగా ఆయనను కీర్తించాలి. భక్తివున్న వారికి ఆయనను కైవశం చేసికోవటం యేమి అరుదు? అందుకే శ్రీవేంకటేశుని చేరి భజించండి.

**భావదీపియ :**

శ్రీవిభుడు (శ్రీపతి) ఒక కుంచము చేపట్టి మన పాపపుణ్యాలను కొలుస్తూనే వుంటాడు. కాబట్టి పైపెరిగి (ఉపాయం తెలిసి) హరిని కీర్తించాలి.

మనస్సులోనున్న శ్రీహరిని మఱువక ధ్యానించినచో తనకు అతిశయించునట్లు ఇహపరములను సాధించుట యేమి అరుదు? (యేమీదుస్సాధ్యము కాదు).

సంపూర్ణ విశ్వాసముతో ఆతిని నామోచ్ఛరణ జేయుచు జీవించినచో తనకు బ్రహ్మానందము కలుగుట యేమి అరుదు?

జీవులందరిని పుట్టించిన ఆతనిని పూనికతో కొలిచిన వివేకము ఇట్టే (సులభంగా) రావటం యేమి అరుదు? చేరువయై అతని దాసులకు మ్రొక్కితే, పుట్టుగలు గెలుచుట (జన్మరాహిత్యం పొందుట) యేమి అరుదు?

శ్రీవేంకటేశ్వరుని చేరి భజించిన యెప్పుడూ సాత్వికంగా వుండటం యేమి అరుదు? అతని రూపాన్ని భావించి భక్తి నతనిపై నిలిపిన తనను కైవశం చేసి కోవటం యేమి అరుదు?

**సంఖ్య : 541 సంపుటము : 3 పుట : 363 రాగం : సామవరాళి**

పల్లవి: తనుఁ దా నేమఱక దైవము మఱవకుంటే
మనసులోనే కలుగు మహామహిమ

చ. 1: కనురెప్ప మూసితేనే కడ దాఁగె జగమెల్ల
కనుదెరచినంతనే కలిగెఁ దాను
ననిచివుండుట లేదు నమ్మకపోవుట లేదు
తనతోడిదే యిన్నిఁ దాఁ గలితేఁ గలవు

చ. 2: కడుపు నిండినంతనే కైపాయ రుచులెల్లా
బెడిదపుటాఁకలైతేఁ బ్రియమాయను
యెడనెడఁ జేఁదుగాదు యింతలోనే తీపు గాదు
వొడలితోడివే యివి వుండునట్టే వుండును

చ. 3: అద్దములోఁ దననీడ అంతటా మెరసినట్లు
పొద్దు వొద్దు తనతోనే భోగాలెల్లా
అద్దిన శ్రీవేంకటేశుఁ డంతరాత్మయైనవాఁడు
కొద్ది లేదాతనిమాయ కొనసాగుచుండును

**తొలిపలుకు :**

అన్నమయ్య ఈ కీర్తనలో మహామహిమలను చేసేది మనిషి మనస్సేనని చెబుతున్నారు. వేంకటేశుని మాయ వలన మనిషి తనని తానే మఱచి దైవాన్నీ మఱచిపోతున్నాడు. అన్నీ తనతోనే కలుగుతున్నాయి. రెప్పలు తెరిస్తే వుండే జగత్తు, రెప్పలు మూస్తే లేదు. శరీరం లేకపోతే అనుభవమూలేదు, అంటున్నారు.

**భావదీవియ :**

జీవుడు తనను తాను యేమఱక (భ్రమపడక) దైవాన్ని మఱవక (మఱచిపోకుంటే) మహామహిమలన్నీ వాడి మనస్సులోనే కలుగుతాయి.

ఈ సమస్త విశ్వమూ మనిషి కనురెప్పలలోనే దాగి వున్నది. కళ్ళు తెరిస్తే ఆ దాగినది "కలుగుతున్నది". పోనీ రెప్పల్లో వుంటోందా అంటే లేదు. నమ్మకమూ అది వుందని పోవటం లేదు. ఇవన్నీ తనతోడివే కదా! తాను కలితే (వుంటే) అవీ వుంటాయి.

కడుపు నిండకపోతే రుచుల ఆలోచనేరాదు. నిండిన వానికే రుచులు గుర్తువస్తాయి. ఏది చేదు కాదు, యేదీ తీపి కాదు. బెడిదంపుటాకలి (అధికమైన ఆకలి) వుంటే అన్నీ ప్రియముగానే వుంటాయి. ఒడలితోనే (శరీరం వుంటేనే) ఈ రుచులూ వుంటాయి.

అద్దంలో చూచికొంటే మన నీడ మెఱసిపోతుంటుంది. ఏ వేళనైనా తనతోనే తన భోగము. మనం లేకపోతే నీడె యోట్లా వుండదో, తానే లేకపోతే తన భోగమూలేదు. మన అంతరాత్మయైన శ్రీవేంకటేశ్వరుడు అద్దినట్లు మనలోనే వుంటాడు. ఆతని మాయ కొద్దిపాటిది కాదు. అది కొనసాగుతూనే వుంటుంది.



**సంఖ్య : 480 సంపుటము : 3 పుట : 328 రాగం : శంకరాభరణం**

పల్లవి: తెలిసినవారికి దేవుఁ డితఁడే
వలవనిదుష్టులవాదములేలా

చ. 1: పురుషులలోపలఁ బురుషోత్తముఁడు
నరులలోన నరనారాయణుఁడు
పరదైవములకుఁ బరమేశ్వరుఁడు
వరుస మూఢులకెవ్వరో యితఁడు

చ. 2: పలుబ్రహ్మలకును పరబ్రహ్మము
మలయునీశులకు మహేశుఁ డితఁడు
ఇల నాత్మలలో నిటు పరమాత్ముఁడు
ఖలుల కెట్లుండునో కానము యితఁడు

చ. 3: వేదంబులలో వేదాంతవేద్యుఁడు
సోదించ కరిఁ గాచుచో నాదిమూలము
యీదెస శ్రీవేంకటేశుఁ డిందరికి
గాదిలిమతులనుఁ గైకొనఁ డితఁడు

**తొలిపలుకు :**

పరమాత్ముని ఉనికి అందరికీ అవగతం కాదు. దుష్టులు ఆయనను అంగీకరించక వితండ వాదాలు చేస్తుంటారు. అన్నీ తెలిసిన జ్ఞానుల కితడే దేవుడు, ఆ నోటితోనే అన్నమయ్య ఈ వేంకటేశ్వరుడు గాదిలిమతులను చేకొనడు అంటున్నారు అంటే?

**భావదీవియ :**

జ్ఞానులందరికీ ఇతడే దేవుడు (పరమాత్మ). వలవని (అంగీకరించని) దుష్టులతో వ్యర్థమైన వాదము లెందుకు చెప్పండి?

ఈతడు శ్రేష్ఠమైన పురుషులలో పురుషోత్తముడు. నరులలో నరనారాయణుడు. పరదైవముగా పూజించబడే వారందరికీ పరమేశ్వరుడు. అయితే పరమ మూఢులకు ఇతడెవ్వరో నేను చెప్పలేను.

ఈతడు పలుబ్రహ్మలకు (తొమ్మిదిమంది బ్రహ్మలకు) పరబ్రహ్మము. ఉద్యమించు ఈశ్వరులకు ఈతడే మహేశ్వరుడు. ఆత్మరూపులైన వారందరికి ఈతడే పరమాత్మ. ఖలులకు (దురాత్ములకు) ఇతడెవరో చెప్పమంటే నేను చెప్పలేను.

వేదంబులలోను వేదాంతములలోను తెలుసుకొదగిన వేద్యుడు ఇతడే. వెదకి, కానలలో గజేంద్రుని రక్షించిన ఆదిమాలము ఇతగాడే. ఇక్కడ అందరికీ శ్రీవేంకటేశుడై వున్నాడు. గాదిలిమతులకు (వ్యామోహపూరితులను) ఇతడు స్వీకరించడు.

(గమనిక: గాదిలిమతులు అంటే ప్రేమకలవారు అని అర్థం చేసికొనరాదు)

**సంఖ్య : 123   సంపుటము : 4   పుట : 83   రాగం : దేవగాంధారి**

పల్లవి: తెలిసినవారెల్లా దేవునిఁ జేరి బదికి-
రిల నిదెరఁగనిది యేఁటిదోకాక

చ. 1: కరుణానిలయుఁడట కరుణకు వెలితా
వెరువుతో నేఁ గొల్వనివెలితిగాక
నరహరి ఇతఁడట నరులఁ గాచుటరుదా
శరణననివెలితి జనములదిగాక

చ. 2: వెస లక్ష్మీపతియట వితరణములేదా
పసఁదన్నేకోరనిమాపాపముగాక
యెసఁగు భక్తవత్సలుఁడింట వెంట నుండఁడా
ససువై మొక్కనివెల్తి జగములదిగాక

చ. 3: శ్రీవేంకటేశుఁ డట చిత్తములో లేఁడా
భావించి నమ్మినది మాభాగ్యముగాక
వావాత నింతటివాఁడు వరములీలేఁడా
వోవలఁగొలగొనేదేవోటి(పి)కింతేకాక (?)

**తొలిపలుకు :**

దేవుని తెలియకపోవటం జీవుని దౌర్భాగ్యం. అంతేకాని ఆయన వెలితియేమున్నది? అంటున్నారు అన్నమయ్య. మనం ఆయనకు శరణనకపోతే తప్పు ఆయనదా? మనము మొక్కకపోతే ఆ భక్తవత్సలుడిదా నేరం? ఆయన లక్ష్మీపతి. వరాలు కోరుకోక పోతే నీ పాపము. ఆ స్వామి నీ చిత్తములోనే వున్నాడు. భావించలేని మనదే నేరము.

**భావదీపిక :**

దేవుని గురించి తెలిసిన వారెల్లా ఆదేవుని జేరి బ్రతికినారయ్యా! ఇదెరగని తెలివి యెట్టిదోగాని, మీరు నామాట వినండి.

శ్రీహరి కరుణా నిలయుడట. ఆయన కరుణకు వెలితివుంటుందా? అనవసరమైన భయాలతో కొలవని నావెలితేగాని హరి లోపమేమిటి? ఇతడే నృసింహుడట. నరులను గాచుట ఇతనికే చెల్లింది. నరహరీ! శరణు అని వేడుకోని జనులదే వెలితిగాని హరి వెలితికాదు.

వేగముగా సిరులిచ్చే లక్ష్మీపతి మరి ఈయన వితరణము (దానమునకు) కొదవేమిటి? ప్రీతితో ఆయనను కోరని మాదే పాపము. కాని ఆయన లోపమేమిటి? ఆయన భక్తవత్సలుడు. ఇంటిలో మనవెంట వుండగా వెలితి వుంటుందా? ససువై (సాధువై) మొక్కని జగముల వెలితి కాని ఆయన లోపమేమీలేదు.

శ్రీవేంకటేశుడు మా చిత్తములో లేడా? ఆయనను నమ్మితే మా భాగ్యము. అంతటివాడు నోరారా వేడితే వరాలివ్వడా? స్వామిని బలవంతం చేసి ఒప్పించనిది మన లోపమే సుమా!



**సంఖ్య : 558   సంపుటము : 3   పుట : 358   రాగం : మాళవి**

పల్లవి: తెలుపఁగ రాదిది దేవునిమాయలు
ఫల మెఱఁగరు యీ పట్టినవెట్టి

చ. 1: పుట్టిరి దివిజులు పురషోత్తమునం-
దట్టే యణఁగిరి యతనందు
యిట్టె యీతని యిందరితో సరి-
వెట్టి కొలుచుటే పెనువెట్టి

చ. 2: హరివరమననే యందరు బదికిరి
పరులవరము గని బడలిరి యసురలు
యిరవెఱిఁ గీతని నిందరిలోపల
సరిగా మొక్కుట సహజపు వెట్టి

చ. 3: జీవాంతరాత్ముఁడు శ్రీవేంకటేశుఁడు
యేవల శ్రీలక్ష్మి యీతనిదేవులు
వేవేలు సిరులు వీరె యొసఁగిరని
భావించువారికిఁ బట్టదు వెట్టి

**తొలిపలుకు :**

అన్నమయ్య ఈ కీర్తనలో దేవుని మాయలు ఇట్టివని వివరించటం అసాధ్యం, అంతేకాదు ఆ మాయ ఫలితము కూడా యెఱగరు. అది తెలియక వెట్టి పట్టిన వారిలా ప్రవర్తిస్తుంటారు. శ్రీవేంకటేశుని సిరివరుడని భావించగల వారికి ఏ వెట్టి పట్టదు అంటున్నారు.

**భావదీపిక :**

దేవుని మాయలు యెటువంటివో తెలుపుట అసాధ్యం. ఎవ్వరూ ఆ మాయ ఫలితమెట్టిదో యెఱుగరు. ఇదే పట్టిన వెట్టిలా బాధిస్తుంటుంది.

పురుషోత్తముడైన శ్రీహరియందే దేవతలంతా పుట్టారు. అదే విధంగా వారంత అయనలోనే అణగిపోతారు. ఈ దేవదేవుని వీరందరితో పాటు సరివెట్టి (సమానం చేసి) కొలుచుటే పెనువెట్టి (పెద్ద పిచ్చిపని).

హరివరమును పొందిన వారంతా బ్రతికి బట్టకట్టారు. పరుల (ఇతర దేవతల) వరములను పొందిన అసురులు (రాక్షసులు) బడలిరి (నశించి పోయారు). ఇదంతా తెలిసి కూడా ఇంతమందితో ఈతనిని సమానం చేసి మొక్కుట సహజమైన వెట్టి.

శ్రీవేంకటపతి జీవులందరిలో అంతరాత్మగా వుంటాడు. శ్రీలక్ష్మి ఈతని దేవులు (పట్టపురాణి). వేవేల సిరులు (సకల సంపదలను) వీరే వొసగిరి అని భావించగల వారికి యెటువంటి వెట్టి పట్టదు.

**సంఖ్య : 138 సంపుటము : 4 పుట : 93 రాగం : ధన్యాసి**

పల్లవి: తొల్లిటివారు వెట్టినతోవ యిది
బల్లిదులై యిందునే బదుకుటే మేలు
చ. 1: కలఁడు సర్వేశ్వరుఁడొక్కఁడు దిక్కందరికిని
సులభుఁడు శరణముచొచ్చితేఁ గాచు నతఁడు
బలుతపములు చేసి పాట్లఁ బడ నోప మని (ము?)
బలువుఁడాతని నమ్మి బ్రదుకుటే మేలు
చ. 2: వున్నాఁడు మనసులోనే వొక్కచో వెదకవద్దు
ఇన్నిటాఁ దలఁచుకొంటే నిచ్చు నిహముఁ బరము
కన్నచోట్ల వెదకి కడు నలయనోపము
పన్నుగ నితనిఁ గొల్చి బ్రదుకుటే మేలు
చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చేరి నిలుచున్నవాఁడు
సేవించినయంతలోనే చేకొని యేలు నీతఁడు
దేవతలఁ బ్రార్థించి తెలియఁగ నేరము
భావించితని నుతించి బ్రదుకుటే మేలు

**తొలిపలుకు :**

అనాదిగా ఋషులు, జ్ఞానులు, భక్తులు పెట్టిన రాచమార్గము భగవంతునికి శరణాగతి. ఈ శ్రీవేంకటేశ్వరుడు బలవంతుడు శరణాగతవత్సలుడు. అన్య దేవతలను ప్రార్థించి యెరుగము. బల్లిదులమై తొల్లిటివారి బాటలోనే నడచి ఈ తిరుమలలో బ్రతుకుటే మేలు అంటున్నారు అన్నమయ్య.

**భావదీపిక :**

ఇది తొల్లిటివారు (అనాది నుండి ఋషులు, జ్ఞానులు) పెట్టిన తోవ. ఇందునే (ఈ లోకంలోనే) బల్లిదులై (బలవంతులై) బ్రతుకుట మేలు కదా!

అందరికీ దిక్కుగా వున్నవాడు సర్వేశ్వరుడు. ఆయన సులభుడు (సులభముగా అనుగ్రహించువాడు). శరణుచొచ్చిన తప్పక కాపాడును. మేము గొప్ప తపస్సులు చేసి పాటు బడలేము. బలవంతుడైన భగవంతుని నమ్మి బ్రతుకుటే మాకు మేలు.

శ్రీహరి యెక్కడో లేడు. మన మనస్సులోనే వున్నాడు. ఆయనను యేదో వొక్కచోట వెదకుట అవివేకము. ఎల్లప్పుడూ స్మరిస్తుంటే మనకు ఇహమున సుఖము, పరమున మోక్షము ఆయనే ఇస్తాడు. కన్నచోట (కనబడ్డ ప్రతిచోటా) వెదకి అలసిపోవటం దేనికి? మాకు వద్దు. భావించి ఇతనిని గొల్చి బ్రదుకుటే మాకు మేలు.

ఈ తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా వచ్చి ప్రతిమ అయ్యాడు. సేవించగానే వచ్చి యేలుకొంటాడు. మేము అన్యదేవతలను ప్రార్థించ నెరుగము. ఇతనినే భావించి కీర్తించుచు బ్రతికెదము గాక!



**సంఖ్య : 523 సంపుటము : 3 పుట : 351 రాగం : గౌళ**

పల్లవి: త్రిజగముల నెరుఁగు దేవదేవుఁడు
అజునిజనకుఁడైన ఆదినారాయణుఁడు
చ. 1: గరుడనిమీఁద నెక్కి ఘనచక్రము చేఁబట్టి
పరమపదాననుండి పరతెంచి
మురిపేన కరిఁ గాచి మొసలిఁ దుంచినవాఁడు
అరుదైనప్రతాపపు ఆదినారాయణుఁడు
చ. 2: కనకాంబరము గట్టి కౌస్తుభము మెడఁ బెట్టి
వెనువెంట శ్రీసతి సేవించుచుండఁగా
పనివూని జయముతో పాంచజన్యము వట్టి
అనిశముఁ గరుణించీ నాదినారాయణుఁడు
చ. 3: త్రిదశులు నుతియించ దిక్కులెల్లా నుల్లసిల్ల
ముదమున దాసులెల్లా మొక్కఁ గాను
వదల కెల్లవారికి వరము లిచ్చీ వాఁడే
అదె శ్రీవేంకటవిభుఁ డాదినారాయణుఁడు

**తొలిపలుకు :**

ఆదినారాయణుడైన శ్రీహరిని ప్రస్తుతిస్తున్నారు అన్నమయ్య. త్రిజగముల వారికి దేవదేవుడైన ఈ విధాతతండ్రికెన్ని విశిష్టతలున్నాయో చూశారా? మురిపేన అంటే మురిపెముతో అని అర్థం. పరతెంచి అంటే పరుగుతో యేతెంచి అని భావము. ఇది శ్రీమన్నారాయణుని ప్రస్తుతి.

**భావదీపిక :**

ఈ దేవదేవుడు ముల్లోకములలో ప్రసిద్ధి నొందిన ఆదినారాయణుడు. ఎంత అనాది అంటే అందరి సృష్టికర్త అయిన అజునికే (బ్రహ్మకే) ఈయన తండ్రి.

గరుడని మీదనెక్కు గరుడవాహనుడు. గొప్ప చక్రపాణి. పరమపదాన (వైకుంఠంలోనున్నా) తన దాసుల కోసం పరితెంచి (పరుగులు పెట్టి వస్తాడు). మురిపేన (మురిపెముతో) గజేంద్రుని రక్షించుటకు మొసలిని తుంచిన దితడే కదా! ఈ ఆదినారాయణుడు అరుదైన ప్రతాపము కలవాడు.

ఈయన శరీరంపై కనకాంబరము (పీతాంబరము) ధరిస్తాడు. మెడలో కౌస్తుభమణిని ధరిస్తాడు. తన వెంటనే వుండి శ్రీలక్ష్మి సేవిస్తుంటే పూనికతో తన పాంచజన్య శంఖాన్ని పూరిస్తూ విజయుడై, యీ ఆదినారాయణుడు తన భక్తులను అనిశము (నిరంతరం) కరుణిస్తుంటాడు.

త్రిదశులు (దేవతలు) స్తుతిసుంటే దిక్కులన్నీ పిక్కటిల్లుతున్నాయి. అతి సంతోషంతో ఈయన దాసులు స్వామీ అని మొక్కుతున్నారు. ఏ వొక్కరినీ వదలక అందరికీ వారు కోరిన వరాలిచ్చేవాడే ఈ శ్రీవేంకటేశ్వరుడు. అదిగో ఈతడే ఆదినారాయణుడు.

**సంఖ్య : 488 సంపుటము : 4 పుట : 329 రాగం : సాళంగనాట**

పల్లవి: దాసులపాలిటి నిధానమై వున్నాఁ డదిగో
ఆసాబాసా నితఁడే అహోబలేశుఁడు

చ. 1: నగె నదె వాఁడిగో నారసింహదేవుఁడు
పగదీర హిరణ్యాక్షుఁ బట్టి చించి
మృగరూపై గద్దెమీఁద మెఱసీవాఁ డదిగో
అగవూఁ దగవెఱిఁగి యహోబలేశుఁడు

చ. 2: తేరిచూచీ నదిగో దేవాదిదేవుఁడు
ఘోరపు నెత్తురు గోళ్ళఁ గురియఁగాను
నేరుపుతోఁ బేగుల జన్నిదాలవాఁ డదిగో
ఆరితేరి కొలువున్నాఁ డహోబలేశుఁడు

చ. 3: కరుణించీవాఁ డదిగో కమలాపతి దేవుఁడు
సురలు గొలువఁగాను సొంపుతోడను
యిరవై లోకములెల్లా నేలుచున్నాఁ డదిగో
హరి శ్రీవేంకటాద్రి యహోబలేశుఁడు

**తొలిపలుకు :**

ఇది ఆహోబల నరసింహస్వామిపై అన్నమయ్య వినిపిస్తున్న రమ్యమైన సంకీర్తన. తన దాసులకు ఈయన పెన్నిధి. వారికి ఆశలు కల్పించటమే కాదు తాను వారికి చేసిన బాసలు నిలుపుకొంటాడు కూడా అంటున్నారు. శ్రీవేంకటాద్రి హరియే ఈ అహోబలహరి (సింహము) అనేది అన్నమయ్య గీత. ఇందు హిరణ్యాక్షుని అని వున్నది కాని 'హిరణ్యుని' అని వుండాలి.

**భావదీపిక :**

అదిగో తన దాసుల పాలిటి నిధానమై వున్నాడీ స్వామి. వారికి నితడే ఆసాబాసా (ఆశలు కల్పించువాడు, బాసలు నిలుపుకొనే వాడు కూడా). ఈయనే అహోబలేశ్వరుడైన నారసింహుడు.

అదె నవ్వుతున్నాడు వాడే కదా! నారసింహదేవుడు. తన పగదీరునట్లు హిరణ్యకశిపుని బట్టి చించివేశాడు. గద్దెపై మెరసిపోతున్న మృగరూపై వున్నవాడే అగవూ తగవూ (తనకిచ్చే పెండ్లి కానుకలను కూడా) బాగుగా యెరిగిన అహోబలేశ్వరుడు.

ఆయన గోళ్ళ నుంచి నెత్తురు ఘోరంగా కురుస్తుంటే, అదిగో దేవతలు వారి అధిదేవతలు భయంతో తేరిపార చూస్తున్నారు. ఎంత నేర్పుతో ఆయన ఆ దైత్యుని పేగులు తన జంధ్యాలుగా వేసికొనినాడో!! అదిగో ఆరితేరి (నిష్ణాతుడై) కొలువుదీరి వున్నాడీ అహోబలేశుడు.

అదిగో కమలాపతియైన ఈ దేవుడు కరుణామూర్తి సొంపుమీర దేవతలంతా ఆయనను కొలుస్తుంటే ఇక్కడ సుస్థిరుడై లోకముల నెల్లా యేలుచున్నాడు. అదిగో శ్రీవేంకటాద్రి హరియే ఆనాటి అహోబలేశ్వరుడైన హరి (సింహము).



**సంఖ్య : 25 సంపుటము : 4 పుట : 377 రాగం : సామంతం**

పల్లవి: ధనముగని మరికదా ధనికుఁడౌట - మొదల
తనుఁ దానెఱుఁగలేని తలపేఁటి తలఁపు

చ. 1: మచ్చికల నినుఁగొలిచి మరికదా సుఖులౌట
యెచ్చోట నేవేల్పులెవ్వరైన
అచ్చుపడ నటువంటి హరి నిన్నుఁ గొలిచి నీ
మెచ్చువడయఁగలేని మేలేఁటి మేలు

చ. 2: కందువగ నినుఁ గొలువఁగనికదా ఘనులౌట
యెందునరుదగు వేల్పులెందరైన
అందముగ పరదైవమని నిన్నుఁ గనలేక
గొందిఁబడి పొరలేటి కూడేఁటి కూడు

చ. 3: వేసరక నినుఁగొలిచి వేంకటనగేశ నీ-
దాసులై మరికదా ధన్యులౌట
వాసి వట్టముకొఱకు వదలి దినములచేతఁ
బాసి పోయినవెనక పరమేడ పరము

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో మానవనైజం వెల్లడి చేస్తున్నారు. ఒక స్థితికి చేరాలంటే కొంత పరిశ్రమ కొంత ఈశ్వరకృప కావాలి. తననితాను తెలిసికొనలేని వివేకం యేమి వివేకం? పేరు ప్రతిష్ఠల కోసం వెంపర్లాడి అంతా పాసిపోయాక పరము గుర్తుకొస్తే యేమి ప్రయోజనం? అంటున్నారు.

**భావదీపిక :**

అయ్యలారా! ధనమును సంపాదించిన తరువాత కదా! ధనికుడయ్యేది? మొదట తనను తానే తెలిసికోలేని వాని తలపేటి తలపు (వివేకమేమి వివేకము?)

ఏ దేవతలైనా చనువుతో నిన్ను (శ్రీవేంకటేశుని) కొలిస్తేనే కదా! సుఖులై యేలోకాననైనా వుంటారు. అచ్చుపడ (శ్రీవైష్ణవుడై) నిన్నుగొలిచి నీమెప్పు పొందలేని వాడు పొందేమేలు, అదెట్టి మేలయ్యా శ్రీహరీ!

ఎవడన్నా ఘనుడవ్వాలంటే కందువగు (సమర్థుడైన) నిన్ను కొలిచి దర్శించాలి కదా! ఏ లోకములోను దేవతలకైనా ఇది వర్తిస్తుంది. మనోహరుడైన నిన్ను (శ్రీవేంకటేశుని) పరదైవమని భావించి నిన్ను దర్శించలేక, గొందులలో పడి పొరలే వాళ్ళ కూడు (కూటమి) యేమి కూడు?

ఓ శ్రీవేంకటేశ్వరా! వేసరక (విముఖతలేక) నిన్ను ఆరాధించి నీ దాసులైన వారు కదా! ధన్యులయ్యేది? వట్టము కొఱకు (చిల్లర లాభాలకోసం) వాసి (పేరుప్రతిష్టలు) వదలి దినములన్నీ తరిగి పోయాక పరము (మోక్షము) కావాలంటే యెలా వస్తుంది?

**సంఖ్య : 479 సంపుటము : 3 పుట : 322 రాగం : మాళవిగౌళ**

పల్లవి: ధరలో నాజన్మమే తనువు నదియె  
యిరవై నీదాసుఁడైతే హీనుఁడైనా ఘనుఁడే

చ. 1: అలరావణునితమ్ముఁ డసురనరభోజనుఁ-  
డలరి తొల్లెల్లా నీవాఁడైనమీఁదను  
కులజుఁడు పుణ్యుఁడు గుణనిధి యిందరునుఁ  
దలఁప యోగ్యుఁడు నట దాస్యమహి మెట్టిదో

చ. 2: జాతిబోయ పాతకుఁడు సత్యతపుఁడట తొల్లి  
నీతి నరణియనేటినీదాసుఁ జేరి  
ఆతల బ్రహ్మఋషాయ నష్టాక్షరమంత్రాన  
చేఁతల నీదాసుల సేవాఫల మెట్టిదో

చ. 3: నానాజంతువులందు నవభక్తిగలిగితే  
హీనాధిక్యము లేక యేచి కాతువు  
శ్రీనాథ కాచితివి శ్రీవేంకటేశ మమ్ము  
నేనూ ధన్యుఁడనైతి నీమహిమ యెట్టిదో

**తొలిపలుకు :**

అన్నమయ్య చతుర్వేదాలు, షట్శాస్త్రాలు, అష్టాదశపురాణాలు నేర్చిన జ్ఞాన సంపన్నుడనటానికి ఈ కీర్తన నుదాహరించవచ్చును. ఎక్కడో "వరాహ పురాణం"లో వున్న సత్యతపుని కథను ఉదాహరిస్తున్న ఆయన "హరిగానమే" అనన్యమైన జ్ఞానమని, నేను ఈ కృతికి యెన్నుకొన్న పేరు సరి అయినదేనని అంగీకరిస్తారు కదా!

**భావదీవియ :**

ఈ భూమిపై నాజన్మమే వొక వుదాహరణ. నా శరీరమూ అట్టిదే. అది నిరూపిస్తున్నదేమిటి? నీ దాసుడైనవాడు యెంతహీనుడైనా ఘనుడే.

అలనాడు రావణాసురుని తమ్ముడు, నరభక్షక అసురజాతిలో పుట్టిన విభీషణుడు తొల్లెల్లా (మునుముందే) నీ వాడైన మీదట శ్రేష్ఠకులజుడై పుణ్యుడై, గుణనిధియై, యోగ్యుడైన దెందుచేత? రామచంద్రుడవైన నీ దాసుడైనందున. మరి నీ దాస్య మహిమ యెంతటిదో కదా!

అదే విధంగా పూర్వం బోయజాతిలో పుట్టి పాతకుడై జీవించిన "సత్యతపుడు" నీతిమంతుడైన అరణి అనే హరిదాసుని జేరి, ఆపైన "ఓం నమో నారాయణాయ" అనే నీ అష్టాక్షరీ మంత్రమహిమ చేత బ్రహ్మఋషి అయ్యాడు. నీ దాసుల సేవాఫలమెంతటిదో కదా!

ఏ జంతువు జన్మ కలిగినా, నవ విధభక్తులలో యేవొక్కటి కలిగితే హీనాధిక్యములను చూడక యేచి కాతువు (పూని రక్షింతువు). ఓ శ్రీనాథా! రక్షించితివి. నేడు శ్రీవేంకటేశ్వరుడవై మమ్ము ధన్యులను చేశావు. నీ మహిమ యెంతటిదో కదా!



**సంఖ్య : 248 సంపుటము : 2 పుట : 166 రాగం : నాట**

పల్లవి: నిండె నిన్ని చోటులను నీమహిమలే  
అండనే మొక్కేము నీకు నాదినారసింహా

చ. 1: కూరిమి యిందిరమీఁద, కోపము అసురమీఁద  
తారుకాణనవ్వు దేవతలమీఁదను  
ఆరీతి నీకొలు విట్టే అహోబలముమీఁద  
నారుకొనె నీనేరుపు నారసింహా

చ. 2: కరుణ ప్రహ్లాదుమీఁద, గన్నులు దిక్కుల మీఁద  
సరిచేతులు పేగులజంధ్యాలమీఁద  
గరిమ నీనటనలు ఘనప్రతాపముమీఁద  
తిరమాయ నీకోరిక దివ్యనారసింహా

చ. 3: శాంతము లోకముమీఁద శౌర్యము శత్రులమీఁద  
కాంతులెల్లా తనదివ్యకాయము మీఁద  
చింతదీర వినోదము శ్రీవేంకటాద్రిమీఁద  
సంతతమై నీకుఁ జెల్లె జయనారసింహా

**తొలిపలుకు :**

అహోబలనారసింహునిపై అద్భుతమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. నీ మహిమ అన్నిచోట్లా నిండినదయ్యా. నీవు మా అండవని మొక్కుతున్నామంటున్నారు. చింతదీర వేంకటాద్రి మీద కూడా వినోదించటం నీకే చెల్లిందయ్యా! అహోబలనారసింహా! ప్రహ్లాదుని వలెనే మమ్మూ రక్షించు అంటున్నారు.

**భావదీవియ :**

ఓ ఆదినారసింహా! నీమహిమలతో అన్నిచోట్లు నిండిపోయినవయ్యా అందుకనే నీ అండ కోరి నీకు మ్రొక్కుచున్నామయ్యా!

స్వామీ! నీవు వొకేసారి ఇందిరపై కూరిమి, అసురునిపై (హిరణ్యునిపై) కోపమును, దేవతలమీద తారుకాణ నవ్వు (ఎన్ని వరాలున్నా తాను చంపగలననే నవ్వు) తో నున్నావు. ఈ అహోబలమున ఆ విధముగా నీ కొలువు నీ నేర్పులు పాదుకొనునట్లు చేసింది.

ప్రభూ! నీవు ప్రహ్లాదుని మీద కరుణ చూపుతున్నావు. నీ దృష్టి దిక్కులన్నిటిపై ప్రసారింపజేస్తున్నావు. సరిసంఖ్యలోనున్న చేతులతో హిరణ్యుని పేగులు చించి జంధ్యాలుగా వేసికొనినావు. నీనటనలు నీ ఘనప్రతాపము మీద విచిత్రముగా నీ కోరిక యొక్క స్థిరత్వమును తెలుపుచున్నదయ్యా! దివ్యనారసింహా!

దేవా! నీశాంత గుణమును లోకాల మీదజూపుచున్నావు. నీ శౌర్యగుణమును శత్రువులపై జూపుచున్నావు. తన దివ్యకాయము యొక్క కాంతులు నలుదిక్కులా వ్యాపించినవి. అంతేకాక, శ్రీవేంకటాద్రిపై చింతలేక వినోదిస్తున్న నీకు సర్వమంగళములూ సంతతమై (శాశ్వతమై) చెల్లెనయ్యా జయనారసింహా!

**సంఖ్య : 476 సంపుటము : 4 పుట : 321 రాగం : సాళంగనాట**

పల్లవి: నీగురుతులు చూచుకో నీబిరుదు లెంచుకో
యీగతిని కలబంట నిఁకనన్నుఁ గావవే

చ. 1: కానిలే నేనెంతకఠినచిత్తుఁడనైన
నానొసల నివే పట్టెనామములు
మేను తోలునెమ్ములతో మెరసినదైనాను
పూనితిఁ దమ్మితులసిపూసలపేరులు

చ. 2: భ్రమసి నేఁజేసినవి పాపకర్మములైనాను
జమళిభుజాల నివే శంఖచక్రాలు
అమరఁ దఱచుగా నే నాడేవి కల్లలైనా
తమిఁ బాడీ నాలిక నీతగు సంకీర్తనలు

చ. 3: తలఁచితే నావోజ తామసగుణమైనాను
పిలిచేది భువిలో నాపేరు తిమ్మఁడు
అలర శ్రీవేంకటేశ అన్నిట నేదుష్టనైనా
తలకొనె నాయందు దాసరితనములు

**తొలిపలుకు :**

"కలబంట" అంటే ద్వారం వద్దవేచివుండే కావలిబంటు అని అర్థం. అన్నమయ్య స్వామితో నేను అనేక పాపాలు చేశాను, కఠినాత్ముడినే, అనేక అబద్ధాలు చెప్పాను, విపరీతమైన తామసగుణమువున్నది, ఎన్నో దుష్టగుణాలున్నాయి. నిజమేనయ్యా! కానీ నీకు నన్ను రక్షించక తప్పదు. ఎందుకంటే... కాస్త నా మొర విను మరి.

**భావదీవియ :**

స్వామీ! నా మేనిపై నీ గురుతులు (తిరుముద్రలు) చూచుకోవయ్యా! నీకున్న శరణాగత రక్షకుడనే బిరుదును యెంచిచూసుకో. ఈ గతిని (విధముగా) నీకు కలబంటు (ద్వారపు కావల బంటు) నైన నన్ను ఇకపై కావవయ్యా!

నేనెంత కఠినాత్ముడనైనా కానిలేవయ్యా! నా నొసటనున్న నీ పట్టె నామాలు చూసుకోరాదా? నా శరీరం తుచ్ఛమైన తోలు యెముకలతో చేయబడి పనికిమాలినదే కాని దానిపైన నీ తులసిపూసల పేరులు ధరించాను కదా! మరి అదీ పవిత్రమైపోయింది కదా!

నేను భ్రమచేత యెన్నో పాపకర్మలు చేసిన మాట నిజమే స్వామీ! కాని నా భుజాలమీద నీ శంఖచక్రముద్రలు కనబడుటలేదా? ఇంకా పాపమేమి? నాకు అనువైనట్లు తఱచుగా నేను అనేక అబద్ధములాడిన మాట నిజమే. కాని నా నాలిక మీద ఆర్తితో పాడిన నీ సంకీర్తనలు లేవా? మరింకేమి?

తలచితే నా ఓజ (ప్రకృతి) తామసగుణ ప్రధానమనుట సత్యమే. భువిలో నా పేరు తిమ్మడు (కోతి). ఆగుణము దానికి సహజమే కదా! ఓ శ్రీవేంకటేశ్వరా! అన్ని విధాల నేను దుష్టుడనే కాదనను. కాని నాయందు నీ దాసరితనము (దాస్యగుణము) వున్నది. అది చాలదా తండ్రీ!



**సంఖ్య : 540 సంపుటము : 3 పుట : 363 రాగం : రామక్రియ**

పల్లవి: నేనా గెలువ లేను నీమాయ
శ్రీనాథ నీవు సేసేచేఁతలే నీమాయ

చ. 1: తమకము గడు రేఁచు తలఁపు ఉబ్బూఁతలూఁచు
నిమిష మూరకుండదు నీమాయ
తిమిరము బుద్ధిఁ గప్పు తెఱవల వెంట దిప్పు
అమరి తోడునీడ ఆయఁబో నీమాయ

చ. 2: పట్టినందుకెల్లాఁ దీసు పాపమే చవులుసేసు
నిట్టి(ట్ట?) పిడిఁ బోనీదు నీమాయ
కొట్టఁగొన కెక్కించుఁ గోరి మొదలికి దించు
మట్టులే దింతింతని మరియు నీమాయ

చ. 3: పలులంపటాల ముంచు భావజుచే భ్రమయించు
నిలిచినచోటనెల్లా నీమాయ
యెలమి శ్రీవేంకటేశ యిటు నిన్నుఁ గొలువఁగా
మలసి సొలసి నన్ను మన్నించె నీమాయ

**తొలిపలుకు :**

అన్నమయ్య యీ కీర్తనలో శ్రీహరి చేసే లీలలన్నీ ఆయన మాయా కల్పితాలే. ఆమాయను గెలవటం యెవ్వరివల్లా అయ్యే పని కాదు, అని చెబుతూ ఆ హరిమాయ చేసే విచిత్రాలెట్లా వుంటాయో వివరిస్తున్నారు. అయితే శ్రీవేంకటేశ్వరుని భక్తులను మాత్రం ఆ మాయ మన్నిస్తుందని అంటున్నారు.

**భావదీవియ :**

ఓ శ్రీనాథా! నీవు చేసే నీచేతలే నీమాయ. నీమాయను నేనెలాగూ గెలువలేను. నన్ను నీవే రక్షించాలి.

ఈ మాయ వలన తమకము (తన్మయత్వం) అధికమవుతుంది. తలపు (ఆలోచనలు) ఉబ్బూతలూగిస్తాయి. నిమిషం కూడా వూరకవుండనీయదు. బుద్ధిని చీకట్లు కమ్ముతాయి. తెఱవల (ఆడువారి) వెంట తిప్పుతుంది. నీమాయ మాతోడు నీడ అయింది పో!

పట్టినందుకెల్లాఁదీసు (పట్టుకొన్న ప్రతిదానిని తీసికొంటుంది). పాపమే రుచిగా అనిపిస్తుంది. పిడికొట్టినట్లు నీమాయ యెటూ కదలనీయదు. కావాలంటే కొట్ట కొనకు యెక్కిస్తుంది. కాదనుకొంటే మొట్ట మొదటికే దించివేస్తుంది. మరియు నీమాయకు ఇంతింత అని మట్టులేదు (మితిలేదు).

అనేకమైన లంపటాలలో ముంచుతుంది. మన్మథుని చేత భ్రమలు కల్పింపజేస్తుంది. నీమాయ నన్ను నిలిచిన చోట నిలువనీయదు. అయితే శ్రీవేంకటేశ్వరా! ఈ విధంగా నిన్ను గొలవగా నీమాయ నన్ను మన్నించి వదలిపేసింది.

**సంఖ్య : 252 సంపుటము : 15 పుట : రాగం : బంగాళం**

పల్లవి: పోకు పోకు మంత నీవు పురుషోత్తమా వట్టి
బూకలు మేమెఱుఁగమా పురుషోత్తమా

చ. 1: పొలసులాడకు నీవు పురుషోత్తమా నీ
పొలజాణతనాలు పురుషోత్తమా
పులుసు వేసినీచెంత పురుషోత్తమా నేము
పులు గరసితి మింత పురుషోత్తమా

చ. 2: పొడవాటి సటకాఁడ పురుషోత్తమా
పొడమె నీమోవినవ్వు పురుషోత్తమా
పుడిశెఁడే నీసిగ్గు పురుషోత్తమా
పొడిరాలి రతులలో పురుషోత్తమా

చ. 3: పొద్దు వొద్దు కొత్తలేల పురుషోత్తమా నీవు
బుద్దెరిగి నప్పుడయ్యా పురుషోత్తమా
అద్దుకొని శ్రీవేంకటాద్రి పురుషోత్తమా నీది
బొద్దువంటి యుంగరము పురుషోత్తమా

**తొలిపలుకు :**

"అతని కంటే ఘనుడు అచంటి మల్లన్న" అనే సామెతను నిజంచేశారు అన్నమయ్య సుపుత్రుడు పెదతిరుమలయ్య. అయన చెప్పిన ఈ కీర్తన సంపూర్ణంగా వివరించగల వారు మహాపండితులనదగ్గవారు. ఇది దశావతార కీర్తన అని తెలియటమే బహుకష్టం. ఇక దీని వివరణ దాదాపు అసాధ్యం. శ్రీవేంకటాద్రి పురుషోత్తముని దయవల్ల నేనీ మాత్రం ప్రయత్నిస్తున్నాను. నేను చెప్పింది యెంత సబబో స్వామికే తెలియాలి.

**భావదీవియ :**

ఇట్లా అంతగా నీవు పోకుపోకుము (పోకడలు పోవద్దు) పురుషోత్తమా! నీవన్నీ వట్టి బూకలు (మాయలు) అని మేమెఱగమా పురుషోత్తమా!

పురుషోత్తమా! నీవు పొలసులాడకు (**పొలసులు గల మత్స్యావతారము**). పొలజాణతనాలు చూపావు (**మోహినీ అవతారం**). మేము నీ చెంత పులుసువేసినాము (**విచిత్రమైన గుఱ్ఱుధ్వని విన్నాము. ఇది వరాహపు ధ్వని. వరాహావతారము**). పురుషోత్తమా! ఇంత పులుగు అరసితిమి (**అసంబద్ధమైనవి చూచినాము. నరసింహావతారము**).

పురుషోత్తమా! నీవు పొడవాటి సటకాడవు (మాయగాడివి). వామనుడిగా వచ్చిన (**త్రివిక్రముడవు**). క్షత్రియ సంహారముతో, నవ్వు పొడమింది నీమోమున (**పరశురాముడు**) పుడిశెఁడే నీ సిగ్గు (**భార్యాపహరణతో అవమానింపబడిన శ్రీరామచంద్రుడు**). పురుషోత్తమా! నీవు నిరంతర రతులతో పొడిరాలినావు (**చూర్ణమైనావు. శ్రీకృష్ణుడు**)

పురుషోత్తమా! నీకు పొద్దుపొద్దు (ప్రతిపూట) కొత్తలేల(కొత్త స్త్రీ యెందుకు?) త్రిపురాసుల భార్యల శీలములు చెరచిన (**బుద్ధుడు**). నీవు బుద్దెరిగినప్పుడయ్యా (అధర్మం హద్దుదాటిందని నీ బుద్ధి అనిపిస్తే అంతా అయిపోతుంది. (**కల్కి అవతారం**).

ఓ వేంకటాద్రి పురుషోత్తమా నీది పొద్దువంటి వుంగరము (**నీ చేతివుంగరమే సూర్యభగవానుడు**).



**సంఖ్య : సంపుటము : పుట : 82 రాగం : శ్రీరాగం**

పల్లవి: ప్రత్యక్షమే మాకుఁ బ్రమాణము
సత్యరూప జోలిదవ్వి జాలిఁబడ నోపము

చ. 1: కన్నవా రెవ్వరు నిన్ను కన్నులయెదుటను
పన్ని నీదాసులు చూచేభావమువలె
విన్నవా రెవ్వరు నీవిభవపుమాటలు
అన్నిటా నాచార్యుని యానతివలె

చ. 2: తొడఁగి నీ ప్రసాదము దొరకినవా రెవ్వరు
జడియు నీ దాసుల ప్రసాదమువలె
కడు నీ పాదతీర్థము కడగన్నవా రెవ్వరు
బడి బడి నీ భక్తపాదజలమువలె

చ. 3: యేచి పరంధామమున కేఁగినవా రెవ్వరు
చాచిన నీ దాసుల సన్నిధివలె
చూచితి శ్రీవేంకటేశ సొంపుల నీ మహిమెల్ల
తాచిన నీ దాసానుదాసులయందే

**తొలిపలుకు :**

మానవజన్మ అనుమానాల పుట్ట. కళ్ళతో చూచిన కనికట్టు ప్రత్యక్ష ప్రమాణము అని నమ్ముతారే కాని, సత్యమేరూపముగా గల శ్రీహరిని చూడలేరు. అందుకనే వారికా దేవదేవుడు ప్రమాణముకాదు. కారణాలను వెదకి మూలకారణం కనుగొనే శక్తీలేదు. మరి మాగతేమిటి? అంటున్నారు అన్నమయ్య. ఏదోవొక చరణం మింగుడు పడకుండా చేయటం అన్నమయ్య వైభవం.

**భావదీవియ :**

స్వామీ! మాకు ప్రత్యక్షమే (కనులతో చూచినదే) ప్రమాణము (నిరూపితమైన సత్యము). ఓ సత్యరూపా! జోలిదవ్వి (మూల కారణము వెదకి) జాలిబడనోపము (విచారించలేము). ఎందుకంటే...

నిన్ను తమ కన్నులతో యెట్టెదుట చూచిన వారెవరయ్యా? నీ దాసులు తమ భావనలోనే నిన్ను చూడగలిగారు. పోనీ వైభవోపేతమైన నీ మాటలు విన్నవారెవరు? మా ఆచార్యులు ఆనతిచ్చిన నీ మాటలే మా ప్రమాణము.

యత్నించి, నీ చేతి ప్రసాదమును తినిన వాడెవ్వడు? నీ దాసులు మా కొసగిన నీ ప్రసాదమే మాకు లభ్యము. నీ పాదతీర్థమును స్వయంగా గైకొన్న వారెవరున్నారయ్యా? నీ శరణాగతుల పాదజలమే మాకు తక్షణమే లభ్యము.

నీ పరంధామము (వైకుంఠమునకు) వెళ్ళినవారెవ్వరు? మేము వెళ్ళగలిగినది నీ దాసుల సన్నిధికి. ఓ శ్రీవేంకటేశ్వరా! నీమహిమలు సొంపారా తాచిన (తాకిన) నీదాసులకు దాసులందే నీ మహిమలు చూచితిమి.

**సంఖ్య : 480 సంపుటము : 4 పుట : 323 రాగం : లలిత**

పల్లవి: బడిబడి నింద్రియాలే పరువులు వెట్టుఁగాని
యెడయని చుట్టరికాలెవ్వరికీ లేవు

చ. 1: వన్నె సతులరూపులు వారివద్దనే వుండఁగా
కన్నులఁజూచేవారికి కళలేఁగును
యెన్నిక వారిగుణాలు యెడమాటలాడఁగాను
విన్నవారికి నూరకే వేడుకలు పుట్టును

చ. 2: అంతా నింతాఁ గమ్మవిరు లంగళ్లలో నుండఁగాను
సంతవార లూరకే వాసనగొందురు
బంతివారికంచాలలో పలురుచు లుండఁగాను
వింతవారలందుకుఁగా వెస నోరూరుదురు

చ. 3: వెరవిడి దేహాలు వేరేవేరే వుండఁగాను
సురతాన సోఁకితేనే చొక్కుదురు
ఇరవై శ్రీవేంకటేశుఁ డిన్నిటికి సూత్రధారి
సరి నితని దాసులు జడియ రిందుకును

**తొలిపలుకు :**

మనం ఈ లోకంలోకి ఒంటరిగా వచ్చాము. ఒంటరిగానే పోతాము. ఇంద్రియాలు చేసే మాయ వలన లేని అందాలు కనుపిస్తాయి, నచ్చిన వారిలో అన్నీ సుగుణాలే కనుపిస్తాయి. పొరుగింటి పుల్లకూర రుచిగా అనిపిస్తుంది. అంగడిలో వున్న పూలు బాగుంటాయి. ఒక స్త్రీతో తృప్తి పడరు. ఈ చాంచల్యానికి సూత్రధారి వేంకన్నదొర. కాని స్వామిదాసులకేమి భయం? అంటారన్నమయ్య.

**భావదీపిక :**

బడిబడి (వెనువెంటనే) జీవుల ఇంద్రియాలు పరుగులు పెడుతుంటాయి. అంతేకాని యెవ్వరితోటీ విడువలేని బాంధవ్యాలు జీవికి వుండవు.

వన్నెచిన్నెలున్న స్త్రీల రూపములు వారి వద్దనే వుంటాయి. కాని వారిని చూచేవారి కన్నులే చూచేవారికి కళలురేపుతాయి (ఉద్రేకపరుస్తాయి). స్త్రీల గుణాలు వాక్చాతుర్యం విన్న వారికి వూరకనే వినోదము కలిగిస్తాయి. ఇదే చిత్తభ్రమ.

కమ్మటి విరులు (పుష్పాలు) అంగళ్ళలో అనేకం వుంటాయి. సంతకెళ్ళే ప్రతివారూ వాటిని అక్కడక్కడా వాసనచూచి పులకిస్తుంటారు. అంగడిబొమ్మను చూడని వాడెవ్వడు? బంతిలో కూర్చునప్పుడు పక్కవారి కంచాలలోని పదార్థాలు రుచిగా భ్రమ కలిగిస్తాయి.

వెరవిడి (భయమును వదలిన) శరీరాలు వేర్వేరుగానున్నా సురతమున (సంభోగమున) అలసిపోతేనే పరవశిస్తారు. ఇదేమి వింత? అతిశయించిన శ్రీవేంకటేశ్వరుడే వీటన్నిటికీ సూత్రధారి. జీవులందరూ తోలుబొమ్మలు. ఇదొక తోలుబొమ్మలాట. అయితే ఆయన నిజమైన దాసులు ఇందుకు యేమాత్రం జడియరు (భయపడరు).



**సంఖ్య : 453 సంపుటము : 3 పుట : 305 రాగం : రామక్రియ**

పల్లవి: బలువుఁడు నాతఁడే బంధువుఁడు నాతఁడే
తలఁ చాతనికి మొక్కఁ దగులి(ని)ంతే నేము

చ. 1: దైవమే భారకుఁడు ధరణి రక్షించుటకు
భావింప నరులచేఁత పనిలేదు
శ్రీవల్లభుఁ డతఁడు నేసినట్టల్లా నవును
వావాత ననుభవించే వారమింతే నేము

చ. 2: హరియే స్వతంత్రుఁడు అన్ని పనులుగాఁ జేయ
పరులవుద్యోగాలు పనిలేవు
సురనాథుఁ డాతఁడు చూచినట్టల్లా నవును
వరుసతోఁ దిరిగాడేవారిమింతే నేము

చ. 3: సకలేశుఁడే కర్త జగములు గాచుటకు
ప్రకటించ నేర్పులు పనిలేవు
వొకట శ్రీవేంకటేశుఁ డొనరించినట్లవును
సుకియించి పొగడేటిసుద్దులింతే నేము

**తొలిపలుకు :**

మేము శ్రీహరిని దైవము, రక్షకుడు, సర్వస్వతంత్రుడు, సురశ్రేష్టుడు, సకలేశుడు అని తలచి మ్రొక్కెదము. బలవంతుడు ఆత్మబంధువు అయిన ఆ ప్రభువు కాక పరుల సహాయం కోసం తిరుగాడే అజ్ఞానం పోయి ఆయన యేదనుకొంటే అది అవుతుందని నమ్మి సుఖంగా ఆయన లీలలు గానం చేయటమే మా పని అంటారన్నమయ్య.

**భావదీపిక :**

బలవంతుడు ఆతడే (శ్రీహరియే). ఆత్మబంధువు కూడా అతడే. మేము ఇట్లా తలచి, అతనికి మ్రొక్కదగును. ఇంతే. ఇదే జ్ఞానము.

దైవమే భారకుడు (భారం వహించేవాడు). భూమండలానికి రక్షకుడు అతడే. ఆలోచిస్తే అది నరులచేతనయ్యే పని కాదు. అవునా? శ్రీవల్లభుడైన అతడు యెట్లా చేస్తే అట్లా అవుతుంది. మేము వావాత (చెప్పింది చెప్పినట్లు) అనుభవించే వారము. అంతకంటే మరేమీలేదు.

అన్ని పనులూ చేయటానికి శ్రీహరి సర్వస్వతంత్రుడు. పరులు ఇందులో తలదూర్చి ప్రయత్నించ వలసిన పని లేదు. అతడు దేవతలందరికి ప్రభువు. ఆయన యేమి చూస్తే అది కృతకృత్యమవుతుంది. మరి మేము? వరుసలో (వెంటబడి) తిరిగే వాళ్ళము అంతే.

ఈ జగములన్నిటికీ కర్త అయిన ఆయనే సకలమునకు ఈశ్వరుడు. కాపాడేవాడు. దీన్ని చెప్పటానికి పెద్ద నేర్పు అవసరంలేదు. శ్రీవేంకటేశ్వరుడు యెట్లా వొనరిస్తే (చేస్తే) అట్లా అవుతుంది. మేము సుఖంగా ఆయనను పొగడుతూ ఆయన కథలను గానం చేస్తుంటాము అంతే.

**సంఖ్య : 250**　**సంపుటము : 2**　**పుట : 167**　**రాగం : రామక్రియ**

పల్లవి: మగటిమిగల హనుమంతరాయ
దిగువపట్టణములోనిదేవ హనుమంత

చ. 1: చక్కఁగా దోఁక చాఁచి జంగవెట్టి చేచాఁచి
అక్కజపుప్రతాపపు హనుమంతుఁడా
రక్కసులఁ దునుమాడి రామునిదేవులకు
దిక్కై వుంగరమిచ్చినదేవ హనుమంత

చ. 2: కీలు గంటు వేసుకొని కెరలి పిడికిలించి
ఆలకించేవు దిక్కులు హనుమంతుఁడా
నేలకు మింటికి మేను నిండఁ బెరిగి యక్షుని
తీలుపడఁగొట్టినట్టి దేవ హనుమంతుఁడా

చ. 3: తమితోడ దాసులను తప్పక కాచేనని
అమర నభయమిచ్చిన హనుమంతుఁడా
జమళి శ్రీవేంకటేశుసరసపూడిగానకు
తిమురుచు నుండేయట్టి దేవ హనుమంతా

**తొలిపలుకు :**

బహుశా దిగువ తిరుపతిలో నున్న హనుమంతునిపై అన్నమయ్య చెప్పిన కీర్తనేమో ఇది అనే భావన కలుగుతున్నది. ఇది ప్రస్తుతి కీర్తన. దీనిలో కూడా నేటి తరానికి తెలియని పదములు చరణానికి ఒకటి చొప్పున ఉన్నవి. "మగటిమి" అంటే మా గురుదైవమైన అన్నమయ్యదే, సుమా!

**భావదీపిక :**

మగటిమి (మొగతనం) గలిగిన హనుమంతరాయా! నీవు దిగువ పట్టణము (తిరుపతి) లోని దేవుడవయ్యా హనుమంతా!

చక్కగా నీ తోకను చాచి, జంగవెట్టి (పంగచాచి), చేతులు చాచి ఆశ్చర్యకరమైన ప్రతాపమును చూపిన హనుమంతుడా! రాక్షసులను తుదముట్టించి శ్రీరాముని దేవులకు (దేవేరికి) దిక్కై రామముద్రిక నిచ్చిన దేవుడవయ్యా! హనుమంతా!

కీలుగంటువేసుకొని (కేశబంధమును గట్టిగా బిగించి), పిడికిలి గట్టిగా బిగించి, చెవులు నిక్కించి దిక్కులను ఆలకించుచున్నావయ్యా హనుమంతుడా! నీ శరీరాన్ని భూమ్యాకాశాలు నిండేటట్లు విస్తరింపజేశావు. అట్టి రూపంతో అక్షకుమారుని తీలుపడగొట్టి (నశింపజేసిన) హనుమంతుడవు.

హనుమంతా! నేటి కలియుగంలో నీ భక్తులను తప్పక కాచెదనని అభయమిచ్చుచున్నావు. దానికి తోడు శ్రీవేంకటేశుని సరసమైన వూడిగానికి సిద్ధపడివున్నట్టి దేవా! హనుమంతా! జయము జయము.



**సంఖ్య : 557**　**సంపుటము : 3**　**పుట : 374**　**రాగం : శంకరాభరణం**

పల్లవి: మిగిలిన దే మిఁకమీఁదట దేహికి
అగపడు నొక పడెఁ డన్నంబు

చ. 1: రతిఁ బగటివెలుఁగు రాత్రి చీఁకటికి
సతముగాదు అది సరికి సరి
అతిభోగములకు నార్జించుటకును
చతురపు సంపద సరికి సరి

చ. 2: అలయపథ్యమున కౌషధము గొనుట
చలువకు వేఁడికి సరికి సరి
నిలిచినపుణ్యము నిండుఁబాపములు
జలువు వెలువులకు సరికి సరి

చ. 3: మహి మరణములకు మరి పుట్టుగులకు
సహజ మందరికి సరికి సరి
యిహమున శ్రీవేంకటేశ్వరుఁ డాత్మకు
సహకారి యతఁడు సరికి సరి

**తొలిపలుకు :**

'సరికి సరి' అంటే 'అదెంతో ఇదీ అంతే' అని పోల్చటం అన్నమాట. అన్నమయ్య ఈ కీర్తనలో యేమంటున్నారంటే దేహి నానా అగచాట్లు పడియెంత సంపాదించినా, మిగిలిందేమిటి? ఒక్క 'పడి' అన్నం అంతేగా. మిగిలినవన్నీ 'సరికి సరి'. చివరికి శ్రీవేంకటేశుడు కూడా ఆత్మతో 'సరికి సరి' అంటున్నారు.

**భావదీపిక :**

ఇక మీదట దేహికి (జీవునికి) మిగిలిన దేమిటి? అగపడును (కనుపిస్తున్నది) వాడు తినే ఒక్క పడి (రెండు సోలలు) అన్నం. అంతేకదా! మిగిలినవన్నీ సరికి సరి (అదెంతో ఇదీ అంతే).

పగలు శోభాయమానమైన వెలుగు, రాత్రివేళ చీకటి.రెండూ స్థిరంగా వుండేవి కావు. ఇదెంతో అదీ అంతే. అతిశయించిన భోగాలు కావాలంటే, దానికి సరిపడే సంపద వుండవలసిందే. అవి రెండూ సరికి సరి.

వ్యాధిపీడితుడై అలసినప్పుడు, ఔషధము తీసికొనక తప్పదు. ఔషధము చేసే చలువకు వ్యాధి గలుగచేసే వేడికి సమతుల్యం వుంటేగాని వుపయోగంలేదు. రెండూ సరికి సరి. చేసిన పుణ్యం చివరికి మంచిచేస్తుంది. చేసిన పాపము యేనాటికైనా పీడిస్తుంది. పుణ్యమిచ్చే చలువుకు (సుఖమునకు) పాపమిచ్చే వెలువులకు (పీడలకు) సరికి సరి.

భూమిపై యెన్ని మరణాలున్నాయో అన్ని పుట్టుకలూ వున్నాయి. అవి అందరికి సహజం కాబట్టి సరికి సరి. ఈ లోకంలో శ్రీవేంకటేశ్వరుడు ఆత్మలలో అంతర్యామిగా వున్నాడు. అట్లా సహకరించటం చేత అంతా సరికి సరి.

**సంఖ్య : 173 సంపుటము : 4 పుట : 146 రాగం : మేఘరంజి**

పల్లవి: వట్టిజాలిఁ బడవలదిఁకను
గట్టి విచారముగల వారికిని

చ. 1: దేవుఁడు సులభుఁడు తెలియఁగనేర్చిన
వేవేలు లాభము విరతి
భావించు జ్ఞానమె పాదైన సౌఖ్యము
తావగు శాంతమె ధనధాన్యములు

చ. 2: గురుఁడె సాధనము కోరి వెదకినను
పరగు నాచారమె బ్రదుకెల్ల
శరణాగతియె సామ్రాజ్యపదవి
ధర జితేంద్రియత్వమె వైభవము

చ. 3: తననిజభక్తియె దండము దాపును
మనసు నిలుపుటే మరి శుభము
యెనయఁగ శ్రీవేంకటేశుమహిమ లివి
కని మని య(యు)ందుటె ఘనవివేకము

**తొలిపలుకు :**

గట్టి విచారము గల వారికి అంటే గొప్ప జ్ఞానులకు అని అర్ధం. అన్నమయ్య ఈ కీర్తనలో యేమి చెబుతున్నారంటే గొప్ప జ్ఞానులకు ఇకపై నిరుపయోగమైన జాలి పడనవసరము లేదు. శాంతిలేని ధనము దేనికి? శరణాగతి నెరుగని వారు జితేంద్రియులైతే నేమి? ఇంతకీ వివేకమంటే యేమిటి?.

**భావదీపిక :**

గట్టి విచారము గలవారికి (గొప్ప జ్ఞానులకు) ఇకపై నిరుపయోగమైన జాలి పడవలసిన పనిలేదు.

తెలిసికొనుట నెరిగిన వారికి దేవుడు సులభసాధ్యుడు. విరక్తి వలన అనేక లాభములు కలవు. పరమాత్మ భావించుట నెఱిగిన జ్ఞానమే సుస్థిరమైన సౌఖ్యము నిస్తుంది. ఎల్లప్పుడూ నిలిచివుండే శాంతస్వభావమే నిజమైన ధనధాన్యాలు.

పట్టుదలతో వెదకి కనుగొన్న సద్గురువే మోక్ష సాధనము. ఆయనతో బ్రతుకుటయే మేలైన యాచారము. భగవంతుని శరణాగతియే గొప్ప సామ్రాజ్యము. భూమిపై జితేంద్రియత్వమే మహావైభవము.

తన నిజమైన దైవభక్తి గొప్ప దండయుదావు (అండదండ). మనోస్థైర్యము శుభప్రదము. శ్రీవేంకటేశ్వరుని మహిమలను గ్రహించి మనస్సులో నిలుపుకోవటమే ఘనమైన వివేకము.



**సంఖ్య : 454 సంపుటము : 3 పుట : 306 రాగం : భవుళి**

పల్లవి: వద్దిక నోపము వట్టిస్వతంత్రము
వొద్దిక శాంతితో నుండేమయ్యా

చ. 1: నడవకమానవు నానాజగములు
కడఁగిన హరిసంకల్పానను
వుడుగ కిందు నావుద్యోగమేఁటిది
నడుమనే కనుఁగొని నవ్వేమయ్యా

చ. 2: కలుగక మానదు కాఁగలభోగము
కలిమిఁ బురాకృతకర్మమిది
అలసి యిందు నాయాస లేమిటికి
కలిగినపాటే కానీవయ్యా

చ. 3: తగులక మానదు తనసంసారము
వెగటగుమాయావిలాసము
అగపడి శ్రీవేంకటాధిపు కృపచే
తగినపాటినే తనిసేమయ్యా

**తొలిపలుకు :**

జీవులకి స్వతంత్ర్యము వున్నంత మాత్రాన పెద్ద వొరిగేదేమీ వుండదు. శాంతిలేని స్వతంత్ర్యం దండుగ అంటున్నారు అన్నమయ్య. హరి సంకల్పం లేక నా ప్రయత్నం ఫలిస్తుందా? భోగము పురాకృత కర్మఫలము కదా! మరి ఆశలు దేనికి? శ్రీవేంకటేశుడు యేమిస్తే దానితో తృప్తిపడాలి అంటున్నారు.

**భావదీపిక :**

ప్రభూ! వ్యర్థమైన స్వతంత్ర్యము వోపము (సహించలేము) ఇక మాకది వద్దు. ఒద్దికతో (వినయంతో) లభించే శాంతితో మేముండేదమయ్యా!

అనేక జగములు యీ విశ్వంలో నడువక మానవు. అవి హరి సంకల్పంచేత నడుస్తాయి. దీంట్లో నా వుద్యోగము (ప్రయత్నం) యేటిది? (యేపాటిది?) ఇదంతా చూచి మధ్యలో మాకు విపరీతమైన నవ్వు వస్తున్నది స్వామీ!

కాగల భోగము (రావలసిన వైభోగము) రాక మానదు. ఎందుకంటే సంపద పురాకృత కర్మ వలన సంప్రాప్తిస్తుంది. నేను వృథాగా ఆశపడి అలసిపోవటం దేనికి? యెట్లా మాపాటు (విధి) వుంటే అట్లాగే కానీవయ్యా!

జీవి సంసారములో వున్నప్పుడు, తగులక (సంబంధము పెట్టుకోక) మానదు (తప్పదు). ఇది భరించరాని మాయా చిద్విలాసము. ప్రత్యక్షమైన శ్రీవేంకటేశ్వరుని కృపచేత నాకు తగిన విధముగా నేను తృప్తి పడెదనయ్యా!

**సంఖ్య : 30 సంపుటము : 4 పుట : 381 రాగం : కాంబోది**

పల్లవి: వాగె బలువు దైవపురాయా - నీ
రాగె జతనము పరాకెచ్చరికె

చ. 1: మించులఁ దురగము మిన్నులు మోపఁగ
నంచలఁ గురుచల నాడఁగను
కంచు మించుగా గక్కనఁ దోలితి
పంచాస్త్రగురుఁడ పాదెచ్చరికె

చ. 2: పెక్కువతేజిటు పేరెమువారఁగ
తొక్కనిచోట్లు దొక్కఁగను
చుక్కలు మోపఁగ సొంపుగఁ దోలితి
తొ(తె)క్కుల దేవరదేవెచ్చరికె

చ. 3: అంకవన్నె పాదాబ్జము పదిలము
వేంకటేశ తిరువీధులను
సంకెలేక శ్రీసతితోఁ జెలఁగెడి
లంకెలఁ జాఁగు భళా యెచ్చరికె

**తొలిపలుకు :**

అద్భుతమైన ఈ కీర్తన రాబోయే కల్కిఅవతారమును సూచిస్తూ శ్రీవేంకటేశుని "ఉచ్చైశ్రవము" అనే తెల్లని గుఱ్ఱము మీద ఊరేగే వైభవాన్ని వర్ణిస్తున్నారు. ఇందులో ఒక అచ్చు తప్పుకూడా దొర్లింది. స్వామి "తొక్కుల దేవర" కాదు తెక్కుల దేవర (రాచఠీవిగల దేవుడు) అని అర్థం. మరి ఈ కీర్తన అన్నమయ్య నారికేళపాకంలో చెప్పారు. చిత్తగించండి. పరాకెచ్చరిక!!!

**భావదీపియ :**

బలమైన వాగె (అశ్వము) గల దైవపురాయా! (దేవచక్రవర్తీ!) నీ రాగెజతనము (ఎరుపెక్కిన ప్రయత్నమునకు) పరాకెచ్చరికె (బహుపరాక్ అంటాను).

నీ మించులఁదురగము (శ్రేష్టమైన గుఱ్ఱము) మిన్నులు మోపగన్ (నింగిని తాకగా) అంచలన్ కురుచలన్ ఆడఁగను (తెల్లని జూలు అటూఇటూ ఆడినది). కంచు మించుగా (కళ్ళకు కనబడనంత) గక్కన (వేగముగా) అశ్వమును తోలితివి. ఓ పంచాస్త్రగురుడ (మన్మథునితండ్రీ!) పాదెచ్చరికె (మేలైన బహుపరాక్ అంటాను).

పెక్కువతేజి (అతిశయించిన గుఱ్ఱము) ఇట్లు పేరెమువారగ (పరుగులు పెట్టగా) తొక్కని చోట తొక్కగను (ఆకాశమును తాకినది). స్వామీ! నీవు చుక్కలు మోపగ (నక్షత్రములు తగులు నంత యెత్తుకు) అందముగా తోలినావు. ఓ తెక్కుల దేవరదేవా (రాచఠీవితో యొప్పెడి దేవదేవా!) బహుపరాక్ అంటాను.

అంకవన్నె (ఎఱ్ఱరంగు) గల పాదపంకజములు, పదిలము (జాగ్రత్త) స్వామీ! శ్రీవేంకటేశ్వరా! తిరువీధుల గుండా నీవు శ్రీసతితో పోతుంటే, సంకెలేక (అసంఖ్యాకమైన) అతిశయించిన, లంకెలజాగులు (వరుసగా సాగిలబడిన విధము) భళా (సెహబాసు) హెచ్చరిక.



**సంఖ్య : 186 సంపుటము : 4 పుట : 125 రాగం : రామక్రియ**

పల్లవి: విత్తొకటి వెట్టఁగాను వేరొకటి మొలచీనా
హత్తి దేహగుణములు అతుమకయ్యీనా

చ. 1: చెంది చేఁదుదిన్ననోరు చేఁదేయయివుండుఁగాక
దిందుపడి కొంతైనాఁ దియ్యనుండీనా
బందెల సంకారికి బలు లంపటాలేకాక
అందు హరిఁజేరి సుఖ మందఁ దీరీనా

చ. 2: యెంగిలిఁ బుట్టినమేను హేయమే వెదకుఁగాక
చెంగలించి పావనము సేసుకోనీనా
ముంగిటిదేహికిఁ గర్మములు ముంచుకొనుఁగాక
రంగున శ్రీపతిఁ గొలిచి రతికెక్కీనా

చ. 3: చేతికి వచ్చినసొమ్ము చేరిదాఁచుకొనుఁగాక
యేతులఁదా నొల్లనంటా యీసడించీనా
యీతల శ్రీవేంకటేశుఁ డిచ్చిన విజ్ఞానము
ఆతుమ సంతసించుఁ గాకందు వెలితున్నదా

**తొలిపలుకు :**

అన్నమయ్య ఈ కీర్తనలో విత్తుననుసరించి 'వేరు' యెట్లా పెరుగుతుందో, ఒక క్రియకు పర్యవసానంగా జరిగే పాట్లు దేహికి కలుగక తప్పవు. చేదు తిన్ననోరు తియ్యగా వుండదు కదా! శ్రీవేంకటేశుడు కలిగించిన విజ్ఞానంతో ఆత్మ సంతోషిస్తుంది గాని వెలితి అనేది వుంటుందా అంటున్నారు.

**భావదీపియ :**

జ్ఞానులారా! విత్తొకటి నాటితే దానికి చెందిన "వేరు" మొలుస్తుంది. అంతేగాని వేరొక వేరు మొలుస్తుందా? దేహానికి వుండే గుణాలు ఆత్మకు వుంటాయా?

చేదును తిన్న నోరు చేదే అవుతుంది గాని, దిండుపడి (అతిశయించి) తీయగా మారుతుందా? బందెల దొడ్డిలాగా కట్టబడిన సంసారికి బలమైన లంపటాలు తగులుకొంటాయిగాని హరిని జేరి సుఖమును పొందుతూ వుండగలడా?

ఎంగిలి బుట్టిన (అపరిశుద్ధంగా పుట్టుక నొందిన) శరీరము హేయము కొఱకే వెదకును గాని తన దేహాన్ని పవిత్రంగా వుంచుకొంటుందా? ముంగిటి దేహికి (సంసిద్ధుడైన జీవుని) పురాకృత కర్మలు ముంచి వేస్తాయిగాని అందమైన శ్రీపతిని కొలిచి ప్రసిద్ధి చెందుతాడా?

ఎవడికైనా సొమ్ము చేతికి దొరికితే దాచుకొంటాడు కాని ఒళ్లు పొగరుతో నాకు వద్దు అంటాడా? ఇవతల నాకున్న విజ్ఞానమంతా శ్రీవేంకటేశ్వరుడిచ్చిందే. దానితో ఆత్మానందం కలుగుతుంది గాని వెలితి వుంటుందా?

**సంఖ్య : 436** **సంపుటము : 4** **పుట : 294** **రాగం : భౌళి**

పల్లవి: వెదకిన నిదియే వేదాంతార్థము
మొదలు తుదలు హరిమూలంబు

చ. 1: మునుకొని అవయవములు యెన్నైనా
పనివడి శిరసే ప్రధానము
యెనలేని సురలు యెందరు గలిగిన
మునుపటిహరియే మూలంబు

చ. 2: మోవని యింద్రియములు యెన్నైనా
భావపుమనసే ప్రధానము
యీవల మతములు యెన్ని గలిగినా
మూవురలో హరి మూలంబు

చ. 3: యెరవగు గుణములు యెన్ని గలిగినా
పరమజ్ఞానము ప్రధానము
యిరవుగ శ్రీవేంకటేశ్వరునామమే
సరవి మంత్రముల సారంబు

**తొలిపలుకు :**

వేదాంతార్థములను కలబోసి వెదకినచో తెలిసే సత్యం వొక్కటే. ఈ సర్వజగతికి మొదలు తుదలునకు మూలము శ్రీహరియే. ఎంతగుణవంతుడైనా పరమజ్ఞానము నేర్వనివాడైతే ప్రయోజనమేమిటి? శ్రీవేంకటపతి నామమే సర్వమంత్రముల సారము అని గ్రహించుటే గొప్ప జ్ఞానము అని అన్నమయ్య హరిగానము వినిపిస్తున్నారు.

**భావదీపిక :**

బాగుగా వెదకినచో ఇదియే వేదాంతార్థము (శ్రీవేంకటేశుని నామమే వేదాంతసారము). దానికి మొదలు తుదలు (ఆద్యంతములకు) హరియే మూలము.

మునుకొని (అతిశయించి) యెన్నెన్నో అవయవాలున్నా ప్రధానమైనది శిరస్సే కదా! ముక్కోటిదేవతలు లెక్కకు వున్నా మునుపటి హరి (ఆదివిష్ణువే) అందరికీ మూలము కదా!

జ్ఞానేంద్రియాలు, మోవని ఇంద్రియాలు (మనస్సును తాకిన ఇంద్రియాలు). అవియెన్నివున్నా బావించగల మనస్సే ప్రధానమైనది. ఇక్కడ మతములెన్ని వున్నా త్రిమూర్తులలో శ్రేష్ఠుడైన హరియే మూలమైనవాడు.

సుస్థిరమైన గుణములు యెన్నివున్నా పరమజ్ఞానము లేకపోతే ప్రయోజనంలేదు. సుస్థిరమైన శ్రీవేంకటేశ్వరుని నామమే అన్ని మంత్రముల సారము. ఇది గ్రహించుటే జ్ఞానము.



**సంఖ్య : 23** **సంపుటము : 4** **పుట : 379** **రాగం : శోకవరాళి**

పల్లవి: వేంకటగిరి గోవిందుడా
యింకా నొకరో యిద్దరొ మీరు

చ. 1: పచ్చలు దాచిన బహుపురులతో
అచ్చపుఁ గరముల అందముతో
అచ్చలు నిచ్చలు నలను (రు?) దురిదివో
నిచ్చలు (నిచ్చలు) నీవో నీవో కాని

చ. 2: నిలుచుండుటయును నెరిఁ బవళింపుచు
నలరుటయును మీరటు నిటును
జలజాక్షులు దొడ చరచఁగ నొరపుల
వెలయఁగ నిద్రో విభవమిదో

చ. 3: తిరువేంకటగిరి దిగువతిరుపతిని
పరమానందపు బహుసిరులు
అరుదుగఁ బొందుచు అధికములందుచు
ఉరగశయనుఁడవొ వొడయఁడవో

**తొలిపలుకు :**

తిరుపతిలో వెలసిన గోవిందరాజ స్వామిపై తియ్యని కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. వేంకటగిరి గోవిందుడా! ఇంకా మీరు ఇద్దరా? ఒక్కరా? నిలుచ్ను దేవుడు వొకరైతే పడుకొన్న దేవుడింకొకడు. ఒకాయన జగదేకపతి అయితే ఇంకొకాయన నాగశయనుడు అని పోలుస్తున్నారు.

**భావదీపిక :**

ఓ వేంకటగిరి గోవిందుడా! మీరు (గోవిందరాజులు, శ్రీవేంకటపతి) ఇంకా మాకు వొక్కరో యిద్దరో తెలియటలేదు.

పచ్చలు దాచిన (వజ్రాలు తాపడం చేసిన) బాహుపురులతో (చేతి కేయూరాలతో) నిర్మలమైన చేతులు అందము తొణికిసలాడుతుంటే అచ్చలు నిచ్చలు (అక్కడ తిరుమలలోను, ఇక్కడ తిరుపతిలోను) అతిశయించుచున్నారు. ఇదిగో ఇట్లా నిచ్చలు (నిత్యమూ) అలరించుచున్నది నీవో లేక నీవో.

తిరుమలలోని ఆయన నిలుచుని వుంటాడు. తిరుపతిలో ఆయన పడుకొనివుంటాడు. మీరు అటు (అక్కడ) ఇటు (ఇక్కడ) అలరుట బాగున్నది. జలజాక్షలు (శ్రీదేవి భూదేవి) తొడచరచగా (పట్టుదలతో) ఒరుపులు వెలయగ (విలాసము ప్రదర్శించగా) ఒకాయన తిరుపతిలో నిద్రిస్తుంటే, ఒకాయన తిరుమలలో వైభవము ప్రదర్శిస్తున్నాడు.

తిరువేంకటగిరి, దిగువ తిరుపతి మీా నెలవై బ్రహ్మానంద వైభవాన్ని ప్రదర్శిస్తున్నాయి. అరుదైన సేవలు పొందుతూ వొకరు, అధికమైన సేవలు పొందుతూ ఇంకొకరు వున్నారు. ఇంతకీ ఉరగశయనుడివా (శేషతల్ప శాయివా?) లేక ఒడయఁడవా? (జగదేకపతివా?).

**సంఖ్య : 116 సంపుటము : 4 పుట : 78 రాగం : పాడి**

పల్లవి: సచరాచర మిదె సర్వేశ్వరుఁడే
పచరించి యితని భావింపు మనసా

చ. 1: కదలెటి దంతయు కమలారమణుని-
సదరపు సత్యపుచైతన్యమే
నిదిరించెటియీ నిశ్చేష్టజగమును
వుదుటున నాతఁడు వుండేసహజమే

చ. 2: కలిగివుండినదె కల దింతయు హరి-
నలుగడఁ బరిపూర్ణపుగుణమే
మలసి లేనిదియు మహిమల నాతని-
నిలుకడగలిగిననిర్గుణమే

చ. 3: జీవరాసులగు సృష్టియింతయును
శ్రీవేంకటపతిచిత్తంబే
కైవల్యమె లోకపు టిహముఁ బరము
భావించనేర్చినపరమవిదులకు

**తొలిపలుకు :**

సృష్టిలోని చైతన్యములను జడపదార్థములను "అజడములు, జడములు" అంటారు. ఈ రెంటియందునూ సర్వేశ్వరుడున్నాడు. అయితే కొన్నిటిని ప్రత్యక్షంగా చూచినా కొన్నిటిని మనస్సులో భావించి మాత్రమే గ్రహించగలం అంటున్నారు అన్నమయ్య. మరి సృష్టిలో ఇంత వైవిధ్యమెందుకు వుంటున్నది? శ్రీవేంకటపతి ఇష్టం. అంతే.

**భావదీపిక :**

ఇదే మనకు కనబడుతున్న సమస్త చరాచరములు (జడములు, చైతన్యములూ) ఆ సర్వేశ్వరుడే. ఓమనసా! ఇతనిని పచరించి (ఉపాయంతో) భావింపుము (గ్రహింపుము).

ఈ సృష్టిలో కదలేటిదంతా లక్ష్మీపతి నిత్య సత్యమైన చైతన్యమే. నిద్రించునప్పుడు నిశ్చేష్టమైన జగత్తు అంతా అతిశయముగా ఆయనవుండే సహజ ప్రపంచమే.

అంతటా వున్నదేమిటి? నలుదిక్కులా వ్యాపించిన శ్రీహరి పరిపూర్ణ గుణవిశేషములే. మలసి (వ్యాపించి) లేనిదేమిటి? నిలకడ గలిగిన ఆతని నిర్గుణ విశేషమే. నిర్వికార స్వభావమే.

ఈ సృష్టిలో ఇన్నికోట్ల జీవరాసులున్నాయి. జడములు చైతన్యములు. ఏది జడము, ఏది చైతన్యము? అంతా శ్రీవేంకటపతి ఇష్టం. కైవల్యమూ ఆయన చిత్తమే. లోకములోని ఇహమూ ఆయన ఇష్టమే. పైనున్న పరమూ ఆయన ఇష్టమే. భావించగల పరమ వేదాంతులకు "అంతయు నీవేహరి పుండరీకాక్ష".



**సంఖ్య : 435 సంపుటము : 4 పుట : 293 రాగం : ముఖారి**

పల్లవి: సమ్మతించి కనుకొండ సరుస నిశ్చలబుద్ధి
యెమ్మె నెంత బోధించినా నెక్కుడేల కలుగు

చ. 1: తలఁపులో కొలఁది దైవము, తనవల్ల
గల విరతికొలఁది ఘనసుఖము
తెలిసిన కొలఁదే తేటల విజ్ఞాన మందు-
నెలమి నెవ్వరికైన నెక్కుడేల కలుగు

చ. 2: తపము కొలఁదియే తరువాతి ఫలమును
వుపమ కొలఁదియే యోగమును
ప్రపత్తి కొలఁదియే భాగవతభక్తియును
యెపుడు నెవ్వరికైనా నెక్కుడేల కలుగు

చ. 3: చెంది చేసినకొలఁదే శ్రీవేంకటేశుసేవ
అంది పొందినకొలఁదే యానందము
కందువనీతని కృపగలకొలఁదే యింతాను
యెందును దక్కినవారి కెక్కుడేల కలుగు

**తొలిపలుకు :**

"చేసికొన్నవారికి చేసికొన్నంత మహాదేవా!" అంటారు పెద్దలు. ఏదీ దానంతట అదే రాదు. నిశ్చలబుద్ధి వూరకనే వస్తుందా? కూర్చోబెట్టి యెక్కువ సేపు బోధిస్తే ఎక్కువ జ్ఞానం వస్తుందా? ఎంత కృషియో అంతే ఫలితం. ఎంత ప్రాప్తమో అంతే లబ్ధి. అంతెందుకు హరికృప యెంతవుంటే అంతే దక్కుంతుంది అంటున్నారు అన్నమయ్య.

**భావదీపిక :**

సరసమైన నిశ్చలబుద్ధి ఎంత సమ్మతముతో కనుగొంటే అంతే వస్తుంది. ఎమ్మెన్ (చక్కగా) యెంత బోధించినా, యెక్కువ వస్తుందా? రాదు.

మన తలపుల కొలదే (ధ్యానం మేరకే) దైవము వుంటాడు. జీవికి యెంత విరక్తి కలిగితే అంత చిన్మయానందం దక్కుతుంది. తేటపడిన విజ్ఞానము ఎంత తెలుసుకొంటే అంత లభిస్తుంది. ఎవ్వరికైనా యెక్కువ యెలా వస్తుంది?

ఎవ్వరికైనా యెంత తపస్సుచేస్తే అంత ఫలము దక్కుతుంది. ఎంత ఉపమ (ఉపాయము) వుంటే అంత యోగము (కూర్పు) కలుగుతుంది. ఎంత ప్రపత్తి (శరణాగతి) వుంటే భాగవతులపై భక్తీ అంతేవుంటుంది. ఎప్పుడైనా యెవ్వరికైనా యెక్కువావుండదు తక్కువా వుండదు.

శ్రీవేంకటేశుని చేరి యెంత సేవ చేస్తే ఆయనకు అంత చెందుతాము. ఆయనను యెంత పొందితే అంత ఆనందం దక్కుతుంది. ఏదైనా ఆయన కృప యెంతుంటే అంత ప్రాప్తిస్తుంది. ఆయన కృప దక్కినా యెక్కువెందుకు దక్కుతుంది? చెప్పండి.

**సంఖ్య : 479** **సంపుటము : 4** **పుట : 323** **రాగం : వరాళి**

పల్లవి: శ్రీసతీశ బహుజీవ చైతన్యుఁడవు నీవు
చేసే నా చేఁతలెల్లా నీ సేవలెసుమ్మీ

చ. 1: ఆనుక జగద్రూపుఁడవని నిన్నందురుగాని (న?)
నేనిట్టే చూచినవెల్లా నీరూపులే
నానాశబ్దవాచ్యుఁడ వెన్నఁగ నీ వటుగాన
వీనుల విన్నవల్లా నీ విష్ణుకథలే

చ. 2: అట్టే విశ్వభుజుఁడవైతివి తొల్లే కనక
నెట్టన నారుచులెల్లా నీ ప్రసాదాలే
గుట్టుతో సర్వవ్యాపకుఁడవు నీ వటుగాన
ముట్టిన నాతనుభోగములు నీకే సెలవు

చ. 3: ప్రక్కన జీవులకెల్ల ప్రాణమవు నీవేకాన
ముక్కున నాయాఘ్రాణములెల్లా నీవే
నెక్కొని శ్రీవేంకటేశ నీవే లోకకుటుంబివి
తక్కక నా సంసారధర్మమెల్లా నీవే

**తొలిపలుకు :**

మానవులు పంచేంద్రియాలతో గ్రహించగలిగిన జ్ఞానమంతా దైవప్రసాదమే కదా! కాబట్టి వాటితో మనం చేసే చేతలన్నీ ఆ స్వామి సేవలే అంటున్నారు అన్నమయ్య. శ్రీవేంకటేశుడు వసుధేక కుటుంబి. కాబట్టి నా సంసార ధర్మమంతా శ్రీహరే అంటున్నారు.

**భావదీపిక :**

ఓ శ్రీసతీవల్లభా! సకల జీవుల చైతన్యమే నీవై విలసిల్లుతున్నావు. నేను చేసే నా చేతలెల్లా నీ సేవలే ప్రభూ!

నీవు జగత్తే రూపముగా గలవాడవని అంటారు. అందుచేత నేను చూచే రూపములలో నిన్ను చూస్తున్నట్లే కదా! ఎంచగా నానాశబ్దముల అర్థము నీవేనని పెద్దలంటారు కదా! కాబట్టి నా చెపుల ద్వారా నేను విన్నవన్నీ నీ విష్ణుకథలే.

తొల్లేను (ఆదిలోనే) నీవు విశ్వభుజుడవు (విశ్వభోక్తవు). కావున నాకు రుచిని కలిగించేవన్నీ నీ ప్రసాదములే. నీవే సర్వవ్యాపకుడవు. అందుచేత నా తనువు ద్వారానే ననుభవించే భోగమంతా నీకే సెలవు (నీ అనుజ్ఞ వల్ల లభించినదే).

సమస్త జీవులకు ప్రాణము నీవే. ముక్కుతో శ్వాస పీల్చి వదలుటే ప్రాణశక్తి. మరి నా ముక్కుకున్న ఆఘ్రాణశక్తి అంతా నీవే. నెలకొనిన శ్రీవేంకటేశ్వరా! వసుధైక కుటుంబము అని చాటిన లోకకుటుంబివి నీవే. కావున వీడక నా సంసార ధర్మమంతా నీవే.





# సంపుటి -III

# హరి గానమే అన్నమయ్య జ్ఞానము

## సంపుటి -III

### ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు భావదీపిక

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | కీర్తన విషయము | సంపుటము/ సంఖ్య | పేజీ |
|---|---|---|---|
| 1. | అపురూపమైన మోహము దాఁచి యిటువంటి- | 5/128 | |
| 2. | అవునే యింతేసి సేసేవపుడే నీవు | 8/186 | |
| 3. | ఆతనివల్లఁ దప్పేది అరసి చూచేనంటే | 7/500 | |
| 4. | ఇంకాఁ జదువవయ్య యిటువంటివి | 8/275 | |
| 5. | ఇంతిమోహములిఁక నేమని చేప్పేము నీకు | 7/499 | |
| 6. | ఇంతే విన్నపమింతేలా నీ- | 5/20 | |
| 7. | ఇందాఁక నెరఁగము యీవింత సతి | 7/330 | |
| 8. | ఇచ్చలోనిదాన నేను ఇన్నిటా నీకు | 19/162 | |
| 9. | ఉండరే యెక్కడిసుద్ది వొడఁబరచకురే | 8/296 | |
| 10. | ఊరకుంటే నన్ను నుండనియ్యవు ఇంత | 5/243 | |
| 11. | ఊరకుండవయ్యా వుడివోవు వలపులు | 8/277 | |
| 12. | ఎంత సేయఁగనేరదింతి గోపించినను | 5/375 | |
| 13. | ఎట్టయిన జేయరా నీ విఁకనేలా నన్నుఁ | 5/47 | |
| 14. | ఎప్పుడు గాని రాఁడో యెంతదడవాయ కాలి- | 5/46 | |
| 15. | ఎరుఁగుదుము నీ నాయా లేల చెప్పేవు | 8/274 | |
| 16. | ఎవ్వరిముందరఁ జూసే వేడలేనినీగుట్టు | 19/159 | |
| 17. | ఏమని పొగడుదమె యీచెలిచక్కఁదనము | 7/337 | |
| 18. | ఏమని భావింతు నిన్ను నెంతని సంతోసింతు | 8/175 | |
| 19. | ఏమి సేతు ముచ్చటకు యెవ్వరు గలరు నాకు | 7/331 | |
| 20. | ఏలనాచే మొక్కించేరే యిప్పుడేనన్ను | 8/71 | |
| 21. | ఒద్దేలే జగడాలు వోయింతి | 8/70 | |
| 22. | కంటిమి వింటిమి నేడు కందువగాను | 19/158 | |
| 23. | కందువ నేఁడెందరైనాఁ గలరు నీకు | 5/377 | |
| 24. | కానవచ్చెఁ గదే మీకు కాంతలాల | 8/137 | |
| 25. | కానీవే యెంతకెంత గబ్బితనము | 8/73 | |
| 26. | కొమ్మకడకు విచ్చేసి కోరినవరమీరాదా | 7/380 | |
| 27. | కొలమునొకటిగాదు గుణమునొకటిగాదు | 7/582 | |
| 28. | గుట్టుతోడిదాన నేను కొసరనేల | 8/272 | |
| 29. | చెప్పకున్న దోసము చేఁతలెరిఁగినవారు | 8/176 | |
| 30. | చెలులము నేము బుద్ధి చెప్పనోపమాకెకు | 7/339 | |
| 31. | చెలులెల్లాఁ జూచి సంతోసించి మెచ్చి పొగడేరు | 7/370 | |
| 32. | చేఁతలు నీవిచూచి సిగ్గయ్యీ మాకు | 7/381 | |
| 33. | చేసిన తనచేఁతలు చెప్పరాదు | 7/584 | |
| 34. | తనసేవ నేఁజేయనా తగవు దప్పఁగాఁ గాక | 7/338 | |
| 35. | తల వంచుకోకుమీ తప్పు నీయందేమి లేదు | 7/501 | |
| 36. | దంతచ్ఛద ముద్రా మదనాస్త్రల- | 5/318 | |
| 37. | దేవరచిత్తం దివ్యనిధి | 5/19 | |
| 38. | దేవ! వాసుదేవ | 19/332 | |
| 39. | దొరకెఁగా పూజ కందువపూజ నీ- | 5/95 | |
| 40. | న తు మమ తావన్మానసస్త్వదీయ | 6/85 | |
| 41. | నిన్నుఁ గూడిన విభుని నిలువెల్ల సొంపాయ | 5/356 | |
| 42. | నేడుగొత్తలా తన నేరుపులివి | 8/298 | |
| 43. | నేనే వింతగాని నీచుట్టాలవేయివి | 7/371 | |
| 44. | పోపో అదేఁటిమాట పొద్దువోదా | 7/332 | |
| 45. | నేఁడె సుక్కురారము నెలఁతలాల | 8/153 | |
| 46. | మాజహిహి దుష్టమనాయితి | 10/7 | |
| 47. | మాపుదాఁకా గొసరిన మాను మానే రాయి రాయే | 8/287 | |
| 48. | మాయలేల సేసేవు మన్నించరాదా | 19/160 | |
| 49. | మావంటివారి దీవెన మరి యేకాలము గద్దు | 8/276 | |
| 50. | వినవే విభునిమాట వింతదానవా | 8/143 | |
| 51. | హత్తి రాజసపువాఁడ వయినాఁగాని | 8/185 | |

**సంఖ్య : 128 సంపుటము : 5 పుట : 88 రాగం : సామంతం**

పల్లవి: అపురూపమైన మోహము దాఁచి యిటువంటి-
కపటపు నటనలు గడియించనేలే

చ. 1: కిన్నెరకాయలఁ బోలు కిక్కిరిసినట్టి గుబ్బ-
చన్నులపై నునుఁగొంగు జారఁగ
కిన్నెర మీఁటుచు మంచి సన్నపు నడపుతో
కన్నుల దేలఁగమేను కదలించేవేలే

చ. 2: వీడియు వీడనికొప్పు వేగన ముడుచుచు
ఆడెడి బిత్తరిమాటలమరఁగా
చూడనొప్పె నీ మంచి సుద్దులు చెప్పఁగనెంతే
వాడక వాడుదురే వైతాళమేలే

చ. 3: చెక్కుటద్దములమీఁది చెమట చిత్తడితోడ
సొక్కులు దేరఁగ మేను సుదతికి
చిక్కించి నిన్నుఁగూడె శేషగిరీంద్రుఁడు నీ పయి
మక్కువ గలిగి కొంత మనసియ్యఁడేలే

**తొలిపలుకు :**

అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో వొక చెలికత్తెయై దేవిని ప్రశ్నిస్తున్నారు. దేవీ అపురూపమైన నీ మోహాన్ని యెందుకు దాచిపెడతావు? నీ ప్రవర్తనే నీ సంగతి వెల్లడిచేస్తోంది కదా! అని అంటూ దేవి చేష్టలను వివరిస్తున్నారు. ఈ కీర్తనలో “వేంకటేశ” మకుటం లేక పోవటం విశేషం. అందువలన ఈ కీర్తన కూడా “అపురూపమే”.

**భావదీపిక :**

దేవీ! అపురూపమైన నీ మోహమును దాచిపెట్టి ఇటువంటి కపటమైన నటనలు గడియించనేలే? (కల్పించుటెందులకమ్మా?).

నీ కిక్కిరిసిన గుబ్బచన్నులు (బిగువైన కుచములు) కిన్నెర కాయలను (వీణకు బిగించిన సొరకాయ బుర్రలను) బోలియున్నవి. వాటిని గప్పుపయ్యెద జారగా కిన్నెర మీటుచు (వీణ వాయించుచూ) మంచి సన్నని నడుము తేలిపోయే కన్నులతో నీ వంటిని అంత వేగముగా కదిలించేవేలనే?

వీడక విడిపోవుచున్న కొప్పును వేగముగా ముడువబోయి వేగముగా పలుకు నీ బిత్తర మాటలు బాగుగా అమరినవి. నీవు చెప్పే మంచి “కతలు” వాడకుండానే వాడుకయైపోతాయి. వైతాళమేలే? (మాకు ఇదంతా నిత్యమైన మేల్కొలుపు). మాకెందుకమ్మా ఇవన్నీ?

ఈ సుదతికి మేను సొక్కుదీరునట్లు చెక్కిళ్ళపై కారిన చెమటల చిత్తడి పోవునట్టు తుడిచి అద్దము వంటి చెక్కిళ్ళ నిగ్గుతేల్చేదము అని తలచునంతలో శేషగిరీంద్రుడు వచ్చి నిన్ను కూడినాడు. అట్టి స్వామి కొంత మక్కువ నీపై కలిగి మనసియ్యడేలనే?



**సంఖ్య : 186 సంపుటము : 8 పుట : 109 రాగం : కన్నడనాట**

పల్లవి: ఆవునే యింతేసి సేసేవపుడే నీవు
చవులుసేసి యిచ్చేది జవ్వనమేకాదా

చ. 1: సిగ్గువడ్డవారికిని చెక్కిటి చేయేమరఁగు
దగ్గరి రాఁగదవే ఆతఁడు విల్చీని
కగ్గులేక నీవంటి కన్నెలేకారా పతిని
యెగ్గులుఁ దప్పులుసోఁక నెలయించేవారు

చ. 2: సెలవి నవ్వేవారికి చేతిమొక్కులే మరఁడు
తలఁగకుండఁగదే ఆతఁడు ముట్టీని
మొలచిన నీవంటి ముగ్ధలేకారా పతిని
తెలిపి రతికిఁదీసి తెమలిఁచేవారు

చ. 3: కాఁగిటఁగూడేవారికి కనురెప్పలే మరఁగు
వీఁగకువే కూడెను శ్రీ వేంకటేశుఁడు
మాఁగినమోవి నీవంటి మానాపతులేకారా
రాఁగలై యీతనిఁ బొంది రవ్వకెక్కినారు

**తొలిపలుకు :**

అన్నమయ్య దేవితో ఇప్పుడే మా పెళ్ళయ్యిందోలేదో యెంతెంత పనులు చేస్తున్నావే నీవు!!! నీవు సంప్రీతితో నీ స్వామికి సమర్పించింది నీ యౌవనమే కదా! శ్రీవేంకటేశుడు నిస్సంకోచంగా నిన్ను కూడితే నీవంటి మానవతులు అయన పొందుతో జగత్ప్రసిద్ధులైనారు అంటున్నారు.

**భావదీపిక :**

అవునే నీవు అప్పుడే ఇంతేసి అఘాయిత్యాలు సేసేవు. నీవు నీ పతికి చవులుసేసి (ప్రీతిగా) సమర్పించేది నీ యౌవనమే కాదా?

సిగ్గుపడ్డ భామకు చెక్కిలిపై చెయివేసికొనుట యేమి అరుదు? అతగాడు నిన్ను పిలిచినాడు. కాస్త దగ్గరకు రావమ్మా! కగ్గులేక (సంకోచించక) నీవంటి కన్నెలే తమ పతిని తప్పులెంచి ఆవిధంగా వశపరచుకొంటారు.

చిరునవ్వులొలికించే చిన్నారికి చేతికొచ్చినన్ని మొక్కులు యేమి అరుదు? అతడు నిన్ను ముట్టుకొంటే తొలగిపోకుమమ్మా! నీవంటి నవముగ్ధలే పతిని రతికి పిలిచి తెమలించేరు (చలింపజేస్తారు).

పతి కౌగిట కూడేవారికి కనురెప్పలే మఱుగుతెర. దేవీ! నీవు వెనుకంజవేయకు. శ్రీవేంకటేశుడు నిన్ను కూడినాడు. నీవంటి మానాపతులు (పతివ్రతలే) ఎఱ్ఱని పెదవులు పతికిచ్చి అనురాగవతులై అతనిని పొంది రవ్వకెక్కినారు (పేరుగడించారు).

**సంఖ్య : 500** **సంపుటము : 7** **పుట : 306** **రాగం : ఆహిరి**

పల్లవి: ఆతనివల్లఁ దప్పేది అరసి చూచేనంటే
కాతరపు నాగుణాల గతులింతే కాక

చ. 1: చనవుమెరసి నేను సారెకు మాటలాడఁగ
వినక మానీనా విభుఁడు తాను
ననిచి నాపై ప్రేమ నాఁటెనో నాఁటదో యని
అనుమానపు నామనసల్లాడీఁ గాక

చ. 2: వీడిన తురుముతోడ వేగమె నేమొక్కఁగాను
చూడక మానీనా సుగుణ (ణి?) తాను
వాడుదేర నన్నుఁ గూడ వచ్చీనో రాఁడోయని
వేడుకతోఁ దమకించే విధమింతే గాక

చ. 3: పొంకానఁ గాఁగిలించి పొసఁగ నేఁగూడఁగాను
లంకెగాక మానీనా శ్రీవేంకటేశుఁడు
కొంకక నా రతులియ్యకొనునో కొనఁడోయని
సంకెలేని నాలో విచారమింతే కాక

**తొలిపలుకు :**

స్వామిని చేరబోతున్న దేవి మనస్సు సందేహాల సందోహంలాగా వున్నది. అన్నమయ్య ఆమె చిత్తప్రవృత్తిని అద్భుతంగా ఆవిష్కరిస్తున్నారు. తేరిపార చూస్తే అతని తప్పేమీ లేదనిపిస్తోంది. ఇవన్నీ నా చిత్తచాంచల్యమే. అసంఖ్యాకమైన నా ఆలోచనలే నన్ను ఆడిస్తున్నాయి అని ఆరాటపడుతొంది ఆ చిన్నది.

**భావదీపిక :**

అరసి చూస్తే అతని వల్ల తప్పేముంది? కాతరపు (చంచలమైన) నా గుణాల (మనోవైక్లబ్యాల) గతులింతే (తీరే అంత) అనిపిస్తొంది.

నేను చనువు తీసికొని ప్రతిసారి మాట్లాడితే తాను వినక మానునా? అయన నా భర్త కదా! అయినా అతనికి నాపైన ననిచిన ప్రేమ (అతిశయించిన అనురాగం) నాటుకొన్నదో లేదో? నామనస్సు అనుమానంతో అల్లాడిపోతున్నది.

నా కొప్పు విడిపోయినా నేను లెక్కసేయక వేగముగా అతని కాళ్ళకు మ్రొక్కగా తాను సుగుణాల సుందరుడు కావున నన్ను చూడక మానేనా? లేక వాడుదేర (అలవాటైన వానివలె) నన్నుకుడుటకు వచ్చునో రాడో? వేడుకతో ప్రేయసిని తపింపచేసే విధానమిదేనేమో?

ఆ శ్రీవేంకటేశ్వరుడు నేను తనను పొంకముగా కౌగిలించి పొసగునట్లు కూడితే నన్ను లంకెవేసి కొనకమానుతాడా? అయినా, కొంకక (జంకులేక) నా రతులకు తానిచ్చగించునో లేదో? నాలో అసంఖ్యాకమైన ఆలోచనలు వస్తున్నాయి. ఇదేమో?



**సంఖ్య : 275** **సంపుటము : 8** **పుట : 160** **రాగం : సాళంగనాట**

పల్లవి: ఇంకాఁ జదువవయ్య యిటువంటివి
లంకెలాయ నీవిద్య లావరివి నైతివి

చ. 1: పెదవిపై సుద్దులు ప్రియముల బద్దులు
యెదుగాఁ జదివితివి యిపుడు నీవు
వదరు సతులు నీతో (నీతో) వాదించే వారెవ్వరు
తుదకెక్కె నీవిద్య దొడ్డవాఁడ వైతివి

చ. 2: మంతనపు మంత్రాలు మంకుగోరి యంత్రాలు
యింతగా నేరుచుకొంటి విపుడు నీవు
జంతల సతులు నిన్ను సాధించే వారెవ్వరు
దొంతినున్నది నీవిద్య దొడ్డవాఁడ వైతివి

చ. 3: అట్టయిన సత్యా లాఱడి జోలినిత్యాలు
యిట్టివె నేరుచుకొంటి విపుడు నీవు
గట్టిగా శ్రీవెంకటేశ కాఁగిలించితివి నన్ను
తొట్టెను నీవిద్యలెల్ల దొడ్డవాడవైతివి

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో దేవి స్వామితో యెలా దెప్పుతున్నదో చిత్తగించండి. ఇటువంటి విద్యలు ఇంకా నేర్చుకో స్వామీ! వీటిలో ఆరితేరావు. చివరికి స్వామి తన "విద్య"లను దేవిపైననే ప్రయోగించి ఆమెను కౌగలించి దొడ్డవాడయ్యాడట. మనమేం చేయగలము చెప్పండి?

**భావదీపిక :**

ప్రభూ! ఇటువంటి విద్యలు ఇంకా మరెన్నో చదువవయ్యా! (నేర్చేసుకో). నీ విద్యలు లంకెలాయ (వరుసగా వెలివడుతున్నాయి). నీవు గొప్పలావరివైతివి (ఉద్దండుడవైనావు).

నీ పెదవులపై కొత్త కొత్త కథలు పుట్టుకొస్తాయి. వినడానికి అవి అనురాగాల పద్దులు. నీవు ఇప్పుడు మా యెదురుగా ప్రదర్శిస్తున్నావు. సతులు యెంతవాదించినా నీతో నెగ్గేవారెవ్వరు? నీ విద్యలన్నీ కొనకెక్కితివి (కడతేరితివి) దొడ్డవాడవైతివి (విద్యా పారీణుడవైతివి).

నీవు రహస్యంగా సాగించే మంతనాలు, మంకుతనం చాటి చెప్పే నీ యంత్రాంగాలు నీవు యెంతగానో నేర్చుకొన్నావు. నీ భార్యలు జంతల (గయ్యాళులై సాధిస్తారా?). ఎవరాపని చేయగలరు? నీ విద్యలు దొంతరగావున్నాయి. నీవు విద్యాపారీణుడవు.

సత్యము లెప్పుడూ అట్టవుతాయి. ఆఱడిపెట్టే నీ "సంబంధాలు" నిత్యనూతనములు. ఇవన్నీ నీవీ మధ్య నేర్చిన విద్యలే. శ్రీవేంకటేశ్వరా! నన్ను గట్టిగా కౌగలించితివి. అధికమైన నీ విద్యలలో నీ వెప్పుడూ విద్యాప్రవీణుడవే.

**సంఖ్య : 499**　**సంపుటము : 7**　**పుట : 306**　**రాగం : దేసాళం**

పల్లవి: ఇంతిమోహములిఁక నేమని చేప్పేము నీకు
మంతనాననాకెనేలి మన్నించవయ్యా

చ. 1: చిలుకలు మాఁటాడితేఁ జేరి నీవంపినయట్టి
చెలులపలుకులంటాఁ జెవి యొగ్గి వినును
అలులు మొరసితే నీవాడకు వచ్చేయప్పటి
బలుశంఖరావాలని పైపైనాలకించును

చ. 2: మరుని పంచబాణాలు మనసున నాఁటితే
విరుల వేసేవంటా వెస నవ్వును
సురటుల విసరితేఁ జూచి నీవూరుపుగాలి
సరుగనేతెంచెనని సంతోసించుకొనును

చ. 3: చందురుఁడుదయించితే చాయల నీపంజనుచు
యిందుముఖి నీరాకకునెదురువచ్చు
అందపు శ్రీవెంకటేశ అంతలో నీవేలితివి
యిందులోఁ దెలిసి వాని హితులంటా మెచ్చును

**తొలిపలుకు :**

దేవి చెలికత్తెలలో వొక్కతెయై అన్నమయ్య స్వామి వారికి వినిపిస్తున్న దేవి విరహవేదన ఇది. అలులు, సురటులు, పంజ వంటి పద ప్రయోగాలవల్ల నాబోటి వారు తెల్లమొహం వేసే సందర్భాలు చాలా వున్నాయి ఈ కీర్తనలో. స్వామివారు దేవిని యేలుకోగానే ఆయన హితులైన పై ముచ్చరిని మన్నించిందట ఆ జగజ్జనని.

**భావదీపిక :**

స్వామీ! ఈ ఇంతి మోహముతో తపించి పోవుచున్నది. ఇక అవి యేమని వర్ణించము? ఏకాంతములో ఆమె నేలుకొని మన్నించుము ప్రభూ!

ఆమె వద్దనున్న చిలుకలు మాట్లాడితే నీవు పంపిన చెలుల పలుకులేమోనని చెవి యొగ్గి వింటుంది. అలులు (ఆళుల=తుమ్మెదలు) మొరసితే (ఝుంకారం చేస్తే) నీవక్కడకు వచ్చే సూచనగా వినిపించే గొప్ప శంఖారావమని పైపైన ఆలకించి పరవశిస్తుంది.

మన్మథుని పంచబాణములు ఆమె మనస్సున నాటుకొంటే నీవే ఆమెపై పూలను వేస్తున్నావని తలచి నవ్వుతుంది. చెలులు ఆమెకు సురటులు (విసనకఱ్ఱలు) విసరితే అది నీ ఊర్పుల గాలి అని నీవు వేగముగా వచ్చావేమోనని సంతోషిస్తుంది.

చంద్రోదయమైతే చీకటి పడి నీవు వచ్చేటప్పుడు వెంట తెచ్చుకొనే పంజు (చే దివిటీ) అని ఆ ఇందుముఖి నీ రాకకు యెదురు వస్తుంది. అందమైన శ్రీవేంకటేశ్వరా! అంతలోనే నీవామెను యేలుకొనినావు. ఇది తెలిసిపైన చెప్పిన వారిని ఆమె హితులంటూ మెచ్చుకొన్నది.



**సంఖ్య : 20**　**సంపుటము : 5**　**పుట : 14**　**రాగం : శంకరాభరణం**

పల్లవి: ఇంతే విన్నపమింతేలా నీ-
పంతము చేకొంటి పాలించు

చ. 1: ఆలయు సొలయునతివ లోలోనే
చెలిపై నొరగు చెక్కు (గుఁజెక్కు?) నొక్కు
పులకించు నించు వొ (చుఁబో?) లఁతి చెమట
చిలికించు గోరఁజిత్తగించు

చ. 2: చెలుల మొరఁగు చిం (గుఁజిం?) తచేఁ గరఁగు
పలుకఁ దలఁచు బడలును
పిలుచు నిన్ను నీపేరుకొనుచును
తొలఁకు కన్నీరు దుడుచును

చ. 3: చనుఁగవ చూచు సారె నీసేఁతలు
తనలోనే మెచ్చి తనరును
అనయము వేంకటాధీశ యీా యింతిఁ
జెనకి కౌఁగిటఁ జేకొంటివి

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో దేవి చెలికత్తెలు స్వామిని పంతాలుమాని ఆమెను చేకొని పాలించమని విన్నవించుకొంటున్నారు. ఇందులో శృంగారం పాలు కొంత యెక్కువనే చెప్పాలి. అన్నమయ్య దేవి చెలికత్తెగా అవతరించినప్పుడు చెలికత్తె సలహాలు అమ్మవారికే కాదు పాఠకులకూ సిగ్గు తెరలు కప్పుతాయంటే నమ్మండి.

**భావదీపిక :**

స్వామీ! ఇంతేనా? ఇంత విన్నపము యేలనయ్యా? నీ వింత పంతము చేకొంటివి. మా దేవిని పాలింపుమయ్యా!

లోలోపల యీా అతివ యెంత అలసిందో యెంత సొలసిందో చూచితివా? ఆ చెలిపై నొరగుము, చెక్కిలి నొక్కుము, అప్పుడామె పులకించును. ఆ పొలతి (యువతి) చెమటతో నిండిపోతుంది. ఆ చెమటను నీగోటితో చిలికించి మా విన్నపము చిత్తగించుము.

ఆమె చెలులను మొరగును (అరుస్తున్నది). తదుపరి అయ్యో ఇట్లేల చేసితినని చింతించి కరిగిపోతుంది. ఏదో మాట్లాడాలని అనుకొంటుంది. అంతలో బడలిక ప్రదర్శిస్తుంది. నీ పేరు పెట్టి పిలుస్తుంది. ఎందుకిలా దురుసుగా ప్రవర్తించానా అని తొలకెడి కన్నీరు తుడుచుకొంటుంది.

ప్రతిసారీ తన చనుగవను చూచుకొని నీ చేతలను తలచుకొంటుంది. వాటి పొంకమునకు తనలోనే మెచ్చుకొని అతిశయిస్తుంది. ఎల్లప్పుడూ వో తిరువేంకటేశా! యీా ఇంతిని స్పృశించి ఆర్తితో నీ కౌగిట చేకొంటివి. ఆమె ధన్యురాలు ప్రభూ!

**సంఖ్య : 330** **సంపుటము : 7** **పుట : 204** **రాగం : బౌళి**

పల్లవి: ఇందాఁక నెరఁగము యీవింత సతి
కందు వాసె శ్రీకాంతావిభుఁడ

చ. 1: సుదతికి నీరాక సూర్యోదయమై
వదనకమలమిటు వడిఁ జెలఁగె
పొదలిన నీనవ్వుపున్నమ వెన్నెలకు
కదిసి చకోరపుకన్నులు దెలిసె

చ. 2: వనితకు నీచూపు వసంతకాలమై
వెనకఁ బలుకుఁగోవిలలొదరె
మినుకు నీతనువు మేఘకాంతులకు
పనివడి పులకలపైరులు దేరె

చ. 3: సతికి నీపొందులె జలధిమథనమై
రతినధరామృతరసమబ్బె
ఇతవై శ్రీవెంకటేశ నీవు చెలిఁ
దతిఁ గూడఁగ మరుతంత్రము గెలిచె

**తొలిపలుకు :**

శ్రీపతితో చెలులు విన్నవించుకొంటున్నారు. ఇప్పటిదాకా ఇటువంటి వింత నెరుగమయ్యా! ఈ సతి తాపముతో వేగిపోతున్నది. నీరాక ఆమెకు సూర్యోదయంలాగ, వసంతాగమంలాగ, నీ పొందు జలధిమథనంలాగ వున్నాయి, అని అన్నమయ్య వర్ణిస్తున్న వైనం అనితర సాధ్యం అని వేరే చెప్పవలెనా?.

**భావదీప్తి :**

ఓ శ్రీకాంతా మనోవల్లభా! యీ వింత సతిని మేము ఇందాక (ఇప్పటిదాక) చూచియెఱుగము. నీ విరహతాపముతో ఈమె వివర్ణయైనది స్వామీ!

ఈ సుందరికి నీరాక సూర్యోదయమైనందున ఆమె ముఖపద్మము వేగముగా వికసించినది. పున్నమి వెన్నెలవంటి నీ నవ్వును చూడగానే చకోరముల వంటి ఆమె కన్నులు తేలిక పడ్డాయి.

ఈ వనితకు నీ చూపులు వసంతాగమనమై ఆమె ముద్దుమాటలు అనే కోయిల కూజితములు రవించినవి. నీలమేఘశ్యాముడవైన నీ తనువు మేఘకాంతులను చూచి ఆమె మేనిపై పులకల పైరులు మొలకలెత్తినవి.

ఇక చెప్పేదేమున్నది స్వామీ! ఈ సతికి నీ కూటములు సాగరమథనమై రతివేగమున అధరామృతమావిర్భవించినది. హితుడవైన వో శ్రీవేంకటేశ్వరా! నీవీ చెలిని తతిగూడగా (అదను చూచి కలియగా) మన్మథుని మదనతంత్రము గెలుపు సాధించింది.



**సంఖ్య : 162** **సంపుటము : 19** **పుట : 109** **రాగం : భైరవి**

పల్లవి: ఇచ్చలోనిదాన నేను ఇన్నిటా నీకు
గచ్చు లేమిటికిరా చేఁగలమట్టిచెన్నుఁడా

చ. 1: ఆరితేరి కతలెల్లా నడుగుతా నన్ను నీవు
చేరి యాసవెట్టకురా చెప్పేఁగాని
దూరుసేయ కిఁకనైనా దోసము లేదనరా
సారెసారె నీకు మొక్కి జట్టిగానే నేను

చ. 2: వొగ్గి కొంగువట్టుకొని వొకటొకటే యడిగి
సిగ్గులువడకురా చెప్పేఁగాని
అగ్గలమై కిందుపడి ఆసుద్దులు మఱవరా
అగ్గమై నీవూడిగాలే అన్నిఁ జేసే నేను

చ. 3: యెన్నఁగ శ్రీవేంకటాద్రి నిరవై నన్నేలితివి
చిన్నిగోరు దియ్యకురా చెప్పేఁగాని
మన్నించితి వెప్పుడు నామచ్చిక దలఁచరా
సన్నల నీరతులకే సమ్మతించే నేను

**తొలిపలుకు :**

నేటి కర్నూలు జిల్లా చాగలమట్టి గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామిపై శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య."ఇచ్చలోనిది" అంటే ప్రియురాలు అని అర్థం. శృంగారకీర్తనలో పల్లవిని అర్థం చేసికోవటం ఆషామాషీ వ్యవహారం కాదు. "గచ్చులేమిటికిరా" అంటే మాయలమారి వేషాలెందుకు అని అర్థం.

**భావదీప్తి :**

చేఁగలమట్టి చెన్నుడా! (చాగలమట్టి చెన్నకేశవస్వామీ!) ఇన్నిటా (అన్నివిధాలా) నేను నీకు ఇచ్చలేని దాన (ప్రియమైన దాననుకాను) ఇంకా గచ్చులేమిటికిరా (నీ మాయలమారి వేషాలెందుకురా?)

నీవు ఆరితేరినవాడవు. నాగురించి తెలుసుకోవాలని నన్నే అడిగావు. బాగుంది. నేను చెబుతాను కదా! ఇంకా ఒట్లు యెందుకు పెట్టుకుంటావు? నీకు కావలసిన కథలన్నీ నేను వినిపిస్తాను. ఇంకాననెందుకు నిందిస్తావు? నాదోషమేమీలేదని ఒక్కమాట చెప్పు. నీకు జట్టిగా (బాగా) మొక్కి అనేకమార్లు వేడుకొంటానురా!

ఒడిసి నాపైట కొంగుపట్టుకొని వొక్కొక్కటే చెప్పమని అడిగావు. నేను చెబుతాగాని మధ్యలో నీవు సిగ్గెందుకు నటిస్తున్నావు? అగ్గమై (స్వాధీనమై) నీకు సేవచేసికొంటాను కాని, అగ్గలమై కిందుపడి (మెండుగా తలవంచి) ఆ సంగతులన్నీ మఱచిపోరాదా?

నేడు యెన్నికగా శ్రీవేంకటాద్రి మీద నెలకొని నన్నేలుకొన్నవు. నీకు నా సంగతులన్నీ చెబుతానుగాని నీ చిటికెనవ్రేలి గోటితో గీఱకురా. నీవెన్నోసార్లు నన్ను మన్నించి కూడినావు. నా అనురాగం తలచుకొనరా. నేను చీకటిపడగానే నీరతులకు సమ్మతిస్తాను సరేనా?

**సంఖ్య : 296 సంపుటము : 8 పుట : 172 రాగం : సామంతం**

పల్లవి: ఉండరే యెక్కడిసుద్ది వొడఁబరచకురే
యెండలెల్ల నీడలాయ నిద్దరికి మాకు

చ. 1: కూరిమిలేనిపొందు కొనలెటువలెసాగు
పేరులేని పిలుపులు ప్రియమెట్టౌను
తారుకాణించేనంటే తానాడ నేనీడ
మారుత్తరమియ్యరాదు మనసులేయెరుఁగు

చ. 2: నగవురానిమేలము నయమెటువలెనౌను
మొగముచూడనిమొక్కు మోచేదేడ
తగులఁబెట్టేనంటే తతిలేదు మితిలేదు
పగటు లాడఁగరాదు పట్టినదేపంతము

చ. 3: పలచఁగానిసిగ్గులు పనికెటువలెవచ్చు
చలివాయనివలపు సాదించేదెట్టు
యెలమి శ్రీవేంకటేశుఁ డీడనుండె నన్నుఁగూడె
వెలపరచఁగరాదు వేడుకలేనిండను

**తొలిపలుకు :**

తన స్వామి గురించి మరిన్ని కొత్త సంగతులు చెప్పమన్న చెలులతో దేవి మెల్లిమెల్లిగా మరికొన్ని వివరిస్తూ మా ఇద్దరికీ "యెండలెల్లా నీడలాయె" అంటున్నది. భర్త మనస్సునెలా రంజిపచేయాలో వివరిస్తున్నది. అన్నమయ్య గడుసుగా స్వామి నన్ను గూడిన వేడుక "వెలపరచగరాదు" అని ముక్యాయింపు నిచ్చారు.

**భావదీపిక :**

చెలులారా! ఉండండే. నన్ను వొడబరచకండి. ఏమి సంగతులు చెప్పను? మా ఇద్దరికీ యెండలెల్లా నీడలాయె (విరహపు తాపములు సంతోషాలనే నీడయైనవి).

పొందులో అనురాగం లేకపోతే అదెలా మొలకెత్తుతుంది? కనుక అదే మూలం. పేరుపెట్టి పిలుచుకోలేని జంటది "ప్రేమ" యెట్టా అవుతుంది? ఉదహరించాలంటే ఆయనక్కడ నేనిక్కడ వున్నా అదేమని మగనికి యెదురాడరాదు. మనస్సులేమా ఇద్దరి మాటలు ఆడుకొంటాయి.

మేలము (సరసము) లాడితే నవ్వు పుట్టించాలి. నవ్వురాకపోతే అది "నయము" యెట్లా అవుతుంది? మొగము చూపకుండా మొక్కితే ప్రయోజనమేమి? తగులు (సంబంధము) కలిగిందంటే ఇకదానికి తతి (సంతృప్తి) మితివుండవు. అన్నిటికంటే ముఖ్యం యేమంటే పట్టిన పంతం విడువకుండా పగటు (ద్వేషపు) మాటలు పలుకరాదు.

పలచబడని సిగ్గులు ప్రేమజంటకు పనికిరావు. చలివాయని వలపు (సిగ్గు సంకోచం విడువని వలపు) సాధించేదేమిటి? చెలులారా! అతిశయించిన శ్రీవేంకటేశుడు ఇక్కడవుండే నన్ను గూడినాడు. మామధ్య జరిగినవన్నీ వెలపరచరాదు (బయటకు చెప్పరాదు).



**సంఖ్య : 243 సంపుటము : 5 పుట : 166 రాగం : శ్రీరాగం**

పల్లవి: ఊరకుంటే నన్ను నుండనియ్యవు ఇంత
పేరుకుచ్చి తిట్ట నన్నుఁ బ్రియమా నీకు

చ. 1: బుజముపైఁ జేయి వేసి బుజ్జగించేవు ఇంత-
నిజమా నామీఁద నీకరుణ
భజన మెరయ నన్నుఁ బచ్చి సేసేవు ఇంత-
గజరుఁజేఁతలకోపఁగలనా యిఁకను

చ. 2: కాలుమీఁదఁ గాలువేసి కరిఁగించేవు యింత-
మేలా నాతోడి సమేళములు
వాలుకచూపుల నాకు వాఁడివెట్టేవు యింత-
యేలికవై యిటుసేయనేలా యిపుడు

చ. 3: చక్కఁదనమిది నాది జట్టిసేసేవు నా
చెక్కుల రేకలు వ్రాయఁ జిత్తగించేవు
చక్కని వేంకటగిరిస్వామీ నీవు యిట్టే
దక్కిన నన్నింతసేయఁ దగునా యిఁకను

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన శృంగార కీర్తనలో నాయిక (దేవి) స్వామితో నన్ను పేరుపెట్టి మరీ తిడుతున్నావు. అట్లా చేస్తే నీకేమి సంతోషం? మరి ఇప్పుడు నా భుజముపై చేయివేసి బుజ్జగిస్తున్నావు. కాసేపు కాలు మీద కాలువేసి మైమరిపిస్తావు. నా చక్కదనాన్ని పొగిడి అమూల్యమంటావు. నీవేమిటో నాకు తెలియటం లేదు అందున్నది.

**భావదీపిక :**

స్వామీ! నన్ను వూరకుంటే, అట్లా వుండనీయవు. ఇంతగా నన్ను పేరుకుచ్చి (పేరుపెట్టి) తిట్టటం నీకు ప్రియమా (ఇష్టమా... న్యాయమా?).

నా భుజముపై చేయివేసి బుజ్జగిస్తావు. ఇది నిజమేనా? నీకు నా మీద అంత కరుణవున్నదా? నా పేరే భజన చేసి నన్ను పచ్చిసేసేవు (ఆఉడిపెడ్తావు). ఇంత గజరు (కామపుచేష్టలకు) ఓపగలనా (సహించగలనా?).

నా కాలుమీద నీ కాలువేసి నన్ను కరిగించేస్తావు. నాతో ఇంత సమేళము (అనుకూల్యము) నీకు మేలా (మంచిదేనా?) వాలుచూపులు చూచి నాకు వాడివెట్టేవు (సానపెడుతున్నావు). ఇంత నాయకుడవై ఇట్లా చేయుటెందులకు?

నా చక్కదనము జట్టిసేసేవు (పొగిడి అమూల్యమంటావు). నా చెక్కిలిపై గోరుతో గీరుతావు. అట్లా చేయటం నీకు ఇష్టము. అందమైన శ్రీవేంకటేశ్వరా! నీకు సులువుగా లొంగిన నన్ను ఇంతసేయ తగునా?

**సంఖ్య : 277  సంపుటము : 8  పుట : 167  రాగం : నాదరామక్రియ**

పల్లవి: ఊరకుండవయ్యా వుడివోవు వలపులు
కోరుకొంటా వున్నదాన గొప్పలు నీకన్నులు

చ. 1: చనవు నీవిచ్చితివి చలము లన్నియుఁ దేరె
మనసొక్కటాయ నీతో మారుమాటేల
ననిచివుందాన నిదె నన్ను నేల రేఁచేవు
వినుకొంటానున్న దాన వింతలు నీసుద్దులు

చ. 2: ప్రియములు చెప్పితివి పెనఁగితివిందాఁక
నయమాయ సరసాలు నవ్వులంతేల
క్రియ నే నెఱుఁగుదును కెరలించ కిఁక నీవు
జయము చేకొంటి నిదె చక్కనె నీమాటలు

చ. 3: తెలిపితివి బుద్దులు దిష్టముగాఁ గూడితివి
వెలసె నీమోహములు వెరపు లేల
యెలమి శ్రీవెంకటేశ యెచ్చరించకు గోరను
తలపోయుచున్న దాన తగు నీగుణములు

**తొలిపలుకు :**

దేవి స్వామితో వలపు లెన్నటికీ నశించవు, ఘనమైన నీ కన్నులలో వుంటే నాకదే చాలు అంటున్నది. నీ తలపులలో వుంటే నా కదే పదివేలు అంటూవున్నది. నీ విచ్చిన చనవు ప్రేమ వల్లనే నేను జయము చేకొంటిని అని చెబుతున్నది. అన్నమయ్య వర్ణించిన ఈ నాయిక ముగ్ధ.

**భావదీపిక :**

స్వామి! నీవు వూరకుండవయ్యా! వుడివోని వలపులు (నశించని ప్రేమలు) కోరుకొంటూవున్న ముగ్ధను. ఘనమైన నీ కన్నులలో వుంటే నాకదే చాలు.

నీవు నాకు చనవు నిచ్చితివి గావున నా పంతములన్నీ నెగ్గినవి. మారుమాటేలనయ్యా! నీతో మనసు కలిసింది. నీవంటే అనురాగం వున్నదానను, నన్నేల యేచెదవు (వేపుతున్నావు?) నీ వింతయైన కబుర్లు వినుకొంటూవున్నదానను.

ఇప్పటిదాకా నాతో ముచ్చటలాడి పెనవేసికొంటివి. మన సరసాలు నయమైనవి. నవ్వులు అంతులేవా? క్రియ (ఉపాయము) నేను యెఱుగుదును. ఇంక నీవు నన్ను కెరలించకుము (ఆగ్రహం తెప్పించకు). చివరకు నేనే జయించాను. నీ మాటలు కూడా చక్కబడ్డాయి.

స్వామి! ఆమె కెంతో హితవు చెప్పావు. కలిసివచ్చిన అదృష్టము వలె కూడితివి. నీ మోహములు అతిశయించినవి. ఇంకా సంకోచమెందులకు? అతిశయించిన శ్రీవేంకటేశా! నన్ను హెచ్చరించకు. నిన్నేమీ కోరను. నీ తలపులలో నేనే వున్నాను. అదే నీ సద్గుణము.



**సంఖ్య : 375  సంపుటము : 5  పుట : 256  రాగం : ముఖారి**

పల్లవి: ఎంత సేయఁగనేరదింతి గోపించినను
కంతుని గెలిపించెను ఘనుఁడైన విభుని

చ. 1: సతినింత తాపాన చందురుఁడేఁపఁగఁ బో
ప్రతిచందురుండాయ పడఁతిమోము
అతివఁ గోవిలకూఁతలలయించఁగాఁ బో
తతిఁ గోవిలలకూఁత తానాయఁ బలుకు

చ. 2: మలయానిలుఁడు దన్ను మలసి యేఁచఁగఁ బో
చెలివూర్పు చిరుగాలిఁ జిత్రించెను
తలపోఁతచింత చిత్తము సేయఁగాఁ బో
కలికిచిత్తము పతికడకంటెనిపుడు

చ. 3: తిరుగఁ జంద్రుఁడు తన్ను తిలకించగాఁ బో
ధరియించెఁ గుచముల తానతని
తిరువేంకటగిరిదేవునికౌఁగిటి-
సిరులఁబో యిన్నిటాఁ జెలువాయె నిపుడు

**తొలిపలుకు :**

కోపం వస్తే ఈ దేవి యేమైనా చేయగలదంటున్నారు అన్నమయ్య. ఎందుకు కోపం? తన నాథుడు చివరికి ఆ మన్మథుడినే గెలిపించాడు. చంద్రుడు, కోయిలలు, మలయమారుతం, తలపోతలు, కూడా ఆమెను వేదిస్తే దానికి ప్రతిగా దేవి యేమిచేసిందో వినండి. చివరికి ఆమెదే పై చెయ్యి యెలా అయిందో చదివి దేవి గొప్పతనం తెలియండి.

**భావదీపిక :**

ఈ ఇంతి కోపిస్తే యెంతచేయగలేదు? ఆమె తన ఘనుడైన పతిని కంతుడు (మన్మథుడు) గెలిచేటట్లు చేసింది. పైగా ఆ మదనుడికి తోడు దొంగల సహాయం కూడా తీసికొన్నది. మరికనేమి?

ఇంత తాపంతో ఆ సతిని వేపినాడు చంద్రుడని ఆమె మోము ప్రతిచంద్రుడు (మరియొక చంద్రుడు) అయినది. కోయిల కూజితాలు ఆ సతిని బాధించాయని క్రమముగా ఆమె తన మాటలను వినిపించింది. అవి కోయిల కూజితాలకంటే మధురంగా వున్నాయి.

మలయానిలము (మలయ పవనము) తనను యత్నించి బాధించబోగా తన ఊపిరితో చిరుగాలిని సృష్టించింది. స్వామి తలపోత వలన కలిగిన చింత ఆమె చిత్తమును వేపగా ఆ కలికి తన చిత్తమును తన పతి కంటుకొనునట్లు చేసింది.

చంద్రుడు తన కుచసౌకుమార్యం తిలకిస్తున్నాడని ప్రతిగా ఆమె తన కుచములపై తానతనినే (తాను ఆ చంద్రుల వంటి పతి నఖక్షతములను) ధరించినది. శ్రీవేంకటేశ్వరుని కౌగిట సిరులతో దేవికి ఇప్పుడు అన్ని సొబగులు అమరినవి.

**సంఖ్య : 47** **సంపుటము : 5** **పుట : 32** **రాగం : సామంతం**

పల్లవి: ఎట్టయిన జేయరా నీ విఁకనేలా నన్నుఁ
బట్టకుర పలుమారు పదివేలు వచ్చెను

చ. 1: ఇంత సేసితివి చాలు నిఁకనేలా తొల్లే
యింతటివాఁడని నిన్నెఱఁగనా
ఇంతులపై దయగలదిఁక నేలా నీ-
పంతములే నీకుఁజెల్లె పదివేలు వచ్చెను

చ. 2: ఇచ్చలాడకురా నాతో నిఁకనేలా నీ-
యచ్చలమ్ములే నిజమా యఁగా
యెచ్చరిక మఱచితివిఁకనేలా నన్ను
పచ్చిసేయకురా యింత పదివేలు వచ్చెను

చ. 3: ఇనుమడించె నీచేఁత లిఁకనేలా నీ-
కనుమాయలిన్నియుఁ గంటిమిగా
యెనసి వేంకటపతి యిఁకనేలా నన్నుఁ
బనుపరచితివిట్టే పదివేలు వచ్చెను

**తొలిపలుకు :**

"పదివేలు వచ్చెను" అంటే కావలసినదంతా సంతృప్తికరంగా వచ్చింది అని అర్థం. నాయిక స్వామితో నీ ఇష్టం వచ్చినట్లు చేయరా కాని అనేకమార్లు నన్ను పట్టుకోకు. కావలసిన తృప్తి వచ్చింది అంటున్నది. అన్నమయ్య ఈ కీర్తనలో వాడిన "పనుపరచితివి" వంటివి అర్థం కావు.

**భావదీపిక :**

స్వామీ! యెట్టయినా చేయవయ్యా! నన్నేల పలుమార్లు పట్టుకొంటావు? పదివేలు వచ్చెను (కావలసిన సంతృప్తి కలిగింది). ఇక నన్ను పట్టకురా!

చాలును ఇంతచేశావు ఇంకా యెందుకు? నీ వింతటి వాడివని నాకు ఆదిలోనే తెలీదనుకొన్నావా? ఇంతులపై దయగలిగిందంటే ఇంక చెప్పనేల? నీ పంతములు నీకే చెల్లినవి. అదే కదా! కావలసినంత తృప్తి కలిగింది.

స్వామీ! నాతో ఇచ్చకాలు మాట్లాడకురా! ఇంకా యెందుకు? నీ అచ్చలమే (పట్టుదలే) నిజమయింది (నెగ్గినది) కదా! నేనే హెచ్చరిక మఱచిపోయాను. ఎందుకులే నన్ను ఇంత పచ్చిసేయకురా (ఆఱడిపెట్టకురా). ఇంకా యెందుకురా.

నీ చేతలు ఇనుమడించినవి ఇంకా యెందుకు? నీ కనికట్టు మాయలన్నింటినీ చూశాను. అతిశయించిన శ్రీవేంకటేశ్వరా! ఇంకా యెందుకయ్యా? ఇట్టే నన్ను పనుపరచితివి (అలవాటు చేశావు). పదివేలు వచ్చెను (కావలసినంత తృప్తిగా వున్నది).



**సంఖ్య : 46** **సంపుటము : 5** **పుట : 32** **రాగం : కాంబోది**

పల్లవి: ఎప్పుడు గాని రాఁడో యెంతదడవాయ కాలి-
చప్పుడాలకించి మతి జల్లురనెనమ్మా

చ. 1: ఇద్దరమదరిపాటు యేకాంతాన నాడుకొన్న-
సుద్దులు దలఁచిమేను చురుకనెనమ్మా
పెద్దగాఁ గస్తూరిబొట్టు పెట్టిన నాతఁడు గోర
తిద్దుట దలఁచి మేను దిగులనెనమ్మా

చ. 2: పాయక యాతఁడూ నేనుఁ బవ్వళించే యింటివంకఁ
బోయి పోయి కడుఁ జిన్నఁబోతి నోయమ్మా
తోయపు గుబ్బల చనుదోయి మీఁద వాఁడొత్తిన-
పాయపుఁ జంద్రుల జూచి భ్రమసితినమ్మా

చ. 3: కూడిన సౌఖ్యములందు కొదలేని వాని నా-
వేడుక మతిఁ దలఁచి వెరగాయ నమ్మా
యీడులేని తిరువేంకటేశుఁడిదె నాతోడ
నాడినట్టే నా చిత్తమలరించె నమ్మా

**తొలిపలుకు :**

ఎంతకీ రాని తనమగని దలచి దేవి చింతిస్తున్నది. కాలి అడుగుల సవ్వడైతే ఆమె మనస్సు ఝల్లుమంటున్నది అని పరితపిస్తున్న దేవి విరహ వేదనను అన్నమయ్య, కళ్ళకు కట్టినట్లు వివరిస్తున్నారు. మా ఏకాంతంలో వేంకటనాథుని మాటలు ఇంకా నాతో అంటున్నట్లే వున్నాయి అని అంటున్నదా తల్లి.

**భావదీపిక :**

ఇంత తడవాయ (ఆలస్యమైనది) ఎప్పుడుగానిరాడో (ఎంతసేపైనా రాడు). కాలి అడుగుల సవ్వడి వినపడగానే మనస్సు ఝల్లుమంటున్నది.

ఇద్దరమూ అతిశయించిన యేకాంతములో ఆడుకొన్న ముచ్చటలు నామేను చురుక్కుమంటున్నది. కస్తూరి బొట్టును అతగాడు పెద్దదిగా పెట్టుకొంటే నీవు దిద్దినావు. అది తలచుకొన్నప్పుడల్లా నీ శరీరమే దిగులుగా వున్నదమ్మా!

వదలక అతగాడు నేను పవ్వళించే మా ఇంటివంకకు వెళ్ళివెళ్ళి యెంత చిన్నబోయానో యేమి చెప్పనమ్మా? తోయపు గుబ్బలు (గుండ్రముగా నున్న) ఘన కుచముల జంటపై వాడొత్తి చేసిన చంద్రరేఖలు చూచుకొని చంద్రోదయమైనదని భ్రమసినానే వోయమ్మా!

మా కూటముల సౌఖ్యములలో అంతులేని వాని వేడుకలు నా మనస్సులో తలచుకొంటేనే మనస్సు పరవశిస్తుందే వోయమ్మా! సాటిలేని శ్రీవేంకటేశ్వరుడు ఇదే నాతో మాట్లాడి నా చిత్తమును అలరించినాడమ్మా!

**సంఖ్య : 274** **సంపుటము : 8** **పుట : 159** **రాగం : శ్రీరాగం**

పల్లవి: ఎరుఁగుదుము నీ నాయా లేల చెప్పేవు
వోరిమె గలవాఁడవు వూరకుండ రాదా
చ. 1: మొగమోట గలవారు మోహించిన సతులకు
తగవు చెప్పేరా తప్పకుండాను
మగఁడ వైతేనేమి మచ్చికగలచోటికి
తెగెవా పరులకైతే దీకొందువుగాక
చ. 2: చుట్టపుఁ బొందైనవారు చూచి చూచి సవతుల
యెట్టయినా వున్నట్టే యేలాడేరు
దిట్ట వైతేనేమి నీతీరుకు వచ్చేవారిఁ జే-
పట్టవా వింతవారైతే భ్రమయింతువుగాక
చ. 3: కడు వేడుకకాండ్లు గలిగినట్టె ధర్మము
నడపేరా శ్రీవెంకటనాయక నేఁడు
అదరి నన్నుఁ గూడితి వాపెనుఁ గొంతమాత్రము
విడిచేవా యిది నీ వేసా లింతేకాక

**తొలిపలుకు :**

అన్నమ్య స్వామిని దెప్పుతున్నది. నీ న్యాయదృష్టి మాకందరికీ తెలిసినదే కదా! నీ కెంతో ఓర్పువున్నదిలే. మాకు తెలియదా వూరకుండవయ్యా! నీవంటే మొగమాటం వున్నవారు, చుట్టపు పొందులు గలవారు, నాబోటి అనామకులు, లెక్కలేనంతమంది వున్నా నీవు మాత్రం నీ దేవిని విడిచివుండలేవు. అన్నీ నీ వేషాలు అంతే.

**భావదీపిక :**

స్వామీ! నీ నాయాలు (న్యాయదృష్టి) యెఱుగుదుములే. ఏల చెప్పేవయ్యా? వోరిమె (ఓర్మి) గలవాడవులే. ఇక వూరకుండరాదా?

మొగమోటము వున్నవారు తాము మోహించిన సతులకు తగవులు తీరుస్తారా? నీవు మగడవైతేనేమి? నీకు మచ్చికగల చోటికి సాహసించి పోవా? పరులకు వేరు తీర్పులు చెప్పి నీవు యెదిరింతువు.

చుట్టరికాల వారితో పొందులు చేసికొనినవారు చూస్తూ చూస్తూ సవతుల వున్నట్లయితే ఒప్పుదురా? నీవు దిట్టవు అయితే నాకేమి? నీ తీర్పుకు తలవొగ్గే వారిని చేపట్టు. అదే నీకు తగినది. తెలియని కొత్తవారైతే వారిని భ్రమింపజేతువు గాని, నాతోనా?

మిక్కిలి వేడుకకాండ్లు (సరసులు) యే ధర్మము నడుపుతారో నీవూ అదే చేశావు. నేడు శ్రీవేంకటేశ్వరా! నీవూ అందరివంటి వాడవే. అదరి (అతిశయించి) నన్ను గూడితివి. ఆపెను (దేవిని) విడిచేవా? ఇది నీ వేషాలు, అంతే సుమా!



**సంఖ్య : 159** **సంపుటము : 19** **పుట : 107** **రాగం : పాడి**

పల్లవి: ఎవ్వరిముందరఁ జూసే వేడలేనినీగుట్టు
నవ్వులేమి నవ్వేవు నాలితనమునను
చ. 1: విన్నవించీ నాపెమాట వినుకొనరాదా
యెన్ని పరాకులు సేసే వెఱిఁగివుండే
సన్న సేసీ నివెల్లా జాడతోఁ జూడరాదా
కన్నులేల మూసేవు కడుసిగ్గుతోడను
చ. 2: ఆపెయిచ్చేవిడెము అందుకొనరాదా
చూపులేమి చూచేవు సోరణగండ్ల
ఆపని కాసపడితే నట్టె కానిమ్మనరాదా
యేపున నేలకొంకేవు యిందరిలోపలను
చ. 3: కూడినయాపెకూటమిఁ గోరి చెంగలించరాదా
వాడుమోముతో నెంత వాను (సు?) లెంచేవు
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యీడులేల పెట్టేవు యివ్వలా నవ్వలాను

**తొలిపలుకు :**

స్వామికి భావనా ప్రియురాలైన అన్నమయ్య స్వామిని దెప్పుతున్నది. నీకు కావలెనంటే ఆమె (దేవి) ఇచ్చే తాంబూలమే స్వీకరించు, ఆమె విన్నపాలే వీనులవిందుగా విను, ఆమె కూటమిలోనే అతిశయించరాదా? ఎక్కడలేని నీగుట్టు యెవరి ముందుచూపుతావు? రాని నవ్వులెందుకు నవ్వేదవు?

**భావదీపిక :**

స్వామీ! నీవు యెక్కడాలేని నీగుట్టును యెవ్వరిముందు చూపుతావయ్యా? నీ నాలితనము (కుత్సితమంతా) వొలకబోస్తుయేమి నవ్వులు చిందిస్తున్నావయ్యా!!!

ఆమె (దేవి) మాట నీకు వినిపిస్తుంటే వినుకోరాదా? నీవు యెఱిగివుండి యెంత పరాకు నటిస్తున్నావు!!! నీకు యేవేవో సైగలు చేస్తోంది కదా! యెఱుకతో చూడరాదా? ఎంతో సిగ్గునటిస్తూ నీ కన్నులెందుకు మూసివుంచుతావు స్వామీ?

ఆమె ఇచ్చే విడెము (ఆహ్వానతాంబూలం) అందుకోరాదా? ఎవరు వద్దన్నారు. సోరణగండ్ల (గవాక్షం) లోంచి దొంగచూపులేమి చూస్తావులే.

ఆపని (ఆ తరువాత పనికి) నీవు ఆశపడితే ఆమెను అట్లాగే కానిమ్మని నీ అంగీకారమూ తెలుపరాదా? అందరిలోనూ తెగింపుతో యేలకొంకేవు? (ఎందుకు సంకోచిస్తావు?)

నీతో కూడిన ఆమె (దేవి) గారి కూటమిని కోరి, చెంగలించరాదా (అతిశయించరాదా?) వాడిపోయిన మొగముతో యెంతవాసులెంచేవు (తారతమ్యాలు లెక్కకడతావు?) ఏదైతేనేమి, వో శ్రీవేంకటేశ్వరా! నన్ను కూడా అనుగ్రహించావు. మరి ఇంకా నాదగ్గరా, దేవి దగ్గరా ఈడులేలపెట్టేవు (యెందుకు పోలుస్తావు?)

**సంఖ్య : 337** **సంపుటము : 7** **పుట : 208** **రాగం : సామంతం**

పల్లవి: ఏమని పొగడుదమె యీచెలిచక్కఁదనము
యీమేఁటి యలమేల్మంగ యెక్కువైతానిలిచె

చ. 1: అరచంద్రుఁడుఁ జకోరాలద్దాలు సంపెఁగయు
ధర శింగిణులు శ్రీలు తలిరులును
అరుదుగాఁ దుమ్మిదలు నందముగాఁ గూడఁగాను
మరుతల్లి యలమేలుమంగమోమై నిలిచె

చ. 2: బిసములు శంఖమును పెనుఁజక్రవాకములా-
కసము నీలపుఁజేరు కరికుంభాలు
పొసఁగ నివెల్లానొకపోఁడిమై నిలువఁగాను
మసలక అలమేలుమంగమేనై నిలిచె

చ. 3: అనఁటులంపపొదులు నబ్జములు ముత్తేలు
వొనరి వరుసఁ గూడి వుండఁగాను
ఘనుఁడైన శ్రీవేంకటేశునురముమీఁద
పనుపడలమేల్మంగ పాదములై నిలిచె

**తొలిపలుకు :**

అన్నమయ్య శృంగార కీర్తనలో యీ అలమేల్మంగ చక్కదనమును యేమని పొగడవచ్చును అని వర్ణిస్తున్నారు. ఇందులో ప్రత్యేకతేమంటే పోలిక దేనికి చెబుతున్నారో పాఠకులు వూహించాలి కాని కవి చెప్పడు. "బిసములు శంఖములు పెను చక్రవాకములు" అని వదలవేస్తారు. అంటే "తామరపూలు, శంఖములు, పెద్ద చక్రవాక పక్షులు" అని పైపై అర్థం. కాని అంతర్లీనమైన అర్థం "వదనము, మెడ, కుచములు" అని. బుఱ్ఱకి పదును పెట్టండి.

**భావదీపిక :**

ఈ చెలి చక్కదనముల నేమని పొగడుదుమే? మేటియైన ఈ అలమేలుమంగ తాను అన్నిటిలోను యెక్కువై నిలచినది.

అర్ధచంద్రులు (కనురెప్పలు) చకోరములు (కళ్ళు) అద్దాలు (చెక్కిళ్ళు) సంపెంగలు (ముక్కు) శింగిణులు (ఇంద్రధనుస్సువంటి కనుబొమ్మలు) శ్రీలు (లక్ష్మీ వైభవము) తలిరులు (లేత చిగుళ్ళవంటి పెదవులు) తుమ్మెదలు (ఉంగరాల నల్లజుట్టు) అందముగా నొక్కచోట కూడినవి. ఈ మన్మథుని తల్లికి ఇవన్నీ ముఖమై నిలిచినవి.

బిసములు (తామర పూలవంటి చేతులు) శంఖములు (శంఖము వంటి మెడ) పెను చక్రవాకములు, ఆకాశము (నడుము), నీలపుజేరు (నల్లని నూగారు) కరికుంభములు (గజకుంభస్థలి వంటి నితంబములు). ఇవ్వన్నీ ఒక్కచోట పోడిమై (ఒప్పుగా) నిలువగా అలమేలుమంగ మేనిపై నిలచినవి.

అనటు లంపపోదులు (అఱటి బోదెలవంతి తొడలు), అబ్జములు (పద్మములవంటి పాదములు) ముత్తేలు (ముత్యముల వంటి తెల్లనిగోళ్ళు) అతికినట్లు ఒకచోట కూడినవి. అందుకే ఘనుడైన శ్రీవేంకటేశ్వరుని వురము తిష్టవేసికొనిన ఈ అలమేలుమంగ పాదములైనిలిచినది.



**సంఖ్య : 175** **సంపుటము : 8** **పుట : 102** **రాగం : సామంతం**

పల్లవి: ఏమని భావింతు నిన్ను నెంతని సంతోసింతు
శ్రీమంతుడ నన్నుదిద్దే చేఁతోయిది

చ. 1: కాంతుఁడ నేనెంతాడినా గక్కదలవు నీవు
యెంత రాతిగుండెవాఁడ వేమి చెప్పేది
శాంతుఁడవో గట్టువాయిజాణతనమో యిట్టె
మంతుకెక్కించే నామీఁది మన్ననో యిది

చ. 2: దిట్టనై నేజంకి(కిం)చితే తెమలవేమిటా నీవు
యెట్టి చలపాదివాఁడ వేమి చెప్పేది
గుట్టు నీకింతగలదో గుణము చండిపడెనో
గట్టిగా నన్నీడేర్చే కరుణో యిది

చ. 3: బిగ్గ నేఁగాఁగిలించితే బెగడవేమిటా నీవు
యెగ్గులెంతెంచనివాఁడ వేమి చెప్పేది
సిగ్గరితనమో నేఁడు శ్రీవేంకటేశ నీనవ్వో
కగ్గులేకేలితివి నాకన్నవరమో యిది

**తొలిపలుకు :**

అన్నమయ్య భావనాసుందరి స్వామితో మొరపెట్టుకొంటున్నది. నీవేమిటో నాకర్థం కావటంలేదు. ఎంత సంతోషం కలుగుతున్నది!!! శ్రీమంతుడా నన్ను తీర్చిదిద్దటానికే చేసే నీచేతయే ఇది. స్వామి! నీ నవ్వు నీవు సిగ్గరివో లేక నన్ను యేలుటకు వరమిచ్చే కరుణామూర్తివో తెలుపకున్నవి.

**భావదీపిక :**

స్వామి! నిన్నేమని భావించమంటావు? నాకు యెంత సంతోషం కలుగుతోంది!! ఓ శ్రీమంతుడా! ఈ నీచేత (ప్రయత్నము) నన్ను దిద్దుటకేనా?

ఓ కాంతుడా! నేనెంత మాట్లాడినా నీవు మారు మాట్లాడవు. నీది యెంత రాతిగుండె ప్రభూ! నేనింకేమి చెప్పగలను? నీవు శాంతకారుడవా? లేక నీవుగట్టువాయతనమున జాణవా (మాటకారివైన జాణవా). లేక సులువుగా నన్ను మంతుకెక్కించే (ప్రసిద్ధురాలిని చేసే) నీ మన్ననా? ఇదేమి స్వామి?

దిట్టతనముతో నేను నిన్ను బెదిరించినా, నీవే విధంగానూ తెమలవు (బయటపడవు). నీవెంత మొండివాడవో యేమని చెప్పను? నీకింత గుట్టు వున్నదని నీ గుణమును చండిపడేనో (కోపగించనా?) అదేమీ కాక నన్ను ఈడేర్చదలచిన నీ కరుణా ప్రభూ? ఇదేమిటి?

నేను నిన్ను బిగికౌగిలిస్తే నీవు యేవిధంగానూ బెగడవు (జంకవు). అలాగని నన్ను తప్పులూ పట్టవు. నన్నేమి చెప్పమన్నావు? ఓ శ్రీవేంకటేశ్వరా! నేడిదంతా నీ సిగ్గరితనమా? లేక నీ నవ్వులాటా? ఏదియేమైనా నన్ను కగ్గులేక (సంకోచించక) యేలితివి. ఇది నేను పొందిన వరమా ప్రభూ?

**సంఖ్య : 331 సంపుటము : 7 పుట : 204 రాగం : పాడి**

పల్లవి: ఏమి సేతు ముచ్చటకు యెవ్వరు గలరు నాకు
యేమీననకూరకున్న యెగ్గువట్టుఁగా

చ. 1: అడుగుదునో వానినాడనేల వుంటివని
అడుగఁబోనలుగుఁగా అందుకతఁడు
తుడుతునో వానిమేనఁ దొరిగే వేఁడిచెమట
చిడిముడి వాఁడందుకు సిగ్గువడుఁగా

చ. 2: విసరుదునో సురటి విభునియలపు దీర
విసరఁబో అదియును వెంగెమౌఁగా
కొసరుదునో తనగుట్టు నేఁగనినదాఁకా
ఇసుమంతపనికి మనసు నొచ్చుఁగా

చ. 3: నవ్వుదునో రమణుఁడు నాతోఁ గరఁగినవేళ
నవ్వఁబో ఆతనిమేలు నామేలుగా
రవ్వగా శ్రీ వేంకటాద్రిరాయఁడిట్టె నన్నుఁగూడె
యివ్వల మోవియిత్తునో యిచ్చగించఁగా

**తొలిపలుకు :**

శ్రీవేంకటేశుడు తనను కూడ వస్తున్నాడని తెలిసి దేవి పొందుతున్న ఆరాటాన్ని వర్ణిస్తున్నారు అన్నమయ్య. నాతో ముచ్చటించటానికి యెవ్వరూలేరే? స్వామి వచ్చేస్తున్నాడు. నేనేమి మాట్లాడకబోతే తప్పునెంచుతాడోయేమో? పోనీ ఆయన వొప్పుకుంటే నా అధరమునందింతునా అని సంశయిస్తోంది జగజ్జనని.

**భావదీవియ :**

నాకు ముచ్చటకు (ముచ్చటించుటకు) యెవ్వరు గలరు? ఇప్పుడు యేమిసేతును? ఒక వేళ యేమీ అనకుండా వూరకుంటే యెగ్గువట్టీనో (తప్పునెంచునో?)

వానిని ఆడయేల వుంటివని అడుగుదునా? అడిగితే అతగాడు అందుకు అలుగుతాడేమో? వాని మేన (వంటిపై) తొరిగే (పెల్లుబికే) వేడి చెమటలను తుడిచేదా? అసలే అతగాడు చిడుముడి (తొట్రుపాటు కలవాడు). అందుకని ఒకవేళ సిగ్గుపడతాడేమో?

నా విభుని (భర్త) అలసట దీరునట్లు సురటితో (విసనకఱ్ఱతో) విసరుదునో. ఒకవేళ విసరితే అతగాడు వ్యంగ్యంగా తీసుకొంటాడో? తన గుట్టును నేను చూచేదాకా కొసరుదునో (కొసరి కొసరి అడుగనా?) ఒకవేళ నేను చేసిన ఈ ఇసుమంత పనికి (చిన్నపనికి) అతగాని మనస్సు నొచ్చుకుంటుందో యేమో?

నా రమణుడు (నా భర్త) నాతో గరిగిన వేళ (పరవశించిన వేళ) నవ్వను కదా! ఒకవేళ నవ్వనుపో అతనిమేలు నామేలుగా మారును కదా! శ్రీవేంకటాద్రి విభుడు ఇట్టే నన్నుగూడినాడు. అతగాడు ఇచ్చగించగా (అంగీకరిస్తే) నా అధరము నందించను కదా!



**సంఖ్య : 71 సంపుటము : 8 పుట : 43 రాగం : రామక్రియ**

పల్లవి: ఏలనాచే మొక్కించేరే యిప్పుడేనన్ను
కాలగాలమున మేలు కనుఁగొనేఁగాక

చ. 1: పంతమే ఫలముగాఁగ బ్రదికేటి వారికి
చెంతలఁ బ్రియాలు చెప్పఁజెల్లునటవే
దొంతులు వేరిచేనంటే తోదోపులు వలపులు
కాంతుఁడు మన్నించిన కనుఁగొనేఁగాక

చ. 2: రాజసమే ఫలముగా రచ్చసేసేవారికి
వోజదప్పి కిందుపడ నొనరునటే
సాజము చూచేనంటే చలములు బహ(హు)ళము
పూజ లాతనిచేతనే పొరసేఁగాక

చ. 3: కూటములె ఫలముగా గురియైనవారికి
పాటించి కోపించుకొనఁ బాడియటవే
యీటున శ్రీవేంకటేశుఁడింతలోనే నన్నుఁ గూడె
తేటలనాతనివల్లఁ దిరమయ్యెఁ గాక

**తొలిపలుకు :**

తనకీ తనపతికీ రాజీ కుదిరించాలని చూస్తున్న తన చెలులతో దేవి అసహనంతో ఈ కీర్తన చెబుతున్నది. ఎంత చిరాకుపడ్డా స్వామిని చూడగానే కరిగిపోతుందా తల్లి. అన్నమయ్య రసగుళికలు మ్రింగుడు పడకపోయినా, చప్పరిస్తే అంతా మాధుర్యమే. ఆ గుళికలు కొఱకాలంటే జరిగే పనికాదు.

**భావదీవియ :**

నా మగనికి నాతో యేల మొక్కిస్తారే? అప్పుడే నన్ను అతనికి లొంగిపోయేట్లు చేశారు. కాలుగాలము (కలకాలం) నాకు మేలు జరుగుతుండవచ్చుగాక!

ఆయన పంతమే స్వంతము అనుకొంటాడు. అట్లా బ్రతికే వారి దగ్గర మధురంగా మాట్లాడి ప్రయోజనమేమిటి? దొంతులుగా పేర్చిన పరస్పర ప్రేరిత వలపులు నా కాంతుడు మన్నిస్తే నేనూ కనులారా స్వీకరిస్తాను.

ఆయన రాజసము చూపులే ప్రధానమని, ప్రతిదీ రచ్చ జేస్తాడు. న్యాయం లేకుండా లొంగివుండి ప్రవర్తించాలంటే కుదురుతుందటే. ఆయన స్వభావం చూద్దామా అంటే బహుమొండివాడు. ఆయన పూజలనెన్నో అనుభవించారు.

కూటములే ప్రధానంగా కోరుకునేవారికి భర్తపై కోపించుట ధర్మముకాదు. ఇట్లా నాలో నేను ఆలోచిస్తుండగానే శ్రీవేంకటేశ్వరుడట కేతెంచి నన్ను గూడినాడు. దానివల్ల నేను తేటపడి స్థిరత్వం పొందాను.

**సంఖ్య : 70　　సంపుటము : 8　　పుట : 42　　రాగం : తెలుగు గాంబోది**

పల్లవి: ఒద్దేలే జగడాలు వోయింతి
సిద్దెబట్టి కోరికలు చిత్తఁగించఁ గదవే

చ. 1: మొగముచూచి యతఁడు మోవితేనెలడుగఁగా
వొగరులేలాడేవే వోయింతి
నగవుల పంచదార నాథుఁ డందుపైఁ జల్లి
జిగి చవిచేసుకొనీఁ జిత్తగించఁ గదవే

చ. 2: వాటవు వలపతఁడు వారవట్టుకుండఁగాను
వూటలేల పోఁ జల్లేవే వోయింతి
పాటించి సరసముల పన్నీరతఁడు నించి
చీటికి మాటికి వేఁడీ చిత్తగించ గదవే

చ. 3: అప్పుడే కాఁగిటఁ గూడి ఆయములతఁడంటఁగా
వుప్పతించేవేలె రతులోయింతి
చిప్పిలె కాఁగిటిలోన శ్రీవేంకటేశ్వరుఁడు
చెప్పరాని చేఁతసేసీఁ జిత్తగించ గదవే

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో ఆయన దేవికి ఆంతరంగిక చెలికత్తెయై హితబోధ జేస్తున్నారు. "సిద్దె" అంటే నేటి భాషలో తోలుసంచి అని చెప్పుకోవచ్చు. ఈ కీర్తన పల్లవి అర్థము కావటం నాబోటి వాడికి చుక్కలు లెక్కించటమే. జగద్రక్షకుడు జతగావుంటే స్ఫురణ మెరుస్తుంది. నన్ను నమ్మండి.

**భావదీప్తి :**

ఒద్దేలే (ఒద్దుయేలే)! ఓ ఇంతీ! జగడములెందుకే నాసలహాను చిత్తగించ (ఆలకించ) గదవే. కోరికలు సిద్దెబట్టి (మూటగట్టి) స్థిర చిత్తం కలిగివుండవమ్మా!

ఓయింతీ! అతడు నీ మొగము జూచి అధరామృతం అడిగినంత మాత్రాన, వొగరులేలాడేవే (విరసంగా యెందుకు మాట్లాడతావు? తన నవ్వుల పంచదారను నీ నాథుడు వాటిపై (అధరాలపై) చల్లి శోభతో ఆ అమృతాన్ని ఆస్వాదిస్తున్నాడు గ్రహించవమ్మా!

ఓయింతీ! వాటమైన వలపులను నీ స్వామి నీ కొసం కొలిచిపోస్తూవుంటే వానిపై నీళ్ళెందుకు చల్లుతున్నావమ్మా? అతడు పనివేళా సరసాల పన్నీరు నీపై నించి (పోసి) చీటికీమాటికీ నిన్ను బ్రతిమిలాడుతుంటే ఆలకించవమ్మా!

ఓయింతీ! నీ స్వామి! నీ మర్మములనంటి కౌగలించి కూడినాడు. అట్టి రతినాస్వాదించక ఉప్పతించేవేలే (రట్టు చేస్తావెందుకమ్మా?) శ్రీవేంకటేశ్వరుడే నీ కౌగిటిలో చిప్పిల్లినాడు. నేను పైకి చెప్పలేని వెన్నో చేశాడు. నీ మగనిని అనుగ్రహించవమ్మా!



**సంఖ్య : 158　　సంపుటము : 19　　పుట : 106　　రాగం : బౌళి**

పల్లవి: కంటిమి వింటిమి నేఁడు కందువగాను
వొంటిఁ జిక్కించుక నిన్ను నొరసే దేమి

చ. 1: నిక్కి నీవు సేయించుకొనినగురుతులెల్లాను
చెక్కులనే వుండఁగాను చెప్పేదేమి
పిక్కటిల్లుఁజెమటలు పిచ్చిలి మేననుండఁగ
అక్కడి నీ సుద్దులెల్లా నడిగేదేమి

చ. 2: పెనఁగి యెక్కడనో తెప్పించుకొన్న వుంగరము
కొనవేల నుండఁగానే కొసరేదేమి
వెనకటి నీ పొందులు వెంటనే వచ్చివుండఁగ
దినదినము నీతోఁ దెలిపేదేమి

చ. 3: కాముకళలెల్లా నొక్కగనియై నేఁ డింతలో నీ-
మోముననే వుండఁగాను మొరఁగేదేమి
ఆమని శ్రీవేంకటాద్రి అహోబల నరసింహా
చేముంచి నన్నే లితివి సిగ్గువడేదేమి

**తొలిపలుకు :**

శృంగారరాయడైన నరహరిని శ్రీలక్ష్మికళ అయిన చెంచులక్ష్మి దెప్పుతున్న వైనం వివరిస్తున్నారు అన్నమయ్య. నీవు ఆమెతో జరిపిన శృంగారం గుర్తులు పైకి కనబడుతూనేవున్నాయి. నీ గురించిన అనేక సంగతులు కంటిమి, వింటిమి. ఓ శ్రీవేంకటాద్రి అహోబల నరసింహా! ప్రమాణం చేసి నన్నేలుకొన్నావు. ఇంతకంటే చెప్పేదేముంది స్వామీ! అంటున్నదా చెంచెత.

**భావదీప్తి :**

నేడు కందువగా (నేర్పుతో) నీ సమాచారమంతా కన్నాము, విన్నాము. నిన్ను ఇప్పుడు వొంటి జిక్కించుకొని (అసహాయముగా పట్టుకొని) వొరసేదేమి? (విచారణ చేసి ఫలితమేముంది స్వామీ!

అతిశయించి నీమేనిపై ఆమెతో చేయించుకొనిన 'గురుతులు' నీ చెక్కిళ్ళపై అద్దం పడుతుంటే ఇంకా నేను చెప్పేదేముంటుంది స్వామీ! ఉప్పొంగుతున్న నీ చెమటలు నీమేనిపై పిచ్చిలి (చిప్పిల్లుతూ) వుండగా మేము ఇంకా అక్కడి నీ సుద్దులు (లీలలు) గురించి అడిగేదేముంది స్వామీ!)

తమరు యెక్కడనుండో తెప్పించుకొన్న వుంగరము నీ కొనవేలిన (చిటికెనవ్రేలు) వుండగా కొసరేదేమి (కొసరి కొసరి నిన్ను యేమి అడగవలెను?) నీవు తొలినాళ్ళలో నాతో జరిపిన పొందులు నీ వెంటనే జ్ఞాపకాలుగా వస్తుంటే ప్రతిరోజూ మన శృంగారం గురించి నీతో తెలిపేదేముంటుంది స్వామీ!

నీ కాముకళలు (శృంగార కళావైభవం) వొక 'గని' వలె నేడు నీ మోముననే ప్రస్ఫుటిస్తుంటే ఇంకా మొరగేదేమి (వంచించే అవసరమేముంది స్వామీ?) చిగురించిన శ్రీవేంకటాద్రి అహోబల నరసింహా! చేముంచి(ప్రమాణముచేసి) నన్ను స్వీకరించితివి. ఇంకా సిగ్గుపడేదేముంది ప్రియా?

**సంఖ్య : 377** **సంపుటము : 5** **పుట : 259** **రాగం : ముఖారి**

పల్లవి: కందువ నేఁడెందరైనాఁ గలరు నీకు
యిందరిలో నాప్రియమీడేరీనా

చ. 1: సన్నలు సేసేటి వారు సరసమాడేటివారు
కన్నుల మొక్కేటివారు గలరు నీకు
విన్ననై యిందరికిని వెరవనే కాక నా-
విన్నపమెంతైన నీకు వినఁదీరీనా

చ. 2: తేఁకువఁ జేరేటివారు తేనెల మాఁటలవారు
కాఁకలు సేసేటివారు గలరు నీకు
యేఁకటనిందరికడ నెడతాఁకనేకాక
సోఁకనాడే నావంక చూడఁగూడీనా

చ. 3: ముద్దులు గునియువారు ముచ్చటలాడెడివారు
గద్దించి తిట్టెడివారు గలరు నీకు
తిద్దిన నీవిద్యలివి తిరువేంకటేశ నా-
వొద్దఁ గూడి యిట్ల నీకు వుండఁగూడీనా

**తొలిపలుకు :**

నాయిక స్వామితో వాపోతున్నది. నీకు కావలసిన వారెందరో వున్నారయ్యా! నీ దగ్గర ముద్దులు గునిసేవారూవున్నారు. గద్దించి తిట్టేవారు వున్నారు. మరి నీ విద్యలేమన్నా సామాన్యమైనవా? ఇంతదెప్పిన ఆమె కోరిన చిన్న కోర్కెయేమిటి? భావదీపిక చదువక తప్పదు.

**భావదీపిక :**

స్వామీ! నేడు కందువ (ఆసక్తి) చూపేవారు నీ కెందరో వున్నారు. ఇంతమందిలో నా ప్రేమ నెగ్గుకొస్తుందా?

సన్నలు (సైగలు) చేసేవారు, సరసములాడేవారు, కళ్ళతోటే నీకు మొక్కేవారు నీకు గలరని నాకు తెలుసు. ఇందరిని వినటానికే నీ తీరిక గడిపితే నా విన్నపం వినటానికి నీకు తీరిక యెక్కడుంటుంది?

తెగించి నిన్ను చేరినవారు, తేనెలు కురిసే మాటలు మాట్లాడే వారు, కోపగించి మాట్లాడేవారూ, నీకు యెందరో వున్నారయ్యా! ఏకాంతంలో ఇందరి దగ్గర ప్రేమ చూపించి సోకనాడేట్లు (మనస్సు నొప్పించెటట్లు) నావంక చూడటం బాగుందా?

నీ దగ్గర ముద్దులు కుడిచేవారు, ముచ్చటలాడేవారు, గద్దించి తిట్టేవారూ వున్నారు నీకు. దిద్దవలసిన నీ విద్యలు ఇన్నివున్నాయి. ఓ తిరువేంకటేశ్వరా! నా వద్దకు వచ్చి నన్నుకూడి ఇట్లా వుండటం నీకు కూడీనా (తగునా?)



**సంఖ్య : 137** **సంపుటము : 8** **పుట : 81** **రాగం : మంగళకౌశిక**

పల్లవి: కానవచ్చెఁ గదే మీకు కాంతలాల
నానచ్చితేనే కొంత నయము వచ్చీని

చ. 1: మనసులోపలి చింత మాటలోనే కానరాదా
మనసేమి సోదించేవే మగఁడాతఁడు
కొనకొనలనే వద్ద గుట్టుననుండుటే మేలు
పనివడి పిసికితే పసురు వేసీని

చ. 2: ముంచిన వలపుతీపు మోవిమీఁదఁ గానరాదా
యెంచనేలే గుణాలు ప్రాణేశుఁ డాతఁడు
అంచలనిచ్చక మాడి ఆసలనుండుటే మేలు
కంచముపొత్తుకుఁబోతే కారాలు సోఁకీని

చ. 3: కాయము సోఁకినరతి కళలోఁ గానరాదా
యేయెడను శ్రీవేంకటేశుఁడాతఁడు
పాయక కూడెనితఁడు పంతముగొనుటే మేలు
వాయఁబోతే కొనగోరు వాఁటాలు సేసీని (?)

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో దేవి తన చెలులతో స్వామివారికి తనపైన నిజమైన వలపులేదేమో నన్న శంకను బయటపెడుతున్నది. మీకు కూడా కనబడుతోంది కదా! మగవాడి వలపులో తీపియెంతుందో అతని అధరామృతంలోనే తెలిసిపోతుందట.

**భావదీపిక :**

ఓ కాంతలారా! మీకు కూడా కానవచ్చుచున్నది కదా! ఈ వ్యవహారం ఇట్లా నాననిస్తేనే నయమేమో అని నాకు అనిపిస్తోంది.

మీరే చెప్పండి, మనస్సులో వున్న చింత (ఆలోచన) మాటలలో కనబడదా? అతడు మగవాడు వాని మనస్సును శోధించటం సాధ్యమయ్యేపనేనా? తాకీతాకనట్లు గుట్టుగా వుండటమే నయం అనిపిస్తోందే. పనివేళా పిసికితే (వత్తిడి తేస్తే) మొండికెత్తుతాడేమో?

అతిశయించిన వలపు మాధురిమ మగని పెదవుల మీద కానరాదా? ఆయన నా ప్రాణేస్వరుడు. ఆయన గుణాలనెంచటం తగునా? దగ్గరవున్నప్పుడు ఇచ్చకపు మాటలాడి ఆశనిలబెట్టుకోవటమే మంచిది. పంక్తి భోజనాలలో కారము మంట తగిలినా సహించాలి.

శరీరాలు తాకిన రతిలో కళ కనబడుతూనే వుంటుంది కదా! ఎట్లా చూచినా ఆయన శ్రీవేంకటేశ్వరుడు. ఆయన వదలక కూడినాడు. ఇప్పుడు పంతము చూపించుటేమేలు. అప్పుడు కొనగోరితాకులు కూడా వాటాలు చేసికొనవచ్చు.

**సంఖ్య : 73** **సంపుటము : 8** **పుట : 44** **రాగం : హిజ్జరి**

పల్లవి: కానీవే యెంతకెంత గబ్బితనము
యీనెపములెల్లాను యెరఁగనటె

చ. 1: నవ్వులనె వొకమాట నటనలనొకమాట
దివ్వెనలనొకమాట తిట్టేవేమే
పువ్వులనె వొకవాటు పోరచినె వొకవాటు
యివ్వలనే వేసితేను యేమిసేసేవే

చ. 2: కన్నులమొనలుచూపి కతలమొనలుచూపి
చన్నులమొనలుచూపి సాదించేవే
నున్ననిగోరుదీసి నూఁగురుల కొప్పుదీసి
యిన్నినే రట్టుసేసితే నేమిసేసేవే

చ. 3: బిగువుఁగాఁగిటఁబట్టి బీరమునఁ జలపట్టి
పగటున కొనగొంగు పట్టేవేమే
జిగిమించఁగలసితి శ్రీవేంకటేశుఁడఁదాను
యెగసక్కేల దూరితే నేమిసేసేవే

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన స్వామిగా భావించుకొని, దేవి ప్రవర్తన “అట్లా” వుంటే నేనేంచేసేదే? అని చెలికత్తెలతో చెప్పినట్లు నాకుతోచింది. ఇదమిద్ధంగా చెప్పే సాహసం చేయలేము. మొత్తానికి అంత తేలికగా మింగుడు పడని రసగుళిక ఈ కీర్తన.

**భావదీపిక :**

ఓ చెలీ! తనకు (దేవికి) యెంత గబ్బితనమో (గర్వమో) చూచినావా? ఆవిడవేసే ఈ నెపములెల్లా మేము యెఱుగనివాయేమిటి?

తను నవ్వుతుంటే వొకరకంగా మాట్లాడుతుంది. నటనలు చూపుతూ మరొకరకంగా మాట్లాడుతుంది. శుభము పలుకుతూ వొకలాగా మాట్లాడుతుంది. ఇక తిట్టిందంటే చెప్పనే అక్కరలేదు. పూజిస్తే ఒకరకంగా పూలు వేస్తుంది. పోరచి (అలక్ష్యం) చూపితే విసిరినట్లు వేస్తుంది. ఈ విధంగా వేస్తే యేమి చేస్తావే?

సోగకన్నులు చూపిస్తుంది వొకసారి. వికారపు చేష్టలు చేస్తుంది మరొకసారి. వాడికుచములను చూపుతుంది వొకసారి. నున్నని గోటితో గీస్తుంది. సన్నని కురులను కొప్పుతీస్తుంది. పైగా ఇవన్నీ బట్టబయలు చేస్తుంది. ఇకనేనేమిసేతునే?

నన్ను తన బిగికౌగిలిలో బిగిస్తుంది. పగబట్టిన వీరునిలా ప్రవర్తిస్తుంది. సాహసంతో నా కొనకొంగు పట్టుకొంటుదేమో? నేను శ్రీవేంకటేశ్వరుడను. అతిశయించి ఆమెను కూడితిని. దానికి ఆమె పరాచికముగా నన్ను తిడితే మేమేమిచేసెదమే?



**సంఖ్య : 380** **సంపుటము : 7** **పుట : 234** **రాగం : దేసి**

పల్లవి: కొమ్మకడకు విచ్చేసి కోరినవరమీరాదా
యెమ్మెల మానసతపమీకె చేసీని

చ. 1: వెన్నెలయెండలలోన విరహతాపానఁ జెలి
పన్ని మిక్కుటమైన తపము చేసీని
చెన్నుమీరఁ బరచిన చిగురుఁగత్తులమీఁద
యెన్నరాని వుగ్రతపమిదె చేసీని

చ. 2: మొనసి చెమటఁ దలమునుకల నీటిలోన
పనివడి నీకుఁ దపము చేసీని
ఘనమైన నిట్టూరుపుగాలిలోనఁ జెలించక
యెనలేని ఘోరతపమిదె చేసీని

చ. 3: బాయిటనె తనమేని పచ్చిజవ్వనవనాన
పాయక నీరతికిఁ దపము చేసీని
నీయింట శ్రీవేంకటేశ నిన్నుఁ గూడెలమేల్‌మంగ
యీయెడ మోహనతపమిదె చేసీని

**తొలిపలుకు :**

అనాదిగా ఋషులు తపించే యెండల్లోను, కత్తులవంటి ముళ్ళమీద, తలమునకలయ్యే వానలలోను, సుడిగాలిలోను, దట్టమైన వనాలలోను, తపస్సు చేసి హరికృపపొందారు. కాని ఈ అలమేల్మంగ అటువంటి ఘోరతపస్సునే విరహిణియై స్వామి రతికోసం చేసిందట. ఆవిడ మోహన తపమును చూచి అనుగ్రహించవయ్యా! అంటున్నారు అన్నమయ్య.

**భావదీపిక :**

స్వామీ! ఈ తరుణి వద్దకు విచ్చేసి కోరినవరముల నియ్యరాదా? అతిశయించిన మానసిక తపమును ఈమె చేయుచున్నది.

ఎండవలె తపింపజేసే వెన్నెలలో విరహతాపమనే అగ్నిలో నిలబడి దీక్షగా గొప్ప తపస్సు చేస్తున్నది నీ చెలి. చెన్ను మీర (అందముగా) పరచిన చిగురుటాకులనే కత్తులమీద కూర్చొని లెక్కించలేని ఉగ్రతపమును ఈ చెలి చేయుచున్నది.

అతిశయించిన చెమటలు అనే తలమునకలయ్యే వానలో పనివేళా నిలబడిపోయి నీకోసం గొప్పతపస్సు చేస్తోంది. నీ విరహజనితమైన నిట్టూర్పులనే సుడిగాలిలో చలించక నిలబడి యెనలేని ఘోరతపస్సును ఈ చెలి నీకోసం చేస్తున్నది.

పచ్చదైన యౌవనమనే తనమేను యొక్క గమ్మమే నీరతి అని భావించి ఈ దేవి విడువక నీరతికై తపస్సు సేస్తున్నది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ ఇంట్లోనే నిన్ను కూడిన ఈ అలమేలుమంగ ఇప్పుడు నీకై మోహనమైన తపమును ఈ విధంగా చేసినది.

**సంఖ్య : 582** **సంపుటము : 7** **పుట : 356** **రాగం : సామంతం**

పల్లవి: కొలమునొకటిగాదు గుణమునొకటిగాదు
శెలిమి శేయవచ్చీని శెనకకుమనవే

చ. 1: యిల్లిదివో మమ్ము సూడు యేనుగవంటి నడపు
సల్లని తేటసూపులే సక్కదనాలు
సెల్లఁబో సూడుమనవే శింయ్యమువంటి నడుము
గొల్లనికి శెంచెతకు కూటము సెల్లునా

చ. 2: నిచ్చలు మాసెంపలపై నెమిలివంటిది కొప్పు
పచ్చులవంటివి మాబలు సన్నులు
కుచ్చుల పారిటాకులు గిరిగింజ సరుములు
అచ్చపుటూరవాఁడు మాయడవినుండీనా

చ. 3: వసుముగాని శిలుకవంటిదివో మామాట
పసని తేనెల మోవి పశిమివొల్లు
యెసగ శ్రీవేంకటేశుఁడేటవెట్టి నన్నుఁగూడె
రసికుఁడు దాను నేను రాశిపాటదాననే

**తొలిపలుకు :**

చెంచెతయైన ఒక పడుచు శ్రీకృష్ణుని గురించి తన చెలులతో ఈ కీర్తన రూపంలో యేమి చెబుతున్నదో అన్నమయ్య వివరిస్తున్నారు వినండి. మా కులమూ వొకటికాదు, గుణమూ కలవదు. అతడేమో నాతో స్నేహం చేస్తానంటున్నాడు. నన్నెందుకు తాకుతాడు? అని నిగ్గదీస్తున్నది. చెంచెత భాష సులభగ్రాహ్యం కాదు.

**భావదీపిక :**

కొలము (కులము) వొకటి కాదు. గుణము (నడవడి) వొకటి కాదు. శెలిమిశేయ వచ్చీని (స్నేహం చేద్దామని వచ్చాడు). శెనకకుమనవే (నా జోలికి రావద్దని చెప్పండే).

అల్లదిగో మా ఇద్దరిని చూడండి. మదపుటేనుగు వంటి గమనము అతనిది, చల్లని తేట చూపుల అందగాడు. అయ్యబాబోయ్!!! శింయ్యము (సింహము) వంటి నడకను చూడండే. అయినా నాకు చప్పవే గొల్లవానికి చెంచుదానికి యెలా ముడిపడుతుందే?

నా చెంపలు నిచ్చలము (నిశ్చలంగా వున్నాయి). కొప్పు నెమలి వంటిది (నెమలి నలుపు కొప్పు వున్నది). మా బలు సన్నులు (నా బిగువైన స్తనములు) పచ్చులవంటివి (జక్కువ పక్షుల మాదిరి వున్నవి). పారిటాకులు (పండుటాకులు) కూర్చినట్లున్న గిరిగింజల హారములు నా మెడలోవున్నవి. అచ్చం నాగరీకుడులా వుండేవాడు మా అడవిలోకెలా వచ్చాడే?

మా చెంచుల మాట వశముకాని చిలుకమాట వంటిది. మా మోవి తేనెసారము వలె తీపిగావుంటుంది. మా శరీరం రంగు పశిమి (పసిడిరంగు). అట్టినన్ను ఈ శ్రీవేంకటేశుడు వేటాడినాడు. తానేమో రసికుడు. నేను రాశిపాటుదానను (ప్రసిద్ధి కెక్కిన లక్ష్మిని).



**సంఖ్య : 272** **సంపుటము : 8** **పుట : 158** **రాగం : వరాళి**

పల్లవి: గుట్టుతోడిదాన నేను కొసరనేల
దిట్టతనమె నాది తెలుసుకొనవయ్యా

చ. 1: పెక్కుమాట లాడఁగాను ప్రియుఁడ నీతో నేను
వొక్కటి హితవౌను వేరొక్కటిగాదు
చక్కటులు నీవాఁడితే సారెకు వినేఁగాని
అక్కరతో మారుమాట లడుగకువయ్యా

చ. 2: సారె నీతో నవ్వఁగాను చప్పనవునో వుప్పనవునో
తేరకొనని మనసు తిద్దుకోరాదు
కేరి నీవు నవ్వితేను కిమ్ములఁ జూచేఁగాని
ఆరయ నన్నుఁ గలపే వంతయేఁటికయ్యా

చ. 3: నిన్ను బాసగొనఁగాను నిలుపుదువోమరి
నన్నులఁ దోతువో అంతసాధించనేల
యెన్నఁగ నన్నుఁ గూడితి విదిగో శ్రీవేంకటేశ
వెన్నవంటి నయముతో వేఁడుకోనేలయ్యా

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో దేవి స్వామితో తను గోప్యముగల తరుణియైనందున తాను కొసరి కొసరి మాట్లాడలేనని తన దిట్టతనము గ్రహించమని వేడుకొంటున్నది. నీ దగ్గర బాసతీసికొంటే నిలుపుకొంటావోలేవో అని సందేహం వెలిబుచ్చుతున్నది.

**భావదీపిక :**

స్వామీ! నేను గుట్టుగలదానను. కొసరి కొసరి నన్ను నీవు సమ్మతింపజేసెదవెందులకు? నేను దిట్టతనము (ధీరత) గలదానను. నీవిది తెలుసుకొనుట మంచిది.

ఓ ప్రియా! నేను నీతో యేన్నో మాటలు మాట్లాడినప్పుడు కొన్ని నీకు హితముగా వుంటాయి, కొన్ని వుండవు. చక్కటులు (మంచి మాటలు) నీవు చెబుతుంటే యెన్ని సార్లైనా వింటాను గాని తిరిగి మారు మాట్లాడమని బలవంతం చేయకు.

నీతో ప్రతిసారీ నవ్వుతుంటే అది “చప్ప”గా వుంటుందో “ఉప్ప”గా వుంటుందో? తేటపడని మనస్సును దిద్దుకోవటం చాలా కష్టము. నీవు కేరింతలు గొడుతూ నవ్వుతుంటే, కిమ్మున (మౌనంగా) చూడగలను గాని నన్ను కలయుటకు నీకు పంతమేలనయ్యా?

నీ దగ్గర “బాస” తీసికొంటే దాన్ని నిలుపుకొంటావో లేక సన్నల (చీకటి పడేసరికి) తోతువో (గాలికొదిలేస్తావో). నిన్ను అంతగా సాధించటమెందుకు? ఇదిగో శ్రీవేంకటేశ్వరా! నన్ను అతిశయించి కూడినావు. వెన్నవంటి అనునయంతో నన్ను వేడుకొందువేల?

**సంఖ్య : 176  సంపుటము : 8  పుట : 103  రాగం : శుద్ధవసంతం**

పల్లవి: చెప్పుకున్న దోసము చేఁతలెరిఁగినవారు
కప్పిన సంతోసాలఁ గందువలెరఁగరు

చ. 1: కన్నెలాల మీరిద్దరు కాఁగిలించేరు చుట్టాలై
పిన్నలు చన్నులొత్తీనే పెరిగేపొద్దు
మున్నాడి యొక్కరొక్కరు మొక్క లాడేరప్పటిని
కన్నచో గోళ్లుదాఁకీనే కడువాఁడిపొద్దు

చ. 2: దిట్టలై ముచ్చటలుగా తీపులు మాటలాడేరు
యిట్టె తేనెగారీ నిప్పలెర్లించే (?) పొద్దు
చెట్టపట్టాలు వట్టేరు చేరి పిరుఁదులురాయ
బట్టబయలయ్యా మరుబండ్లు వారేపొద్దు

చ. 3: బంతినే మీరిద్దరును పాదుగాఁ గూచుండేరు
గుంతలయ్యాఁ బరపెల్లాఁ గూడేటిపొద్దు
యింతలో శ్రీవేంకటేశుఁడెనసె నిన్నునూ నన్నూ
రంతుగా మాచేనాడించే రాజసమీపొద్దు

**తొలిపలుకు :**

ఈ శృంగార కీర్తన సులభగ్రాహ్యం కాదు. అన్నమయ్య వాడిన కొన్ని మాటలు నేటి కాలంలో వాడుకలో లేవు. నిఘంటువులలో అర్థం దొరకదు. సందర్భాన్నిబట్టి అర్థం వూహించాలి అంతే. సర్వం శ్రీవేంకటపతి అభీష్టం. నేను నిమిత్తమాత్రుడిని. ఇది నా ఊహ మాత్రమే.

**భావదీవియ :**

ఈ శృంగారరాయని చేతలెట్టివో యెరిగిన వారు పరుల సావధానమునకు చెప్పుకున్న దోసము కాదా? ఇతని చెలిమిలో కప్పిన సంతోషముల ప్రభావము వలన, కందువలను (ఇతని కపట బుద్ధిని) యెరుగరు.

ఓ కన్నెలారా! (శ్రీదేవి భూదేవి) ఇతనికి చుట్టాలై (భార్యలై) కౌగలించేరు. అవి పెరిగే పొద్దున ఇతడు చిన్నారి కుచముల నొత్తుచున్నాడు. మీరేమో పూర్వంవలెనే ఒక్కరొక్కరు ఆయనకు మొక్కుచునే వున్నారు. మిక్కిలి వాడియైన తన గోళ్ళతో తాకీని (గీరివేస్తాడు). ఏ పొద్దునైనా మిమ్మల్ని కన్నచో వదలడు.

మీరేమో దిట్ట తనముతో వానిని పలుకరించి తీయగా మాట్లాడెదరు. తేనెగారే నిప్పులో పొర్లించేరు. మీరిరువురూ చెట్టాపట్టాలు వేసికొని మీ నితంబులను స్వామికి తాకించెదరు. మీ మదన కళలు బట్టబయలవుతూనే వున్నాయి. ఏ పొద్దునైనా ఇదే జరుగుతుంది.

ఎప్పుడూ మీరిద్దరూ అతని పంక్తిలో కూర్చొని భుజిస్తారు. మీరు స్వామితో కూడేటి పరుపుపై గుంతలవుతూనే వుంటాయి. ఇంతలో శ్రీవేంకటేశ్వరుడు హఠాత్తుగా ఇక్కడికి వచ్చి నిన్నునూ (దేవిని) నన్నునూ (అన్నమ్మను)కూడి రంతుల (ప్రణయ కలహం) ఆడిస్తాడు. ఏ పొద్దునైనా రాజసమే.



**సంఖ్య : 339  సంపుటము : 7  పుట : 209  రాగం : హిందోళం**

పల్లవి: చెలులము నేము బుద్ధి చెప్పనోపమాకెకు
అలరి నీవాపెను మాఁటాడించవయ్యా

చ. 1: మక్కువతో నాపె నీవు మాటలాడేవంటాను
పక్కునఁ బాన్పుపైనీకె పవళించె
వెక్కసాన నింతలోన విచ్చేసితివీడకు
నెక్కొని నీవే యిఁక నిద్రలేపవయ్యా

చ. 2: తతితో విందాకెయింటఁ దగనారగించేవంటా
అతివ బోనమెల్లా చల్లారఁబెట్టెను
అతివేడుకనింతలో నాఁకలిగొంటిననేవు
కతగా నీవే వడ్డించఁ గైకొలువవయ్యా

చ. 3: కందువనాపెతో నేఁడు కాఁపురము సేసేవంటా
వొందిలిఁ దలుపు మూసుకున్నది చెలి
అందుకె శ్రీవేంకటేశ అండకేఁగి కూడితివి
చెందినీవె వాకిలాపె చేఁదెరపించవయ్యా

**తొలిపలుకు :**

దేవి చెలికత్తెలు స్వామితో ఈ కీర్తన రూపంలో ఇలా చెబుతున్నారు. మాదేముంది, మేము చెలికత్తెలము. ఆమెకు మేమేమి బుద్ధి చెప్పగలము? నీవే ఆమెతో యేమి మాట్లాడాలో మాట్లాడుకో. అమె యేమేమి చేసిందో వినవయ్యా! స్వామి తన కొత్త ప్రేయసితో వున్నాడని దేవి వగచిన ఫలితమేమయింది?

**భావదీవియ :**

స్వామీ! మేము చెలులము. ఆమెకు (దేవికి) హితబోధ చేయగలమా? నీవే అతిశయముతో ఆమెను మాట్లాడించవయ్యా!

నీవే మాట్లాడెదవని ఆమె అనురాగంతో పక్కనున్న పాన్పుపై నీకై పవ్వళించినది. ఇంతలో వెక్కసాన (ఆశ్చర్యకరముగా) నీవుయేతెంచితివి. నెలుకొని ఇక నీ భార్యను నీవే నిద్రలేపుకోవయ్యా!

నీవు నీ ప్రియురాలి ఇంట మక్కువతో విందారగించే వస్తావని వూహించుకొని మా దేవి నీ కోసం సిద్ధం చేసిన వేడిభోజనాన్ని చల్లారబెట్టింది. అతి వేడుకతో వచ్చిన నీవు ప్రియా! ఆకలిగా వుంది అన్నావు. నీవే కతగా (జాణతనంతో) వడ్డించడానికి సిద్ధపడవయ్యా!

కందువ (ఆసక్తితో) ఆమెతో (నీ కొత్త ప్రియురాలితో) నేడు కాపురం చేసివచ్చావని చెలి (మా దేవి) వొందిలి (దుఃఖించి) తలుపు మూసుకొన్నది. శ్రీవేంకటేశా! నీవే నీ మాయతో అక్కడికి వెళ్ళి ఆమెను కూడితివి. అందుకని నీవే ఇప్పుడు దేవి వాకిలి తెఱచునట్లు నచ్చచెప్పుకో స్వామీ!

**సంఖ్య : 370** **సంపుటము : 7** **పుట : 228** **రాగం : మధ్యమావతి**

పల్లవి: చెలులెల్లాఁ జూచి సంతోసించి మెచ్చి పొగడేరు
కలిగె మీకు మేలము కలకాలము

చ. 1: చెలియ నీవద్దనుండి సెలవి నవ్విన నవ్వు
వెలలేని వలపుల వెన్నెలపువ్వు
అలవోక నీమీఁదనంటఁ జూచినచూపు
తలకొన్న జవ్వనమదము తరితీపు

చ. 2: పొంచి నీదేవులు నీతోఁ బూఁచి యాడినపలుకు
వంచి తీసిన మరువాఁడి చిలుకు
అంచ నీయెదుటఁ బచరించిన సింగారము
పంచలఁ బదారువన్నె బంగారము

చ. 3: వనిత నీతోఁబెనఁగి వలలఁబెట్టిన యాస
మునుకొన్న తమితోడి ముత్తేల సేస
చనవిచ్చి శ్రీవేంకటేశ్వర యీకెనేలితివి
చెనకురతిమెండు చెరకునఁ బండు

**తొలిపలుకు :**

మేలము అంటే పరిహాసముతో కూడిన సంతోషము. ఆ నూతనదంపతుల సరసము చూచి వారి చెలులు సంతోషపరవశులై వారిద్దరినీ యెంతో పొగడుతున్నారు. కలకాలం మీరిలాగే సంతోషముతో మేలములాడుకొంటూ అన్యోన్యముగా వుండాలని వారు ఆశిస్తున్నారు. అన్నట్లు వారిలో మన అన్నమయ్య ముఖ్యులు.

**భావదీపిక :**

స్వామీ! చెలులందరూ మీ సరసము జూచి మిక్కలి సంతోషించి మెచ్చుకొన్నారయ్యా! మీకు కలిగిన ఈ "మేలము" కలకాలం వుండాలని మా కోరిక.

మా చెలి నీవద్ద నుండి చిరునవ్వులు చిందిస్తుంటే సాటిలేని వెన్నెల పూచినట్లు వున్నది స్వామీ! అలవోకగా ఆమె నీపై ప్రసరించు చూపులు ఆమెలో కలిగిన యౌవనమదజనితమైన తరితీపు (పారవశ్యము).

ప్రభూ! నీ దేవులు (దేవేరి) రహస్యముగా నీతో అతిశయించి ఆడినపలుకులు (మాట్లాడిన మాటలు) వాడి చిలుకు (పదునైన బాణము). దేవి ఆపైన నీయెదుట ప్రదర్శించిన సింగారము, వద్దనున్న మేలిమి బంగారము వంటిది.

ఆ వనిత నీతో పెనగి నీకు పెట్టిన ఆశ, పరవశంతో నీపై ఆమె పోసిన "ముత్తేలసేస" (ముత్యాల తలంబ్రాల వేడుక). శ్రీవేంకటేశ్వరా! చనవునొసగి ఈమెను నీవుయేలితివి. రతిలో మెండుగా నీవొసగిన స్పర్శలు "చెరకునకు పండు" (అపురూపమైనవి).



**సంఖ్య : 381** **సంపుటము : 7** **పుట : 235** **రాగం : భైరవి**

పల్లవి: చేఁతలు నీవిచూచి సిగ్గయ్యీ మాకు
కాతరమింకానెంతే కతకారి నీకు

చ. 1: నీడనుండె యలసేవు నిన్ను నీవె సొలసేవు
చేడెరో నీమగఁడు చూచీనంటాను
పాడిపాడి చొక్కేవు పలుమారు నిక్కేవు
యేడ నేరుచుకొంటివే యెమ్మెలాఁడి నీవు

చ. 2: వేసాలకే మురిసేవు వెస ముద్దుగురిసేవు
పోసరించి యాతఁడు పొగడీనంటా
ఆసలు గడు రేఁచేవు అట్టె సిగ్గులు దాఁచేవు
మాసుద్దులు వినరాదా మాయదారి నీవు

చ. 3: బొమ్మలనె జంకించేవు పొందులనె లంకించేవు
కమ్మి శ్రీవేంకటేశుఁడు కైకొనీనంటా
నెమ్మది నన్నేలినాఁడు నేనలమేల్‌మంగను
సమ్మతించ నేరుతువే సటకారి నీవు

**తొలిపలుకు :**

అన్నమయ్య అనే భావనా సుందరిని శ్రీవేంకటేశుడు స్వీకరించాడని దేవి మండిపడుతున్నది. ఎంత "సటకారివే" అని నిగ్గదీస్తోంది. ఎంత "కాతరమే" నీకు? అంతేకాదు "యెమ్మెలాడి", మాయదారి "కతకారి" అని మాటజారింది. అన్నమయ్య కాలపుభాష అర్థం కాకపోయినా భావం తెలుస్తూనేవున్నది. మరి భాష తెలియాలంటే... భావదీపికను పట్టుకోండి.

**భావదీపిక :**

ఓ కాంతా! (అన్నమయ్య) నీచేతలు చూస్తుంటే మాకే సిగ్గుగా వున్నది. ఓ కతకారీ! (గడుసుదానా!) నీకు ఇంకా యెంత కాతరమే (పొగరే?)

నీడలోవుంటేనే అలసిపోతావా? చేడెరో! (ఓ పిల్లా!) నీమగడు (స్వామి) చూస్తాడని నీకు నీవె సొలపులు (పారవశ్యం) నటిస్తావా? అనేకమార్లు యేవేవో శృంగార గీతాలు పాడి పరవశించిపోతావా? ఓ యెమ్మెలాడి (వగలాడీ!) యీ వగలు యెక్కడ నేర్చుకున్నావే?

ఏమే వేషాలు చూపించి మురిసేట్లు చేస్తావా? ముద్దులు కురిపిస్తావా? అతగాడు (స్వామి) నీతో పోసరించి (మదించి) పొగడినాడని విఱ్ఱవీగుతావా? సిగ్గుయెగ్గూ దాచిపెట్టి ఆయనలో అన్ని ఆశలు రేపుతావా? నీవు మాయదారి దానివి మాకెక్కడ దొరికావే? నాతో (దేవితో) మా కథలు వినలేదటే?

ఓ అన్నమ్మా! నీ కనుబొమ్మలతో మా ఆయనను బెదిరిస్తావా? ఎట్లాగో ఆయన పొందుదక్కించుకొన్నావులే. శ్రీవేంకటేశునే కైవశం చేసికొంటివని ఎంత ఆతిశయమే? కాని ఆయన మనస్సులో యెప్పుడూ నాయేలికే. నేను అలమేలుమంగను. నీవు సటకారివి (వంచకురాలివి). ఆయనను సమ్మతింపచేయటం యెక్కడ నేర్చావే?

**సంఖ్య : 584** **సంపుటము : 7** **పుట : 357** **రాగం : బౌళి**

పల్లవి: చేసిన తనచేఁతలు చెప్పరాదు
యీ సటలవానితోడ నేమిసేతునే

చ. 1: వలపు గలవారికి వాసులు పనికిరావు
పిలిచితేఁ బలుకక బిగియరాదు
చలపట్టి వేఁడుకొంటే సమ్మతించకుండరాదు
యెలయించీనిదె తాను యేమిసేతునే

చ. 2: మన్ననగలవారికి మంకులు చూపరాదు
సన్నలేమి సేసినాను సాదించరాదు
కన్నులనే నవ్వినాను కాఁతాళము చూపరాదు
యిన్నేసి ప్రియాలు చెప్పీ నేమిసేతునే

చ. 3: కూటమిగలవారికి కోపగించు కొనరాదు
పాటించి మేలమాడఁగ బదరరాదు
గాఁటమై శ్రీవేంకటఘనుఁడిట్టె నన్నుఁగూడె
యీటువెట్టెఁ దనతోడ నేమిసేతునే

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో దేవి తన చెలికత్తెతో తన భర్త యెంత మోసకారియో వివరిస్తోంది. అబ్బో! యెవ్వరికీ చెప్పుకోకూడదు గాని ఈయన పచ్చి మోసగాడు. ఏమిచేయమంటావే? అయితే చివరకు తనతో ఈటువెట్టాడు. శ్రీవేంకటేశుని యేమిచేయనే అని గునుస్తున్నది.

**భావదీపిక :**

చెలీ! ఇతగాడు (స్వామి) చేసిన తన చిలిపి పనులు ఇటువంటివని చెప్పరాదు. ఈ సటలవానితో (మోసాల మొగుడితో) యేమిచేయనే?

నీకు తెలియును కదా! వలపు నిజంగా వున్నవారికి వాసులు (తారతమ్యాలు) పనికిరావు. తనే భార్యతో మాటలు కలిపితే బిగువుచూపరాదు. చలపట్టి (భర్త పంతము వదలి) వేడుకొంటే సమ్మతించకుండా వుండరాదు. ఇన్ని నీతులు చెప్పి నన్ను ఇదే (అదేపనిగా) యెలయించీని (కౌగిలిస్తాడు) అతని నేమి చేయనే?

మరి కొన్ని నీతులు విను. భార్యంటే మన్ననగల వారికి మంకుపట్టు చూపకూడదు. ఆయన సన్నలు (సైగలు) చేస్తే అదే పనిగా సాధించకూడదు. ఆయన కన్నులతోనే నవ్వితే, కాతాళము చూపరాదు (ఈర్ష చూపరాదు) చెలీ! నాకు ఇన్నేసి ప్రియాలు చెప్పి (నీతులు చెబుతాడు). ఏమి చేయనే?

భర్తతో కూటమిగలవారికి కోపగించుగొనుట కూడదు. అదే పనిగా మేలమాడితే (సరసమాడితే) బదరరాదు (పనికిరాని మాటలు మాట్లాడకూడదు). ఇటువంటి నీతి బోధలు చేసి శ్రీవేంకటేశ్వరుడు నన్ను సులువుగా కూడినాడు. తనతో ఈటువెట్టి (సమానము చేశాడు). ఇక నేనేమి చేయనే?



**సంఖ్య : 338** **సంపుటము : 7** **పుట : 208** **రాగం : గౌళ**

పల్లవి: తనసేవ నేఁజేయనా తగవు దప్పఁగాఁ గాక
చెనకీఁ దానిందుకేపో సిబ్బితయ్యీ నాకు

చ. 1: కదుఁ దమకాన నేను కస్తూరి నూరఁగాను
తడఁబడ నామీఁద బాదము చాఁచీని
బెడిదమై ఆఁటదాని పెండెము వెట్టుకున్నాఁడు
చిడిముడి నిందుకేపో సిబ్బితయ్యీ నాకు

చ. 2: పొందుగా నేను గొజ్జంగ పువ్వుదండ గుచ్చఁగాను
చెంది నాబుజముమీఁదఁ జెయివేసీని
మందెమేళాన నెవ్వతో మట్టెలు వేలనున్నవి
చిందువందసేఁతకేపో సిబ్బితయ్యీ నాకు

చ. 3: పొలుపుగా నేఁదట్టుపునుఁగు వాసించఁగాను
అలమీ శ్రీవేంకటేశుఁడంతలో నన్ను
మొలనూలేదదో వురమునఁ బెట్టుకున్నాఁడు
చెలరేఁగి కూడఁగానే సిబ్బితయ్యీ నాకు

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో దేవి, స్వామితో జరిపిన శృంగారలీలలో తొందర వల్ల జరిగిన పొరబాట్లను పేర్కొంటూ అతగాని చెనకులకి అందుకే నాకు “సిబ్బితయ్యీనీ’వ అంటున్నది దేవి. “సిగ్గు వస్తోంది” అని అర్థం. మరి ఎందుకంత సిగ్గో తెలియాలంటే ఈ మధురకీర్తన చదవక తప్పదు. ఆవిడగారి మొలనూలు ఆయన యెద పైకి వచ్చిందంటే... మాటలా!!!

**భావదీపిక :**

చెలీ! మామధ్య తగవు తప్పుటకేమి చేయను? తన సేవచేతునా? దాని కోసం స్వామిని స్పృశించక తప్పదు కదా! తాను. అందుకే పో అంతగా నాకు సిబ్బితయ్యీ (సిగ్గుకలుగుతున్నది).

నేను తమకంతో వుండి కస్తూరిని నూరుతున్నాను. ఇంతలో స్వామి తడబడి తనపాదముతో నన్నుతొక్కాడు. అప్పుడు చూస్తే తెలిసింది, వారి శృంగారహేల తదనంతరం ఆయన చేసిన పొరబాటు. ఆయనగారి బెడిదంపు (కఠినమైన) కాలికివున్నది ఆడదాని పెండేరము. తొట్రుపడిన నాకు అందుకే సిగ్గయ్యింది.

నేను గుజ్జంగపూలదండ కడుతుంటే ఆయన వెనకనుంచి వచ్చి నా భుజంపై చెయ్యివేశాడు. అప్పుడు చూస్తే తెలిసింది మందెమేళాన (పరిహాసంగా) యెవ్వతో తన కాలిమట్టెను ఆయన వేలికి తొడిగింది. ఇప్పుడు చిందరవందర చేయాలంటే నాకే సిగ్గుగావున్నదే.

నేను తట్టుపునుగు (సుగంధద్రవ్యం) వాసనచూస్తుంటే, శ్రీవేంకటేశ్వరుడు వెనకనుంచి వచ్చి దానిని నా వంటిపై అలమినాడు. తీరా చూద్దును గదా! ఆయనగారి వురమున పెట్టుకొన్నది ఆడదాని మొలత్రాడు. ఆయనగారు చెలరేగి నన్ను అక్రమించుకొంటే నాకు చెప్పలేని సిగ్గుముంచు కొచ్చింది. ఇదండీ ఈయనగారి సరసం, శృంగారం.

**సంఖ్య : 501 సంపుటము : 7 పుట : 307 రాగం : సామంతం**

పల్లవి: తల వంచుకోకుమీ తప్పు నీయందేమి లేదు
బలుదొరతనానకుఁ బాడి యిదే సుమ్మీ

చ. 1: ఇంతేసి నేనాడేది యిచ్చకము గాదు సుమ్మీ
కాంతలఁ జూచితే నీవు కరుణింతువు
అంతవాఁడవీమాటకు నట్టే సిగ్గుపడకుమీ
బంతి దయగలవారి పాడి యిదె సుమ్మీ

చ. 2: వేడుక నిన్ను మెచ్చేది వెంగెములు గావు సుమ్మీ
కూడేమంటే సతులకుఁ గొంగిత్తువు
వాడికింతే యిందుకుఁగా వడి నవ్వునవ్వకుమీ
పాడిపంతాలవారికిఁ బాడి ఇదె సుమ్మీ

చ. 3: నమ్మించి కాఁగలించేది నమ్మనిది గాదు సుమ్మీ
యిమ్ముల సులభుఁడవు యెవ్వరికైనా
కమ్మి శ్రీవేంకటేశుఁడ కలసితి విటునన్ను
పమ్మి మోహపువారికిఁ బాడి యిదె సుమ్మీ

**తొలిపలుకు :**

ఈ కీర్తనలో అన్నమయ్య స్వామి భావనాప్రియురాలూ ఆమె స్వామితో నీవు బలమైన దొరవు. నీ స్వభావం నీది. సతులు కూడమికి సిద్ధపడితే నీవూ సై యంటావు. నీవు యెందుకు తలవంచుకొంటావయ్యా? నీకు నావంటి వారిపై మోహము యెక్కువ. అది నీకు న్యాయమే కదా! "వనిత తనంత తావలచి వచ్చిన కాదను వారలెవ్వరో?".

**భావదీపిక :**

ప్రభూ! తప్పు నీయందేమీ లేదు. నీవు తలవంచుకొనుటెందుకు? బలు దొరతనానకు (సమర్ధుడైన చక్రవర్తికి) ఇదే పాడి (నీతి) సుమ్మీ!

నేనింతంత మాటలు చెప్పటం ఇచ్చకము (ముఖప్రీతి) మాటలు కావు. కాంతలను చూస్తే నీవు కరుణించక మానవు. అంతటి దేవుడవు నేనన్న యీ చిన్న చలోక్తికే అంత సిగ్గుపడతావెందుకు స్వామీ? బంతిదయ (యెనలేని కరుణ) గలవారికి ఇది న్యాయమే కదా!

నేను నిన్ను వేడుకతో మెచ్చుకొంటున్నది వ్యంగముగా కాదయ్యా! నిజంగా ఏ సతులైనా నిన్ను కూడెదమంటే నీవు వెంటనే వారికి నీ కొంగిత్తువు (వారి ఆధీనమైపోతావు). ఇది నీ వాడికె (అలవాటు). అందుకోసం నీవు పడిపడి నవ్వవలసిన పనిలేదు. పంతాలు పరిపాటి అయినవారి తీరే ఇంత.

నీవు నాబోటి వారిని నమ్మించి కౌగలించుకొంటావు అనేది నమ్మనిదికాదు (అందరూ నమ్మే సంగతే). నీవు యెవ్వరికైనా ఇదే మాదిరి సులభుడవు (సులభంగా చిక్కుతావు). ఓ శ్రీవేంకటేశ్వరా! ఇట్లా నన్ను కలిశావోలేదో నన్ను కమ్ముకొనినావు. పమ్మి మోహనపు వారికి (అతిశయించిన మోహపరవశులకు) ఇది సహజమే.



**సంఖ్య : 318 సంపుటము : 5 పుట : రాగం :**

పల్లవి: దంతచ్ఛద ముద్రా మదనాస్త్రల-
తాంత శాంతికృతి రహో భవతి

చ. 1: వనితా కుచయోర్వర నఖరేఖా-
ర్జన శశిచిహ్నం సఫలమిదం
ఘనకరుణాం మయి ఘటయ చంద్ర ఇ-
త్యనునయ కారణమహో భవతి

చ. 2: సతీమణి విరసత్కరమూలే
చతురలాంఛనం సఫలమిదం
ప్రతతి భయహృదే వరదాస్యకలన-
మతిఘాతాకృతి రహో భవతి

చ. 3: తరుణీతనుగంధ విలేపనవి-
స్తర సౌభగ్యం సఫలమిదం
పరిరంభ సుఖే తిరువేంకటగిరి
హరిః పూజనమహో భవతి

**తొలిపలుకు :**

అన్నమాచార్య విరచిత శృంగార సంకీర్తన ఇది. సంస్కృత కీర్తన కాబట్టి అంత తేలికగా మింగుడు పడదు. దేవి వదనముపై స్వామి చేసిన దంతచ్ఛదములు, నఖములు చేసిన నఖరేఖా చంద్రికలు వివరించటం మనబోంట్లకు సాద్యమా? అయినా "పతంజలి"గారి కౌముదిలో నడకలు నేర్చుకొంటున్నాను.

**భావదీపిక :**

దేవి ముఖముపై స్వామివారు చేసిన దంతచ్ఛత ముద్రలు పూలతో శాంతి రచనగా భాసిల్లుతున్నది. అహో!! ఈ గాట్లు మదనుని అస్త్రఘాతములు కాదుగదా!

ఓ చంద్రా! నాపై కృపచూపుము. నన్ను బుజ్జగించటానికా అన్నట్లు స్వామివారు నీ రూపములను నఖక్షతములుగా నా కుచములపై ముద్రించారు. అహో!! ఈ అనునయ కారణము అత్యద్భుతము.

దేవి యొక్క బాహుమూలముల మెఱపు స్వామి వారి నేర్పు ప్రదర్శించు చతురమైన లాంఛనములను చూచిన తెలియుచున్నది. విరహతాపముతో ఆమె చెట్ల నడుమ నడచుచున్నప్పుడు తీగెలు ఆమెకు చుట్టుకొని బాధించిననూ ఆ బాధే అలవాటై విరహ బాధసైచుచున్నదా అనిపిస్తున్నది. అహో!! స్వామి నేర్పు అత్యద్భుతము.

దేవి శరీరంపై స్వామి పూసిన శ్రీగంధపు సౌభాగ్యము విస్తరించి సఫలమవుతున్నది. తన కౌగిటి సౌఖ్యములోనే దేవి స్వామికి గంధపు పూజ చేస్తున్నది. అహో!! శ్రీవేంకటేశ్వరుని నేర్పు యెంత ఆశ్చర్యకరము!!!

**సంఖ్య : 19 సంపుటము : 5 పుట : 14 రాగం : పాడి**

పల్లవి: దేవరచిత్తం దివ్యనిధి
దేవనిర్మిత విధీ యవధానం

చ. 1: అతివలు నాట్యంబాడెదమని వు-
న్నతి మెఱయుచు నున్నారిదివో
ప్రతినలతో రంభయు మేనకయును
ధృతి కరుణాంబుధి ధీయవధానం

చ. 2: గానవిద్య తమకంబున వినుమని
కానుకలివె సురకాంతలవి
కానుపించుకో గంధర్వసతులను
ధీనుత పంపు సుధీ యవధానం

చ. 3: పరియంకంబునఁ బవళించెదవో
సిరుల విభవములఁ జెలఁగెదవో
తిరువేంకటగిరి దేవ యన్నిటా
తిరమందితి విటు ధీయవధానం

**తొలిపలుకు :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ సరస కీర్తనలో దేవర చిత్తమును రంజింపచేయుటకు రంభ మొదలైన అప్సరసల నృత్యవిశేషాలను, సుర గంధర్వ కాంతల గానవైదుష్యాన్నీ ఆస్వాదిస్తూ శయ్యపై పవళిస్తావో సిరుల విభవముల చెలగెదవో అని ప్రశ్నిస్తున్నారు స్వామిని. ఇందకీ "అవధానం" అంటే ఎచ్చరికతో వుండటం.

**భావదీపిక :**

దేవర చిత్తం (దేవదేవుని ఆజ్ఞ), దివ్యనిధి (దివ్యమైన సంపద). ఆదిదేవునిచే రచించబడిన శాసనం. అవధానం (ఎచ్చరికతో వుండాలి).

ఇదివో అతివలు (స్త్రీలు) నాట్లమాడెదమని విశిష్టముగా శోభిస్తూ వున్నారు. మేమే గెలుస్తామని ప్రతిజ్ఞ పట్టి దేవకాంతలైన రంభ, మేనక ధృతితో (స్థిర చిత్తంతో) నర్తిస్తున్నారు. కరుణాసాగరుడవైన వో ధీరచిత్తా! ఎచ్చరిక ప్రభూ!

స్వామీ! తమకంబున (తన్మయత్వంతో) వినుమని తమ గానవిభవం కానుకగా సమర్పిస్తున్న సురకాంతలు ఉల్లాసముగా నున్నారు. గంధర్వసతులను కానుపించుకొ (దర్శిస్తూ) అతిశయింపుము. ధీరులచే నుతించబడు దేవా! పంపు (ఆజ్ఞాపించు) సుధీ (విద్వాంసుడా!) ఎచ్చరిక.

ప్రభూ! నీవు పర్యంకమున (తల్పముపై) పవ్వళించెదవో లేక సిరులతో కూడిన వైభవమున అతిశయిందవో? ఓ శ్రీవేంకటేశ్వరా! అన్నిటా ఈ విధముగా స్థిరపడితివి. ఓ ధీశాలీ! ఎచ్చరిక.



**సంఖ్య : 332 సంపుటము : 19 పుట : రాగం :**

పల్లవి: దేవ! వాసుదేవ
భావయ తాం పాలయ

చ. 1: నరహరే అహెూ నారాయణరే
మురహర నగధర ముకుంద
తరుణీయం తు తవ విరహేణ
భరితవిచిత్రప్రతిమా జాతా

చ. 2: దివిజవందిత! దేవోత్తమ! అహెూ
నవనీతప్రియ నందసుత
తవ సంగమసంతతకామనయా
యువతి ర్జాతా యోగిణీవ

చ. 3: జితదానవ! అహెూ శ్రీవేంకటపతే!
సతత మాధవ కృష్ణ సర్వేశ
రతిసంగమేన రమణీ యంతు
బతతే విహితాభరణా జాతా

**తొలిపలుకు :**

అన్నమయ్య గీర్వాణిలో హరి నామ సంకీర్తన చేస్తున్నారు. ఈ సంకీర్తనలన్నీ యథాతథంగా వింటే రసవంతంగా వుంటాయి. అనువాదముతో వింటే కొంత పేలవంగా వుండే మాట నిజమే. కాని అర్థం తెలియకుండా నేర్చిన వాటిని చిలుక పలుకులంటారు. అవి వినుటకు మించి నిరుపయోగం. పాడే వారికి మానసిక తృప్తి కలిగినా అది సంపూర్ణం కాదు.

**భావదీపిక :**

ఓ దేవా! వసుదేవనందనా! నీదేవిని భావించు. ఆమెను పరిపాలించుము. ఆహా!! నరహరీ! ఓ నారాయణా! "ముర" అనే దానవుని మట్టుబెట్టినవాడా! గోవర్ధనగిరిని చిటికెన వ్రేలిపై మోచినవాడా! మోక్షప్రదాయకా! ఈ యువతి నీ విరహము చేత విచిత్రమైన ప్రతిమగా మారిపోయింది.

దేవతలందరి చేత నమస్కరింపబడుచున్న ప్రభూ! దేవుళ్ళందరిలో శ్రేష్ఠుడా! ఆహా!! అప్పటికప్పుడు చిలికి తీసిన వెన్న అంటే బహుప్రీతి గల స్వామీ! నందకుమారా! నీ కూటమికి ఆశపడిన యువతి యోగిని వలె విరక్తురాలైపోయినది. ఆమెను పరికించవయ్యా!

ఆహా!! దానవులను గెలిచినవాడా! శ్రీవేంకటేశ్వరా! నిరంతరము శ్రీదేవిని ప్రేమించు స్వామీ! శ్రీకృష్ణా! సర్వేశ్వరా! నీతో రమించు రమణి రమణుడవైన నీకు నిర్దేశింపబడిన ఆభరణమై శోభించుచున్నది.

**సంఖ్య : 95** **సంపుటము : 5** **పుట : 66** **రాగం : ముఖారి**

పల్లవి: దొరకెఁగా పూజ కందువపూజ నీ-
విరహపు తనుతావి విరవాది పూజ

చ. 1: కలికి నీ కనుచూపు కలువరేకులపూజ
లలన నీనగవు మొల్లల పూజ
తలపోఁత చింత చిత్తపుఁ గమలపు పూజ
చలివేఁడి వూర్పు నీ సంపంగి పూజ

చ. 2: కనలుఁ జెక్కునఁ జేయి కరపల్లవపు పూజ
తనుపులకలు జాజిననలపూజ
తనరు నీ వలులు దొంతరపూవుల పూజ
మొనయుఁ జెమట మల్లె మొగ్గలపూజ

చ. 3: చెనకు నీ గోళ్ళే చిఱుగేదఁగుల పూజ
గునియు గుబ్బలు పూవుగుత్తుల పూజ
ఘనతమైఁ గూడి వేంకటపతి మోము సోఁ-
కిన నీదుమోని మంకెనపూవు పూజ

**తొలిపలుకు :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో దేవి చేసిన ఇటువంటి "పూజ"లను వివరించేవి నేను ఇదివరలో చాలా వివరించాను. ఆ రోజుల్లో స్వామివారికి పుష్పయాగం అసంకల్పిత దోష నివారణార్థం చేసేవారు. అనేక పుష్పాలతో జరిగే ఆ పూజను అన్నమయ్య కాల్పనిక జగత్తులోకి వెళ్ళి అక్కడ మీరు వున్నట్లు భావించి తరించండి.

**భావదీపిక :**

మాకు ఇట్టి అద్భుతమైన పూజ దర్శించే భాగ్యం దొరకెను కదా! ఇది కందువ పూజ (అసక్తికరమైన పూజ). దేవీ! ఇది నీ విరహపు తనువు యొక్క సుగంధం జాలువారే విరవాది (విరజాజుల) పూజ. ఆలకింపుము తల్లీ!

ఓ కలికీ! నీవు స్వామిపై ప్రసరించే కనుచూపులే కలువరేకుల పూజ. ఓ లలనా! నీ మనోహరమైన నవ్వులే మొల్లల పూజ. నీ స్వామి తలపులతో నీ మనోకమలము చేసేదే కమలాల పూజ. పరిమళభరితమైన నీ చలివేడి వూర్పులు (ఉచ్ఛ్వాస, నిస్స్వాసములు) నీవు చేసే సంపగి పూల పూజ.

దేవీ! కనలునట్లు నీ చెక్కిళ్ళపై చేయివేసికొని చేయునదే కరపల్లవముల పూజ. నీ తనువుపై కలిగిన పులకలే జాజిపూల పూజ. అతిశయించిన తనూలతతో నీవు చేసేదే వలుల దొంతర పూజ. నీ స్వేద బిందువులతో నీవు చేసేదే మల్లెమొగ్గల పూజ.

దేవీ! నీవు స్వామిని గోళ్ళతో చెనకుతావు కదా! అదే లేతగేదగుపూల పూజ. నీ చనుగుబ్బలు తాకించుటయే స్వామికి పూలగుత్తుల పూజ. ఘనతతో మీ మేనులు కూడునపుడు శ్రీవేంకటపతి తనమోమును సోకించి నీ అధరామృతమును గ్రోలుటే మంకెనపూవుల పూజ.



**సంఖ్య : 85** **సంపుటము : 6** **పుట :** **రాగం :**

పల్లవి: న తు మమ తావన్మానసస్త్వదీయ
నితాంత హిత సరణిం నమామి

చ. 1: న వదతు భవాన్ జనార్ధన ఘనరతి
వివాద వచనం వృథావృథా
తవ మృదు వేద సుధామయ వచనైః
వివిధా వశ పదవీం వహామి

చ. 2: న భజతు మాం కరుణానిధే భవ
ద్విభవ వినయశ్చ వృథావృథా
త్రిభువన సుఖకర దివ్య రూప తే
ప్రభూతయా పరాభవం భజామి

చ. 3: న చలతు వేంకట నాథ మాం వినా
విచరణమపి తే వృథావృథా
సుచరిత్రస్త్వం సుభగస్త్వం త్వాం
కుచయోః పులకాంకురైఃధరామి

**తొలిపలుకు :**

ఈ శృంగార కీర్తనలో నాయిక "ఖండిత భర్తృక" స్వామి నడిరేయిలో ఇంటికి చేరాడు. మేనిపై యెన్నో గుర్తులు ఆయన రాసలీలను చెప్పకనే చెబుతున్నాయి. కోపంతో బుసలు కొట్టినా స్వామితో రాజీకి వచ్చి నేనులేకుండా నీవు యెక్కడికీ వెళ్ళవద్దని యేమి చేసిందో అన్నమయ్య భాష (సంస్కృతం) లోనే వినండి.

**భావదీపిక :**

నా మనస్సులో నీపై యెట్టి కోపమూ లేదయ్యా! ఎందుకంటే తమరి మార్గం ప్రియులందరికీ సదామేలుచేసేదే కదా! నేను కూడా నీ మార్గానికి నమస్కరిస్తున్నాను స్వామీ!

ఓ జనార్దనా! ఘనమైన నీ రతికేళిలో వ్యర్థ వివాదవచనాలు చెప్పుట యెందులకు? వృథా! వృథా! తమరి మృదువైన "వేదామృతము" నిండిన మాటలతో మీ వశము చేసికొనే మార్గములనే నేనూ అనుసరిస్తాను.

ఓ కరుణానిధీ! తమరు నన్ను సేవించుటెందులకు? నా చెంతకు రావలదు. వైభవోపేతమైన తమరి వినయం వృథా! వృథా! ముల్లోకాలకు సుఖమునిచ్చే వాడవుకదా! పైగా స్ఫూరద్రూపివి. క్షణం తీరికలేని రాచకార్య నిమగ్నులైన తమరిని కలుసుకోవాలనే నా కోర్కె తీరక అవమానంతో పరాభవం పొందాను.

ఓ వేంకటనాథా! నేను లేకుండా యెక్కడికీ నీవు పోరాదు. అట్లా నీవు యెక్కడకు వెళ్ళినా అది వృథా! వృథా! మంచి ప్రవర్తన గల స్వామీ! నీ వెంతో మహిమ కలవాడవు. నిన్ను పులకాంకితుని చేయుటకు నిన్ను నా స్తనములపై ధరిస్తాను.

**సంఖ్య : 356 సంపుటము : 5 పుట : 256 రాగం : ఆహిరి**

పల్లవి: నిన్నుఁ గూడిన విభుని నిలువెల్ల సొంపాయ
నిన్నియును నొనగూడె నింతలోపలనె

చ. 1: సొలపు నీ కడగంటిచూపు హృదయము గాఁగి
లలినితఁడు శ్రీవత్సలాంఛనుండాయ
వెలఁది నినుఁ బెడఁబాసి విరహంపుమెయికాఁక
వలన నీతఁడు నీలవర్ణుఁడైనాఁడు

చ. 2: ఆదన నీ చనుగుబ్బలను చక్రముల చేతఁ
బదిలపరపుచు చక్రపాణియైనాఁడు
సుదతి నీ దేహమున సొబగు కుంకుమపూఁత-
లెదిగి పీతాంబరంబీతనికి నాయ

చ. 3: ఆలింగనాపేక్షనయంబు నినుఁగూడ
లోలుఁడటుగాన నాలుగుచేతులాయ
శ్రీలలితమూర్తియగు శ్రీవేంకటేశ్వరుఁడు
పాలించె నిను నీకుఁ బరితోషమాయ

**తొలిపలుకు :**

అన్నమయ్య అత్యద్భుతమైన శృంగార కీర్తన వినిపిస్తున్నారు. దేవితో ఇలాంటి కీర్తన ఆయనొక్కడే చెప్పగలడు. స్వామికి అంత సొంపు నిన్ను కూడుటవల్లనే వచ్చినదమ్మా! అంటూ అతిమనోహరంగా తన వాదన వినిపిస్తున్నారు. అయితే చివరకు ఆయన నిన్ను పాలించుట చేతనే నీకు మిక్కిలి సంతోషము కలిగిందమ్మా! అని ముక్తాయింపు నిచ్చారు.

**భావదీపిక :**

దేవి! నిన్ను గూడిన నీ విభుని నిలువెల్లా (మేనుయెంతో) సొంపు అయిందమ్మా ఇంతలోనే ఇన్నియును ఆయనకు ప్రాప్తించినవమ్మా!

దేవీ! నీకడగంటి చూపులు ఆయన హృదయమును కాగించగా అది నల్లబడి శ్రీవత్సమనే పుట్టుమచ్చ అయింది. ఓ వెలదీ! నిన్నెడ బాసిన విరహము చేత శరీరము కమిలిపోయి ఇతడు నీలవర్ణుడైనాడమ్మా!

ఇంకొక సంగతి విన్నావా? సుదర్శన చక్రము వలన యీతడు చక్రధారి కాలేదు. చక్రవాకములవంటి నీ చనుగుబ్బలనంటి తన చేతులలో పదిలపరచుకొన్నందున చక్రపాణి అయ్యాడు. సుదతీ! బంగారువన్నె గల నీదేహమున అంటిన కుంకుమ పూత కలగాపులగమై ఆయన వస్త్రములకు "పీత" వర్ణముగా అంటి ఆయన పీతాంభరుడైనాడు.

తల్లీ! నిన్నాలింగనము చేసికొనుటకు కాక ఆక్రమించు ఆపేక్ష కలవాడై నిన్ను కూడుటకు లోలుడైనందున ఆయనకు నాలుగు చేతులు కావలసివచ్చాయి. అందుకే చతుర్భుజుడైనాడు. లలితమైన మూర్తి గల శ్రీవేంకటేశ్వరుడు నీకు పరితోషమై (మిక్కిలి సంతోషముకలవాడై) నిన్ను పరించినాడమ్మా!



**సంఖ్య : 298 సంపుటము : 8 పుట : 173 రాగం : కేదారగౌళ**

పల్లవి: నేఁడుగొత్తలా తన నేరుపులివి
వాఁడివెట్టి ముంటికొన వాదులడిచేనా

చ. 1: కానిమ్మంటినే యిఁక గాదని యెదురాడనే
తానాడినదే మాట తప్పులులేవు
రానీవే యందుకేమి రతిఁ గరఁగించుఁ దాను
నానఁబెట్టీగొడ్డలి సన్నల నింతయేఁటికే

చ. 2: బాసయిచ్చితినే తనపంతము చెల్లించేనే
సేసినదేచేఁత మరి చిక్కులులేవు
ఆసపడనీవె తాను అంబుధులు పేరఁబెట్టు
కోసి రాతనారొలిచి కూరిము లింతేఁటికే

చ. 3: కూడితినే కాఁగిటను గురుతులు నించితినే
ఆడనీవే సరసాలు అంకెలాయనే
వేడుకవెలవెట్టె శ్రీ వేంకటేశ్వరుఁడు తాను
వీడెమిచ్చి బుజ్జగించీ వేసాలిఁకనేఁటికే

**తొలిపలుకు :**

ఈ కీర్తనలో అన్నమయ్య వాడిన వుదాహరణలు నేటి వాడుక భాషలో లేవు. గొడ్డలి నానబెట్టటం, కొసి రాతినారను వొలవడం, వాడివెట్టి వాదులడచడం, వీడెమిచ్చి బుజ్జగించటం మన వూహకందని ప్రయోగాలు. అందుకే చేతులెత్తి మొక్కరో శ్రీవేంకటవిభునికి. ఎందుకంటే అన్నమయ్యతో ఇవన్నీ పలికించింది వాడే కదా!

**భావదీపిక :**

చెలీ! ఇవన్నీ తన (స్వామివారి) నేర్పులే. నేడు ఇవేమైనా కొత్తవా నాకు? వాడివెట్టి ముంటికొన (వ్యర్థప్రయత్నము చేసిన) వాదులడిచేనా (వాదులాట తీరుతుందా?)

కానిమ్మని అన్నానే! ఇకపై కాదని స్వామికి యెదురు చెప్పనే. తానేమంటే అదేమాట తప్పులనేవే లేవు. ఆయనను వస్తేరానీవే. మహా అయితే రతిలో కరిగిస్తాడు అంతే కదా! సన్నల (చీకటి పడేదాకా) గొడ్డలిని నానబెడితే ప్రయోజనమేమి మెత్తబడుతుందా?

తన పంతము చెల్లిస్తానని బాస ఇచ్చానే. ఆయన చేసినదే చేత అని అంగీకరిస్తే, యేచిక్కులూ వుండవు. అదెవత్తో దానిపై ఆశపడితే సముద్రాలను దాని పేరపెట్టేస్తాడా? కోసి రాత నారొలిచి (వ్యర్థమైన) కూరిమి లెంతవున్నాయెందుకే?

స్వామి కౌగిటిలో కూడితిని ఎన్నో గుర్తులు కూడా పడ్డాయి. స్వాధీనుడై సరసాలు ఆడనీవే. శ్రీవేంకటేశుడు వేడుక వెలకు పెట్టినాడు. తాను ఆమెకు (అన్నమ్మకు) తాంబూలమిచ్చి బుజ్జగించాడు. ఇంకా వేషాలెందుకే?

**సంఖ్య : 371** **సంపుటము : 7** **పుట : 228** **రాగం : భైరవి**

పల్లవి: నేనే వింతగాని నీచుట్టాలవేయివి
కానుకగా నేఁదెచ్చితే కడు వెంగమనేవు

చ. 1: కప్పురము నేనిచ్చితే కసరుదురా
దప్పికి నెవ్వతో నీకు దాఁచినది
తెప్పిర సురటి వీచితే జంకింతురా
వొప్పుగా నాపెరూపు వొనర వ్రాసినది

చ. 2: పానుపు పరచితే సిగ్గుపడుదురా యిందాఁక
నీనెలఁత యెవ్వతో నిద్రించినది
పూని గందమిచ్చితే వొల్లనందురా
మేననాకె పూసుకొని మిగిలినది

చ. 3: సారెఁ బువ్వుల వేసితే సాదింతురా
కూరిమినీసతి పెద్దకొప్పులోనివి
చేరి నన్నుఁగూడితివి శ్రీవేంకటేశ్వర
వారిదాననే నేను వచ్చి పెండ్లాడితిని (వి)

**తొలిపలుకు :**

దేవి స్వామితో దెప్పుతున్నది. వెంగెమాడటం అంటే "వ్యంగ్యంగా మాట్లాడటం" అని అర్థం. అన్నమయ్య భావం ఊహాతీతం. (స్వామి కృపవల్ల నాకు స్ఫురించింది నేను వ్రాస్తున్నాను. నిజానికి నేను రచయితనే కాను. నన్ను నమ్మండి) అమ్మవారు విసురుకోవటానికి విసనకఱ్ఱ ఇస్తే ఆయన గుడ్లురిమాడట. ఎందుకంటే ఆయన "యెదపై" ప్రియురాలు ఆమె రూపం వ్రేలితో వ్రాసిందట. అది "చెదరిపోతుందని"ట.

**భావదీపిక :**

స్వామీ! నేనే నీకు పరాయిదాన్ని. తమరి వంటి మీది ఈ 'గుర్తు'లన్నీ తమరి చుట్టాలు చేసినవే. నీకు కానుకగా వాటిని తెచ్చి చూపిస్తే నాతో చిరాకు వడి వ్యంగ్యంగా దెప్పుతున్నావు. ఇది భావ్యమా?

నేను కర్పూరం పలుకులందిస్తే నన్ను కసురుకొన్నావు. అవి తమరు దాహం అంటే యెవత్తో నీకిచ్చిందని నాకేం తెలుసు? నీవు తెప్పరిల్లటానికి నేను సురటి (విసనకఱ్ఱ)తో వీస్తే నన్ను బెదిరిస్తావు. ఆమె సరసంగా తమరి దేహంపై తన వ్రేలితో వ్రాసిన ఆవిడ రూపం 'చెదిరిపోతుందనా?'

ఏ మొగుడన్నా భార్య పాన్పు పఱచితే సిగ్గు పడతాడా? బహుశా తమరి 'నెలత' యెవరో దానిపై పడుకొన్నది. అది నీకు గుర్తు వచ్చింది. అంతే. భార్య గంధం ఇస్తే యేమొగుడన్నా వద్దంటాడా? అది ఆవిడగారు తనవంటిపై పులిమి మిగిలింది తమరికిచ్చింది.

పెళ్ళాం తనపై పూలు చల్లితే యేపతి సాధిస్తాడు? ఓ శ్రీవేంకటేశ్వరా! గతం గుర్తుచేసుకో. నేను వారిదానను (సాగరకన్యను) నీవే వచ్చి నన్ను పెండ్లాడినావు.



**సంఖ్య : 332** **సంపుటము : 7** **పుట : 205** **రాగం : శంకరాభరణం**

పల్లవి: పోపో అదేఁటిమాట పొద్దువోదా
మాపుదాఁకా నదే కాక మరియేఁటిమాటలే

చ. 1: గుత్తులపూవులు నీవు కోవయ్య కానికె ఆ
గుత్తులేల నీచనుగుత్తులీరాదా
జొత్తులైన లతలవే చూడవయ్య మాటలేల
హత్తి నీబాహులతలు అవె కంటినే

చ. 2: పండుబలమిదివో పట్టవయ్య సూడిదె
పండులేల నీమోవిపండె కాక
మెండగుఁ దామరలు మీఁదవేసేఁ జుమ్మీ
దండి నీచేతులె రెండుతామరలు గావా

చ. 3: కప్పురమిచ్చే నీకుఁ గైకోవయ్యా ఆ
కప్పురాలు నీనోరికతలెకావా
యిప్పుడె శ్రీ వెంకటేశ యిటుగూడితి నేఁ-
డిప్పుడా అల్లప్పుడెపో యెరఁగవు గాని

**తొలిపలుకు :**

ఇది దేవి, దేవరల మధ్య సంవాద కీర్తన. నాలుగైదు సార్లు కీర్తనను చదివి ఆకళింపు చేసికొనకపోతే తలాతోక తెలియదు అన్నమయ్య శృంగార సంవాద కీర్తనలో "అదేం మాట నీకు పొద్దుపోదా?" అని మొదలెట్టిన నాయికతో "ఇప్పుడా, నేను అల్లప్పుడే నీవాడిని, కాకపోతే నీకే తెలియదు" అన్నాడు పరమాత్మ.

**భావదీపిక :**

దేవి: పోపోవయ్యా! నీకు పొద్దుపోదా? అదెటు వంటి మాటమట్లాడుతున్నావు?
దేవర: మాపుదాకా నాకు నీతో "అవే" మాటలు మరింకేం మాటలుంటాయే?

దేవి: సరే! నా కానుకగా ఈ పూలగుత్తులు నీవు కోవయ్యా (పుచ్చుకోవయ్యా!)
దేవర: నాకు ఆ గుత్తులెందుకే. నీ చనుగుత్తులు ఇయ్యరాదా?
దేవి: మాటలెందుకయ్యా? జొత్తులైన (ఎఱ్ఱని) లతలు బాగున్నాయి, చూడరాదు?
దేవర: అవెందుకే? నన్నుహత్తుకొనె ఆ నీబాహులతలు కూడా చూచితినే.

దేవి: ఇదిగో బలమైన పండును సూడిదె (కానుకగా) ఇస్తాను పట్టుకోవయ్యా!
దేవర: నాకు ఆ పండ్లెందుకే? నీ అధరమనేది కూడా తీపి పండే కదా!
దేవి: ఇదిగో ఇట్లా అంటే నిన్ను తామరపూలతో కొడతాను సుమా!
దేవర: బలమైన నీ చేతులే రెండు తామరపూలు కావటనే?

దేవి: సరేలే! కర్పూరపు పలుకులనిస్తాను తీసికొనరాదా?
దేవర: నీనోటి పరిమళమే కర్పూరం కదటే?
దేవి: ఓ శ్రీవేంకటేశా! ఈ మాటలు చెబుతూనే ఇప్పుడే నన్నుకూడితివి.
దేవర: నేడు ఇప్పుడా? అల్లప్పుడేపో (సృష్టాదిలోనే) నీవు నేను వొకటే. అది నీ వెఱగవు అంతే. (ఆవిడ ఆత్మ ఆయన పరమాత్మ)

**సంఖ్య : 153 సంపుటము : 8 పుట : 90 రాగం : శంకరాభరణం**

పల్లవి: నేఁడె సుక్కురారము నెలఁతలాల
పోఁడిమి సేవసేయరే పుణుఁగుకాపు

చ. 1: పన్నీటి కాలువలు పారీనిఁజూడరే
అన్నిటాఁ గొండవంటి శ్రీహరిమీఁదను
యెన్ననభిషేకమంత్రాలిదె చెప్పేరు వినరే
తిన్నని పుళు(ణు)గుకాపు దేవునికి నేఁడు

చ. 2: రాలీని కప్పురరజమిదె చూడరే
నీలమేఘమువంటి యీ నీరజాక్షుపై
తాలమితో జాలువారీ తట్టుపుణుఁగదిగోరే
పోలింపఁ బుణుఁగుకాపు పురుషోత్తమునికి

చ. 3: అలమేలు మంగతోడి హారాలు సేవించరే
వెలయ ధరించెను శ్రీవేంకటేశుఁడు
పలువిందులారగించె బాగాలు యియ్యరే
చెలఁగీ పుణుఁగుకాపు శేషాద్రిపతికి

**తొలిపలుకు :**

అన్నమయ్య తిరుమలలో శుక్రవారం నాటి శ్రీవేంకటేశుని అభిషేక మహోత్సవాన్ని వర్ణిస్తున్నారు. అసంఖ్యాకమైన ఈ మధుర కీర్తనలలో ఏది మనోహరమైనదో యెన్నుకోవటం దాదాపు అసాధ్యం. దేని మాధుర్యం దానిదే. భిన్నత్వంలో ఏకత్వం శ్రీవేంకటేశుడైతే, ఏకత్వంలో భిన్నత్వం ఈ అభిషేక కీర్తనలు.

**భావదీవియ :**

ఓ నెలతలారా! నేడే శుక్రవారము. అతిశయించి స్వామికి పుణుగుకాపు సేవ చేయండి.

అన్ని విధములా కొండ వలెనున్న ఈ శ్రీహరి మీద పన్నీటితో అభిషేకించగా పన్నీరు కాలువ వలె పారినది. అయ్యవార్లు అభిషేక మంత్రాలు చెప్పుచున్నారు వినండి. నేడు తిన్నని శ్రీపతికి పుణుగుకాపు జరుగుచున్నది.

కర్పూరరజము స్వామి వంటిపై యెలారాలుతున్నదో చూడండి. ఈ నీలమేఘము వంటి నీరజాక్షునిపై తట్టుపుణుగును జాలువార పోయుచున్నారు. పురుషోత్తమునికి కాచిన పుణుగుకాపు పోలింప జేయుచున్నారు.

అలమేలు మంగతో పాటు హారములను ధరించిన స్వామిని సేవించండి. ఈ శ్రీవేంకటేశ్వరుడు పలు విందు లారగించు చున్నాడు. స్వామికి బాగాలు (తాంబూలపు పెట్టె) ఇయ్యండి. శేషాచలపతికి పుణుగుకాపు అతిశయముగా జరుగుచున్నది.



**సంఖ్య : 7 సంపుటము : 10 పుట : రాగం :**

పల్లవి: మాజహిహి దుష్టమనాయితి
యోజయ తవపదయుగామృతేన

చ. 1: పరమాత్మన్ మమపామరచిత్తం
చిరం పాపం చికీర్షతి
కరుణానిధే! అకారణబంధో
గురుతరాం కృపాం కురు మయి దేవ

చ. 2: అంతర్యామిన్! హరే! మదాశా
సంతాప ఏవ సమేధతే
దాంతికరానంతగుణనిధే
భ్రాంతిం వారయ! పావన చరిత

చ. 3: నలినోదర! మాం నానామోహ
విలసత్కృతీవ విమోహయ
కలిత శ్రీవేంకటనాథత్వం
సలలితం ప్రసాదయ స్వామిన్

**తొలిపలుకు :**

తాళ్ళపాక చిన తిరుమలాచార్యుల వారిచే విరచితమైన ఈ కీర్తన శృంగార కీర్తన కానప్పటికీ గీర్వాణిలో కూడా ఆయన తాత అన్నమయ్యకు తగ్గ మనుమడు అని యెత్తి చూపుటకే దీనినిక్కడ ప్రస్తావిస్తున్నాను. స్వామిని ప్రస్తుతిస్తూ తనపై కరుణతో నిరంతర భక్తిని ప్రసాదించి భ్రాంతిని తొలగించమని వేడుకొంటున్నారు.

**భావదీవియ :**

ప్రభూ! మాజహిహి (నను విడువవద్దు). దుష్టమనాయితి (నేను దుష్ట కార్యములు చేయు దుష్టస్వభావము కలవాడనని). తవపదయుగా మృతేన (నీ పాద పద్మజనితమైన అమృతమున) యోజయ (నన్ను కలుపుము).

హే పరమాత్మా! నా పాపభూయిష్టమైన మనస్సు యెల్లప్పుడూ నాచేత పాపకార్యాలనే చేయిస్తుంటుంది. ఓ కరుణానిధీ! నీవు అకారణ బంధుడవు (కారణము లేకనే బంధువువలె కాపాడెదవు). ఓ నా దేవా! నాయందు కృపను మాత్రమే ప్రదర్శించుము.

ఓ అంతర్యామీ! శ్రీహరీ! నా ఆశ అను సంతాపము పెరిగిపోతూనేవుంది. ఇంద్రియనిగ్రహం కలిగించే అనేక సుగుణ నిధివైన స్వామీ! ఉన్నది లేనట్లూ, లేనిది వున్నట్లూ తలపించే నా భ్రాంతిని పోగొట్టు. పవిత్రమైన చరిత్ర గల స్వామీ! నన్ను దయచూడు.

ఓ నలినోదరా! (పద్మనాభా!) పలురకములైన మోహములతో వెలిగిపోతూ కూడా నేను అదృష్టవంతుడిని అనుకొనే నా మోహమును నీవే రూపుమాపుము. నీవు వేంకటాచలముపై కొలువైవున్నావు. స్వామీ! భక్తితో రమ్యముగా నుండునట్లు నాకు మంచి జీవితాన్ని అనుగ్రహింపుము.

**సంఖ్య : 287** **సంపుటము : 8** **పుట : 172** **రాగం : ధన్యాసి**

పల్లవి: మాపుదాఁకా గొసరిన మాను మానే రాయి రాయే
దాపుదండ నీవు నాకు తగవు నీచేతిది

చ. 1: మొక్కలపు మాటలెల్ల మొన్ననె ఆడితిఁగాని
పుక్కటయిన నిన్ను నేనుఁ బొగడ నేఁడూ
వుక్కువంటి గుండెలోన లక్కవంటి మనసిదే
దక్కియున్నదాన నీకు ధర్మము నీచెతిది

చ. 2: అంగడిఁ బెట్టినచేఁత లప్పుడెపెట్టితిఁగాని
ముంగిట నీసుద్దులెల్ల మూసేనిపుడు
యెంగిలిసెలవిలోన రంగువంటిమనసిదే
పొంగివున్నదాన నీకు పుణ్యము నీచేతిది

చ. 3: లోచి నిన్నుఁ గూడేది లోననే కూడితిఁగాని
యేచి నిన్నుఁగూడేను యీచాయ నేను
చేచేత నీదేవులను శ్రీవేంకటేశుఁడవు
తాచియున్నదాన దయ దలఁపు నీచేతిది

**తొలిపలుకు :**

అన్నమయ్య కాలంనాటి "నుడికారాలను" అర్థం చేసికొవటం సులభం కాదు. నేటి కాలంలో తెలుగు ప్రజలు వాడే "సుత్తి కొట్టకు", "బోరు దొబ్బకు' అనే మాటలు 500 ఏళ్ళ తర్వాత అర్థం లేని పదాలుగా మారిపోతాయి. అప్పుడు భాషలో వాడబడిన వీటిని వివరించటానికి నాబోటివానికి చచ్చేచావు అవుతుంది కదా! ఇప్పుడు నాకూ అదే జరుగుతున్నది. స్వామీ! నీదయ.

**భావదీపిక :**

స్వామీ! నిన్నుమాపుదాగా (పొద్దస్తమానూ) కొసరినా (బ్రతిమాలినా) మానవు. ఎందుకంటే రాయి రాయే చెట్టు చెట్టే. నీవే నాకు దాపుదండా (దిక్కూమొక్కు). నాతో తగవుపెట్టుకోవటం తమరి చేతిలో పని.

నేను మూర్ఖంగా మాట్లాడినదంతా మొన్ననే అయిపోయింది కదా! నేడు నిన్ను వూరకనే పొగడుతున్నాను కదా! ఉక్కువంటి నీ గుండెలో లక్కవలె కరిగిపోయే మనస్సువుండదా? నేను నీకు దక్కివున్నదానను. ఇక నన్ను కరుణించటం నీ చేతిలో పని. పైపెచ్చు అది నీ ధర్మం కూడా.

నేను నిన్ను బజారులో పెట్టిన మాట నిజమే. అదెప్పుడో జరిగిన వ్యవహారం కదా! నీ పాత కథలన్నిటిని ఇప్పుడు మఱచి పోతాను. పెదవులపై వుండేది యెంగిలి. మనస్సు వన్నెచిన్నెలు కోరుతుంది. నీ కోసం ఉత్సుకించి వున్నదానను. ఇక నీ పుణ్యం, నీ చిత్తం.

స్వామీ! నిన్ను కూడేదేదో లోననే కూడితిని. ఈ రేతిరి నేను నిన్ను పరవశించికూడెదను. నీవు శ్రీవేంకటేశ్వరుడవు. నేను నీ దానినైన పట్టపురాణిని. నేను తాచియున్నదానను (అణగదొక్కబడివున్నదానను) నన్ను దయదలచుట నీ చేతిలోని పని.



**సంఖ్య : 160** **సంపుటము : 19** **పుట : 106** **రాగం : సామంతం**

పల్లవి: మాయలేల సేసేవు మన్నించరాదా
బాయిటఁ బడె నీగుట్టు ప్రహ్లాదవరద

చ. 1: వొరసివలపు తొల్లే వొడిఁ గట్టుకొన్నందుకు
అరుదైన తొడపై తొయ్యలి సాకిరి
సరుసనే మాతోను జాణతనాలాడేవు
యిరవై నీయాసోద మేమిచెప్పే దిఁకను

చ. 2: మొనసి చుట్టరికము తొల్లి మోపు గట్టుకొన్నందుకు
యెనలేని వీఁపుమీఁది యింతి సాకిరి
ననుపు నాతోనే నవ్వులెల్లా నవ్వేవు
నినుపులై గజరెల్లా నిండె నీమై నిపుడు

చ. 3: తమకమెల్లాఁ దవ్వి తల కెత్తుకున్నందుకు
కొమరైనశిరసుపై కొమ్మ సాకిరి
మమత శ్రీవేంకటేశ మరిగి నన్నేలితివి
జమళి నీపొందులు సతమాయ నేఁడు

**తొలిపలుకు :**

ప్రహ్లాదవరద నారసింహునిపై సరస శృంగారకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఇందులో శ్రీహరి యెత్తిన మూడు అవతారాలను ప్రస్తావిస్తున్నారు. అవి, నారసింహ– కూర్మ– వరాహావతారాలు. వాటిలో స్వామి "గుట్టు" యేమిటో వివరిస్తున్నారు. బహు జాగ్రత్తగా అధ్యయనం చేయవలసిన కీర్తన ఇది.

**భావదీపిక :**

ఓ ప్రహ్లాద వరద నారసింహా! నీవు మాయలేల చేసేవయ్యా! మమ్ముమన్నించరాదా? ఇదిగో నీ గుట్టు బయట పడిపోయింది. కావాలంటే నీవే వినవయ్యా!

తొల్లే (మొదట్లోనే) వలపులు కురిపించి చేపట్టినందుకు అన్యులకసాధ్యమైన నీ తొడమీద ఆ తొయ్యలి (శ్రీలక్ష్మి) యెక్కికూర్చుంది. అదే సాకిరి (సాక్ష్యం). అయినా నేడు నీ సరసనవున్న మాతో నీ జాణతనాలు (లీలలు) ఆడుతూనేవుంటావు. అతిశయించిన నీ ఆసోదము (కోరిక) గురించి యేమి చెప్పేది? (ఇది నరసింహావతార ప్రశస్తి).

తొల్లి (పూర్వం) చుట్టరికం సాగరకన్యతో మోపుగట్టుకొన్నందుకు యెనలేని (కొలువలేని సువిశాలమైన) నీ వీపు మీద ఆమెతో బాటు ఆమె తోబుట్టువులనూ నీవు మోయవలసివచ్చింది. అదే సాకిరి (సాక్ష్యము) కదా! నాతో (అన్నమయ్యతో) నవ్వులెల్లా నవ్వుతావు ఈనాడు. ఇప్పుడు కూడా అధికమైన నీ గజరు (కోరిక) నీ ఒంటిపై కనుపిస్తూనేవున్నది. (ఇది కూర్మావతార ప్రశస్తి).

స్వామీ! నీ తమకము (తన్మయత్వం) తవ్వితలకెత్తుకున్నందుకు ఫలితము చూశావా? కొమరైన (ధృడమైన) నీ శిరసు (ముట్టెపై) నున్న కొమ్మ (యువతి భూదేవి) సాక్ష్యము. (ఇది వరాహావతార ప్రశస్తి). నేడు మమతల శ్రీవేంకటేశ్వరుడా! నన్ను మరిగి (ఇష్టపడి) యేలుకొన్నావు. జమళిపొందులు (జంట రతులు) నేడు నీకు శాశ్వతమైనవి.

**సంఖ్య : 276 సంపుటము : 8 పుట : 160 రాగం : దేసాళం**

పల్లవి: మావంటివారి దీవెన మరి యేకాలము గద్దు
భావించి విచ్చనవిడి బతుకఁగదయ్యా

చ. 1: వెలలేని వలపులు వేమారు గొనఁగాను
లలియెత్తి తమకము లాభమాయను
పలచని వద్ది(ట్టి?) శిగ్గు పదారువేలకు బారె
బలిమి నిఁకఁ గోటికిఁ బడిగెత్తవయ్యా

చ. 2: చదరపు సరసాలు చాలుమూలనడవఁగా
గుదిగొన్న నగవు లగ్గువ లాయను
అదిగో పట్టపుదేవు లారడి పంతముచేరె
పదరక సవరాజ్యపట్ట మేలవయ్యా

చ. 3: పాయపు తరితీపుల పంటలెల్లఁ బండఁగాను
చాయల రతిభోగాలు సదరమాయ
యీయెడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
లాయపుటింతుల పొఁజులనుఁ గూర్చవయ్యా

**తొలిపలుకు :**

అన్నమయ్య స్వామిని వలచిన నెచ్చెలి. నావంటి వారి దీవెనలు నీకు యెన్నడైనావుంటాయి. అటువంటి వలపుకత్తెలను మనస్సులో పెట్టుకొని నీ ఇష్టారాజ్యంగా బ్రతుకుము ప్రభూ! అంటున్నది. స్వామిని కోటికి పడగెత్తమని, సవరాజ్యపట్టమేలమని, ఇంతుల పౌజులు సమకూర్చుకోమని శుభకామనిలను చెబుతున్నది.

**భావదీవియ :**

స్వామీ! నీకు మావంటివారి (వలపు కత్తెల) దీవెనలు (శుభకామనలు) యేకాలముననైనా కద్దు (వుంటాయి). భావించి (ఇది గ్రహించి) విచ్చనవిడి బ్రతుకవయ్యా! (ఇష్టారాజ్యంగా వర్థిల్లవయ్యా!)

నీకు మాపై అమూల్యమైన వలపులు పలుమార్లు కలుగుట వలన అతిశయించిన పరవశత్వమే లాభముగా లభించింది. సున్నితమైన నునుసిగ్గులు అసంఖ్యాకంగా కమ్ముకొన్నవి. ప్రభూ! ఇక దిట్టవై కోటికి పడగెత్తవయ్యా (అనంతమైన సిరిసంపదలతో తులతూగవయ్యా!)

సమతుల్యమైన సరసాలు చాటుమాటుగా నడుస్తుంటే అతిశయించిన నవ్వులు అగ్గులాయెను (చౌకబడ్డాయి). అదిగో నీ పట్టపురాణి పంతములు ఆరడిపెట్టే దశకు చేరాయి. సంకోచించక సర్వరాజ్యపట్టము నీ దేవికే కట్టవయ్యా!

ప్రాయానికి తగిన వలపుల పంటలు బాగుగా పండినవి. రాతిరి రతులు నిరంతర భోగములైనవి. ఈ విధంగా శ్రీవేంకటేశ్వరా! నన్నునూ కూడితివి. లాయపుటింతుల పౌజు (ప్రేమాతిశయముగల రమణులసేన) యేర్పాటు చేసికొనవయ్యా!



**సంఖ్య : 143 సంపుటము : 8 పుట : 84 రాగం : లలిత**

పల్లవి: వినవే విభునిమాట వింతదానవా
చెనకేటి వేళనింత సిగ్గులు వడుదురా

చ. 1: యీసు లేని వాఁడతఁడు యిచ్చకురాలవు నీవు
తాసులవంటివే నీతలఁపు లెల్లా
సేస వెట్టినాఁడతఁడు చేయివట్టితివి నీవు
వాసులకు నీవుతల వంచుకొందురా

చ. 2: సరసపు వాఁడతఁడు చాయకు వత్తువు నీవు
సరిబేసి వంటివే మీచనవులెల్లా
తెరవేసినాఁడతఁడు తిరమై నిలిచితివి
శిరసువంచుక నీవు చెక్కు చేతనుందురా

చ. 3: శ్రీ వెంకటేశుఁడతఁడు శ్రీ మహాలక్ష్మివి నీవు
పూవు వాసనవంటివే బుద్ధులెల్లాను
భావించి కూడెనతఁడు పై కొంటి విట్టెనీవు
తావుల రతుల నిట్టే తమకింతురా

**తొలిపలుకు :**

అన్నమయ్య దేవి ఆంతరంగిక చెలికత్తెయై హితబోధజేస్తున్నారు. నీవేమన్నా ఆయన నెరుగని పరాయిదానివా? నీ మగని మాటలను విని ప్రియము చూపు సరసములాడవలసిన వేళ సిగ్గులు పనికిరావు ఆయన శ్రీవేంకటేశుడు నీవు శ్రీ మహాలక్ష్మివి. పూవుతావి వంటి వారు మీరు. మీకేమి కొత్త? అంటున్నారు.

**భావదీవియ :**

దేవీ! నీ పతి మాటలను వినవమ్మా! నీవేమన్నా వింతదానవా? (నవవధువువా?) పతి నిన్ను దగ్గరకు తీసికొంటే సిగ్గుపడతారా?

అతడు ఈసులేనివాడు (ద్వేషము నెరుగనివాడు). నీవు ఆయన ఇచ్చకురాలవు (ప్రియురాలివి). కేవలం నీ ఆలోచనలే త్రాచుపాముల వంటివి. నీకు తాళికట్టిన వాడతడు. ఆయన పాణిగ్రహణం చేసిన దానవు నీవు. ఆయన అధిపుడని నీవు తలవంచుకొనతగునా?

అతడు సరసుడనునది జగద్విదితమే. నీవు ఆయన దారికి వచ్చే సౌమ్యురాలవు. మీ చనవులు (అన్యోన్యతలు) సరి బేసి వంటివి (మంచిచెడ్డల వంటివి). అతడు మీ శయ్యామందిరపు తెరవేసినాడు. నీవు స్థిరచిత్తంతో నిలిచినావు. నీవిపుడు చెక్కిట చెయ్యిజేర్చి శిరసు వంచుకొనవచ్చునా?

అతగాడు శ్రీవేంకటేశ్వరుడు. నీవు శ్రీ మహాలక్ష్మివి. మీరు పూవుతావి (వాసన) వంటి విడదీయలేనివారు. నీవు ఆయన నాక్రమించితివి. దరిజేరి రతులలో పరవశించరా?

**సంఖ్య : 185　　సంపుటము : 8　　పుట : 108　　రాగం : కన్నడనాట**

పల్లవి: హత్తి రాజసపువాఁ డవయినాఁగాని
చిత్తమువచ్చినయట్టు సేతువుగాని

చ. 1: చనవు గలిగేనంటా సారె సారె మాటలాడె
విని విని నీవేమి వేసరకుమీ
మనసునఁ గలదెల్లా మరిదాఁచనే నీకు
మునుకొన్న సతులకు ముచ్చట స్వభావము

చ. 2: నిండిన మందెమేళాన నీతో సరసమాడేను
అండనే అందుకు లోనై అలయకుమీ
వుండిన దున్నట్టేకాని వూరకే కల్పించనోప
నిండు గరితెలాడితే నిజమునిష్ఠూరము

చ. 3: కాతరాన నిన్ను నిట్టే కాఁగలించుక కూడితి
నాతమకములు చూచి నవ్వేవు సుమ్మీ
ఘాతల శ్రీవేంకటేశ కైకొంటివి నిన్ను దూర
రాతిరిఁబగలునుండి రతులఁ జొక్కితివి

**తొలిపలుకు :**

అతిశయించిన రాజసమున్నవాడవైనా నీకు నచ్చింది చేయటం నీ అలవాటు. కాని నేనూ (అన్నమ్మ) కొంచెం వాగుడుకాయనే, నీతో వేళాకోళాలాడే దానినే, తమకంతో గట్టిగా కౌగిలించేదాన్నే అయినా నన్ను కరుణించి రాత్రీపగలూ అనిలేక రతుల జొక్కించేవు అంటున్నారు అన్నమయ్య.

**భావదీపిక :**

ప్రభూ! నీవు అతిశయించిన రాజసము గలవాడవు. అయినా గాని నీచిత్తము వచ్చినట్లు చేయటం నీ అలవాటు. అంతే.

నేనేమో వాగుడుకాయను. ఒక్కసారి నీతో చనువుయేర్పడిందంటే ప్రతిసారీ మాట్లాడుతూనే వుంటాను. విని విని నీవేమో నాపై విసుగు కొనకు స్వామీ! నా మనస్సున వున్నదేది నీ దగ్గర దాచలేను. మునుకొన్న (అతిశయించిన) ఆడువారికి ముచ్చటలాడటం స్వభావసిద్ధము.

అతిశయించిన వేళాకోళంతో నీతో సరసములాడేను. అందుకని అక్కడే నాకు లొంగిపోయి చిరాకుపడకు. ఉన్నదున్నట్లే చెప్పే అలవాటు నాకుంది. కల్పించటం నాకు చేతకాదు. నేను నిండుగరితెలాడితే (నిజమైన పతివ్రతలా మాట్లాడితే) నీకు నిష్ఠూరంగానే వుంటుంది.

స్వామీ! నేను కాతరాన (తత్తరబాటుతో) నిన్ను కౌగలించి కూడితిని. నా మైమరపు చూచి నవ్వుకునేవు సుమా! ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్ను నేను దూరినా (నిందించినా) నన్ను స్వీకరించితివి. రాత్రిపగలు అని చూడక నన్ను రతులలో సొక్కించితివి.



రచయిత

## అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు




| | | |
|---|---|---|
| పిలవండి | : | అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు |
| పుట్టింది | : | 9-6-1945 |
| చదివింది | : | ఎం. టెక్. |
| ఉండేది | : | ఫ్లాట్ నెం. 5, ప్లాటు నెం. 61, సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్దార్థనగర్, |
| రంధి | : | భగవన్నామ సంకీర్తన |
| నచ్చింది | : | శాస్త్రీయ సంగీతం |
| నచ్చంది | : | నక్కజిత్తులు |
| మెచ్చింది | : | సజ్జన సాంగత్యం |
| రింగండి | : | +91 9393021360 |
| చదవండి | : | www.geetadeeksha.com |
| ఇవ్వండి | : | e-mail : www.geetadeeksha@gmail.com |